ఈనాడు

విజయవాడ 30-9-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 51

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈ హిస్టరీ.. చెరిగిపోదు!

బ్రౌజింగ్ చరిత్రతో తస్మాత్ జాగ్రత్త!



● ఓ పన్నెండేళ్ల పిల్లాడు ఆడుకుంటానంటూ తండ్రి ఫోన్ తీసుకుని ఇష్టారాజ్యంగా పోర్న్ వీడియోలు చూసేవాడు. ఈ విషయాన్ని గ్రహించిన తండ్రి ఎంత ప్రయత్నించినా ఆ అలవాటు మాన్పించలేకపోయాడు. ఫోన్ ఇవ్వకపోతే బాలుడు తిండి మానేసేవాడు. భయపడ్డ తల్లిదండ్రులు మానసిక వైద్యుడి వద్దకు తీసుకొచ్చారు. పూర్వాపరాలు విచారించిన ఆ వైద్యుడు అసలు విషయం తెలుసుకొని నివ్వెరపోయాడు. పోర్న్ వీడియోలు చూసే అలవాటు ఆ తండ్రికి ఉండేది. ఇంటికి వచ్చి ఫోన్ పక్కన పెట్టగానే ఆటలాడుకునేందుకు అతని కుమారుడు ఫోన్ తీసుకునేవాడు. ఇంటర్నెట్ తెరవగానే పోర్న్ వీడియోల తాలూకూ చిత్రాలు కనిపించేవి. బాలుడు వాటిని చూడ్డానికి అలవాటు పడ్డాడు.

● ఓ నడి వయసు వ్యక్తికి అశ్లీల చిత్రాలు చూసే అలవాటు ఉంది. వాటినే ఎరగా వేసిన నేరగాళ్లు ఆయన ఫోన్ నంబర్ తస్కరించారు. దాని ద్వారా ఓ మహిళను రంగంలోకి దింపి, అశ్లీల సంభాషణ చేయించి, దాన్ని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టారు.

చేతిలో ఫోన్ ఉంది..
అందులో ఇంటర్నెట్ ఉంది కదాని...
తోచిందల్లా చేస్తే...
గూగుల్ ఉందని
ఇష్టారాజ్యంగా బ్రౌజింగ్ చేసేస్తే...
చిక్కుల్లో పడ్డట్టే... ఎందుకంటే...
మీ డిజిటల్ చరిత్ర చెరిగిపోయేది కాదు.

● మన బ్రౌజింగ్ చరిత్ర మనను వెంటాడుతుందన్న విషయం మరవకూడదు. మన బ్రౌజింగ్ హిస్టరీని దర్యాప్తు సంస్థలు ఎప్పటికప్పుడు వడపోస్తూనే ఉంటాయి. బాలలకు సంబంధించిన అశ్లీల చిత్రాలు చూడడం, పంచుకోవడం నేరం కాబట్టి ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే పోలీసులు వారిని ఇట్టే పట్టేస్తారు. ఉగ్రవాద సంబంధ సమాచారం వెతికినా దర్యాప్తు సంస్థల కంట్లో పడతారు.

● అంతర్జాల సంస్థలు కూడా మనం వేటి గురించి వెతుకుతున్నామన్న విషయాన్ని గుర్తించి వాటికి సంబంధించిన ప్రకటనలే మనకు కనిపించేలా చేస్తుంటాయి. ఇదంతా మార్కెటింగ్ వ్యూహం. అయితే అడ్డగోలుగా బ్రౌజింగ్ చేయడం వల్ల వ్యక్తిగతంగా అనేక నష్టాలు జరుగుతున్నాయి.



● రుణం గురించి బ్రౌజింగ్ చేస్తే ప్రైవేటు రుణ సంస్థలే కాదు, నేరగాళ్లు కూడా రుణం ఇప్పిస్తామని చెప్పి మోసం చేస్తుంటారు. ఒక తండ్రి రుణం కోసం బ్రౌజ్ చేస్తే ఆ తర్వాత అతని ఫోన్ వాడిన ఇంజినీరింగ్ కుమారుడికి ష్యూరిటీ లేకుండా రుణం ఇస్తామంటూ లోన్ యాప్‌ల నుంచి వచ్చిన ఆకర్షణీయమైన ప్రకటనలు వచ్చాయి. దాంతో రుణం తీసుకుని అప్పుల్లో కూరుకుని పోయాడు.

● ఇంకాగ్నిటో బ్రౌజర్ వాడితే ఎవరికీ తెలియదని అనుకుంటారు. ఇది తప్పు. బ్రౌజింగ్ హిస్టరీ ఉపకరణంలో మాత్రమే కాదు, సర్వీస్ ప్రొవైడర్ వద్ద కూడా పేరుకుపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మన బ్రౌజింగ్ హిస్టరీ మన వేలిముద్ర లాంటిది. మనం ఎప్పుడు ఏమి చూశామన్నది నమోదవుతూనే ఉంటుంది. – ఈనాడు, హైదరాబాద్

అలా చేశారో...



● చేతిలో ఫోన్ ఉంది కదా అని ఏదిపడితే అది చూడకపోవడమే ఉత్తమం. మనకి ఏది అవసరమో అదే చూడాలి.

● ఎప్పటికప్పుడు బ్రౌజింగ్ హిస్టరీ డిలీట్ చేయడం వల్ల కొంత ప్రయోజనం ఉంటుంది. దీనివల్ల మన ఉపకరణం మరొకరు వాడినప్పుడు ముందు వాడిన వ్యక్తి బ్రౌజింగ్ చరిత్ర కనిపించదు.



● అశ్లీల చిత్రాల మాటున సైబర్ నేరగాళ్లు పొంచి ఉంటారన్న సంగతి గుర్తుంచుకోవాలి. హనీట్రాప్ మాదిరిగా పాపప్ మెనూలతో కవ్విస్తారు. వాటిని క్లిక్ చేయగానే ఉపకరణంలో పాగా వేస్తారు.

● నమ్మకమైన వెబ్‌సైట్లు మాత్రమే చూడాలి. తెలియని లింకులు వస్తే క్లిక్ చెయ్యొద్దు. వ్యక్తిగత వివరాలు అడిగితే ఇవ్వొద్దు.



21 వేల పుస్తకాలతో దుర్గాదేవి మండపం

ఝార్ఖండ్‌లోని రాంచీలో 'గురుకుల జ్ఞానవ్యవస్థ' ఇతివృత్తంతో ఏర్పాటుచేసిన దుర్గాదేవి పూజా మండపానికి భక్తులు బారులు తీరుతున్నారు. గ్రంథాలయాన్ని పోలి ఉన్న ఈ మండపంలో 21 వేల పుస్తకాల నడుమ దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. వినూత్నంగా చేయడానికి ఏటా ప్రయత్నిస్తామని, ఈ సారి ఎంపికచేసిన 21 వేల పుస్తకాలతో గురుకుల సంప్రదాయ ఇతివృత్తంతో పండల్ నిర్మించామని నిర్వాహకులు తెలిపారు. వీటిలో మతగ్రంథాలు, రామాయణం, మహాభారతం, భగవద్గీత, రాజ్యాంగ నమూనా, హిందీ వర్ణమాల, సైన్స్, చరిత్ర, ఝార్ఖండ్ ఉద్యమంపై పుస్తకాలు వంటివి ఉన్నాయి. నేటి యువతకు మతగ్రంథాలపై అవగాహన కల్పించడం, ప్రజల్లో తగ్గుతున్న పుస్తక పఠన అలవాటును ప్రాచుర్యంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ మండపాన్ని నిర్మించారు. –రాంచీ

కోల్‌కతా దసరా.. రూ.10 వేల కోట్ల పండగ

దేశమంతా నవరాత్రుల కళే!
అయినా 'కోల్‌కతా' పేరే ప్రముఖంగా వినపడుతుంది.
దసరా వేడుక చూడాలంటే అక్కడికే వెళ్లాలన్నంత ప్రాచుర్యం.
ఎందుకలా? ఏమిటక్కడ ప్రత్యేకత?




కోల్‌కతాకు ఉన్న మరో పేరు 'సిటీ ఆఫ్ జాయ్'. అక్కడి నవరాత్రుల ఉత్సవాలను చూస్తే ఆ పేరు ఎందుకు వచ్చిందో, విదేశీ పర్యాటకులూ ఎందుకు ఆకర్షితులవుతారో అర్థమవుతుంది. నవరాత్రుల్లో కోల్‌కతాలో వాడలన్నీ ఆర్ట్ గ్యాలరీలుగా మారిపోతాయి. అమ్మవారి మండపాల (పండాల్)ను తీర్చిదిద్దడానికి సంప్రదాయ కళాకారులతో పాటు ఆర్కిటెక్ట్‌లూ రంగంలోకి దిగుతారు. వెదురు, వస్త్రాలతో థీమాటిక్ ఆర్ట్‌వర్క్‌లుగా తీర్చిదిద్దుతారు. వీటికి జతగా చేసే లైటింగ్ డెకరేషన్ చూడటానికి రెండు కళ్లు చాలవు. దుస్తులు, వివిధ ఆహార పదార్థాలు, అలంకరణ వస్తువులతో ఏర్పాటు చేసిన బజార్లతో ఎటు చూసినా సందడే.

చాలామంది పెళ్లిళ్లు కుదిరేదీ ఇక్కడే

బెంగాలీ సంప్రదాయానికి చిరునామాగా మారిన ఈ ఉత్సవంలో.. ప్రజలు అమ్మవారిని కుమార్తెగా, ఆడపడుచుగా భావిస్తారు. ఆమెకు నచ్చినవి ప్రసాదాలుగా వండిపెడతారు. నృత్యాలతో ఆనందింపజేస్తారు. అమ్మవారి మండపాలను పెళ్లి అడ్డాలుగానూ భావిస్తారు. చాలా మంది పెళ్లిళ్లు ఇక్కడే కుదురుతాయి మరి. ఢాకీల డోలు వాయింపుతో నృత్యాలు చేయడం, చేతిలో ధునితో మహిళలు ఆడిపాడే తీరు, ఇంటి ఆడపడుచును సాగనంపుతున్నట్లుగా అమ్మవారిని నిమజ్జనానికి పంపడం ఇవన్నీ ఏ విదేశీ కార్నివాల్‌కి తీసిపోవు. దసరా రోజు మహిళలు ప్రత్యేకంగా ఆడే సిందూర్ ఖేలాకీ ప్రాచుర్యం ఎక్కువే. ఇవన్నీ వెరసే 2021లో ఈ ఉత్సవానికి యునెస్కో గుర్తింపూ లభించింది. మరి ఈ స్థాయిలో ఉత్సవాలంటే ఊరికే వస్తాయా? ఖర్చు కూడా దానికి తగ్గట్టే రూ.8-10 వేల కోట్లని అంచనా. ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు చేసిన ఖర్చంత అన్నమాట. – వసుంధర డెస్క్



చాక్లెట్ కొండలు



గడ్డి వాములను వరుసగా పేర్చినట్లున్న ఇవి.. కొండలు. ఫిలిప్పీన్స్‌లో ఉండే వీటిని చాక్లెట్ కొండలని పిలుస్తారు. బోహోల్ ప్రావిన్సులో 50 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇవి విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో 1,776 వరకూ ఒకే రకంగా ఉండే ఈ పచ్చని కొండలు సందర్శకులకు కనువిందు చేస్తాయి. వేసవి కాలంలో అవి చాక్లెట్ బ్రౌన్ రంగులోకి మారతాయి. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఒక్కో కొండ 30 నుంచి 50 మీటర్ల సైజులో ఉంటాయి. అందులో అతి పెద్ద కొండ 120 మీటర్ల పరిమాణంలో ఉంటుంది.

'సార్వత్రిక' కుటుంబం



ఉన్నత విద్య చదవాలనుకున్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించలేదు తిరుపతికి చెందిన శ్రీధర్‌కు. తితిదేలో చిరుద్యోగి అయిన ఆయన వివాహం అనంతరం డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తిచేశారు. భర్త బాటలో ఆయన సతీమణి సైతం ఈ వర్సిటీలో డిగ్రీ చదివారు. వారి కుమారుడు కార్తీక్ కూడా ఇందులోనే ఎం.కాం. పూర్తి చేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. పెద్ద కుమార్తె ఎస్.విద్య ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేశారు. చిన్నకుమార్తె గాయత్రి తాజాగా ఎం.కాం. పూర్తిచేసి బంగారు పతకానికి ఎంపికయ్యారు. అందరూ తిరుపతి అధ్యయన కేంద్రంలోనే చదువుకోవడం విశేషం. గాయత్రి మంగళవారం బంగారు పతకాన్ని అందుకోనున్నారు. – న్యూస్‌టుడే, ఫిల్మ్‌నగర్

అలాంటివారితోనే సమాజంలో మార్పు




ఇప్పటివరకూ మీ ప్రయత్నాల్లో ఏ ఒక్కటీ విఫలం కాలేదా? అయితే మీరు కొత్తగా ప్రయత్నించకుండా ఇతరులను గుడ్డిగా అనుకరిస్తున్నారన్నమాట. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని వినూత్నంగా ప్రయత్నించేవారికే వైఫల్యాలు ఎదురవుతాయి. వాటి నుంచి నేర్చుకోవడం ద్వారా వారు పురోగతి సాధించడంతో పాటు ఓ కొత్త ఒరవడికి నాంది పలుకుతారు. సమాజంలో మార్పు తీసుకొచ్చేది అలాంటివారే.

– ఎలాన్ మస్క్, ప్రపంచ కుబేరుడు

అద్దె ఇంటితో అంత ఈజీ కాదు

ఉద్యోగం..వ్యాపారం..ఉపాధి.. అవసరం ఏదైనా పట్టణానికో, నగరానికో వస్తుంటాం! ఇల్లు, దుకాణం, స్థలం ఏదోటి అద్దెకు తీసుకుంటాం! కొన్నిసార్లు అవగాహన లేక తలెత్తిన వివాదాలు.. ఎంతకీ పరిష్కారం కావు.. కోర్టు మెట్లెక్కినా కొలిక్కి రావు. అందుకే అద్దె ఒప్పందం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాథమిక అవగాహన అవసరం!



అద్దె ఒప్పందం ఏడాది అంతకన్నా ఎక్కువ సమయానికి రాసుకుంటే ఆ ఒప్పందాన్ని చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించాలి. ఓ ఇంటికి ఏడాదికి రూ.2లక్షలు అద్దె ఉంటే దానిపై 1శాతం రిజిస్ట్రేషన్ ఫీజ్ చెల్లించాలి. అంటే రూ.2వేలు, స్టాంపు డ్యూటీ కనీసం 2శాతం వేసుకున్నా రూ.4వేలు మొత్తం రూ.6వేలు అవుతుంది. దీనికి పరిష్కారంగా 11 నెలలకే ఒప్పందం చేసుకుంటే రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం ఉండదు. అవసరాన్ని బట్టి ఒప్పందాన్ని రెన్యువల్ చేసుకోవచ్చు.



వీటిపై దృష్టి పెట్టండి

● ఆన్‌లైన్, మధ్యవర్తుల ద్వారా అద్దె ఇళ్ల గురించి తెలుసుకోవడం వల్ల వాస్తవ పరిస్థితులు, లోటుపాట్లు తెలియవు. వారు మాటలతో మభ్యపెట్టే అవకాశం ఉంది. వారికి భారీగా కమీషన్ చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి స్వయంగా వెళ్లి చూసుకుంటేనే కొంచెం కష్టమైనా మంచి ఇల్లు దొరుకుతుంది.

● ఆ ప్రాంతంలో నీటి సదుపాయం ఎలా ఉంది..పిల్లలు ఉంటే పాఠశాల ఎంత దూరంలో ఉంది అన్నది చూడాలి. ఇల్లు పాఠశాల దగ్గరగా ఉంటే వారికి అదనంగా అయ్యే రవాణా ఖర్చులు మిగులుతాయి. నీరు సవ్యంగా ఉంటే అనారోగ్య సమస్యలు తక్కువ ఉంటాయి.

● రైతుబజార్, సినిమా థియేటర్, సూపర్‌బజార్ వంటి సదుపాయాలు దగ్గరగా ఉండేలా తీసుకునే ప్రయత్నం చేయడం ఉత్తమం.

● అడ్వాన్సు మొత్తం అవకాశం ఉన్నంత వరకు డిజిటల్ చెల్లింపులే చేయండి. దీనివల్ల ఖాళీ చేసే సమయంలో ఎంత చెల్లించామో ఆధారం ఉంటుంది. యజమానికి బుకాయించేందుకు, వివాదాలకు అవకాశం ఉండదు.

● కొన్ని ఇళ్లు ఫర్నిచర్‌తో కలిపి ఇస్తారు. మీరు అద్దెకు వచ్చినప్పుడే అన్ని వస్తువులు సవ్యంగా ఉన్నాయా లేక ఏమైనా డ్యామేజ్‌లు ఉన్నాయా అని చూసుకోవాలి.. లేదంటే ఇల్లు ఖాళీ చేసే సమయంలో ఆ భారం మీరు భరించాల్సి ఉంటుంది.

ఒప్పందంలో ఇవి తప్పనిసరి

- ఇంటి అద్దె మొత్తం, చెల్లించాల్సిన తేదీ మాట్లాడుకున్న ప్రకారమే రాశారా లేదా అన్నది ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలి.
- ఆలస్యమైతే అదనంగా చెల్లింపులు చేయాలన్న ప్రతిపాదన ఉందో చూసుకోవాలి.
- నీటి మోటర్ నిర్వహణ, పార్కింగ్ ఛార్జీలు, క్లీనింగ్ వంటివి అద్దెలో కలిసే ఉన్నాయా? లేవా? వాటిని యజమాని చెల్లిస్తారా? మీరే చెల్లించాలా? అన్నది తెలుసుకోవాలి.
- ఎన్నేళ్లకు అద్దె పెంచుతారు, ఎంత మొత్తం పెంచుతారు అన్న అంశాలు ముందు మాట్లాడుకున్నట్లే ఉన్నాయా లేదా స్పష్టత ఉండాలి.
- నోటీస్ పీరియడ్ ప్రస్తావన ఉందోలేదో చూసుకోవాలి. అంటే యజమాని మిమ్మల్ని ఇల్లు ఖాళీ చేయించాలన్నా.. మీరు ఖాళీ చేయాలన్నా ఎంత సమయం ముందు సమాచారం ఇవ్వాలన్నది పేర్కొంటారు. అలా కాకుండా లాక్ ఇన్ పీరియడ్ అని ఉంటే ప్రస్తావించిన తేదీ వరకు యజమానికి ఇల్లు ఖాళీ చేయించే అధికారం ఉండదు మీరు కూడా ఖాళీ చేయలేరు.
- చాలా మంది యజమానులు పార్కింగ్, ఆహారం, పెంపుడు జంతువులు, నీటి సరఫరా సమయం ఇలా అనేక విషయాల్లో ఆంక్షలను ఒప్పందంలో పొందుపరుస్తారు. ఇవి చదువుకోకుండా సంతకం చేస్తే ఇబ్బందులు తప్పవు.
- సెక్యూరిటీ డిపాజిట్ గురించి చాలా స్పష్టంగా ఉండాలి. ముందుగా ఎంత చెల్లించాలి... గడువు తీరి ఖాళీ చేసే సమయంలో యజమాని తిరిగి ఇస్తారా లేదా అనేది రాసుకోవాలి.

కోర్టు ద్వారా పరిష్కారం

– సరళాబెనర్జీ, సివిల్ న్యాయవాది, విజయవాడ

ఇంటి అద్దె, లీజుల విషయంలో వివాదాలు వస్తే చాలా మంది అక్రమంగా ఖాళీ చేయించడం.. దాడులు చేయడం, సామగ్రి ధ్వంసం చేయడం ఇలా క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నారు. దీనివల్ల యజమానులకే నష్టం జరుగుతుంది. వివాదం ఏదైనా న్యాయస్థానం ద్వారానే పరిష్కరించుకోవాలి. అద్దెదారుడిని ఖాళీ చేయించేందుకు 15 రోజుల ముందే నోటీస్ ఇవ్వాలి. అవసరం ఉందని అప్పటికప్పుడు ఖాళీ చేయించాలనుకుంటే ఇబ్బందులు తప్పవు.

– ఈనాడు, అమరావతి

తరాల వారధి.. ఈ తలయేరు గుండు



సప్తగిరుల్లో ఎన్నో ప్రత్యేకతలు, సంప్రదాయాలు, ఆచారాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. అలిపిరి నడక మార్గంలోని పాదాల మండపం దాటగానే రాజగోపురానికి పక్కన ఆంజనేయస్వామి ప్రతిమతో భక్తులకు దర్శనమిచ్చే తలయేరు గుండు ఆ కోవకే చెందుతుంది. స్వామిపై భక్తిభావంతో తిరుమలకు నడిచి వెళ్లే భక్తులు తమ మోకాళ్లను గుండుకు తాకించి వెళ్తే సాంత్వన కలుగుతుందని విశ్వసిస్తుంటారు. సంకీర్తనాచార్యులు అన్నమాచార్యులవారు తిరుమలకు తొలిసారి నడిచి వెళ్లే క్రమంలో దీన్ని సందర్శించినట్లు చెబుతారు. ఏళ్లుగా రాజులు, అధికారులు, సామాన్య భక్తులు ఆ ఆచారం కొనసాగిస్తూ మోకాళ్లు గుండుకు తాకించడంతో ఆ ఆనవాళ్లు దానిపై స్పష్టంగా ఏర్పడ్డాయి. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే భక్తులు, ప్రముఖులు సైతం నడిచి వెళ్లే సమయంలో ఇక్కడి సంప్రదాయాన్ని ఆసక్తిగా తెలుసుకుని పాటిస్తూ ఉంటారు. – న్యూస్‌టుడే, తిరుపతి (మంగళం)


అమ్ముడు పోవడం లేదని అదృష్టానికి తెరతీశారు?



ఓ వ్యక్తి తన ఇంటి స్థలం విక్రయానికి చేసిన యోచనను చూసి.. ఔరా! అని ముక్కున వేలేసుకుంటున్నారు స్థానికులు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో రేకుల గదితో సహా 66 గజాల ఇంటి స్థలం అమ్మకానికి లక్కీడ్రా పద్ధతి పెట్టారు ఆ యజమాని. కొనుగోలుకు ఆసక్తి ఉన్నవారు రూ.500 విలువైన కూపన్‌ను కొనుగోలు చేసి లక్కీడ్రాలో పాల్గొనాలని జాతీయ రహదారి పక్కన, ఆ ఇంటి వద్ద ఫ్లెక్సీలు కట్టారు. "స్థానిక మార్కెట్ ధర ప్రకారం ఈ స్థలం, గది విలువ రూ.16 లక్షలు ఉంటుంది. 3,000 కూపన్లు ముద్రించా. వాటిని కొనుగోలు చేసిన వారు దానిపై తమ వివరాలు రాసి ఆ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలో వేయాలి. నవంబరు 2న లక్కీడ్రా తీస్తా" అని చెబుతున్నారాయన. "ఏడాదిన్నర క్రితం ఈ ఇంటిని అమ్మకానికి పెట్టా. సరైన ధర రాలేదు. నేను కట్టుకున్న మరో ఇంటికి నవంబరులో డబ్బులు చెల్లించాలి. దీంతో తప్పక ఈ మార్గాన్ని ఎంచుకున్నా" అని చెబుతున్నారు. అది చట్టబద్ధం కాకున్నా.. ఆలోచన కొత్తగా ఉందని స్థానికులు అంటున్నారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్

నింగిలో పులి పంజా.. గిన్నిస్ మిల్‌గయా





ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దసరా ఉత్సవాలను కర్ణాటక ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా చాముండేశ్వరి విద్యుత్తు సరఫరా కార్పొరేషన్(సీఈఎస్‌సీ) నేతృత్వంలో బన్నిమంటపంలోని టార్చ్‌లైట్ పరేడ్ మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రోన్ షో గిన్నిస్ రికార్డుకు వేదికైంది. మొత్తం 2,983 డ్రోన్లతో ఆకాశంలో రూపొందించిన పులి చిత్రం గిన్నిస్ రికార్డులో నమోదైంది. ఇది పులికి సంబంధించిన అతిపెద్ద డ్రోన్ కళాకృతి. గతంలో 1985 డ్రోన్లతో ఏర్పరిచిన రికార్డును అధిగమించింది. అంతేకాకుండా సౌరవ్యవస్థ, ప్రపంచ పటం, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులు, నెమలి, డాల్ఫిన్, శ్రీకృష్ణుడి కాళింగ నర్తనం, జంబూ సవారీలో అంబారీని మోస్తున్న ఏనుగు, చాముండేశ్వరి దేవి చిత్రాలు ప్రదర్శించగా.. అవి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. గంట సేపు ఈ ప్రదర్శన కొనసాగింది. – ఈనాడు, బెంగళూరు

మీ పేరుతో సిమ్.. ఇంకెవరి దగ్గరో ఉంటే?

ఫోన్ల ద్వారానే.. అమాయకులకు గాలమేసి ఆన్‌లైన్‌లో రూ.కోట్లు కొల్లగొట్టేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. ఇతరుల గుర్తింపుకార్డులు వినియోగించి సిమ్‌లు పొందుతూ ఈ నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మీ పేరుతో ఎవరైనా అక్రమంగా సిమ్ తీసుకున్నారా? అనేది తెలుసుకోవడానికి.. గతంలో మీరు వినియోగించి వదిలేసిన కనెక్షన్.. ఇంకా మీ పేరుతోనే ఉందేమో తెలుసుకోవడానికి ఓ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ (డీవోటీ). TAFCOP సైట్‌లోకి వెళితే 'నో(know) మొబైల్ కనెక్షన్స్ ఇన్ యువర్ నేమ్' అనే ఆప్షన్ కనిపిస్తుంది. అక్కడ మొబైల్ నంబర్, క్యాప్చాను నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే మీ పేరిట ఎన్ని మొబైల్ కనెక్షన్లున్నాయో తెరపై ప్రత్యక్షమవుతుంది. ఒకవేళ మీరు వినియోగించే కనెక్షన్లు కాకుండా వేరే ఏమైనా ఉన్నట్లు కనిపిస్తే అక్కడే రిపోర్ట్ చేయొచ్చు. మీరు వినియోగించని నంబర్ పక్కన ఉండే బాక్స్‌లో టిక్ చేసి 'నాట్ మై నంబర్' పై క్లిక్ చేస్తే డీవోటీలో ఫిర్యాదు నమోదవుతుంది. అలాగే గతంలో వినియోగించి వదిలేసిన కనెక్షన్.. ఇంకా మీ పేరుపైనే ఉన్నా 'నాట్ రిక్వైర్డ్' అని క్లిక్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. – ఈనాడు, హైదరాబాద్

సుదర్శనచక్ర ఛాయలో గోరక్షణ



రామాయణాన్ని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించే మహాక్షేత్రంగా పేరొందింది విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని రామనారాయణం. 15 ఎకరాల విస్తీర్ణంలో కోదండం ఆకృతిలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ రెండంతస్తుల్లో వివిధ రకాల విగ్రహాలు దర్శనమిస్తాయి. మధ్యలో 60 అడుగుల ఎత్తులో ఉండే ఆంజనేయస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వీటన్నింటికి మించి ఇక్కడి గోశాలలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. పశువులకు రక్షణగా రూ.20 లక్షలతో సుదర్శనచక్ర రూపంలో మండపాన్ని నిర్మించారు. మధ్యలో కృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాత్రివేళలో ఇది మిరుమిట్లుగొల్పుతూ భక్తులను ఆకట్టుకుంటోంది. సుగ్రీవ గోశాలగా నామకరణం చేసిన దీంట్లో ప్రస్తుతం 11 ఆవులున్నాయి. వీటి పాలతోనే అభిషేకాలు చేస్తారు. ప్రసాదాల తయారీ, అన్నదానంలో ఉపయోగిస్తారు.



– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

ఈనాడు

విజయవాడ 30-9-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 51
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

దుర్గమ్మ దయతో దిగ్విజయంగా సంక్షేమం

ప్రజలందరికీ సుఖసంతోషాలివ్వాలని అమ్మను వేడుకున్నా: చంద్రబాబు

6లో

₹58 వేల కోట్లతో పోలవరం-సోమశిల అనుసంధానం

తెరపైకి కొత్త ప్రతిపాదన

- మూసీ, మున్నేరు నదుల మధ్య ఆయకట్టుకూ నీళ్లు
- వరద జలాల సద్వినియోగంలో భాగంగా సుదీర్ఘ కసరత్తు
- పోలవరం-బనకచర్ల స్థానే ఇదో ప్రత్యామ్నాయం




ఈనాడు – అమరావతి

గోదావరి వరద జలాలను కరవు ప్రాంతాలకు, రాయలసీమకు మళ్లించే క్రమంలో అనేక ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పోలవరం-బనకచర్ల అనుసంధానంపై అనేక సమావేశాలు, చర్చోపచర్చలు జరిపిన జలవనరులశాఖ తాజాగా ఈ ప్రతిపాదనకు కొత్త రూపు తీసుకువచ్చింది. అంచనా వ్యయం తగ్గించి, టన్నెళ్లు మినహాయించి నల్లమలసాగర్ జలాశయం ఆయకట్టు స్థిరీకరణకు నీళ్లు ఇవ్వడంతో పాటు సోమశిల జలాశయానికి ఈ నీళ్లు చేర్చేలా కొత్త ప్రతిపాదన రూపొందించింది. మూడు సెగ్మెంట్లలో ఈ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.58 వేల కోట్ల అంచనా వ్యయంగా లెక్కిస్తున్నారు. ఇందులో +15.50 మీటర్ల నుంచి +250 మీటర్లకు నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. అంచనా వ్యయమూ తగ్గుతుంది. ఈ ప్రతిపాదన వల్ల 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 6 లక్షల ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుంది. రాయలసీమతోపాటు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని కరవు ప్రాంతాల్లో ఆయకట్టుకూ నీళ్లు అందించే ఆస్కారం ఉంది. ప్రస్తుతం కొత్త ప్రతిపాదనపై కసరత్తు సాగుతోంది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాత గోదావరి వరద జలాల మళ్లింపు పథకం తుది రూపు దిద్దుకుంటుంది.

సెగ్మెంట్ 1 : పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీకి

- పోలవరం జలాశయం నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున మళ్లింపు. జులై 1 నుంచి అక్టోబరు 15 లోపు ఇలా నీటిని మళ్లించే అవకాశం ఉంటుంది.
- సముద్రంలో లక్ష క్యూసెక్కులపైన నీళ్లు కలిసిపోతున్న రోజులు 83 ఉన్నాయి. రోజుకు 2 టీఎంసీల చొప్పున 100 రోజులపాటు (మిగతా 6లో)



సినిమాలపైనా ట్రంప్ మోత



అమెరికా వెలుపల నిర్మిస్తే 100% సుంకాలు అదనం

భారతీయ చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం

న్యూయార్క్: భారీ సుంకాలతో ప్రపంచాన్ని గందరగోళ పరుస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సినిమాలనూ వదల్లేదు. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం అదనపు సుంకాలను విధించనున్నట్లు సోమవారం ప్రకటించారు. ఇది భారతీయ చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపనుంది. 'అమెరికా నుంచి మన చిత్ర నిర్మాణ వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలిస్తున్నాయి. ఇది చిన్న పిల్లాడి నుంచి చాక్లెట్ లాక్కున్నట్లుగా ఉంది. దీనివల్ల కాలిఫోర్నియా బాగా దెబ్బతింటోంది. దీనికి ఆ రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ (డెమోక్రాట్) బాధ్యుడు. ఆయన బలహీనుడే కాక.. పోటీపడలేని వారు. ఎప్పటికీ పరిష్కారం కాని ఈ సుదీర్ఘ సమస్యను తీర్చేందుకు దేశం వెలుపల నిర్మించే చిత్రాలపై 100 శాతం అదనపు సుంకాలను విధించాలని నిర్ణయించా' అని తన సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ ద్వారా ట్రంప్ వెల్లడించారు.

ట్రంప్ సుంకాల మోతవల్ల భారతీయ చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే (మిగతా 6లో)

మూలుగుతున్న సినిమాపై టారిఫ్‌ల తాటికాయ

వివరాలు సినిమా లో

'ఈనాడు' సహాయ నిధితో 3 భవనాలకు భూమిపూజ

- విజయవాడలో యువత కోసం మల్టీపర్పస్ భవనం
- మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో రెండు పాఠశాలల భవనాలు

RAMOJI GROUP

ఈనాడు – అమరావతి, ఖమ్మం; న్యూస్‌టుడే – నెల్లికుదురు: ప్రకృతి విపత్తుల వేళ బాధితులను ఆదుకునేందుకు... వారి జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపేందుకు రామోజీ గ్రూపు ముందుంటుంది. పెద్దమొత్తంలో స్వయంగా విరాళం ప్రకటించి... సహాయ నిధికి పిలుపునిచ్చి... అభాగ్యుల ఆవేదనను తొలగించేందుకు తన వంతు కృషిని ఆది నుంచీ చేస్తూనే ఉంది. గత ఏడాది రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్ని వరద ముంచెత్తగా బాధితుల్ని ఆదుకునేందుకు 'ఈనాడు' సహాయనిధిని ఏర్పాటు చేసింది. ప్రజలు పెద్దసంఖ్యలో స్పందించి విరాళాలు పంపారు. రామోజీ గ్రూపు సంస్థల ఉద్యోగులూ తమ వంతుగా సహాయాన్ని అందించారు. ఆ నిధితో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో తలపెట్టిన మూడు ప్రాజెక్టులకు సోమవారం ఉదయం భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో 'వర్క్ ఫ్రం హోం' చేసే యువతకు ఉపయోగపడేలా బహుళ ప్రయోజనకర(మల్టీపర్పస్) భవనం, తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఏదులాపురం పురపాలిక పరిధిలోని జలగం నగర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనం, మహబూబాబాద్ జిల్లా రావిరాలలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనాల్ని సహాయనిధితో 'ఈనాడు' నిర్మిస్తోంది.

తనవంతు బాధ్యతగా...

గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు, వరదలు.. తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్ని అతలాకుతలం చేశాయి. ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బుడమేరు ముంచెత్తడంతో విజయవాడ చిగురుటాకులా వణికిపోయింది. ప్రజల్ని ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించే రామోజీ గ్రూపు సంస్థల యాజమాన్యం తన వంతు విరాళంగా రూ.5 కోట్లు ప్రకటించి, సహాయనిధిని ప్రారంభించింది. ప్రజలు, వివిధ సంస్థల నుంచి రూ.3 కోట్లకుపైగా విరాళాలు వచ్చాయి. న్యూదిల్లీలోని గేట్‌వే డిస్ట్రిపార్క్ లిమిటెడ్ రూ.కోటిని అందించింది. (మిగతా 6లో)

ఇ-మెయిల్ తరహాలో యూపీఐ ఐడీ

సురక్షిత లావాదేవీల కోసమే

ఈనాడు బిజినెస్ బ్యూరో: దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులకు ప్రాధాన్యం పెరుగుతోంది. ప్రతి నెలా రూ.లక్షల కోట్ల లావాదేవీలు ఈ విధానంలో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మోసాలూ పెరిగాయి. యూపీఐ ఐడీలతో ముడిపడిన రహస్య వివరాలను బయటపెట్టేందుకు మోసగాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు పరిష్కారంగా కొత్త రక్షణ చర్యలను యూపీఐ సేవలను అందించే సంస్థలు తీసుకొస్తున్నాయి. యూపీఐ ఐడీలను ఇ-మెయిల్ చిరునామాలాగా సరళంగా, అక్షరాలు, అంకెలు మిశ్రమంతో (మిగతా 6లో)

కల నెరవేరేనా!

మహిళల వన్డే ప్రపంచకప్‌పై భారత్ గురి

నేటి నుంచే మెగా టోర్నీ

ఇప్పటిదాకా ప్రపంచకప్ గెలవలేకపోయిన భారత మహిళల జట్టు.. ఈసారైనా కల నెరవేర్చుకోవాలనే పట్టుదలతో మెగా టోర్నీకి సిద్ధమైంది. భారత్ ఆతిథ్యమిస్తున్న వన్డే ప్రపంచకప్ మంగళవారమే గువాహటిలో ఆరంభం కానుంది. తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన.. శ్రీలంకను ఢీకొనబోతోంది. ఈ రెండింటితో పాటు మరో ఆరు జట్లు ప్రపంచకప్ బరిలో ఉన్నాయి. నవంబరు 2న ఫైనల్ జరుగుతుంది.

వివరాలు ఛాంపియన్ లో..

ఇదీ సంగతి!



ఈ మాత్రానికే మరణశిక్ష అయితే వేలకోట్లు తిన్నవాళ్లను అక్కడ ఏం చేస్తారో!!

పేదల ఇళ్ల నిర్మాణ అనుమతుల ఫీజు రూపాయే

ప్రభుత్వం కీలక నిర్ణయం

50 చదరపు గజాల్లోపు నిర్మాణాలకు వర్తింపు

పేద, మధ్య తరగతికి తగ్గనున్న భారం



ఈనాడు, అమరావతి: పుర, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇళ్ల నిర్మాణ అనుమతుల ఫీజులు భారం కాకుండా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 50 చదరపు గజాల్లోపు విస్తీర్ణంలో చేపట్టే జీ+1, ఆ లోపు భవన నిర్మాణానికి ఫీజు రూపాయిగా నిర్ణయించింది. దరఖాస్తుతోపాటు ఇంటి నిర్మాణానికి సంబంధించి డ్రాయింగ్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి రూపాయి ఫీజు చెల్లిస్తే అనుమతులిచ్చేలా ఏర్పాట్లు చేసింది. ఈ నిర్ణయంతో ప్రజలకు ఏటా రూ.6 కోట్ల ఫీజుల భారం తప్పనుంది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏటా 35 వేలకుపైగా ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. వీటిపై ఫీజుల కింద రూ.1,500 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. మొత్తం అనుమతుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలు 50 చదరపు గజాల్లోపు విస్తీర్ణంలో నిర్మించుకుంటున్న ఇళ్లు 25-30% వరకు ఉంటున్నాయి. రెండంతస్తుల్లో వీరు నిర్మించుకుంటున్న ఇళ్లకు ఫీజుల కింద రూ.3 వేలు నుంచి రూ.4 వేల వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో పేదలకు ఈ భారం తగ్గనుంది. (మిగతా 6లో)

గజవాహనంపై శ్రీవారి వైభవం

- ఉదయం హనుమంత వాహనంపై కోదండరామునిగా..
- వైభవంగా స్వర్ణరథోత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం రాత్రి మలయప్ప స్వామి గజవాహనంపై భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాల నడుమ స్వామి వారి వాహన సేవ కోలాహలంగా సాగింది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి స్వర్ణరథంపై కనువిందుగా ఊరేగారు. రథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. ఉదయం హనుమంత వాహనంపై కోదండరాముని అలంకారంలో శ్రీవారు భక్తులకు అభయ ప్రదానం చేశారు. వాహనసేవలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఆనంద్ సాయి తదితరులు పాల్గొన్నారు.


గజవాహనంపై విహరిస్తున్న శ్రీవేంకటేశ్వరుడు


స్వర్ణరథంలో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి


దసరా నవరాత్రుల్లో భాగంగా సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు


దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులను బారికేడ్లలో ఉంచి, విడతలవారీగా పంపిస్తున్న పోలీసులు

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

- ఇంద్రకీలాద్రిపై వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజు సోమవారం మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో రాగా వీరందరినీ తొలుత కంపార్ట్‌మెంట్లలోకి, అక్కడి నుంచి క్యూలైన్లలోకి వదిలారు. తెల్లవారుజామున 1.15 గంటల నుంచి అర్ధరాత్రి వరకు దర్శనాలు కొనసాగాయి. సోమవారం ఒక్కరోజే అత్యధికంగా రెండు లక్షల మందిపైగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

మహాగౌరి అలంకారంలో శ్రీశైల భ్రమరాంబ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం భ్రమరాంబదేవి మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నంది వాహనంపై కొలువుదీర్చి అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని నిలిపివేసి ఆలయ ఉత్సవం జరిపారు.




శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికారు. దర్శనం తర్వాత రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలుకగా, తితిదే అధికారులు ప్రసాదాలు అందజేశారు. అనంతరం న్యాయమూర్తి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపై కోదండ రామావతారంలో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్నారు.

‘తితిదే’కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన శ్రీవారి గరుడసేవను తితిదే అద్భుతంగా నిర్వహించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్, ఇన్‌స్టా వేదికగా అభినందించారు. రాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి తరలివచ్చిన సుమారు 3 లక్షల మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారని కొనియాడారు. తితిదే బోర్డు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, జిల్లా పరిపాలన విభాగం అధికారులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేశారని సీఎం ప్రశంసించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించిన భక్తకోటికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

తిరుమల గరుడోత్సవానికి.. 5,642 ట్రిప్పులు నడిపిన ఆర్టీసీ

ఈనాడు, అమరావతి: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడోత్సవానికి తరలి వచ్చిన భక్తులను తిరుపతి నుంచి తిరుమలకు తరలించడంలో ఏపీఎస్ఆర్టీసీ రికార్డు సృష్టించింది. 24 గంటల్లో 5,642 బస్సు ట్రిప్పులను తిరుపతి-తిరుమల మధ్య నడిపింది. 2.16 లక్షల మంది భక్తులు వీటిలో రాకపోకలు సాగించారు. గత ఏడాది కంటే పెద్ద సంఖ్యలో భక్తులు ఈసారి ప్రయాణించారు. ఈ బస్సులేవీ బ్రేక్‌డౌన్ లేకుండా, నిరవధికంగా పరుగులు పెట్టేలా చేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు.

గోదావరి డెల్టా ఏరియల్ లైడార్ సర్వేకు రూ.13 కోట్లు

ఈనాడు, అమరావతి: గోదావరి డెల్టా వ్యవస్థలో ఉన్న అన్ని కాలువలు, డ్రెయిన్లకు సంబంధించి లైడార్ సర్వే చేసేందుకు ప్రభుత్వం రూ.13.428 కోట్లు కేటాయించింది. ఇందుకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం పాలనామోద ఉత్తర్వులు ఇచ్చారు. జియో మ్యాప్‌లు తయారు చేసేందుకు వీలుగా ఈ సర్వే చేయనున్నారు. వీటితో పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదికనూ సిద్ధం చేయాల్సి ఉంటుంది.

విజయదశమి అంటే విజయవాడే గుర్తొస్తుంది

- ప్రగతి సంకల్పానికి ఇలాంటి ఉత్సవాలే ప్రేరణ
- విజయవాడ ఉత్సవ్‌లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, అమరావతి: ‘విజయ దశమి అనగానే మైసూరు, కోల్‌కతా ఉత్సవాల గురించి మాట్లాడుకుంటాం. ఈ 11 రోజుల ఉత్సవ్ పూర్తయ్యాక దేశంలో ఎక్కడైనా విజయదశమి ప్రస్తావన వస్తే విజయవాడ గురించి మాట్లాడుకునే స్థాయిలో నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడైనా దసరా ఉత్సవాలు చేయాలంటే విజయవాడ ఉత్సవాలే నమూనాగా నిలుస్తాయి. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు జరగాలంటే మానవ, దైవ సంకల్పాలు మమేకం కావాలి’ అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉత్సవాల 8వ రోజైన సోమవారం విజయవాడ ఉత్సవ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ‘రాష్ట్రంలో అంతరించిపోతున్న కళలకు జీవం పోయడమే ఉత్సవ్‌కు గొప్ప విజయం. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మొదలు అనంతపురం వరకు అన్ని ప్రాంతాల కళల పరిరక్షణ, కళాకారులను గౌరవించడమే కేంద్ర బిందువుగా కార్యక్రమం జరుగుతోంది. ఉత్సవ్‌లో హెలిరైడ్ ద్వారా నా ప్రాతినిధ్యం కూడా ఉన్నందుకు ఆనందంగా ఉంది. డ్రోన్ ప్రదర్శన చూస్తే నాకు గతంలో ఇదే పున్నమి ఘాట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన డ్రోన్ సమ్మిట్ గుర్తొస్తోంది. ఈ విజయదశమి మెగా కార్నివాల్ వాక్ కార్యక్రమంతో మరో గిన్నిస్ రికార్డు సాధిస్తాం’ అని రామ్మోహన్ నాయుడు చెప్పారు.


శ్రీకాకుళం నుంచి వచ్చిన చిన్నారి డప్పు వాయిద్య కళాకారుణ్ని ఎత్తుకుని బృంద చిత్రం దిగుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

అందరం కలిస్తేనే అభివృద్ధి

‘రాజధాని ఏర్పాటు కావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కేవలం సీఎం చంద్రబాబు విజన్‌తో 24 గంటలూ పని చేస్తే సరిపోదు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ఆంధ్రులు కలిసి వస్తేనే సాధ్యమవుతుంది. ముఖ్యమంత్రి చాలా పెద్ద లక్ష్యాలు పెడుతున్నారు కదా అవి చేరుకోవడం సాధ్యమవుతుందా అనుకోవచ్చు. దానికి ఈ ఉత్సవమే పెద్ద సమాధానం. ప్రగతి సంకల్పానికి ఇలాంటివే ప్రేరణ. అభివృద్ధి అంటే భవిష్యత్తుకు సంబంధించే కాదు.. మన కళలు, సంప్రదాయాలు, ఆచారాలు, చరిత్రను కాపాడుకోవడం కూడా. ఉపరాష్ట్రపతిని ఈ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు వెళితే నేను ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి తిరుపతికి రావాలనుకున్నాను. అమ్మవారి నుంచి ఆహ్వానం వస్తే రాకుండా ఎందుకు ఉంటానంటూ ముందు విజయవాడే వచ్చారు’ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




మణిశర్మ సారథ్యంలో మ్యూజికల్ నైట్‌ను ఆస్వాదిస్తున్న జనం ◆ సంగీత దర్శకుడు మణిశర్మ

మహా సరస్వతీదేవికి 108 వీణలతో నీరాజనం

జ్ఞానం, విద్య, కళలకు ఆదిదేవతగా భావించే మహా సరస్వతీదేవికి మూలా నక్షత్రం రోజున 108 మంది వీణ వాయిద్యకారులు సప్త స్వరాలతో సంగీత నీరాజనం అర్పించారు. శ్రీసాలి గ్రామ మఠం ట్రస్టు వారి శ్రీవిద్యాపీఠం ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జిల్లా తెనాలిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీనుల విందుగా సాగిన ఈ కార్యక్రమానికి పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి), పెద్ద సంఖ్యలో సంగీత ప్రేమికులు హాజరయ్యారు.

–న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)



63.50 లక్షల మంది పింఛన్లకు రూ.2,745 కోట్లు విడుదల

కొత్తగా 10,578 మందికి స్పౌజ్ పింఛన్ల మంజూరు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద అక్టోబరు 1న 63.50 లక్షల మందికి పింఛన్ల పంపిణీకిగాను ప్రభుత్వం రూ.2,745.50 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా స్పౌజ్ కేటగిరీ కింద 10,578 మందికి పింఛన్లు మంజూరయ్యాయని మంత్రి చెప్పారు. వారికి రూ.4 వేల చొప్పున పంపిణీకిగాను రూ.4.23 కోట్లు విడుదల చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. విజయనగరం జిల్లా దత్తరాజేరు మండలం దత్తి గ్రామంలో పాల్గొంటారని వెల్లడించారు.

పట్టణాభివృద్ధి సంస్థల ఛైర్మన్ల పదవీ కాలం పొడిగింపు

ఈనాడు, అమరావతి: పట్టణాభివృద్ధి సంస్థల ఛైర్మన్ల పదవీ కాలాన్ని ప్రభుత్వం రెండేళ్లకు పొడిగించింది. అమలాపురం, రాజమహేంద్రవరం, బొబ్బిలి, బాపట్ల, శ్రీకాకుళం, కర్నూలు, కాకినాడ, చిత్తూరు, అనంతపురం-హిందూపురం, నెల్లూరు, విశాఖపట్నం, తిరుపతి, ఏలూరు, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థలకు ప్రభుత్వం 2024 నవంబరు, 2025 మార్చి, మే లలో ఛైర్మన్లను నియమించింది. వీరి పదవీ కాలాన్ని ఏడాదిగా పేర్కొంటూ అప్పట్లో ఉత్తర్వులు ఇచ్చింది. తాజాగా దాన్ని రెండేళ్లకు పొడిగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్టీఆర్ బేబీ కిట్‌లో అదనంగా రెండు వస్తువులు

- ఫోల్డబుల్ బెడ్, బ్యాగుల పంపిణీకి చర్యలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారికి ఉచితంగా అందించనున్న ‘ఎన్టీఆర్ బేబీ కిట్’లో అదనంగా రెండు వస్తువులను చేర్చారు. కిట్‌ను ఇటీవల పరిశీలించిన సీఎం చంద్రబాబు.. అదనంగా ఫోల్డబుల్ బెడ్, బ్యాగును చేర్చాలని ఆదేశించారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అందుకు ఏర్పాట్లు చేస్తోంది. బేబీ కిట్‌లో దోమ తెరతో కూడిన పరుపు, వాటర్ ప్రూఫ్ షీటు, దుస్తులు, న్యాప్కిన్లు, తువాలు, సబ్బు, సబ్బు పెట్టె, పౌడర్, ఆయిల్, షాంపూ, బొమ్మ.. ఇలా 11 వస్తువులు ఉండేవి. ఇప్పుడా సంఖ్య 13కి చేరింది. గతంలో ఒక్కో కిట్‌కు రూ.1,504 ఖర్చవుతుందని అంచనా వేస్తే.. రెండు వస్తువుల చేరికతో అదనంగా రూ.450 వ్యయం కానుంది.


ఎన్టీఆర్ బేబీ కిట్‌లో ఫోల్డబుల్ బెడ్, కిట్ బ్యాగు(నమూనా)

ఏటా 3.20 లక్షల మందికి..: రాష్ట్రంలో ఏటా సుమారు 3.20 లక్షల మంది తల్లులకు ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించాలన్నది లక్ష్యం. శిశు ఆరోగ్య సంరక్షణ కోసం 2016లో తెదేపా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత వచ్చిన జగన్ సర్కారు కొన్నాళ్లు అమలుచేసి.. ఆపేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ‘ఎన్టీఆర్ బేబీ కిట్’ పేరుతో పథకాన్ని పునః ప్రారంభించాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు- మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) ద్వారా 26 జిల్లాల్లోని డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ఎస్‌లు, జీజీహెచ్‌లకు రెండేళ్ల పాటు ‘రేట్ కాంట్రాక్ట్’ పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా జూన్‌లో టెండర్లు పిలిచింది. పలు సంస్థలు ఆసక్తి చూపాయి. ముఖ్యమంత్రి ఆదేశాలతో అదనంగా రెండు వస్తువులను చేర్చాల్సి రావడంతో మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించారు. పథకం అమలుకు రూ.65 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ప్రభుత్వం నిధులివ్వగానే టెండర్లు పిలిచేందుకు ఏపీఎంఎస్ఐడీసీ సన్నాహాలు చేస్తోంది.

అక్టోబరులో జేఈఈ మెయిన్ దరఖాస్తులు ప్రారంభం

- ఇప్పుడే ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోండి
- అభ్యర్థులకు ఎన్‌టీఏ సూచన

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎన్ఐటీల్లో సీట్ల భర్తీకి, జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందేందుకు నిర్వహించే జేఈఈ మెయిన్‌కు అక్టోబరులో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రతి ఏటా జనవరి, ఏప్రిల్‌లో రెండుసార్లు పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా అవే నెలల్లో పరీక్షలు జరుగుతాయని జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) సోమవారం వెల్లడించింది. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ఆ సంస్థ కొన్ని సూచనలు చేసింది. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ(పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం), తాజా ఫొటో, చిరునామా, తండ్రి పేరు తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని, ఏమైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని సూచించింది. ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగుల ధ్రువపత్రాలను కూడా సిద్ధం చేసుకోవాలని కోరింది. జేఈఈ మెయిన్‌కు దేశవ్యాప్తంగా దాదాపు 14 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తుంటారు. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 2.50 లక్షల మంది ఉంటారు.

గ్రహం అనుగ్రహం

30–9–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, ఆశ్వయుజ మాసం, శుక్లపక్షం
అష్టమి: మ. 1-25 తదుపరి నవమి
పూర్వాషాఢ: తె. 4-53 తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: మ. 1-29 నుంచి 3-11 వరకు
అమృత ఘడియలు: రా. 11-45 నుంచి 1-27 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-03 వరకు
తిరిగి రా. 10-38 నుంచి 11-26 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5.53; సూర్యాస్తమయం: సా.5.49
దుర్గాష్టమి, బతుకమ్మ పండుగ

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	25.0
నరసాపురం	35.4	27.0
విజయవాడ	34.1	25.0
ఒంగోలు	34.0	25.0
తిరుపతి	33.7	25.1
అనంతపురం	33.7	23.2
నెల్లూరు	33.6	26.0
విశాఖపట్నం	33.6	25.4
గుంటూరు	33.0	27.0
ఖమ్మం	32.8	23.0
కర్నూలు	32.2	23.0
విజయనగరం	32.0	26.0
శ్రీకాకుళం	32.0	25.0
కడప	32.0	24.0
తాడేపల్లిగూడెం	31.0	27.0


ఈనాడు

అజేయంగా... టీమిండియా!

కొన్ని మ్యాచులను, అవి అందించిన మధురానుభూతులను క్రీడాభిమానులు అంత త్వరగా మరచిపోలేరు. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా మూడేళ్ల కిందట మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్, పాకిస్థాన్ తలపడిన మ్యాచ్ అలాంటిదే. తొంభై వేలకు పైబడిన ప్రేక్షకుల కేరింతల నడుమ ఆరోజు 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన టీమిండియా 6.1 ఓవర్లలో 31 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది. అలాంటి స్థితిలో హార్దిక్ పాండ్యాతో కలిసి ఆచితూచి ఆడుతూ స్కోరుబోర్డును నెమ్మదిగా ముందుకు కదిలించిన 'కింగ్' కోహ్లీ- ఆపై వీరోచిత బ్యాటింగ్ విన్యాసాలతో ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. మొన్నటి ఆసియా కప్ ఫైనల్‌లో 20 పరుగులకే మూడు వికెట్లు నష్టపోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన టీమిండియాను మన తెలుగు కుర్రాడు నంబూరి తిలక్ వర్మ అచ్చం అలాగే ఆదుకున్నాడు. మందకొడి పిచ్ మీద పరిణతితో కూడిన ఆటతో పాక్‌కు విజయాన్ని దూరం చేశాడు. కొండంత ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ సంజూ శాంసన్, శివమ్ దూబేలతో చక్కటి భాగస్వామ్యాలను నిర్మించిన తిలక్- ఆఖరి ఓవర్‌లో హారిస్ రవూఫ్ బంతిని బౌండరీ బయటికి పంపి జట్టుకు గెలుపు ఖాయంచేశాడు. అంతవరకు మునివేళ్లపై నిలబడి చూస్తున్న అభిమానులతో ఆనంద నృత్యం చేయించాడు. సంయమనం, దూకుడు కలగలిసిన తిలక్ బ్యాటింగ్- టీ20ల్లో పరుగుల మోత మోగించడానికి టెక్నిక్‌తో పనిలేదనుకునే వారికి ఒక పాఠం వంటిది!

ఆసియా కప్‌లో టీమిండియా అన్ని మ్యాచులనూ గెలవకపోతేనే ఆశ్చర్యమని దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ టోర్నీకి ముందు వ్యాఖ్యానించారు. భీకరమైన బ్యాటింగ్ లైనప్‌తో, పటిష్ఠమైన విభిన్నమైన బౌలింగ్ వనరులతో భారత జట్టు దుర్భేద్యంగా కనపడుతోందని ఆయన విశ్లేషించారు. అందుకు తగినట్లుగానే ఆసియా కప్‌లో ఆడిన అన్ని మ్యాచుల్లోనూ టీమిండియా విజయకేతనం ఎగరవేసింది. అవతల బౌలర్ ఎవరన్నది చూడకుండా బంతిని బలంగా బాదుతూ జట్టుకు మెరుపు ఆరంభాలనిచ్చిన అభిషేక్ శర్మ- భారత గెలుపు యాత్రలో కీలక పాత్ర పోషించాడు. స్పిన్ త్రయం కులదీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ప్రత్యర్థి బ్యాటర్లకు కొరకరాని కొయ్యలయ్యారు. అయితే, మనవాళ్లు పలు సందర్భాల్లో క్యాచ్‌లు వదిలేయడం, బ్యాటింగ్‌లో కెప్టెన్ సూర్య తన స్థాయికి తగినట్లు రాణించకపోవడం వంటి సమస్యలూ లేకపోలేదు. వాటిని అధిగమిస్తే రాబోయే టీ20 ప్రపంచకప్‌లోనూ భారత్‌కు తిరుగు ఉండదు!

టీమిండియా ఆటకు ఇప్పుడు చప్పట్లు కొడుతున్నవారిలో అత్యధికులు వ్యక్తిగతంగా మైదానాలకు దూరంగా ఉండిపోతున్నారు. ఆటపాటల జోలికి పోకుండా బుద్ధిగా చదువుకోవాలంటూ ఇంట్లో పిల్లలనూ విపరీతంగా ఒత్తిడికి గురిచేస్తుంటారు. క్రీడాసమరాలను చూస్తూ ఆస్వాదించేవారిగా మిగిలిపోవడం కాదు- ఆడేవారిగా ఎదిగితేనే నవతరం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. పదేళ్ల వయసులో కోచ్‌తో కలిసి రోజుకు ఎనభై కిలోమీటర్లు ప్రయాణిస్తూ తిలక్ వర్మ తన నైపుణ్యాలకు పదును పెట్టుకున్నాడు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారికి కుటుంబ సభ్యుల మద్దతు తోడై, తగిన శిక్షణ లభిస్తే కచ్చితంగా దేశం గర్వించే స్థాయికి చేరుకోగలరు. అందుకు తిలక్ ప్రస్థానమే ఓ ఉదాహరణ. సమష్టితత్వాన్ని, క్రమశిక్షణను, గెలుపోటములను సమంగా స్వీకరించే స్థితప్రజ్ఞతను అలవరచే ఆటలు- భావిభారత పౌరుల వ్యక్తిత్వాలను వికసింపజేస్తాయి. శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండే జాతిని తయారుచేస్తాయి. అలాంటి క్రీడాసంస్కృతికి ఆలవాలమైనప్పుడే భారతావని ప్రగతి ప్రస్థానం వేగవంతమవుతుంది. ప్రాణాంతకమైన కుంగుబాటు కోరల్లోంచి యువతరమూ బయటపడగలుగుతుంది!



ఇది కావాలి, అది కావాలి అంటూ కోరికల
వెంట పరుగులు తీసినంత కాలం ఒత్తిడి,
ఆందోళనలతో గుండె కొలిమిలా మండుతుండేది.
ఏమీ అక్కర్లేదని మౌనంగా ఉండిపోతే
నాకేం కావాలో అదే నన్ను వెతుక్కుంటూ వచ్చింది.
ఇప్పుడు మనసు ప్రశాంతంగా ఉంది.

– రూమీ

శ్రీ దుర్గా నమోస్తుతే!

అంతటా విస్తరించిన శక్తి తత్వాన్ని జగన్మాత ఆకృతిలో దర్శించి, ఆరాధించే సాధనా సంవిధానాలు- దేవి శరన్నవరాత్రులు. జడత్వాన్ని వీడి చేతనత్వాన్ని సంతరించుకోవాలి. అజ్ఞానమనే చీకటి నుంచి జ్ఞాన వీచికల దిశగా పురోగమించాలి. కర్తవ్య దీక్షతో కార్యోన్ముఖులు కావాలి- అనే చైతన్య స్ఫూర్తిని నవరాత్రులు అందిస్తాయి. సమస్త శక్తుల సమన్వయ రూపిణిగా దుర్గాదేవి వర్ధిల్లుతోందని దేవీ భాగవతం పేర్కొంది. దుర్వికారాలను ఉపశమింపజేసి, దుర్గతులను రూపుమాపే మాతృశక్తి- దుర్గ. మహాదేవుడి అమేయ శక్తి స్వరూపమే దుర్గ. ప్రతికూల భావాలను, వ్యతిరేక ధోరణులను నివారించి సానుకూల, సౌజన్యయుత అంశాలను దుర్గాశక్తి పెంపొందిస్తుంది. మంత్ర, తంత్ర, యంత్ర సమ్మిళితమైన లోకశుభంకరి- దుర్గా మహేశ్వరి!

దుర్గ, లక్ష్మి, సరస్వతి, గాయత్రి, రాధ రూపాలు- పంచ ప్రకృతి శక్తులు. ఈ అయిదింటికీ మూలకారక శక్తి దుర్గ. సకల సృష్టిలోని తేజస్సు ఆమెను ఆశ్రయించి ఉంటుందని దుర్గాసూక్తం ప్రస్తుతించింది. అందుకే తనను సర్వప్రకాశ స్ఫూర్తిగా పేర్కొంటారు. అఖిలాండకోటి బ్రహ్మాండంలో చైతన్యాన్ని దుర్గాంశగా సంభావిస్తారు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియాత్మక శక్తులకు ఆలంబనగా ఆద్యశక్తి దుర్గాదేవి అలరారుతోంది. జ్ఞాన దీప్తికి సంకేతమైన వేదాలను దుర్గమాసురుడు అపహరించాడు. దుర్గముణ్ని సంహరించి, వేదాలను పునరుద్ధరించడానికి త్రిమూర్తుల దివ్య యశస్సుతో విజయ విలాసినిగా దుర్గ సాకారమైంది. అజ్ఞానాంధకారానికి ప్రతిబింబమైన దుర్గముడి అంతంతో, లోకంలో విజ్ఞాన కాంతులు ప్రసరించాయి. జీవులకు శక్తిని అందిస్తూ, వాటిని పోషిస్తూ జీవోద్ధరణ చేసే మహాదేవి, దుర్గాష్టమి నాడు జగదంబగా అవతరించింది.



అంతర్యామి

లోకంలో జీవత్వాన్ని, జాగృతిని నిలువరించి, జడత్వాన్ని పెంపొందించాలని అసురగణం ప్రయత్నించినప్పుడు కాలాత్మికగా, శతాక్షిగా శ్రీమాత ఆవిర్భవించింది. విశ్వ చక్రాన్ని పురోగమింప చేయడానికి విశ్వేశ్వరిగా వ్యక్తమైంది. 'వాంఛాసమధికం'- అని దుర్గాదేవిని సౌందర్యలహరిలో జగద్గురు ఆదిశంకరులు కీర్తించారు. కోరిన దానికన్నా అధికంగా వరాల సిరులను అనుగ్రహించే కల్పవల్లి- శ్రీ దుర్గ.

ప్రాణమయి, ప్రాణధాత్రి, ప్రాణేశ్వరి అనే దుర్గా నామాలకు ప్రతీకాత్మకమైన, ప్రాకృతికపరమైన సంకేతం- బతుకమ్మ! ప్రకృతిలోని సాఫల్యతకు, సజీవత్వానికి బతుకమ్మ అద్దంపడుతుంది. ప్రాణులలోని జీవశక్తిని బతుకమ్మగా జానపదులు దర్శిస్తారు. పూల పొదరిళ్లలో పుష్ప సౌందర్యంతో బతుకమ్మ పరిమళిస్తుంది. తెలంగాణ వ్యాప్తంగా మహాలయ అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు తన్మయభరితంగా ఆటపాటలతో మహిళలు బతుకమ్మను ఆరాధిస్తారు. దేవీ నవరాత్రులలో నిర్వహించే శ్రీ చక్రార్చనకు మరో రూపమే బతుకమ్మ. చైతన్య కుసుమప్రియగా భాసిల్లే బతుకమ్మ, సద్దుల బతుకమ్మ పేరిట ఈ సంబురాల్లో చివరి రోజు కనువిందు చేస్తుంది. చద్ది అంటే చలువ, శీతలత్వం, క్షేమంకర భావన. పూలపుంతగా, తీరొక్క పువ్వుల దొంతరగా గోచరమయ్యే చద్దుల బతుకమ్మ, సస్యకారక శక్తిగా ప్రకటితమవుతుంది. సమష్టి ఆధ్యాత్మిక చైతన్యానికి, సామరస్య జీవన సంవిధానానికి ప్రతీక- బతుకమ్మ వేడుక!

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

కొంటారా... కుదరదంటారా?

'భారత్ తన జనాభా 140 కోట్లకు పైగానే అని గొప్పగా చెప్పుకొంటున్నా, అమెరికా నుంచి కనీసం ఒక బుషెల్ (25.4 కిలోలు) మొక్కజొన్న అయినా కొనలేదా' అని అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లట్నిక్ ఇటీవల వితండ వాదన చేశారు. మిత్రదేశాలైన భారత్, బ్రెజిల్, కెనడాలపై సుంకాల బాదుడు సబబేనా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అలా సమాధానమిచ్చారు. ఇండియా అమెరికాకు అన్నీ అమ్ముతుంది కానీ, తమ మొక్కజొన్నను మాత్రం కొనడానికి మొరాయిస్తోందంటూ ఆరోపించారు. దీంతో ప్రస్తుత వాణిజ్య సంప్రదింపుల్లో అమెరికా తన నుంచి భారత్ జన్యుమార్పిడి(జీఎం) మొక్కజొన్నను కొనాల్సిందేనని పట్టుబడుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాలను విపరీతంగా పెంచేసినా రెండు దేశాల మధ్య వాణిజ్య సంప్రదింపులు వివిధ స్థాయుల్లో జరుగుతూనే ఉన్నాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులను కొనాల్సిందేనని అమెరికా ఒత్తిడి చేయడం వల్లనే భారత్ సెప్టెంబరు వరకు అగ్రరాజ్య పత్తిపై దిగుమతి సుంకాన్ని 11శాతం నుంచి సున్నాకు తగ్గించింది. తరవాత ఈ తగ్గింపును ఈ ఏడాది డిసెంబరు వరకు పొడిగించింది. దీన్ని రైతు సంఘాలు వ్యతిరేకించాయి. చివరికి భారతీయ కిసాన్ సంఘ్ కూడా పొడిగింపు నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరింది. ఒకసారి అమెరికన్ పత్తి దిగుమతులను అనుమతించామంటే, ఆపైన మొక్కజొన్న, సోయాబీన్, పాడి ఉత్పత్తులనూ దిగుమతి చేసుకోవాలనే ఒత్తిడి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. లట్నిక్ ప్రకటన కూడా దానికి తగినట్లుగానే ఉంది.




అనుమతిస్తే ప్రమాదమే!

అమెరికాలో మొక్కజొన్నే ప్రధాన పంట. ఆ దేశంలో ఏటా 9 కోట్ల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. అది అక్కడి పంట భూమిలో అయిదు శాతానికి సమానం. అక్కడ పండిన పంటలో 15శాతం స్వదేశంలోనే వివిధరూపాల్లో వినియోగమవుతుంది. 40శాతం పశు దాణాగా, 45శాతం ఇంధనంలో మిశ్రమంగా ఉపయోగిస్తున్నారు. తమ దేశంలో పండిన మొక్కజొన్నలో కేవలం ఒక శాతాన్ని మాత్రమే అమెరికన్లు ఆహారంగా తీసుకుంటారు. మిగతా పంటను కార్న్ మీల్(పిండి)గా, అధిక తీపిదనంగల కార్న్ సిరప్‌గా, పెయింట్లు, ప్లాస్టిక్కులలో ముడి పదార్థంగా వాడతారు. కోళ్లు, పశువుల దాణాలో 95శాతం మొక్కజొన్నే ఉపయోగిస్తారు. అమెరికాలో ప్రభుత్వం నుంచి భారీగా సబ్సిడీలు అందుకునే పంట కూడా మొక్కజొన్నే. 2024లో అమెరికాలో మొక్కజొన్న సాగుదారులకు 320 కోట్ల డాలర్ల సబ్సిడీ లభించింది. అది మొత్తం వ్యవసాయ సబ్సిడీలలో 30.5శాతం. అమెరికాలో ప్రధానంగా జన్యుమార్పిడి మొక్కజొన్న సాగవుతోంది. దానిపై చల్లే గ్లైఫోసేట్ అనే క్రిమినాశని మందులకు క్యాన్సర్ కలిగించే గుణం ఉంది. అమెరికాలో మొక్కజొన్నపై వచ్చే లాభాల్లో అత్యధికం జన్యుమార్పిడి(జీఎం) విత్తనాలను సరఫరా చేసే బేయర్-మాన్ శాంటో, కార్గిల్, ఏడీఎం వంటి కంపెనీలకే దక్కుతాయి. జీఎం పంటలను భారత్, ఐరోపా దేశాలు నిషేధించాయి. ఈ తరహా పంటలు అలర్జీలు, క్యాన్సర్లు, ఇతర రోగాలను కలిగిస్తాయనే భయాందోళనలు ఉన్నాయి. జీఎం పంటలు ప్రజారోగ్యంతోపాటు పర్యావరణానికీ తీరని నష్టం కలిగిస్తాయి. ఈ కారణంగానే భారత్ వీటిని ప్రోత్సహించడం లేదు. జీఎం విత్తనాలు జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తాయి. అమెరికన్ జీఎం మొక్కజొన్న మన దేశవాళీ మొక్కజొన్నను విషతుల్యం చేసే ప్రమాదమూ లేకపోలేదు.

నేడు ప్రపంచంలో మొక్కజొన్నను అత్యధికంగా సాగు చేస్తున్న అమెరికా, చైనాల సరసన భారత్ కూడా నిలుస్తోంది. 2024-25 సీజనులో భారత్ 3.7కోట్ల టన్నుల మొక్కజొన్నను పండించింది. అయినాసరే ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) ఒప్పందంపై సంతకం చేసినందువల్ల ఏటా 15శాతం సుంకంపై అయిదు లక్షల టన్నుల మొక్కజొన్నను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అంతకుపైబడిన దిగుమతులపై 50శాతం సుంకం విధిస్తోంది. స్వదేశీ మొక్కజొన్న రైతుల ప్రయోజనాలను రక్షించడానికే ఈ విధానాన్ని అనుసరిస్తోంది. ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటకలలో అత్యధికంగా మొక్కజొన్న సాగవుతోంది. ఇందులోని కొన్ని రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితిలో అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతి చేసుకోవడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదముంది. అమెరికన్ మొక్కజొన్న భారతీయ పంట కన్నా తక్కువ ధరకు లభ్యమై మన రైతులను దెబ్బతీస్తుందన్న సంగతిని ఇక్కడ గమనించాలి. జులైలో అమెరికన్ మొక్కజొన్న ధర బుషెల్(25.4కిలోల)కు 4.29 డాలర్లు పలికింది. అంటే కిలో 15 రూపాయలలోపే అన్న మాట. అదే భారతీయ మొక్కజొన్న ధర కిలోకు రూ.22-23 వరకు ఉంది. 2025-26లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 24 రూపాయలు. అమెరికా ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తుండటం వల్లే ఆ దేశపు మొక్కజొన్నను చవకగా ఎగుమతి చేయగలుగుతున్నారు.


షరతులు విధించాల్సిందే...

మొక్కజొన్న అమెరికా వ్యవసాయానికి వెన్నెముక వంటిది. డొనాల్డ్ ట్రంప్‌నకు కూడా మొక్కజొన్న రైతులు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. అందువల్ల మొక్కజొన్నను దిగుమతి చేసుకోవాలంటూ భారత్‌పై ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. చివరికి పశు, కోళ్ల దాణా కోసమైనా జీఎం మొక్కజొన్నను దిగుమతి చేసుకునేలా భారత్‌ను ఒప్పించడానికి ప్రయత్నించే అవకాశం ఉందని భావించవచ్చు. అది మన పశువుల ఆరోగ్యానికే కాదు, ప్రజారోగ్యానికీ ప్రమాదకరమే. అందువల్ల అమెరికా నుంచి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన మొక్కజొన్నను మాత్రమే దిగుమతి చేసుకుంటామనీ, జీఎం మొక్కజొన్నను అనుమతించేది లేదనీ భారత్ నిక్కచ్చిగా షరతు విధించాలి. ఆ దిగుమతులను కూడా పరిమితంగా, అదీ నిర్దిష్ట కాల వ్యవధి మేరకే తీసుకుంటామని స్పష్టం చేయాలి. మొక్కజొన్న పంట కోతలకు 2 నెలల ముందు, కోతల తరవాత 3 నెలల వరకు అమెరికన్ మొక్కజొన్నను దిగుమతి చేసుకోబోమని తెగేసి చెప్పాలి. ఇలాంటి నిర్దిష్ట చర్యల ద్వారా భారతీయ మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి.



ఇంద్రశేఖర్ సింగ్
వ్యవసాయ విధానాల విశ్లేషకులు, నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్

కల్లు దింపి...కలం పట్టి..!



'నా వృత్తి నాకు గౌరవాన్ని, తృప్తిని ఇస్తుంది. మిగిలిన వారికి ఏమో కానీ, నాకైతే నా వృత్తి ఒక వేడుక' అంటారు నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్. ఆయన కల్లుగీత కార్మికుడు. రోజూ పొద్దున్నే మోకు భుజాన వేసుకుని తాటి, ఈత చెట్లను ఎక్కి కల్లు ముంతలను దింపుతారు. దాన్ని అమ్మేసి మధ్యాహ్నానికి ఇంటికొస్తారు. సీజన్ బాగున్నప్పుడు ఉదయం, సాయంత్రం కల్లు అమ్మకాలు సాగుతాయి. బాగా అమ్మిన రోజున రెండు వేలు, అమ్మకాలు లేనినాడు రెండు వందలు. వందలు ఎన్నయినా ఆయన సంతృప్తి గ్రాఫ్ మాత్రం మారదు. ఇక్కడ విశేషమేమిటంటే శ్రీనివాస్ గౌడ్ తెలుగులో చక్కటి కథలు, నవలలు రాస్తారు. కల్లు మండువాకి అన్ని వర్గాలవారు వస్తుంటారు. అన్న, మామ, తాత అని పలకరించుకుంటారు. కష్ట సుఖాల చర్చావేదిక ఆ మండువా. అన్నీ మౌనంగా, శ్రద్ధగా వినే శ్రీనివాస్ ఇంటికొచ్చాక కలం పట్టుకుని వాటిని కథలుగా మలుస్తారు. ఆయనది జగిత్యాల దగ్గర హనుమాజీపేట. ఆ ఊరి జనం, పరిసరాలే ఆయన కథల్లో పాత్రలు, సన్నివేశాలు. కల్పన, ఊహాగానాలకు తావులేని స్వచ్ఛమైన, సహజమైన గ్రామీణ నేపథ్య రచనలవి. కల్లు గీతనీ, కుటుంబాన్నీ, రచననీ సమానంగా ప్రేమిస్తారాయన. నవలలో తనకు తోచిందేదో రాయరు. నిజానిజాలు శోధించి రాస్తారు. అందుకే ఆయన రచనలు చదివింపజేస్తాయి... ఆలోచింపజేస్తాయి.

2004లో వెలువడిన 'బతుకుతాడు' శ్రీనివాస్ గౌడ్ మొదటి నవల. అది ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ ఎం.ఎ. విద్యార్థులకు పాఠ్యాంశం. ఆయన కథలు- పేదల బతుకులు, సర్పంచ్, రచ్చబండ అనే సంపుటాలుగా వచ్చాయి. 2017లో రాసిన 'దుల్దుమ్మ' అనే నవలకు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ నవల పురస్కారం లభించింది. 320 పేజీల 'దుల్దుమ్మ' నవల ప్రచురణకు తన దగ్గర డబ్బు లేకపోతే భార్య సత్తవ్వ చిట్టి పాడి తీసుకున్న సొమ్ము ఇచ్చిందని శ్రీనివాస్ రాసుకున్నారు. సత్తవ్వ బీడీ కార్మికురాలు. చాలా కాలం పూరి గుడిసెలోనే సాగిన వీరి సంసారం ఈ మధ్యనే పక్కా ఇంటిలోకి మారింది. శ్రీనివాస్ రచనలపై ఎం.ఫిల్., పిహెచ్.డి. చేస్తున్న వారున్నారు.

1970లో జన్మించిన శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏడో తరగతితోనే చదువు మానేసి కులవృత్తిలో చేరిపోయారు. మండువాకు వచ్చే ఓ మాస్టారు వల్ల ఆయనకు లైబ్రరీ పరిచయమైంది. వీలైనంత సమయాన్ని శ్రీనివాస్ పుస్తకాల మధ్యనే గడిపేవారు. ఎన్ని పుస్తకాలు తిరగేసినా కల్లుగీత కార్మికుల జీవితంపై ఆయనకు ఒక్క రచనా కనబడలేదు. ఆ పని తానెందుకు చేయకూడదు అన్న ఆలోచన ఆయనను ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేసేందుకు ప్రోత్సహించింది. దూరవిద్య ద్వారా తెలుగులో ఎం.ఎ. చేశారు. ఒక నవలకు అవసరమైన సమాచార సేకరణ కోసం ఈ మధ్య ఎం.ఎ. సోషియాలజీ కూడా చదివారు. ఇంత చదివినా తన వృత్తిని మానలేదు. ఇప్పటికీ కల్లు దింపడం అయ్యాకే కలం పడతారు శ్రీనివాస్ గౌడ్.

– బద్రి నర్సన్



ఈవీలకే ఓటు!

వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. శిలాజ ఇంధనాల ధరలూ ఎక్కువగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది విద్యుత్ వాహనాల వైపు మొగ్గుతున్నారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్‌లో ద్విచక్ర వాహనాలతో పాటు కార్ల కొనుగోళ్లూ క్రమంగా పుంజుకొంటున్నాయి. నిరుడు ప్రపంచవ్యాప్తంగా కొత్తగా అమ్ముడైన కార్లలో పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్‌వి గణనీయ సంఖ్యలో ఉండటం విశేషం. చైనాలో మొత్తం కార్లలో సగం, ఐరోపా సమాఖ్య దేశాల్లో ప్రతి అయిదింటిలో ఒకటి, అమెరికాలో ప్రతి పది కార్లలో ఒకటి అలాంటివే అమ్ముడుపోయాయి. గతేడాది ఆయా దేశాల్లో అమ్ముడైన మొత్తం కార్లలో విద్యుత్ లేదా హైబ్రిడ్ రకానివి (శాతాల్లో)...

నార్వే	92	ఆస్ట్రేలియా	13
స్వీడన్	58	అమెరికా	10
చైనా	48	దక్షిణ కొరియా	9
యూకే	28	బ్రెజిల్	6
స్విట్జర్లాండ్	28	జపాన్	3
కెనడా	17	ఇండియా	2

(ఆధారం: గ్లోబల్ ఈవీ ఔట్‌లుక్-2025)

రెండు నాల్కల చైనా కూటనీతి!

చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ ఇటీవల దిల్లీ వచ్చి భారత నాయకులను కలిసి చిరునవ్వులు చిందించి వెళ్లారు. దీనిపై చైనా సమాచార మాధ్యమాలు ఏదో గొప్ప విషయం జరిగిపోయినట్లు హోరెత్తించాయి. అమెరికాను నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే అనీ; చైనా వాస్తవిక, ఆచరణీయ దృక్పథంతో వ్యవహరిస్తుందనీ ఊదరగొట్టాయి. ఇదంతా ఒకవైపే! చైనీయుల కోసం మాండరిన్ భాషలో డ్రాగన్ చేసే ప్రచారం మరోలా ఉంటుంది. దాన్ని గమనించి చైనా కపట నాటకాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

డోక్లాంలో చైనా ఆక్రమణ యత్నాలను భారత్ ఎదుర్కొన్నప్పుడు బీజింగ్ దిల్లీకి గట్టి గుణపాఠం చెప్పాలనీ, 1962నాటికన్నా దారుణమైన ఓటమిని రుచి చూపించాలనీ మాండరిన్ భాషలోని చైనా సమాచార మాధ్యమాలు రెచ్చగొట్టాయి. 2020లో గల్వాన్‌లో ఘర్షణలు జరిగినప్పుడు మాండరిన్ భాషా మాధ్యమాలు భారతదేశమే కవ్వింపులకు పాల్పడిందనీ, చైనా ప్రజావిమోచన సైన్యం గట్టిగా బుద్ధి చెప్పిందని చెప్పుకొచ్చాయి. ఆంగ్ల భాషలోని సమాచార మాధ్యమాల్లో మాత్రం చైనా సామరస్య ధోరణి కనబరచి సంప్రదింపులతో ఉద్రిక్తతలను ఉపశమింపజేసుకోవాలంటూ సూచించింది. అదే సొంత భాష మాండరిన్‌లో ఏమో భారత్ మనకు ప్రత్యర్థి అనీ, అందుకే కమ్యూనిస్టు పార్టీ దృఢమైన పంథా అనుసరిస్తోందని చెబుతూ స్వదేశీయుల కళ్లకు గంతలు కట్టడానికి చైనా ప్రయత్నిస్తుంటుంది. ఆ భాషలో వార్తలను భారతీయులు చదవరు. మనం చదివే ఆంగ్ల వార్తల్లో మాత్రం దిల్లీ తమను అపార్థం చేసుకుంటోందనీ, భారత్‌తో సహకారమే తమ లక్ష్యమనీ చైనా ఉద్ఘాటిస్తూ ఉంటుంది.

తప్పుడు ప్రచారంలో దిట్ట


భారత ప్రభుత్వ, రక్షణ, దౌత్య రంగాల్లో పనిచేసేవారికి చైనా మోసకారి తత్వం తెలిసిన విషయమే. చైనా మాండరిన్ భాషలో చెప్పేది ఒకటి, ఆంగ్లంలో చెప్పుకొనేది ఇంకొకటి అని వారికి పూర్తి అవగాహన ఉంది. మనదేశంలో కొన్ని పక్షాలు చైనా మాటలను తమకు అనుకూలంగా మలచుకుంటుండటంతో ప్రభుత్వం ప్రతిస్పందించక తప్పని పరిస్థితి నెలకొంటోంది. దీంతో చైనా ఎత్తుకు పైయెత్తు వేసే వెసులుబాటు కోల్పోతోంది. తద్వారా చైనా దుష్ప్రచారం, కపటనీతి భారత రాజకీయాల గతిని నిర్దేశిస్తున్నాయి. పరిస్థితిని చైనాకు అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయి. ట్రంప్ భారత్‌పై సుంకాలు పెంచగానే ఇండో-అమెరికన్ సంబంధాలపై కొన్ని వర్గాల నుంచి సందేహాలు వ్యక్తమయ్యాయి. అమెరికా శిక్షిస్తే చైనా అక్కున చేర్చుకుంటోందనే వ్యాఖ్యలూ వెలువడ్డాయి. అయితే, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు చైనా వత్తాసు పలకడం, బ్రహ్మపుత్రపై ఆ దేశం నిర్మిస్తున్న మెగా డ్యామ్ గురించి వారు ప్రస్తావించడం లేదు.



వాంగ్ యీ దిల్లీకి వచ్చివెళ్లిన తరవాత భారత్ వన్ చైనా(తైవాన్ విలీనంతో) విధానాన్ని సమర్థిస్తోందని బీజింగ్ తప్పుడు ప్రచారానికి దిగింది. దీన్ని దిల్లీ ఖండించినా బీజింగ్ ప్రచారం మిగతా ప్రపంచంలోకి బలంగా వెళ్లింది. ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పడం, సానుకూలాంశాలను గొప్పగా చిత్రిస్తూ, ప్రతికూలాంశాలను కప్పిపెట్టడమనే కళలో చైనా ఆరితేరింది. మరోవైపు, భారత్ భాషాపరంగా బలహీనతను ఎదుర్కొంటోంది. మాండరిన్‌లో చైనా అవాకులు చెవాకుల గురించి బయటపెట్టకపోవడంతో ఆంగ్లంలో వండివార్చిన కథనాలే దిక్కవుతున్నాయి. మాండరిన్‌లో భారత్ పట్ల శత్రుత్వం, సంఘర్షణలను నూరిపోసే చైనా మీడియా, ఆంగ్లానికి వచ్చేసరికి భాగస్వామ్యం, సయోధ్య, సంప్రదింపులంటూ ధర్మపన్నాలు వల్లిస్తోంది. తాను ఎంతో నమ్మదగిన నేస్తాన్నంటూ ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని మలచడమే చైనా లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ ద్వంద్వ నీతిని భారత్ ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. ఇక్కడ భారత్ కొత్త రకంగా ఆలోచించాలి. తైవాన్ నుంచి పాఠాలు నేర్చుకోవాలి. మాండరిన్, ఆంగ్లంలో చైనా రెండు నాల్కల ధోరణిని విశ్లేషించి ప్రజలను అప్రమత్తం చేసే పనిలో తైవాన్ సంస్థలు అకాడెమియా సినికా, నేషనల్ చెంగ్చి యూనివర్సిటీలు రాటుదేలాయి.

ప్రతివ్యూహాలు తప్పనిసరి

చైనా రాజనీతిలో మాయోపాయాలు, ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా తిప్పుకోవడం అంతర్భాగాలు. అమెరికా కూడా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని తనకు అనువుగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తుంటుంది. చైనా, అమెరికాలు సాగించే ప్రచారాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. మొదట మన గూఢచర్య సంస్థల్లో మాండరిన్ విభాగాన్ని విస్తరించి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. చైనా ద్విభాషా కూటనీతిని ఎండగట్టాలి. తైవాన్ అనుభవ నైపుణ్యాలను స్వీకరించి మన సమాచార సాధనాలనూ బీజింగ్ ఎత్తులను ఎదుర్కొనేలా సిద్ధం చేయాలి. మాండరిన్ భాషలోని వార్తాకథనాలను, ప్రచారాన్ని ఎప్పటికప్పుడు అనువదించి ప్రతి వ్యూహాలతో తిప్పికొట్టాలి. చైనా వ్యాఖ్యలు, ప్రకటనలను అవసరమైనప్పుడు వెంటనే ఖండించి ప్రపంచానికి మన విధానాన్నీ, వాస్తవాలనూ స్పష్టం చేయాలి. పోరాట దళాలను మోహరించడంతో పాటు భారత వాణిని గట్టిగా వినిపించడమూ వ్యూహంలో అంతర్భాగం కావాలి. వ్యూహపరమైన స్వావలంబనకు ఇది కూడా కీలకం.




రాకేశ్ భాటియా
విశ్రాంత బ్రిగేడియర్

కల నిజమైతే...

దేవగిరిలో మరిడయ్య అనే వ్యక్తి ఉండేవాడు. తన పెంపుడు కుక్కని ఎప్పుడెప్పుడు వదిలించుకుందామా అని చూసేవాడు. 'నిన్న రాత్రి కలలో మన ఇంట్లో దొంగలు పడి దోచుకెళ్లారు. అయినా నువ్వు ఎందుకు అరవలేదు' అని ఒకరోజు ఉదయం దాన్ని కసురుకున్నాడు. వెంటనే ఇంట్లోంచి తరిమేశాడు. ఆ తరవాత కొన్ని రోజులకు ఓ గాడిదను తెచ్చి పెంచుకున్నాడు. దాని మీద వస్తువులు మోయించి డబ్బులు సంపాదించేవాడు. ఒకసారి దానికి ఆరోగ్యం బాలేకపోవడంతో.. సరిగ్గా పని చేయలేకపోయింది. దాంతో ఆ గాడిదను కూడా ఊరికి దూరంగా వదిలేసి వచ్చాడు మరిడయ్య.

ఒకరోజు ఓ రుషి, మరిడయ్య దగ్గరికి వచ్చి.. 'నేను ధ్యానం చేసుకోవడానికి చాలా దూరం వెళ్తున్నాను. నాకు తోడుగా ఏవైనా పెంపుడు జంతువులను తీసుకెళ్దాం అనుకుంటున్నాను. నువ్వు కుక్క, గాడిదలను పెంచావని విన్నాను. వాటిని నాకు అప్పగిస్తే కావాల్సినంత డబ్బు ఇస్తాను' అన్నాడు. దాంతో మరిడయ్య.. 'నాకు ఒక్కరోజు సమయం ఇవ్వండి కచ్చితంగా వాటిని మీకు అప్పగిస్తాను' అన్నాడు. 'నాకు ఎక్కువగా సమయం లేదు. వెంటనే వెళ్లిపోవాలి' అన్నాడు రుషి. 'అయితే మీరు ఇక్కడే మా ఇంట్లో కూర్చోండి. నేను సాయంత్రానికల్లా వాటిని తోలుకొస్తాను' అని చెప్పాడు మరిడయ్య. సరేనంటూ ఆ రుషి ఇంట్లోకెళ్లి కూర్చున్నాడు. మరిడయ్య.. ఇంట్లో నుంచి వెళ్లగొట్టిన కుక్క, గాడిదను వెతుక్కుంటూ వెళ్లాడు. 'అవి రెండూ కనిపిస్తే బాగుండు.. ఆయన దగ్గర బోలెడు డబ్బులు తీసుకోవచ్చు' అనుకున్నాడు. కానీ ఎంత వెతికినా లాభం లేకుండా పోయింది. ఇక నిరాశతో ఇంటి బాట పట్టాడు. ఇంటికి వచ్చేసరికి ఆ రుషీ లేడు.. ఇంట్లోని విలువైన వస్తువులూ లేవు. దాంతో మరిడయ్య.. 'ఎంత మోసం జరిగిపోయింది. దొంగ మారు వేషంలో వచ్చి ఉన్నదంతా దోచుకెళ్లాడు. కుక్క, గాడిదలో ఏ ఒక్కటి నా దగ్గర ఉన్నా ఇలా ఇల్లు వదిలి వెతకడానికి వెళ్లకపోయేవాణ్ని. సాకులు చెప్పి మరి.. వాటిని తరిమేశాను. ఇప్పుడు ఎంత నష్టం జరిగింది' అని బాధపడ్డాడు.



– కె.వి.వి.సత్యప్రసాద్

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

1. గులాబీపువ్వు, చామంతి, మందారం, కనకాంబరం
2. చేప, జిరాఫీ, పాండా, గొడుగు
3. కుర్చీ, ఫ్యాన్, తలుపు, నిచ్చెన

డిజిటల్ బుక్‌లో 99% వైకాపా వ్యతిరేక ఫిర్యాదులే..

మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: ఐదేళ్ల అరాచకపాలన సాగించిన వైకాపా నాయకులు ఇప్పుడు డిజిటల్ బుక్ అని చెబుతుండడం 'దొంగే.. దొంగా దొంగా' అన్నట్లుగా ఉందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. జగన్ ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌లో 99 శాతం వైకాపా వ్యతిరేక ఫిర్యాదులే ఉంటాయని తెలిపారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన అనంతపురంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు డిజిటల్ బుక్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.

కొత్త టీచర్లకు 3 నుంచి శిక్షణ

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-2025లో ఎంపికయిన ఉపాధ్యాయులకు అక్టోబరు 3 నుంచి 10 వరకు శిక్షణ నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వీరికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు 9, 10 తేదీల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అకడమిక్ కేలండర్, హ్యాండ్‌బుక్ తదితర మెటీరియల్‌ను అందిస్తారు. మరో విడత ఏప్రిల్ 25 నుంచి మే 5 వరకు శిక్షణ తరగతులు ఉంటాయి. పంచాయతీ కార్యదర్శులు, కానిస్టేబుళ్లుగా పని చేస్తూ డీఎస్సీకి ఎంపికైన తమకు శిక్షణకు హాజరు కావడానికి ఆయా విభాగాలు సెలవులు మంజూరు చేయడం లేదని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోస్టింగ్ ఇచ్చినప్పటి నుంచే విధుల నుంచి రిలీవ్ చేస్తామని చెబుతున్నారని, విద్యాశాఖ మాత్రం తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని ఆదేశిస్తోందని పేర్కొన్నారు.

నవంబరు 3 నుంచి ఆర్‌సెట్

ఈనాడు, అమరావతి: పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నిర్వహించే ఆర్‌సెట్‌ను నవంబరు 3 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి తిరుపతిరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ అక్టోబరు 7 నుంచి చేపడతామని, వచ్చే నెల 6న నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలను శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.



ప్రతికూల పరిస్థితులు శాశ్వతం కాదు

ఒక్క అధ్యాయం అనాసక్తిగా అనిపించినంత మాత్రాన పుస్తకం మొత్తం అలాగే ఉంటుందని నిర్ణయించలేం. అదే విధంగా ప్రస్తుతం మీకు ప్రతికూల పరిస్థితులు ఉన్నంత మాత్రాన జీవితం మొత్తం ఇబ్బందులు ఉంటాయని భయపడకూడదు. సహనం, సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లడమే మీరు చేయాల్సిన పని.

– మార్క్, మైండ్‌సెట్ కోచ్

అంతర్రాష్ట్ర సినిమా పైరసీ రాకెట్ ఛేదన

- జూన్‌లో పట్టుబడ్డ ఓ నిందితుడి ఆధారంగా ముఠా గుట్టు రట్టు
- పైరసీ వెనుక బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు
- మొత్తం ఐదుగురు నిందితుల అరెస్టు



సీపీ ఆనంద్‌తో సమావేశమైన నాని, దిల్‌రాజు, నాగార్జున, చిరంజీవి, వెంకటేశ్

ఈనాడు, హైదరాబాద్: అంతర్రాష్ట్ర పైరసీ ముఠా గుట్టును నగర సైబర్‌క్రైమ్ పోలీసులు బట్టబయలు చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద డెబిట్‌కార్డులు, హార్డ్‌డిస్క్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. క్యామ్ రికార్డింగ్, సర్వర్ల హ్యాక్ ద్వారా సినిమాలను పైరసీ చేస్తున్నట్లు నిర్ధారించారు. సోమవారం బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టీజీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు, నిర్మాతలు దామోదర్‌ప్రసాద్, సుప్రియ, నగర అదనపు సీపీ విశ్వప్రసాద్, సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార, ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్లు నరేశ్, సతీష్‌రెడ్డితో కలిసి నగర సీపీ సీవీ ఆనంద్ మీడియాకు ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మే 9న హీరో శ్రీవిష్ణు నటించిన 'సింగిల్' చిత్రం విడుదలైన రోజే పైరసీ బారినపడి ఆన్‌లైన్‌లో హెచ్‌డీ ప్రింట్ డౌన్లోడ్ లింకులు ప్రత్యక్షమయ్యాయి. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ ఫిల్మ్‌ఛాంబర్‌లోని యాంటీ పైరసీ సెల్‌కు ఫిర్యాదు చేసింది. సెల్ ప్రతినిధి మణీంద్ర నగరంలోని ఓ ప్రముఖ థియేటర్‌లో ఆ సినిమా పైరసీ జరిగినట్లు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సై మన్మోహన్‌గౌడ్ బృందం దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక ఆధారాలతో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో ఉంటున్న జాన కిరణ్‌కుమార్‌ను జూన్‌లో అదుపులోకి తీసుకుని విచారించారు. అతను ఏడాదిన్నర వ్యవధిలోనే 40కిపైగా చిత్రాలను పైరసీ చేసి రూ.40 లక్షలు సంపాదించినట్లు విచారణలో తేలింది. కిరణ్ ఖాతాకు క్రిప్టో కరెన్సీ పంపిన తమిళనాడుకు చెందిన సుధాకరన్, బిహార్‌కు చెందిన అర్సలాన్ అహ్మద్‌లను పట్టుకొని ఆరా తీయగా ఇద్దరు కీలక నిందితుల గురించి తెలిసింది. వారే సిరిల్ ఇన్ఫాంట్ రాజ అమలదాస్, అశ్వనీకుమార్.

తమిళనాడులో అసలు సూత్రధారి

దేశంలో పైరసీ సినిమాల మాస్టర్‌మైండ్‌గా పేరున్న అమలదాస్ స్వస్థలం తమిళనాడులోని వేలుస్వామిపురం. బీఈ పూర్తి చేసిన అతను సాంకేతికతపై పట్టుతో సినిమాలను పైరసీ చేసి విక్రయించడం ప్రారంభించాడు. అన్ని రాష్ట్రాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని శిక్షణ ఇచ్చాడు. వారి నుంచి వచ్చిన కంటెంట్‌ను తన సైట్‌లో అప్‌లోడ్ చేసేవాడు. సర్వర్ ఐపీ అడ్రస్‌లు నెదర్లాండ్, ప్యారిస్‌ల్లో ఉన్నట్టు చూపేవాడు. కొత్త సినిమాలు పైరసీ చేసేందుకు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల సంస్థలు సహకరిస్తున్నట్లు అతడు వెల్లడించాడు. వారు తమ సినిమా పైరసీ వెబ్‌సైట్లలో బెట్టింగ్, గేమింగ్‌యాప్‌ల ప్రకటనలిచ్చి అమాయకులను ఉచ్చులోకి దింపి సొమ్ము చేసుకుంటారన్నారు. దీనికి ప్రతిఫలంగా తనకు ప్రతి నెల 10 వేల డాలర్లు ఇస్తున్నట్లు అమలదాస్ చెప్పాడు. అతను వివిధ భాషలకు చెందిన 550 సినిమాలను పైరసీ చేయించి రూ.2 కోట్ల వరకు సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు.

పైరసీ సినిమాలతో కిరణ్‌కుమార్ ఖాతాలో చేరిన క్రిప్టోకరెన్సీని డాలర్‌గా మార్చే ట్రేడర్ అస్మిత్‌సింగ్ ఐపీ అడ్రస్‌ను పోలీసులు గుర్తించారు. ఆ క్రిప్టో వ్యాలెట్లను ఎక్స్‌ట్రాక్ట్ చేసిన పోలీసులకు బిహార్‌కు చెందిన అశ్వనీకుమార్ బండారం వెలుగుచూసింది. ఇంటర్ మధ్యలోనే ఆపేసిన అతడు యూట్యూబ్‌లో జావా, పైథాన్, లైనెక్స్ ఇతర సాఫ్ట్‌వేర్ కోర్సులు చేసి.. సర్వర్లను హ్యాక్ చేయడం నేర్చుకున్నాడు. దేశవ్యాప్తంగా సినిమాలను థియేటర్లలో ప్రదర్శించే క్యూబ్, యూఎఫ్‌వో సంస్థల ప్రధాన సర్వర్లలోకి జొరబడి 2023లో మొదటిసారి ఒక సినిమా చూశాడు. తర్వాత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌యాప్‌ల నిర్వాహకులకు 800 డాలర్లకు ఒక సినిమా చొప్పున విక్రయించడం ప్రారంభించాడు. ఓటీటీ సర్వర్లనూ హ్యాక్ చేసి హెచ్‌డీ ప్రింట్‌లను కాజేసేవాడు. కంప్యూటర్ ఎక్కువ సమయం చూడటంతో ఇతడి కుడికన్ను పూర్తిగా దెబ్బతింది. అశ్వనీకుమార్‌ని అదుపులోకి తీసుకుని అతడి హార్డ్‌డిస్క్‌ను పరిశీలించిన పోలీసులు నివ్వెరపోయారు. బిహార్ ప్రభుత్వంలోని దాదాపు సగం సమాచారం అతని వద్ద ఉంది.

కమిషనర్‌తో సినీ ప్రముఖుల భేటీ

సినిమాల పైరసీకి అవకాశం లేకుండా ప్రొడక్షన్ యూనిట్లు పకడ్బందీగా వ్యవహరించాలని.. వాటర్ మార్కింగ్‌లు, బలమైన ఫోరెన్సిక్ సాంకేతికతను ఉపయోగించాలని పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. థియేటర్లలోనూ పైరసీ జరగకుండా నిఘా పెంచాలని, రికార్డు చేయకుండా అధునాతన విధానాలు అనుసరించాలన్నారు. పైరసీ రాకెట్‌ను ఛేదించిన నేపథ్యంలో సినీ ప్రముఖులతో సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశమయ్యారు. ప్రముఖ నటులు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, నాని, రామ్ పోతినేని, అక్కినేని నాగచైతన్య, నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు, సుప్రియ, ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు. 'పైరసీ కేసు దర్యాప్తులో తమిళ్‌ఎంవీ, టెయిల్ బ్లాస్టర్స్, మూవీరూల్స్ తదితర పోర్టళ్లను గుర్తించాం. వీటి నియంత్రణకు, అనుమానాస్పద కార్యాకలాపాలను గుర్తించేందుకు సైబర్ భద్రత ఎంతో అవసరం' అని కమిషనర్ వారికి వివరించారు.

మెలికలు తిరుగుతూ మేఘాల్లోకి!



సాగరం నుంచి మొదలై మేఘాల్లోకి తీసుకెళుతోందా అని అనిపిస్తోంది కదూ ఈ రోడ్డును చూస్తుంటే! విశాఖపట్నం-భీమిలి బీచ్ రోడ్డులో తిమ్మాపురం వద్ద ఉన్న ఈ రహదారి ఎంతగానో ఆకట్టుకుంటోంది. రామానాయుడు స్టూడియో ఉన్న కొండపైకి చేరుకోవాలంటే మెలికల్లాంటి ఈ దారిలోనే వెళ్లాలి. పైనుంచి కిందికి చూస్తే పచ్చటి వనాల మధ్య ఆ దారంతా సుందరంగా కనిపిస్తుంది. సమీపంలో సాగర అందాలను తిలకిస్తూ సందర్శకులు మైమరచిపోతుంటారు. – ఈనాడు, విశాఖపట్నం



న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు బీమా ప్రీమియం నమూనా చెక్కు అందజేస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

పోలీసు సిబ్బందికి ప్రమాద బీమా పాలసీ రెన్యువల్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు సిబ్బందికి గ్రూప్ పర్సనల్ ప్రమాద బీమా పాలసీను రెన్యువల్ చేశారు. బెంగళూరుకు చెందిన న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీతో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సోమవారం ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి సంబంధించిన ప్రీమియం రూ.7.68 కోట్ల చెక్కును డీజీపీ.. న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు అందజేశారు. తాజా పాలసీ వల్ల హోంగార్డులు మొదలుకుని డీజీపీ స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరికీ ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది. కానిస్టేబుల్ నుంచి డీజీపీ ర్యాంకు అధికారుల వరకు ఎవరైనా విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి ర్యాంకు ఆధారంగా రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకూ ప్రమాద బీమా లభిస్తుంది. హోంగార్డులకు రూ.10 లక్షల వరకూ ప్రమాద బీమా లభిస్తుంది. సోమవారం నుంచే ఈ పాలసీ అమల్లోకి వచ్చింది. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఅండ్‌ఎల్ విభాగం ఐజీ రవిప్రకాశ్, భద్రత సెక్రటరీ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ భాగస్వామ్య సదస్సుకు రండి

- దక్షిణ కొరియా సంస్థలను ఆహ్వానించిన మంత్రుల బృందం
- ఎల్‌జీతో పాటు పలు సంస్థల ప్రతినిధులతో సమావేశం



ఎల్‌జీ కెమికల్స్ ప్రధాన కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులతో భేటీ అయిన మంత్రులు నారాయణ, బీసీ జనార్దనరెడ్డి తదితరులు

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు మంత్రుల బృందం దక్షిణ కొరియాకు చెందిన వివిధ సంస్థల ప్రతినిధులకు తెలిపింది. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఎల్‌ఎస్ గ్రూప్, షూఆల్స్, ఎస్‌కె హైనిక్స్ సంస్థల ప్రతినిధులతో బృందం సమావేశమైంది. విశాఖలో నిర్వహించనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానించింది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా కంపెనీల ప్రతినిధులకు మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి బృందం వివరించింది. సీనియర్ అధికారులు ఎంటీ కృష్ణబాబు, కాటమనేని భాస్కర్, ఈడీబీ అధికారులు మంత్రుల వెంట ఉన్నారు.

★ దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఎల్‌జీ కంపెనీ ప్రతినిధులతో మంత్రుల బృందం సంస్థ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి వారికి వివరించింది.

★ విద్యుత్ ఉపకరణాల తయారీ రంగంలో గుర్తింపు పొందిన ఎల్‌ఎస్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులతో బృందం సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రతిపాదనలు పరిశీలించాలని సంస్థ ప్రతినిధులను కోరింది. రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చే వినూత్న విధానాలను అమలు చేస్తున్నట్లు వివరించింది. పూర్తి స్థాయి పెట్టుబడులతో వచ్చే కంపెనీలకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొంది.

★ మెడికల్, స్మార్ట్ షూ తయారీలో అగ్రగామి 'షూ ఆల్స్' సంస్థ ఛైర్మన్ చెవోంగ్ లీతో సమావేశమై పెట్టుబడుల ప్రతిపాదనలపై బృందం చర్చించింది.

★ రాష్ట్రంలో మెమరీ మాడ్యూల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అపార అవకాశాలు ఉన్నాయని ఎస్‌కే హైనిక్స్ సంస్థ ప్రతినిధులకు మంత్రుల బృందం వివరించింది. ఏపీలో సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరింది. ఆ సంస్థ ప్రతినిధులు, గ్లోబల్ గ్రోత్ స్ట్రాటజీ ఈవీపీ హెడ్ జున్ చోయ్‌లకు వివరించింది.

'ఈనాడు' సహాయ నిధితో 3 భవనాలకు భూమిపూజ



ఖమ్మం జిల్లా ఏదులాపురం పురపాలిక పరిధిలోని జలగంనగర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. చిత్రంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.హరినాథ్‌బాబు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, 'ఈనాడు' తెలంగాణ బ్యూరో చీఫ్ ఎం.ఎల్.నరసింహారెడ్డి, ఖమ్మం యూనిట్ ఇన్‌ఛార్జి కె.వీరబాబు, సీపీ సునీల్‌దత్ తదితరులు



రావిరాలలో పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, 'ఈనాడు' సర్క్యులేషన్ విభాగం జీఎం సుధాకర్, వరంగల్ యూనిట్ ఇన్‌ఛార్జి దామోదర్‌రెడ్డి తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

రామోజీ గ్రూపు సంస్థల డైరెక్టర్లు, ఉద్యోగులు రూ.41.67 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఇవన్నీ కలిపి సహాయనిధికి రూ.9.44 కోట్లు సమకూరాయి. ఆ నిధులతో మల్టీపర్పస్ భవనం, పాఠశాల భవనాలను 'ఈనాడు' నిర్మిస్తోంది.

యువత కోసం వర్క్ స్టేషన్లు..

బుడమేరు వరద బాధితుల కోసం విజయవాడలో నిర్మిస్తున్న బహుళ ప్రయోజనకర(మల్టీపర్పస్) భవనానికి 'ఈనాడు' ఆంధ్రప్రదేశ్ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాస్ సోమవారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ముందుకొచ్చి అందరికీ అందుబాటులో ఉండేలా భవన నిర్మాణానికి అర ఎకరం స్థలం కేటాయించింది. అత్యాధునిక వసతులతో జీ+2 విధానంలో భవనాన్ని నిర్మిస్తారు. బిల్టప్ ఏరియా సుమారు 20 వేల చదరపు అడుగులు. బుడమేరు వరద బాధిత ప్రాంతాలతోపాటు, నగరంలో 'వర్క్ ఫ్రం హోం' చేసుకునే యువతకు అవసరమైన వర్క్‌స్టేషన్లు, వారికి నైపుణ్య శిక్షణకు కావాల్సిన సదుపాయాలు ఈ భవనంలో ఉంటాయి. 291 మంది ఏక కాలంలో ఇక్కడ పని చేసుకోవచ్చు. నిర్మాణం పూర్తయ్యాక ఈ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి 'ఈనాడు' అప్పగిస్తుంది. భూమి పూజ కార్యక్రమంలో విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్ కిశోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపత్కాలంలో ప్రజలకు చేయూత

గత ఏడాది సెప్టెంబరులో ఆకస్మిక వరదలకు మున్నేరు వాగు ఉప్పొంగడంతో ఖమ్మం జిల్లా ఏదులాపురం పురపాలిక పరిధిలోని జలగం నగర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల ముంపునకు గురై దెబ్బతింది. మున్నేరు వాగు ముంపు భయం, ఇరుకు గదులతో బడిలోని 394 మంది విద్యార్థులు ఆందోళన చెందుతుండటంతో సహాయనిధితో నూతన భవన నిర్మాణాన్ని 'ఈనాడు' తలపెట్టింది. భవనం నిర్మాణానికి తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, 'ఈనాడు' తెలంగాణ బ్యూరో చీఫ్ ఎం.ఎల్.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నేను సైతం.. అంటూ ముందుకొచ్చి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా బాధితులకు 'ఈనాడు' చేయూతనందిస్తూ తోడుగా నిలుస్తోందని కొనియాడారు. 'ఈనాడు' సహాయనిధితో పాఠశాల భవనం నిర్మిస్తున్నందుకు... రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్, వారి కుటుంబసభ్యులు, సంస్థ సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో సందర్భాల్లో రామోజీరావు ఉదారత చాటారని... ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగానే పత్రికను నడుపుతున్నారని ప్రశంసించారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిజానికి 'ఈనాడు' బెంచ్‌మార్క్‌గా నిలుస్తోందన్నారు. 'ఈనాడు'లో వచ్చిన వార్తలను ప్రజలు నిజమని నమ్ముతారని, తృప్తి చెందుతారని తెలిపారు. తాను రాజకీయాల్లోకి రాకముందు 'ఈటీవీ'లో రాత్రి 9 గంటల వార్తలు చూసిన తర్వాతే నిద్రపోయే వాడినని గుర్తుచేశారు.

ఎక్కువ మందికి ఉపయోగపడేలా...

'పత్రిక అంటే ప్రజా సమస్యలను వెలికి తీయటమే కాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నపుడు వారికి చేదోడువాదోడుగా ఉండాలి. . చేతనైన సాయం చేయాలి.. ఏ పని చేసినా ఎక్కువ మందికి ఉపయోగపడాలన్నదే రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు, సీఎండీ కిరణ్ లక్ష్యం' అని 'ఈనాడు' తెలంగాణ బ్యూరో చీఫ్ ఎం.ఎల్.నరసింహారెడ్డి అన్నారు. 1976లో వచ్చిన వరదలు మొదలుకొని తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, గుజరాత్, తమిళనాడు, కేరళ.. ఇలా దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా సంస్థ తరఫున స్వచ్ఛందంగా, సంస్థ పిలుపునకు స్పందించి దాతలు నమ్మకంగా ఇచ్చే విరాళాల్లో ప్రతి పైసానూ ప్రజల అవసరాలకు ఖర్చు చేస్తున్నామని వివరించారు. విద్యాలయాలు నిర్మిస్తే ఎక్కువ మందికి ఉపయోగపడతాయని, భావిభారత నిర్మాతలైన విద్యార్థులు చదువుకొని రాణిస్తారని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీఓ నరసింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.హరినాథ్ బాబు, 'ఈనాడు' ఖమ్మం యూనిట్ ఇన్‌ఛార్జి కె.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాలలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. 'సహాయనిధి'తో అక్కడ నిర్మించతలపెట్టిన నూతన భవనానికి 'ఈనాడు' సర్క్యులేషన్ విభాగం జీఎం సుధాకర్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు 'ఈనాడు' ఆధ్వర్యంలో తక్షణ సాయం అందించడం, శాశ్వతమైన బహుళ ప్రయోజనాలు కలిగేలా రూ.కోట్లు వెచ్చించి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్, డీఈవో దక్షిణామూర్తి మాట్లాడారు. టీజీఈడబ్ల్యూఐడీసీ అరుణ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి మరియన్న, 'ఈనాడు' వరంగల్ యూనిట్ ఇన్‌ఛార్జి దామోదర్‌రెడ్డి, పలువురు గ్రామస్థులు హాజరయ్యారు.



విజయవాడలో బహుళ ప్రయోజనకర(మల్టీపర్పస్) భవనానికి భూమిపూజ నిర్వహిస్తున్న 'ఈనాడు' ఆంధ్రప్రదేశ్ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాస్. చిత్రంలో విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్ కిశోర్, సిబ్బంది తదితరులు

పీహెచ్‌సీ వైద్యుల సంఘంతో వైద్యారోగ్యశాఖ చర్చలు

ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించలేమని స్పష్టీకరణ

డిమాండ్ల పరిష్కారానికి డీపీహెచ్ ఆధ్వర్యంలో కమిటీ

సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేసిన ఏపీపీహెచ్‌సీడీఏ

ఈనాడు, అమరావతి: ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, ఇతర డిమాండ్ల సాధనకు సమ్మె, ఆందోళనలు కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం (ఏపీపీహెచ్‌సీడీఏ) స్పష్టంచేసింది. సోమవారం పలు జిల్లాల్లో అధికారిక వాట్సప్‌ల నుంచి వైదొలగిన వైద్యులు, కొన్నిచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపితే.. మరికొన్ని చోట్ల ఓపీ సేవలకు గైర్హాజరయ్యారు. సమ్మెకు పిలుపునిచ్చిన ఏపీపీహెచ్‌సీడీఏ ప్రతినిధులతో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ సోమవారం సమావేశమయ్యారు. సాయంత్రం వరకు దశలవారీగా చర్చలు జరిపారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించలేమని, మిగిలిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, సెకండరీ హెల్త్, డీఎంఈ కార్యాలయాల పరిధితోపాటు, ఇతర రాష్ట్రాల్లో పరిస్థితిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు కమిటీ వేస్తామని చెప్పారు. జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని సంఘ ప్రతినిధులు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. సమ్మె చేయవద్దని సంఘ ప్రతినిధులకు సూచించామని, ఒకవేళ విధులు బహిష్కరిస్తే చట్టప్రకారం వ్యవహరిస్తామని కమిషనర్ వీరపాండియన్ స్పష్టంచేశారు. వైద్యసేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలను ఆదేశించినట్లు తెలిపారు.

పాక్షికంగా ప్రభావం..

పీహెచ్‌సీ వైద్యుల సంఘం సమ్మె ప్రభావం సోమవారం పాక్షికంగా కనిపించింది. పలు జిల్లాల్లో అక్కడక్కడా ఓపీ సేవలకు ఆటంకం కలిగింది. కాకినాడ జిల్లా పెద్దాపురం, అన్నమయ్య జిల్లా బొమ్మనచెరువు, సీటీఎం పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రత్తిపాడు, నంద్యాలలో వాట్సప్ గ్రూప్ నుంచి వైద్యులు తప్పుకున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెం, తాడిమల్ల పీహెచ్‌సీల్లో ఓపీలు చూడలేదు. కడప జిల్లా అట్లూరు, పెద్దముడియం, బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్టలో ఓపీ బహిష్కరించారు.

వైద్యారోగ్యశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

వైద్యుల సమ్మె నేపథ్యంలో వైద్యసేవలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యారోగ్యశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. సామాజిక, ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లో పనిచేసే ఎంబీబీఎస్ వైద్యులను పీహెచ్‌సీలకు పంపాలని నిర్ణయించింది.

దుర్గమ్మ దయతో దిగ్విజయంగా సంక్షేమం

ప్రజలందరికీ సుఖసంతోషాలివ్వాలని అమ్మను వేడుకున్నా

విజయవాడ ఉత్సవ్‌తో దసరా అంటే బెజవాడే గుర్తొస్తుంది

ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలూ చేపడుతున్నాం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

సతీసమేతంగా వచ్చి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు. చిత్రంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్రబాబు, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, దుర్గగుడి ఈవో శీనానాయక్ తదితరులు

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – విజయవాడ వన్‌టౌన్: రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు ఇవ్వాలని కనకదుర్గమ్మను వేడుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దుర్గమ్మ దయతో సంక్షేమ కార్యక్రమాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకున్నాయని.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని హర్షం వ్యక్తం చేశారు. దుర్గమ్మ జన్మనక్షత్రమైన మూలానక్షత్రం రోజున సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో వి.కె.శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, వేదపండితులు పూర్ణకుంభంతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికి, అమ్మవారి దర్శనానికి తీసుకెళ్లారు. దర్శనం అనంతరం పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఇంద్రకీలాద్రి మీడియా కేంద్రం వద్ద సీఎం మీడియాతో మాట్లాడారు.

భారీగా అభివృద్ధి ప్రణాళికలు

2014-19 మధ్య కాలంలో దుర్గమ్మ ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఘాట్‌రోడ్డును బాగుచేయించడంతోపాటు రూ.9 కోట్లతో డార్మెటరీ కాంప్లెక్స్, నాలుగు హైస్పీడ్ లిఫ్ట్‌లు, పుష్కరాల వేళ రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. 1,500 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేసేలా రూ.26 కోట్లతో నిర్మిస్తున్న అన్నదాన సత్రం భవనాన్ని ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తాం. రూ.27 కోట్లతో నిర్మిస్తున్న ప్రసాదం తయారీ భవనాన్ని మూడు నెలల్లో పూర్తి చేస్తాం. రూ.5 కోట్లతో పూజా మండపం, దాతల సహకారంతో యాగశాల నిర్మించాం. రూ.14 కోట్లతో చేపడుతున్న ఎలివేటెడ్ క్యూకాంప్లెక్స్ పనులు ఐదు నెలల్లో పూర్తి చేయనున్నాం. ఇంద్రకీలాద్రిపై తిరుమల మాదిరిగా విశాలమైన స్థలం లేదు. అందుకే వసతిగృహాల నిర్మాణానికి అవకాశం లేదు. కానీ ఆలయం విజయవాడ నగరంలోనే ఉండడంతో వసతికి ఎలాంటి ఇబ్బంది లేదు. భవిష్యత్తులో అమరావతి కేంద్రంగా 50 వేల గదులు అందుబాటులోకి రాబోతున్నాయి.

8 లక్షలు దాటిన దర్శనాలు

'దుర్గగుడి దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 8 రోజుల్లోనే 8 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మూలానక్షత్రం కావడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం లోగానే 1.20 లక్షల మంది అమ్మ దర్శనం చేసుకున్నారు. నవరాత్రుల్లో వీఐపీ దర్శనాలను క్రమబద్ధీకరించి, సాధారణ భక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. ప్రసాదాల నాణ్యత పెంచాం. రోజుకు లక్ష ఉచిత లడ్డూలను భక్తులకు పంపిణీ చేస్తున్నాం.

భక్తులకు అభివాదం చేస్తూ..

క్యూలైన్లలో ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ చంద్రబాబు ముందుకెళ్లారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సీఎం దంపతులు ప్రధాన ఆలయం పక్కనున్న పాత ఆశీర్వాద మండపం గట్టుపైన కాసేపు కూర్చున్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయ బంగారు తాపడం గురించి అధికారులు వివరించారు.

పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం

2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం. విజయవాడ ఉత్సవ్‌ను ఈ ఏడాది నుంచి నిర్వహిస్తుండడంతో దసరా అంటే విజయవాడ అందరికీ గుర్తుకొస్తుంది. ఈ ఏడాది దసరా ఉత్సవాల నిర్వహణలో.. భద్రత, పర్యవేక్షణకు డ్రోన్లు, చిన్న పిల్లలు తప్పిపోకుండా ట్యాగ్స్ వేస్తున్నాం. తిరుపతి, దుర్గగుడి లాంటి ఆలయాలకు ఆదాయానికి కొరత లేదు. రాష్ట్రంలోని ఆదాయం లేని చిన్న ఆలయాలకు మాత్రం ప్రభుత్వమే నిధులు ఇస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం సామాన్యులకు లబ్ధి చేకూర్చే పథకాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సూపర్ జీఎస్టీతో డబ్బులను ఎక్కువ పొదుపు చేసుకోవచ్చు. కొనుగోలు శక్తి పెరుగుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.



సినిమాలపైనా ట్రంప్ మోత

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదముంది. మన దేశంలో పలు భాషల్లో నిర్మించే చిత్రాలకు అక్కడి ప్రవాస భారతీయుల్లో మంచి ఆదరణ ఉంటుంది.

2017లో ఫోర్బ్స్ ఇచ్చిన నివేదిక ప్రకారం.. భారతీయ భాషల చిత్రాలు అమెరికా, కెనడాల్లో భారీగా ప్రదర్శితమవుతాయి. పెద్ద సినిమాల్లో ఒక్కోటి సగటున 80 లక్షల డాలర్ల వరకూ వసూళ్లు సాధిస్తాయి. కొన్ని కోటి డాలర్లను వసూలు చేసే సందర్భాలూ ఉన్నాయి. ఏ సమయంలో చూసుకున్నా. . అమెరికాలోని 1,000 స్క్రీన్లలో భారతీయ చిత్రాలు ప్రదర్శితమవుతుంటాయి.

కళ కోల్పోయిన హాలీవుడ్

అమెరికా చిత్రాలకు గతంలో ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఆదరణ ఉండేది. మిగిలిన దేశాల్లో చిత్రాలు భారీగా నిర్మాణమైనా అవి అన్ని దేశాలకూ చేరేవి కావు. దీంతో హాలీవుడ్ ఏకఛత్రాధిపత్యం సాగేది. ఓటీటీల రాకతో ఆ ఆధిపత్యానికి గండి పడింది. ప్రపంచంలో ఏ దేశంలో చిత్రాలను నిర్మించినా అనువాదమై అన్ని దేశాలకూ వస్తున్నాయి. అనేక సినిమాలు ఓటీటీల్లో ప్రసారమవుతుండటంతో సినిమా హాళ్లకు జనం రావడం తగ్గింది. ఫలితంగా హాలీవుడ్‌లో అనివార్యంగా నిర్మాణ వ్యయాన్ని తగ్గించాల్సి వచ్చింది. దీంతోపాటు 2023, 24లలో రచయితల సంఘం, కార్మిక సంఘాలు సమ్మెలు చేయడంతో హాలీవుడ్ నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఒక్క 2023లోనే 5 బిలియన్ డాలర్ల నష్టం వచ్చినట్లు అంచనా. అప్పట్లో సమ్మె కారణంగా పోయిన ఉద్యోగాలు ఇంకా రాలేదు.

■ ట్రంప్ సుంకాల మోతపై హాలీవుడ్ ప్రముఖ సంస్థలైన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, కామ్‌క్యాస్ట్, పారామౌంట్ స్కైడ్యాన్స్, నెట్‌ఫ్లిక్స్ సంస్థలు వెంటనే స్పందించలేదు.

■ ట్రంప్ ప్రకటన వెలువడ్డాక నెట్‌ఫ్లిక్స్ షేర్లు పడిపోయాయి.

ఫర్నిచర్‌పైనా..

ఒకప్పుడు ఫర్నిచర్ వ్యాపారానికి అమెరికాలోని నార్త్ కరోలినా కేంద్ర స్థానంగా ఉండేది. చైనాతోపాటు ఇతర దేశాల నుంచి ఫర్నిచర్ దిగుమతులు పెరగడంతో అది తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఈ నేపథ్యంలో అమెరికాలో ఫర్నిచర్ తయారు చేయకపోతే భారీ స్థాయిలో సుంకాలను విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు.

వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్



- ఉత్తర్వులు జారీ చేసిన విజయవాడ ఏసీబీ న్యాయస్థానం
- నిబంధనలను అతిక్రమించి భారీ ర్యాలీ చేసిన వైకాపా శ్రేణులు
- చెవిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కోరుకొండ, కంబాలచెరువు: మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. గత వారం బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. తీర్పును విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం సాయంత్రం వెలువరించారు. ఈ కేసులో ఏ4గా ఉన్న ఎంపీ.. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ఏడాది జులై 7న సిట్ అధికారుల ఎదుట లొంగిపోయారు. అనంతరం అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఐదు రోజులు బయట ఉన్నారు. మొత్తం 68 రోజుల పాటు కారాగారంలో ఉన్నారు. రూ.2లక్షల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, వారంలో రెండు రోజులు.. సోమ, శుక్రవారాల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని, సాక్షులను బెదిరించకూడదని న్యాయస్థానం షరతులు విధించింది.

■ ఈ కేసులో నిందితులైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, సజ్జల శ్రీధర్‌రెడ్డిలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై సోమవారం ఏసీబీ కోర్టులో వాదనలు జరిగాయి. తీర్పును అక్టోబరు 8వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. తనకు విధించిన బెయిల్ షరతులను సడలించాలని ఇదే కేసులో నిందితుడిగా ఉన్న గోవిందప్ప బాలాజీ.. సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను అక్టోబరు 6వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

మిథున్‌రెడ్డి విడుదల.. వైకాపా ర్యాలీ



రాజమహేంద్రవరం విమానాశ్రయం సమీపంలో వైకాపా కార్యకర్తల హడావిడి

బెయిల్ మంజూరు కావడంతో మిథున్‌రెడ్డి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి సోమవారం సాయంత్రం 6 గంటలకు బయటకొచ్చారు. జైలు వద్ద ఆయన తండ్రి, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అనంతరం మిథున్‌రెడ్డి విమానాశ్రయానికి వెళ్లిపోయారు. ఆయన వాహనం వెంట మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర నాయకుల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో విమానాశ్రయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో సీటీఆర్ఐ నుంచి బంకు వరకు, క్వారీ మార్కెట్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. కోరుకొండ మార్గంలోనూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. నగరంలో సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నాయి. సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదు. దీనికి విరుద్ధంగా వైకాపా శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి.

పేదల ఇళ్ల నిర్మాణ అనుమతుల ఫీజు రూపాయే

(మొదటి పేజీ తరువాయి)

■ 50 చదరపు గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు మిగతా నిర్మాణాల్లా.. పనులు పూర్తయినట్లుగా ధ్రువీకరణ అవసరం లేదు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను పట్టణ ప్రణాళిక విభాగం తీసుకోవలసిన పని కూడా లేదు. ఇందుకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం సవరించింది.

■ ఇళ్ల నిర్మాణానికే రూపాయి ఫీజు వర్తిస్తుంది. అదే స్థలంలో దుకాణాల వంటివి నిర్మిస్తే వాటికి యథా ప్రకారం ఫీజులు చెల్లించాలి.

■ 60 చ.గజాల విస్తీర్ణంలో స్థలం ఉండి.. దాన్ని 50 గజాలకు కుదించి చేపట్టే ఇళ్ల నిర్మాణాలకు రూపాయి ఫీజు వర్తించదు. ప్రభుత్వ, వివాదాస్పద స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నట్లు తనిఖీల్లో వెల్లడైతే వాటిని రద్దు చేయడంతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.

ఇ-మెయిల్ తరహాలో యూపీఐ ఐడీ

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించే అవకాశాన్ని ఇస్తున్నాయి. ఈ మార్పు వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడంలో సహాయం చేస్తుంది. చెల్లింపులను మరింత సురక్షితం చేయనుంది.

అక్షరాలు, అంకెల మిశ్రమంగా ఐడీ

అక్టోబరు 2 నుంచి యూపీఐ చెల్లింపులకు కొత్త నిబంధనలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అమలు చేయనుంది. దీనికి తగ్గట్లు యూపీఐ చెల్లింపుల సేవల సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి. సాధారణంగా యూపీఐ ఐడీలు మొబైల్ నంబరు ఆధారంగా ఉంటాయి. దీనికి బదులు యూపీఐ ఐడీని అక్షరాలు, అంకెల మిశ్రమంతో.. మనకు నచ్చినట్లు రూపొందించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. దీనివల్ల మొబైల్ నంబరు చెప్పాల్సిన అవసరం లేకుండానే, చెల్లింపులు చేయొచ్చు. స్వీకరించొచ్చు. ఇది లావాదేవీలను మరింత సురక్షితంగా చేస్తుంది.

ప్రయోజనాలివీ

■ మొబైల్ నంబరు లావాదేవీల్లో కనిపించదు కాబట్టి, మోసగాళ్లు మీ వ్యక్తిగత వివరాలను తెలుసుకోలేరు.

■ వ్యాపారులు తమ బ్రాండు పేర్లతో ఐడీలను రూపొందించుకునే వీలుంటుంది. దీనివల్ల విశ్వసనీయత పెరుగుతుంది.

■ ఇ-మెయిల్ మాదిరిగా సులభంగా ఐడీలను ఇతరులకు పంపించొచ్చు. లావాదేవీలూ వేగంగా పూర్తవుతాయి.

ఇప్పటికే పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పేలాంటి సంస్థలు ఈ మార్పులను అందుబాటులోకి తెచ్చాయి. ఆయా యాప్‌ల సెట్టింగ్స్‌లోకి వెళ్లి, కొత్త ఐడీ సృష్టించుకోవచ్చు.

₹58 వేల కోట్లతో పోలవరం-సోమశిల అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)

మళ్లించేందుకు సమస్యే ఉండబోదు.

■ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు, కొత్తగా ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుల అవసరాలు తీరిన తర్వాతే ఈ వరద జలాలు మళ్లిస్తారు.

■ ఇందుకోసం ప్రత్యేకంగా పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు వరద కాలువను నిర్మిస్తారు. తాడిపూడి కాలువను ఇందుకు ఉపయోగించుకుంటారు.

■ సెగ్మెంట్ 1కి దాదాపు రూ.13 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా

సెగ్మెంట్ 2: ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు

■ ప్రకాశం బ్యారేజీలో వైకుంఠపురం వద్ద నుంచి నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. రోజుకు 23 వేల క్యూసెక్కులు ఎత్తిపోస్తారు.

■ ఆరు చోట్ల పంపుహౌస్‌లు నిర్మిస్తారు. నీటిని +15.50మీటర్ల నుంచి +229 మీటర్లకు ఎత్తిపోయాలి.

■ బొల్లాపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించాలి. దాదాపు 173 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా ఈ జలాశయ నిర్మాణం ఉంటుంది.

■ భూసేకరణ, పునరావాసం, ఇతరత్రా అన్నీ కలిపి దాదాపు రూ.36 వేల కోట్లు వరకు ఈ విభాగంలో వ్యయమయ్యే ఆస్కారం ఉంది.

సెగ్మెంట్ 3: కొత్త ప్రతిపాదనలో మార్పులు ఎక్కువగా ఈ విభాగంలోనే ఉన్నాయి.

■ బొల్లాపల్లి జలాశయం నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున నీటిని మళ్లిస్తారు. కేవలం రెండు దశల్లో నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది.

■ ఈ నీటిలో రోజుకు 1.40 టీఎంసీల నీటిని మూసీ, మున్నేరు ఉపనదుల మధ్య ఎప్పటి నుంచో సాగులోకి రాని భూమిని కొత్తగా సాగులోకి తీసుకువచ్చేందుకు వినియోగిస్తారు.

■ బొల్లాపల్లి నుంచి చిన్ననీటి చెరువులకూ నీళ్లు ఇస్తారు. తాగు, పారిశ్రామిక అవసరాలకూ కేటాయిస్తారు.

■ వెలిగొండ ప్రాజెక్టులో 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఈ నీరు ఉపకరిస్తుంది. ఇందుకోసం బొల్లాపల్లి నుంచి నీటిని నల్లమలసాగర్ జలాశయానికి మళ్లిస్తారు. లేకుంటే వెలిగొండ తూర్పు ప్రధాన కాలువకు మళ్లించి 3 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఈ నీటిని వాడతారు.

■ నీటిని సోమశిల ప్రాజెక్టుకు తరలించి సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టు ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగిస్తారు.

■ నల్లమలసాగర్ వరకు మళ్లించేందుకు సుమారు రూ.9,000 కోట్లు ఖర్చవుతుంది.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

ఆమూలాగ్రం.. ఆనంద పరవశం..

సరస్వతీ దేవిగా దుర్గమ్మ దర్శనం

- ఒక్కరోజే రెండు లక్షల మందికి పైగా రాక
- జగన్మాత సేవలో ముఖ్యమంత్రి చంద్రబాబు

దుర్గమ్మ జన్మ నక్షత్రమైన... మూలానక్షత్రం వేళ ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రమైంది. సరస్వతీదేవి రూపంలోని దుర్గమ్మను దర్శించుకునేందుకు.. లక్షల మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం 7 గంటలకే 50 వేల మంది దర్శనాలు పూర్తిచేసుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లక్ష దాటిపోయారు. వినాయక ఆలయం, కుమ్మరిపాలెం జంక్షన్ నుంచి రెండు వైపులా క్యూలైన్లు కిక్కిరిశాయి. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా.. సీతమ్మవారి పాదాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్లు ఆదివారం రాత్రి 10 గంటల నుంచే భక్తులతో నిండిపోయాయి. హోల్డింగ్ ప్రాంతం నుంచి రాత్రి 11 గంటల తర్వాత భక్తులను క్యూలైన్లలోకి వదిలారు. అప్పటి నుంచి సోమవారం అర్ధరాత్రి వరకూ క్యూలైన్లు రద్దీగానే నడిచాయి.


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న ముఖ్యమంత్రి దంపతులు


భక్తజన సందోహం

చిన్నారి భవానీ..

మనసా స్మరామి


సీఎం చంద్రబాబు దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఈవో తదితరులు

ఒక్క రోజులోనే రెండు లక్షల మంది పైగా భక్తులు జగన్మాతను దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా చదువుల తల్లిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. సరస్వతీ దేవినిదర్శించుకునేందుకు విద్యార్థులు, యువత అధికంగా తరలివచ్చారు. దసరా ఉత్సవాల ఎనిమిది రోజుల్లో ఎనిమిది లక్షల మందికిపైగా భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు.


నృత్యాంజలి



నేడు శ్రీ దుర్గాదేవి అలంకారంలో.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఈనాడు అమరావతి - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక


భళా.. ఉత్సవ్ విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా సోమవారం పున్నమిఘాట్‌లో కార్యక్రమానికి హాజరై ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. వేదికపై ఎంపీ చిన్ని తదితరులు 8లో

కళాంజలిలో విజయదశమి, దీపావళి ఉత్సవాలు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయదశమి, దీపావళి పండగలను పురస్కరించుకొని విజయవాడ ఎంజీ రోడ్డు సిద్ధార్థ మహిళా కళాశాల రోడ్డులోని కళాంజలి.. చిన్నారులకు సంబంధించి సరికొత్త వస్త్ర కలెక్షన్స్‌తో ముందుకొచ్చింది. చిన్నారుల అందాన్ని రెట్టింపు చేసేలా అద్భుతమైన ట్రెడిషనల్ గాగ్రాస్, ప్లాజో సెట్, షరారా సెట్, పార్టీవేర్ లాంగ్ ఫ్రాక్స్, షార్ట్ ఫ్రాక్స్, కాటన్ ఫ్రాక్స్, నైట్‌వేర్‌సెట్‌లు కొలువుదీరాయి. అబ్బాయిల కోసం ప్రత్యేకంగా కుర్తా పైజామా సెట్టు, ధోతి సెట్టు అందంగా.. ఆకర్షణీయంగా ఉన్నాయి. మగవారి కోసం ఏర్పాటు చేసిన కుర్తా పైజామా సెట్టు, లాంగ్ కుర్తాస్, షార్ట్ కుర్తాస్ కనువిందు చేస్తున్నాయి. పండగల సందర్భంగా పది శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 60 శాతం వరకు రాయితీ ఇస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి నిర్వాహకులు కోరారు.


ఆకట్టుకుంటున్న చిన్నారుల వస్త్రాలు

కొనసాగుతున్న కృష్ణమ్మ వరద

నీట మునిగిన పంటలు

ఈనాడు, అమరావతి: ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో ప్రకాశం బ్యారేజీ దగ్గర వరద పోటెత్తుతోంది. సోమవారం కాస్త తగ్గినా అదే ఉద్ధృతి కొనసాగింది. ఉదయం 6గంటలకు బ్యారేజీకి చేరే వరద(ఇన్‌ఫ్లో) 6,86,074 క్యూసెక్కులు ఉండగా.. 6,74,926 క్యూసెక్కుల నీటిని (ఔట్‌ఫ్లో) సముద్రంలోకి వదిలారు. రాత్రి 10 గంటలకు ఇన్‌ఫ్లో 6,41,247 క్యూసెక్కులకు తగ్గగా.. ఔట్‌ఫ్లో 6,26,108 క్యూసెక్కులు నమోదయింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. విజయవాడ నగరంలోని పున్నమిఘాట్‌లో కొద్దిమేర వరద నీరు ప్రవేశించడంతో గత అనుభవాల దృష్ట్యా ముందస్తుగా ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు.

అల్లాడుతున్న లంక గ్రామాలు.. వరద తీవ్రతతో అవనిగడ్డ మండలం పాత ఎడ్లంకలో 7 గృహాలు నేల మట్టమయ్యాయి. పులిగడ్డ అక్విడక్టు మీదుగా ప్రమాదకరంగా వరద ప్రవహిస్తోంది. అవనిగడ్డ, తోట్లవల్లూరు మండలాల్లో ముంపు గ్రామాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. పులిగడ్డలో 20 ఇళ్లు వరద నీటిలో మునిగాయి. దీంతో వారిని స్థానిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. మోపిదేవి, అవనిగడ్డ, తోట్లవల్లూరు తదితర మండలాల్లో 1087 హెక్టార్లలో అరటి, పసుపు, బొప్పాయి, కంద తదితర ఉద్యాన పంటలు నీట మునిగాయి. జగ్గయ్యపేట పరిధిలోని రావిరాల, ముక్త్యాల, వేదాద్రి ప్రాంతాల్లో 500 ఎకరాల్లో పత్తి, మిర్చి, వరి పంటలు ముంపు బారిన పడ్డాయి. చందర్లపాడు, కంచికచర్ల మండలాల పరిధిలో 2వేల ఎకరాల్లో వరి, పత్తి పొలాల్లోకి నీరు వచ్చింది.


ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదల చేసిన నీరు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అగ్నిమాపక శాఖ, సీఐడీల్లో పనిచేసిన కాలంలో అవినీతికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. గత వారం దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. తదుపరి వాదనల నిమిత్తం వచ్చే నెల 6వ తేదీకి విజయవాడ ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. గత నెల 26వ తేదీ నుంచి సంజయ్.. విజయవాడలోని జిల్లా కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

రాజ్ కెసిరెడ్డికి వైద్య పరీక్షలు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డిని జైలు అధికారులు.. పోలీసుల సహాయంతో సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అనారోగ్యం రీత్యా తనకు బెయిల్ ఇవ్వాలని ఆయన కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆయనకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. సోమవారం ఉదయం 10 గంటలకు రాజ్ కెసిరెడ్డిని ఆసుపత్రికి తీసుకురాగా.. మధ్యాహ్నం 12:30 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం జైలుకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -117 రిటైల్ ధర 139 చికెన్ విత్ స్కిన్ - 202, చికెన్ స్కిన్‌లెస్ - 229.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 580 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.87/-.

సాంస్కృతిక వేదిక.. సుస్వరాల గీతిక

భవానీపురం, విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమిఘాట్, గొల్లపూడి ఎక్స్‌పోలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పున్నమిఘాట్ వద్ద డ్రోన్ షో అబ్బురపరిచింది. కళాకారుల ఆటపాట అలరించింది. గొల్లపూడిలో మణిశర్మ సంగీత కార్యక్రమం ఆహూతులను ఓలలాడించింది. వివిధ తెలుగు పాటలకు మణిశర్మ సంగీతం అందిస్తూ ఉర్రూతలూగించారు. కళాకారుల తప్పెట గుళ్ల నృత్యం ఆకట్టుకుంది. రెండుచోట్ల జరిగిన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వేదికపై... పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీలలిత ఐశ్వర్యాంబిక నృత్య కళాక్షేత్రం బృందం (రాజమహేంద్రవరం) ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకుల ఆదరణ పొందింది. ★ ఇవ్వల యేసు రాజు (పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు) క్లారిఎన్ట్‌తో సంగీత విభావరి ఆనంద సాగరంలో ఓలలాడించింది. సరస్వతీ నమోస్తుతే, శుద్ధ సన్యాసి రాగ భావంలోని కీర్తన అంబా భవానీ కీర్తనలు ఆకట్టుకున్నాయి. ★ రాజీవ్ బ్రదర్స్ (విజయవాడ) ప్రదర్శించిన డప్పుల ప్రదర్శన హోరెత్తించింది. ★ తోట అన్నవరం బృందం (కాకినాడ) ప్రదర్శించిన తోలుబొమ్మలాట ద్వారా రామాయణాన్ని కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ★ పత్తే ఓబులయ్య (కర్నూలు) దర్శకత్వం వహించిన పద్య నాటకం జగదేక సుందరి ప్రేక్షకులను కట్టిపడేసింది. ★ చల్లా నవీన్ చౌదరి (కర్నూలు) ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర నాటకం బాగుంది.


పున్నమిఘాట్‌లో మైథిలీ నృత్యం


ధనుంజయ్ సంగీతం


పున్నమిఘాట్: విజయవాడ ఛాంప్స్ విజేత నలంద బృందానికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు


పాటలతో హోరెత్తిస్తూ...

విజయవాడ ఐడల్‌గా రెహాన్



భవానీపురం, న్యూస్‌టుడే: పున్నమిఘాట్ వేదికగా 'విజయవాడ ఐడల్'గా రెహాన్, రన్నర్‌గా మైథిలీ నిలిచారు. విజయవాడ ఛాంప్స్ విజేతగా నలంద విద్యా సంస్థల బృందం, రన్నర్‌గా తన్మయ బృందం నిలిచాయి. 24, 25 తేదీల్లో కేబీఎన్ విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన ఆడిషన్స్‌లో విజయవాడ ఐడల్‌లో 600 మంది, విజయవాడ ఛాంప్స్‌లో 600 మంది పాల్గొన్నారు. విజేతలకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు బహుమతులు అందజేశారు.


ఆనంద చంద్రిక నాట్య విన్యాసం


గొల్లపూడి ఎక్స్‌పోలో జనం సందడి


తుమ్మలపల్లి వేదికపై నవీన్ హరిశ్చంద్ర నాటకం


పున్నమిఘాట్‌లో తన్మయి బృందం ప్రదర్శన


కార్తీక చేసిన జానపద నృత్యం

ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికపై శ్రీపంచవదన కూచిపూడి నృత్యాలయం నాట్యాచారిణి కావ్య కంచర్ల బృందం (విజయవాడ) కూచిపూడి నృత్యరూపకం కన్నుల పండువగా సాగింది. ★ మంటసాల అవార్డు గ్రహీత గాన గౌతమ చిప్పాడ నాగేశ్వరరావు (భీమవరం) చేసిన మంటపాల పాటల కచేరీ శ్రోతలను అలరించింది. ★ గొర్రెల రాము, కృష్ణ బ్రదర్స్ (రామచంద్రపురం) ప్రదర్శించిన బుర్రకథ నాటక ప్రియులను కడుపుబ్బ నవ్వించింది. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ (గుంటూరు) వారి 'పాప దొరికింది' హాస్య నాటకం అందరినీ ఆలోచింపజేసింది.


రాజీవ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో...


డ్రోన్‌షోలో సరస్వతీరూపం


వెలుగులీనుతున్న గొల్లపూడి ఎక్స్‌పో

నేటి కార్యక్రమాలు...

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి, పున్నమిఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు వివిధ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.
గొల్లపూడిలో జరిగేవి.. ★ మిస్ విజయవాడ ఫైనల్ జరుగుతుంది. ★ కాంతార సినిమా బృందం పర్యటన. **పున్నమిఘాట్ వేదికగా..** ★ సాంస్కృతిక ప్రదర్శనలు.. ★ సంగీత విభావరి, డాండియా డీజే. **తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా..** గంగాధర్ శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శన ★ జి.సాహితీ సంగీత కచేరీ ★ వెంకటేశ్వర్లు హరికథ ★ పి.బి.ఎస్.వి.కుమార్ బృందం జానపద నృత్య ప్రదర్శన ★ తోట సుబ్రహ్మణ్యం బృందం తోలుబొమ్మలాట ★ సాయిబాబా నాట్యమండలి చారిత్రాత్మక పద్య నాటకం. **ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో..** ★ చింతా వెంకట సీతారామాంజనేయులు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ★ సంగీత కచేరీ ★ సీహెచ్.అజయ్‌కుమార్ కూచిపూడి నృత్య ప్రదర్శన ★ వెంకట్ బృందం తోలుబొమ్మలాట ★ గంగాధర్ వెంకటలక్ష్మి, మ్యాజిక్ ప్రదర్శన ★ సాంఘిక నాటకం.

యోగాను జీవితంలో భాగం చేసుకోండి: మంత్రి కొల్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 6వ జాతీయ జూనియర్, సీనియర్-సి యోగాసన పోటీలను సోమవారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయి యోగా పోటీలు విజయవాడలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఒలింపిక్స్‌లో యోగాను ప్రవేశపెడితే భారత్‌కు తప్పకుండా పతకాలు వస్తాయని, ఈ పోటీలను చూస్తే అర్థమవుతోందన్నారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఈ పోటీల ద్వారా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. విజయవాడ మధ్య నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విచ్చేసి పోటీలను తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, ఉపాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా యోగాసన సంఘం అధ్యక్షుడు కొంగర సాయి తదితరులు పాల్గొన్నారు. **సీనియర్-సి విజేతల వివరాలు:** [illegible] రేకర్ (మహారాష్ట్ర), బిన్నీ కుమారి బాల (బిహార్), శీతల బైస్య (అస్సాం), పురుషుల వ్యక్తిగత విభాగంలో అయ్యంపిళై (తమిళనాడు), బిరేంద్రకుమార్ యాదవ్ (హరియాణా), రాహుల్ శాండ్‌బోర్ (మహారాష్ట్ర)లు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు.


విజేతలతో మంత్రి కొల్లు రవీంద్ర, రామకృష్ణప్రసాద్ తదితరులు

నీటి కొరత లేకుండా.. మురుగు సమస్య రాకుండా..

విజయవాడ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మూలానక్షత్రం సందర్భంగా దాదాపు 2లక్షల మంది తరలివస్తారని అంచనా. వీరి కోసం మొబైల్ వాహనాల్లో ఉన్న మరుగుదొడ్ల ట్యాంకర్లో ఎప్పటికప్పుడు నీళ్లు నింపారు. వ్యర్థాల సేకరణకు సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని నగరపాలక అధికారులు అనుసంధానించారు. ఎంత మంది భక్తులు వచ్చినా నీటి కొరత రాకుండా మురుగు సమస్య లేకుండా చూశారు. బాగుంది కదా ఆలోచన.
- ఈనాడు, అమరావతి


భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు (అంతర్చిత్రంలో) నీటి ట్యాంకర్

స్వచ్ఛ, హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛ, హరితాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చాలని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవాడలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుగుణమ్మ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతతో పార్కులు ఏర్పాటు చేసి, అమరావతిని హరిత రాజధానిగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలన్నారు. పట్టణ, స్థానిక సంస్థల్లోని ఖాళీ భూముల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం వదిలి పెట్టిన 85 లక్షల టన్నుల చెత్తను డిసెంబర్ నెలాఖరు లోపు తొలగించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్ని మున్సిపాలిటీల్లో పార్కులు, రహదారుల మధ్య డివైడర్లు, అంచులలో మొక్కలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం డైరెక్టర్లు కె.గంగాధర్(నెల్లూరు రూరల్), ఎం.వెంకట సుబ్బయ్య(విజయవాడ తూర్పు), పి.నాగకృష్ణ(పోలవరం), పి.కాసు(ప్రత్తిపాడు), పి.రాజమౌళి(గాజువాక), ఆర్.లక్ష్మీదేవి(రాప్తాడు), పి.రమేశ్ బాబు(కోడూరు), జి.సత్యవేణి(జగ్గంపేట), వి.సింగయ్య(కొండేపి), పి.శ్రీనివాసరావు(చింతలపూడి), ఎస్.వనజాక్షి(నెల్లిమర్ల), వీవీవీబీ రాజు(రాజమహేంద్రవరం రూరల్), ఎన్.విజయ(తెనాలి), కె.యోగానంద్(గిద్దలూరు) చేత ఛైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం చేయించారు.


డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఛైర్మన్లు సుగుణమ్మ, పట్టాభిరామ్

హైవే సర్వీసు రోడ్డుకు మరమ్మతులు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ వైజంక్షన్ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు స్థానిక ఎస్సై అభిమన్యు చొరవతో గుత్తేదారుడు మరమ్మతులు చేయించారు. కిలోమీటరు పొడవున గోతులు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై గత నెల 30న 'దారంతా కంతలే.. రోజంతా గంతులే' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎస్సై స్పందించారు. సమస్యను తొలుత ఎన్‌హెచ్ అధికారులు, టోల్‌ప్లాజా నిర్వాహకులకు తెలియజేసినా పట్టించుకోలేదు. అనంతరం గుత్తేదారుతో మాట్లాడి మరమ్మతులు చేయించారు. ఆయా పనులను ఎస్సై దగ్గరుండి పర్యవేక్షించారు. గోతుల్లో గ్రావెల్ వేసి డోజర్ వాహనంతో చదును చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఈనాడు కథనానికి స్పందన

తిరువూరు

• తిరువూరు • మైలవరం

చుట్టూ నీరు.. ఎటూ కదలలేరు

జలమయమైన ఇసుక పుష్కరనగర్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఎగువ వర్షాల కారణంగా దిగువకు వస్తున్న వరదకు ఫెర్రీ, సంగమం, ఇసుక రేవు, పుష్కరనగర్ ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రాత్రి సుమారు 7లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో సోమవారం ఉదయం ఆయా ప్రాంతాల్లో వరద అధికంగా కనిపించింది. మత్స్యకారులు వారి పడవలు, వలలు తీసుకొని ఒడ్డుకు చేర్చారు. ఫెర్రీ, పుష్కరనగర్ నివాసితులు కొందరు పునరావాస కేంద్రమైన ట్రక్ టెర్మినల్‌కు చేరుకోగా మరి కొందరు నీరు చేరిన ఇళ్లలోనే ఉన్నారు. వరద నీరు ఇంటి గుమ్మాల వరకూ రావడంతో బయటకు రాకపోకలు సాగించడానికి పడవలను ఉపయోగించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు నిరంతరం సూచనలు చేస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నారు.


వరదకు ఫెర్రీ వద్ద ఒడ్డుకు చేర్చిన పడవలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

దుర్గగుడి ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియామకం

విద్యాధరపురం: దుర్గగుడి ట్రస్టు బోర్డు సభ్యురాలిగా తిరువూరుకు చెందిన తరిగొప్పల పార్వతిని నియమిస్తూ సోమవారం దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్ పేరుతో విడుదలయ్యాయి. ఇటీవల 16 మంది సభ్యులతో ఈనెల 27 జీవో విడుదలైంది. అందులో పేర్కొన్న అన్నవరపు వెంకట శివపార్వతి స్థానంలో తరిగొప్పల పార్వతిని నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

జి.కొండూరు, న్యూస్‌టుడే: వెలగలేరు సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు మంచినీళ్ల రాజశేఖర్ కోరారు. సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డివిడెంట్లు, రూ.21.23 లక్షలను 936 మంది సభ్యులకు బట్వాడా చేశామని తెలిపారు. స్వామి, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన తప్పనిసరి

రెడ్డిగూడెం: ప్రతినెలా నిర్వహించే గ్రామైఖ్య సంఘాల సమావేశాల్లో గ్రూపుల ఆర్థిక లావాదేవీలపై సభ్యులందరికీ అవగాహన కల్పించేలా ఉండాలని ఎంపీడీవో టీవీకే రమణ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏల సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాల రికవరీ ప్రతి ఒక్కరి మొబైల్ యాప్ ద్వారా జరిగేలా చూడాలని సూచించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌పై గ్రామ సచివాలయాల సిబ్బంది ఇంటింటి ప్రచారం చేస్తారన్నారు. ప్రతి గ్రూపు సమావేశంలోనూ దానిపై తీర్మానం ద్వారా చర్చించాలని వివరించారు. ఏపీఎం బి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే: కొండపల్లిలో వచ్చే నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా 12వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ కోరారు. అందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

చెల్లింపుల్లో.. సడలింపులు లేవా..?

విద్యుత్తు బిల్లుల్లో కనిపించని క్యూఆర్ కోడ్

ఇబ్రహీంపట్నం గ్రామీణం (గుంటుపల్లి), న్యూస్‌టుడే:

విద్యుత్తు బిల్లులు సులువుగా చెల్లించేందుకు విద్యుత్తు సంస్థ పలు మార్పులు చేసింది. జూన్ నుంచి బిల్లు చెల్లింపునకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తోంది. చాలా చోట్ల బిల్లుపై ఉన్న ఈ కార్బన్ ముద్రణ నాణ్యత లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. గతంలో కార్యాలయాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా ఎక్కువ మంది చెల్లించేవారు. యాప్‌లు పనిచేయకపోవడం, సర్వర్ సమస్యలు తలెత్తడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం ఉన్నతాధికారులు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇందులోనూ పలు సమస్యలు తలెత్తాయి. వీటన్నిటికీ మిన్నగా మరింత సులువుగా బిల్లుపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించి అందజేస్తున్నారు. కానీ ముద్రణ సరిగా లేక మళ్లీ కార్యాలయాలు లేదా ప్రత్యామ్నాయ పద్ధతులను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఎదురైంది.


సరిగా క్యూఆర్ కోడ్ ముద్రించని బిల్లు

సమస్యలు ఇవే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలో 24,000, కొండపల్లి పురపాలిక పరిధిలో 16,000 మంది గృహ విద్యుత్తు వినియోగదారులున్నారు. వీరిలో ఎక్కువ మంది ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ద్వారా కాకుండా కార్యాలయాలతోపాటు యూపీఐ పేమెంట్ ద్వారా బిల్లులు చెల్లిస్తున్నట్లు విద్యుత్తు, రెవెన్యూ కార్యాలయం అధికారులు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా అతి తక్కువ మంది మాత్రమే బిల్లులపై ఉన్న క్యూఆర్ కోడ్‌తో బిల్లు చెల్లిస్తున్నారు. నాలుగు నెలలుగా సమస్య ఉన్నా ఎవరూ స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేపర్‌పై ముద్రించిన కార్బన్ 15 రోజులకే అది చెరిగిపోతుంది. బిల్లు ప్రింట్ తీసే పరికరంలో సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా కొన్ని చోట్ల క్యూఆర్‌కోడ్ ముద్రణ సరిగా రావడం లేదు. రీడింగ్ తీసిన తర్వాత బిల్లు మడత వేయడం, నీటి తడి లాంటివి ఉన్నా స్కాన్ కావడం లేదు.

చర్యలు తీసుకుంటాం.. క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్తు బిల్లులు చెల్లించే క్రమంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు మా దృష్టికి వచ్చాయి. రీడింగ్ తీసే సమయంలో పేపరుపై కార్బన్ ముద్రణ నాణ్యత లేకపోవడం ముఖ్య కారణంగా ఉంది. దీనిపై ఆయా ఏజెన్సీలకు సూచనలు చేశాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.
-వెంకన్న, సహాయక ఇంజినీరు, ఇబ్రహీంపట్నం సెక్షన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంటుపల్లి ఖాజీపేట, చింతలతోపు వద్ద మురుగు కాలువలకు చెత్త అడ్డుపడి పారుదల నిలిచిపోయింది. దీంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - రామానాయక్, స్థానికుడు
✔ ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతాం. - మురళీప్రసాద్, గ్రామ కార్యదర్శి

? కేతనకొండ ఎస్సీ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణ రోజు జరగడంలేదు. దీంతో వీధుల్లో ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. - నాగేశ్వరరావు, స్థానికుడు ✔ పరిశీలించి చెత్త సేకరణ రోజూ జరిగేలా చర్యలు తీసుకుంటాం. - మౌనిక, గ్రామ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

స్పందనకు వందనం

● స్థానిక బీసీ బాలికల వసతి గృహం పక్కనే కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు తెలిపిన సమస్యను ఆదివారం ప్రచురించగా స్పందించిన కార్యదర్శి ఐసయేలేశ్వరరావు సిబ్బందితో పరిశుద్ధ్య చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు



● రామాపురం బీసీ కాలనీలో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారిందని స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా'కు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్. రామారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సోమవారం పంచాయతీ సిబ్బందిని పంపి పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం ● పట్టణంలోని 20వ వార్డులో సైడు కాలువల్లో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉందని స్థానికుడు మోహనరావు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారి సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

67 మందికి ఆరోగ్యసేవలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంలో రుద్రవరంలో సోమవారం నిర్వహించిన శిబిరంలో 67 మందికి ఆరోగ్య సేవలు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్.కీర్తి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి జె.చాంది, ఉపసర్పంచి బి.కృష్ణారెడ్డి, ఎంపీడీవో టి.కె.వి.రమణ, కూటమి నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


పుష్కరనగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ప్రజలు భయపడాల్సిన పనిలేదు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వరద ప్రభావం తగ్గుతున్న నేపథ్యంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఫెర్రీ వద్ద పుష్కరనగర్ ప్రాంత వాసులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. వరదలు వచ్చిన ప్రతిసారి పుష్కరనగర్‌లోకి నీరు వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అక్కడి వారందరికీ మరోచోట నివేశన స్థలాలు కేటాయించామన్నారు. నీరు తగ్గగానే బ్లీచింగ్ చేసే పనులు మొదలు పెట్టాలని పురపాలిక అధికారులకు తెలియజేశామన్నారు. వరద నీటి వద్దకు ఎవ్వరూ వెళ్లకుండా స్థానిక అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా పురపాలిక సమావేశం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు పురపాలిక సమావేశాలకు వరుసగా మూడుసార్లు గైర్హాజరైన వైకాపాకు చెందిన 5, 6 వార్డు కౌన్సిలర్లు అనుమోలు రమాదేవి, రావురు మంజులపై అనర్హత వేటు వేయాలని తెదేపా సభ్యులు కోరారు. తెదేపా కౌన్సిలర్ డియానంద్ జనసాధారణంలో వైకాపా వార్డు కౌన్సిలర్లు వినతి చేశారు. ఈ విషయంపై వాగ్వాదం జరిగి వివరణ అనర్హత్వ కౌన్సిల్‌లో ఓటింగ్ దారితీసింది. సోమవారం తిరువూరు నగర పంచాయతీ సమావేశం ఛైర్‌పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. వరుసగా మూడు కౌన్సిల్ సమావేశాలకు హాజరవని వారికి కమిషనర్ నోటీసు ఇవ్వగా, రాలేకపోవడానికి కారణాలను వివరిస్తూ వైకాపా సభ్యులు ఇద్దరు జవాబిచ్చారు. దీనిపై సభలో వాదన జరుగుతుండగా వైకాపా సభ్యుడు టి.వెంకటరెడ్డి ఓటింగ్ నిర్వహించాలని కోరారు. ఓటింగ్ జరగ్గా 5, 6 వార్డు కౌన్సిలర్లపై కౌన్సిల్‌లో పాల్గొన్న అనర్హతను సమర్థిస్తూ తెదేపా నుంచి 10, అనుకూలించిన వైకాపా నుంచి 8 మంది చేతులెత్తారు. ఓటింగ్‌లో కూడా తెదేపా నెగ్గడంతో వారి డిమాండ్‌పై గట్టిగా వాదించారు. దీనిపై పురపాలిక శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఛైర్‌పర్సన్ ప్రకటించారు. తదుపరి ఇటీవల పురపాలిక కార్యాలయంలో పొరుగు సేవల ఉద్యోగులు ఐదుగురు మానేశారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించగా అభ్యంతరం తెలుపుతూ తెదేపా కౌన్సిలర్లు ఎం.దుర్గారావు, జి.కస్తూర్బాయి డీసెంట్ నోటీసు ఇచ్చారు. దీనిపై కూడా జిల్లా అధికారికి నివేదిక పంపించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాగ్వాదాల మధ్యే సమావేశం ముగించారు.


తెదేపా, వైకాపా కౌన్సిలర్ల వాగ్వాదం

'జోగి రమేష్ నోరు అదుపులో ఉంచుకోవాలి'

మైలవరం, న్యూస్‌టుడే: అనుచిత పోస్టులు పెట్టిన వైకాపా కార్యకర్తను పోలీసులు అరెస్టు చేస్తే, తమ ఎమ్మెల్యేలు కృష్ణప్రసాద్, బాలకృష్ణలపై ఇష్టారీతిన మాట్లాడిన మాజీ మంత్రి జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు లీలాప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు గోపాలస్వామి హితవు పలికారు. సోమవారం సాయంత్రం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జోగి రమేష్ వ్యవహారశైలిపై మండిపడ్డారు. ఎమ్మెల్యే, మంత్రిగా ఆయన చేసిన అవినీతి, అక్రమాలు ప్రజలందరికీ తెలుసన్నారు. జోగి తొలుత ఆయన భాష మార్చుకోవాలన్నారు. తమ ఎమ్మెల్యే, తమను అభివృద్ధిపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించామని, నియోజకవర్గంలో అంబుడు ద్వారా ఎదగాలనుకోవడం తగదన్నారు. నాయకులు లీలేష్, కిరణ్, రేణుక, వెంకట నారాయణ, షహనబేగం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాల్సిందే

కొండపల్లి, న్యూస్‌టుడే: చేయని పనులకు బిల్లులు పెట్టి, చెల్లింపులు చేసే అవకతవకలు పాల్పడిన అధికారులందరిపై విజిలెన్స్ విచారణ జరగాలని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి పురపాలిక పాలకవర్గ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై కౌన్సిలర్లు మాట్లాడుతూ సిల్ట్ పనుల విషయంలో వైస్ ఛైర్మన్ శ్రీను వివరణ అడిగారు. సిల్ట్ పనులకు కేటాయించిన రూ.25 లక్షలు నగదుతో జేసీబీ కొనుగోలు చేయవచ్చునని చెప్పారు. గత సంవత్సరం విధులు నిర్వహించిన సహాయక ఇంజినీరు చేసిన పనులపై ఈ నెలలో బిల్లులు పెట్టడం ఎందుకన్నారు. కొందరు గుత్తేదార్లతో అధికారులు లోపాయి కారి ఒప్పందాలు చేసుకొని పెద్ద ఎత్తున అవకతవకలు చేశారని ఆరోపించారు. ఛైర్మన్ సమాధానం చెప్పాలని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించగా.. పరిశీలిస్తామని ఆయన సమాధానమిచ్చారు.

జగజ్జనని జననం.. జనులంతా సంబరం



గొల్లపూడి: కుంకుమ పూజల్లో మహిళలు


ఊటుకూరులో అన్నదానం

న్యూస్‌టుడే బృందం: జగన్మాత జన్మించిన మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారి ప్రతిమలకు సోమవారం విశేషమైన పూజలు చేశారు. ఆలయాలు, మండపాల్లో విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు చేయగా నిర్వాహకులు వారికి పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు.


పెనుగొలను శివాలయంలో..


కవులూరులో సరస్వతీ దేవిగా..


గంపలగూడెం బస్టాండ్ సెంటర్‌లో..


తిరువూరు మండలం చౌటపల్లిలో..


పవిత్ర సంగమం వద్ద ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న దుర్గమ్మ


మైలవరంలో సరస్వతీదేవీ అలంకరణలో రేణుకమ్మ

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు సమీప కట్లేరులోని పంపుల రేవు వద్ద వరద ప్రవాహంలో సుగాలీ కాలనీకి భూక్యా నాగరాజు(40) సోమవారం కొట్టుకుపోయాడు. హెడ్‌కానిస్టేబుల్ ఆర్.రామచంద్రరావు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజు తన మిత్రుడు తమ్మిశెట్టి సాంబశివరావుతో కలిసి కట్లేరులో చేపల వేటకు వెళ్లారు. ఇటువైపు రేవులో చేపలు పడడం లేదని అవతలి రేవుకు చేరుకునేందుకు వరదలోనే వెళుతుండగా ప్రవాహ దాటికి కొట్టుకుపోయాడు. ఎంత గాలించినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సాయంత్రం అతని భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం గాలింపు చర్యలు చేపడతామని చెప్పారు.

'అయిదేళ్లయినా ప్లాట్లు కేటాయించలేదు'

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కేతనకొండ ప్రభుత్వ ఉద్యోగుల కాలనీ సభ్యులకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. మండలంలోని కేతనకొండ లేఅవుట్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం వివిధ శాఖల్లోని 700 మందికి పైగా సంఘం సభ్యుల నుంచి రూ.కోట్లు వసూలు చేసి అయిదేళ్లు దాటినా ప్లాట్లు అప్పగించలేదన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన సమయంలోనే స్థలంతోపాటు అభివృద్ధి పనులకు ఒకేసారి సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసి పలు కారణాలు చూపి ప్రస్తుతం గజానికి రూ.1,500 చెల్లించాలనడం సరికాదన్నారు. సమావేశంలో అధ్యక్షుడు ఆలూరి రామారావు, ఇతర డైరెక్టర్లతో పాటు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ● ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ నుంచి పలువురు సంఘ సభ్యులు అక్కడికి చేరుకోగా గతంలో సొసైటీ నుంచి బహిష్కరించిన సభ్యులను పాలక వర్గం అడ్డుకుంది. దీంతో ఇరు వర్గాల వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా పోలీసులు శాంతపరిచారు. దీంతో వారంతా బయటే నిరసన తెలిపారు.

ఆహార నియమాలు పాటిస్తే మేలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఆహార నియమాలు, క్రమం తప్పని వ్యాయామంతో గుండెను కాపాడుకోవచ్చని విజయవాడకు చెందిన గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పూర్ణానంద్ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని తిరువూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 3కే వాక్ నిర్వహించారు. తదుపరి పట్టణంలోని శ్రీనిధి పాఠశాలలో జరిగిన సమావేశంలో గుండె వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుండె జబ్బులకు దూరంగా ఉండాలంటే ప్రజలు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ చెన్నారెడ్డి, ఎస్సై సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ ఎం.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ వెంకటనారాయణ పాల్గొన్నారు.


శివకుమార్ నృత్య బృందం అభినయం

సందడిగా విజయ నర్తనం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: సంగమం వద్ద విజయ నర్తనం కార్యక్రమాలు సందడిగా సాగాయి. సప్పా శివకుమార్ శిష్య బృందం ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది. అనంతరం నటరాజ రామకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యంలో కళాకారులు పలు జానపద గీతాలకు నృత్యాలు చేశారు. చివరిగా శ్రీనివాస్ మ్యాజిక్ షో చిన్నారులను, వీక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, పురపాలిక అధికారులు పాల్గొన్నారు. మొదట ఎగువ నుంచి వరద నీరు భారీగా రావడంతో కార్యక్రమాలు నిలిపివేయాల్సి వస్తుందని అధికారులు భావించారు. సోమవారం సాయంత్రానికి వరద నిలకడగా ఉండడంతో ప్రణాళికలో ఉన్న కార్యక్రమాలను కొనసాగించారు.

ప్రమాదవశాత్తు వాగులో మునిగి అర్చకుడి మృతి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి గుడిలో అర్చకుడిగా పని చేస్తున్న దివి వేణుగోపాలాచార్యులు (55) సమీప అనురాధా వాగులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు..ఆదివారం రాత్రి 8 గంటలకు గుడి మూసే వరకు ఆయన విధులు నిర్వహించారు. తదుపరి రెండు గంటల వరకు ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం గాలించగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అతడి మృతదేహం అనురాధా వాగులో కనిపించింది. వెంటనే మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం, పంచనామా పూర్తి చేస్తామని పోలీసులు తెలిపారు.


వేణుగోపాలాచార్యులు (పాత చిత్రం)

కిడ్నీ వ్యాధితో మరొకరి బలి

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మూత్రపిండాల వ్యాధికి మరొకరు బలయ్యారు. మండలంలోని రామచంద్రాపురం శివారు లక్ష్మీపురానికి చెందిన శీలం కుటుంబరావు(50) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. వ్యాధి తీవ్రమై విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు నాయకులు కుటుంబరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యాసిడ్ మీద పడి గాయాలు

లక్ష్మీపురం(తిరువూరు), పెదకొమిర(గంపలగూడెం): పాలశీతల కేంద్రంలో ఉద్యోగిపై యాసిడ్ పడడంతో గాయాలపాలయ్యాడు. గంపలగూడెం మండలం పెదకొమిరకు చెందిన బొల్లెపోగు రామకృష్ణ లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో పనిచేస్తుంటారు. సోమవారం కేంద్రంలో గదులు శుభ్రం చేస్తుండగా యాసిడ్ పడి ముఖం, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. సిబ్బంది వెంటనే అతడిని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీహెచ్‌సీ వైద్యులు ఈ మేరకు తిరువూరు పోలీసులకు సమాచారం అందించారు.

ఎమ్మెల్యేలు వసంత.. బాలకృష్ణలపై అనుచిత పోస్టులు

పోలీసుల అదుపులో వైకాపా నాయకుడు

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణలపై వాట్సాప్ గ్రూపుల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం మైలవరంలో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒక సాధారణ పోస్టుపై కేసులు ఎలా నమోదు చేస్తారంటూ మాజీ మంత్రి జోగి రమేష్ మైలవరం సీఐ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాదనకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 27న గొల్లపూడిలోని విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి బాలకృష్ణ హాజరైన సందర్భంగా..ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సైతం ఆయన పక్కన కూర్చుని ఉన్న చిత్రాన్ని 'ఎన్టీఆర్ జిల్లా పొలిటికల్ న్యూస్ మైలవరం' అనే వాట్సాప్ గ్రూపులో తెదేపా కార్యకర్త బోడ మల్లికార్జునరావు పోస్టు చేశారు. ఆ చిత్రం కింద ఇబ్రహీంపట్నానికి చెందిన వైకాపా నియోజకవర్గ అధికార ప్రతినిధి కోమటి కోటేశ్వరరావు, అదే రోజు రాత్రి పలుమార్లు వారిని కించపరిచేలా పోస్టులు పెట్టాడు. తమ నేతలను కించపరిచేలా పోస్టులు పెట్టారంటూ..మల్లికార్జునరావు మైలవరం పోలీసులకు 28న ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్సై కె.సుధాకర్, సోమవారం ఉదయాన్నే కోటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. ఆ విషయం తెలుసుకున్న జోగి రమేష్, నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు సమాచారం అందించి, కోటేశ్వరరావును ఉంచిన మైలవరం సీఐ కార్యాలయం వద్దకు చేరుకుని ఎస్సై సుధాకర్‌తో వాదనకు దిగారు. 41ఏ నోటీసు ఇచ్చి విడుదల చేయాలని, లేదంటే ఎఫ్ఐఆర్ కాపీని తమకిచ్చి, వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు.. పోలీసులు, ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయబద్ధంగానే పిలిపించామని, ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించినా, విడుదల చేయాల్సిందేనంటూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. దాదాపు 3 గంటలకు పైగా ఆందోళన కొనసాగగా, పలుమార్లు సీఐ చంద్రశేఖర్‌తో నాయకులు ఫోన్‌లో చర్చలు జరిపారు. అనంతరం, విచారణ తర్వాత అతడ్ని పంపిస్తామని, దర్యాప్తులో భాగంగా కోటేశ్వరరావును మళ్లీ పిలుస్తామని ఎస్సై చెప్పడంతో ఆందోళన విరమించారు.



సీఐ కార్యాలయం ఎదుట బైఠాయించిన జోగి రమేష్, వైకాపా నాయకులు

నేటి అలంకారం.. శ్రీ దుర్గాదేవి
30-9-2025, మంగళవారం



విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కంధస్థితాం భీషణాం
కన్యాభిః కరవాలఖేట విలసద్ధస్తాభిరాసేవితాం
హస్తైశ్చక్రగదాసిఖేట విసిఖాంశ్చాపం గుణం తర్జనీం
బిభ్రాణాం అనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే॥

దుర్గముడనే రాక్షస సంహారం చేసిన శక్తిస్వరూపం దుర్గాదేవి. కోటిసూర్య ప్రభలతో వెలుగొందే ఈ దేవి భక్తులను సర్వదుర్గతుల నుంచి కాపాడుతుంది. ఈమె మహా ప్రకృతి స్వరూపిణి. ఈ తల్లి ఉపాసన ద్వారా ఈతి బాధలు నశిస్తాయి. గ్రహబాధలు తొలగుతాయి. ఎర్రని వస్త్రాలు ధరించి, ఎర్రని పూలు, అక్షతలతో అమ్మను పూజించి, పులగం నివేదన చేయాలి. ఓం దుం దుర్గాయై నమః అనే మంత్రాన్ని జపించాలి. దుర్గాసూక్తం, లలిత అష్టోత్తరం, దుర్గాస్తోత్రాలు పారాయణ చేయాలి. వేదపండితులను ఈరోజు సత్కరిస్తే అమ్మ సంతోషిస్తుంది.



అమ్మవారి దర్శనానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ సన్నిధికి వస్తున్న మంత్రి కొల్లు

దుర్గమ్మ అండ.. చంద్రన్న ముద్ర..



రాజగోపురం, మహామండపం, రాజమార్గం ఘనత ఆయనదే
ప్రస్తుతం అన్నదాన భవనం, ప్రసాదాల పోటు నిర్మాణం

ఈనాడు, అమరావతి
న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

దుర్గగుడిలో కీలకమైన అభివృద్ధి అంతా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జరిగింది. ఆలయానికి రాజగోపురం నిర్మించేందుకు 1985లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రణాళికలు రూపొందించారు. కానీ తర్వాత పనులు ముందుకు కదల్లేదు. 2009, జనవరిలో ఘాట్‌రోడ్డులో భవానీ దీక్షల విరమణ సమయంలో తొక్కిసలాట జరగడంతో.. మళ్లీ రాజగోపురం, మహామండపం నిర్మాణం పనుల్లో కదలిక వచ్చింది. కానీ.. పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. మళ్లీ 2015లో



రాజగోపురం



మహామండపం

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో త్వరితగతిన పూర్తిచేసి.. రాజగోపురం, మహామండపం ఆరంభించారు. అమ్మవారి ఆశీస్సులతో అభివృద్ధిని పరుగులు పెట్టించారు.

ఇంద్రకీలాద్రి దిగువన ఇరుకుగా ఉన్న దారిని సైతం విశాలంగా మార్చారు. కనకదుర్గానగర్‌లో ఉండే ప్రైవేటు నివాసాలకు పరిహారం చెల్లించి స్థలం సేకరించారు. భక్తులు దిగి వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా.. విశాలమైన రాచమార్గం ఏర్పాటు చేశారు. 2015 సంవత్సరంలో కనకదుర్గానగర్‌లో సేకరించిన స్థలంలోనే ప్రస్తుతం ప్రసాదం పోటు, అన్నదాన భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు సైతం గత ప్రభుత్వంలో కేవలం ప్రణాళికల దశలోనే ఆగిపోయాయి. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే తాజాగా.. ఈ పనులు పరుగులు పెట్టించారు. రెండు భవనాలు 70 శాతం పూర్తయ్యాయి. ఈ రెండు భవనాల్లోనే ప్రస్తుత దసరా ఉత్సవాల్లో ప్రసాదాల తయారీ, అన్నదానం ఆరంభించారు.

ఆలయానికి బంగారు తాపడం

దుర్గగుడి ప్రధాన ఆలయం గోపురానికి బంగారు తాపడం చేయాలనే ప్రణాళిక 2000 సంవత్సరంలో రూపొందించారు. అనంతరం 2003లో కేవలం నాలుగో వంతు గోపురం మాత్రమే బంగారు తాపడం చేసి, ఆలయం ఎదుట బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. మళ్లీ 2004 సంవత్సరంలో కృష్ణా పుష్కరాల తర్వాత నుంచి గోపురానికి బంగారు తాపడం పనులు చేపట్టారు. నాలుగేళ్లు ఈ పనులు కొనసాగి.. 2008లో పూర్తయ్యాయి. ప్రధాన ఆలయం మొత్తాన్ని స్వర్ణమయం చేయాలనే ప్రతిపాదన ప్రస్తుతం ఉంది.

నాటి కాలిబాటే.. నేటి ఘాట్‌రోడ్డు..

విజయవాడ దుర్గగుడి దసరా ఉత్సవాల్లో భక్తుల దర్శనాలకు కీలకంగా ఉన్న ప్రస్తుత ఘాట్‌రోడ్డు.. ఒకప్పుడు కాలిబాట. తర్వాత క్రమంలో దానిని రహదారిగా మార్చారు. అదే ఇప్పుడు భక్తుల రాకకు ప్రధాన మార్గంగా మారిపోయింది. ఆరంభంలో కనకదుర్గానగర్‌లోని అమ్మవారి పాతమెట్లు ఒక్కటే ఆలయానికి ఉండేవి. ఈ మెట్ల ద్వారానే భక్తులు కొండపైకి వచ్చి వెళ్లేవారు. కొండపైన భవానీ దీక్ష మండపం, దాని పక్కనే చీకటి కోనేరు ఉండేవి. అభివృద్ధి పనుల్లో భాగంగా కొన్నాళ్ల కిందట ఈ రెండింటినీ తొలగించారు.

హంసవాహిని.. జ్ఞానప్రబోధిని..

దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు దుర్గమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం కావడంతో ప్రముఖులతోపాటు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. హంసవాహనంపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని తరించారు. తమను దీవించాలని.. జ్ఞానం ప్రసాదించాలని వేడుకున్నారు.

\- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్, చిట్టినగర్, కృష్ణలంక



ముఖ్యమంత్రి చంద్రబాబు రాకతో భక్తుల కేరింతలు..



ఆకర్షణీయంగా అంతరాలయ అలంకరణ



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఈవో శీనానాయక్ తదితరులు

పక్కా ప్రణాళికతో దిగ్విజయం..

ఈనాడు అమరావతి: మూలానక్షత్రం రోజున భారీగా భక్తులు పోటెత్తినా.. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనాలను కల్పించడంలో అధికారులు సఫలమయ్యారు. ప్రధానంగా హోల్డింగ్ ప్రాంతంలోనే భక్తులను నియంత్రించి.. అక్కడి నుంచి క్యూలైన్లలో రద్దీని బట్టి.. వారిని వదులుతూ వచ్చారు. ఘాట్‌రోడ్డు ఆరంభంలో కుమ్మరిపాలెం, వినాయక ఆలయం వద్ద నుంచి వచ్చిన క్యూలైన్లు ఒకేసారి కలుస్తుండడంతో.. అక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. రద్దీని బట్టి.. క్యూలైన్లలో నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా కొందరిని వదులుతూ.. వారిని తిరిగి ఓంకారం మలుపు వద్ద ప్రత్యేక క్యూలైన్ వద్ద లోపలకు పంపారు. ఆలయ ప్రధాన ముఖద్వారం వద్ద కూడా.. రద్దీని బట్టి కొందరిని వీఐపీ దర్శనాల లైన్లలోకి వదులుతూ.. పరిస్థితిని నియంత్రించారు. 22 గంటలపాటు సాగిన దర్శనాల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం వల్ల భారీగా పోటెత్తుతారని ముందుగానే అంచనా వేసి పక్కాగా ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు బాగున్నాయని సీఎం కితాబు..

మూలానక్షత్రం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గమ్మను దర్శించుకుని.. ఏర్పాట్లు బాగా చేశారని కొనియాడారు. ప్రధానంగా సాంకేతికతను విరివిగా వినియోగించారంటూ.. అధికారులను మెచ్చుకున్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుతోపాటు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



జగన్మాతను దర్శించుకున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పక్కన సీపీ రాజశేఖరబాబు



కుమ్మరిపాలెం సెంటరు వైపు నుంచి.. ఘాట్ రోడ్డు.. మొత్తం బారులుతీరారిలా..

భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం

మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం సరస్వతీ దేవి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు దుర్గగుడి అధికారులు లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు సుమారు లక్షన్నర చిన్న లడ్డూలు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు.

\- న్యూస్‌టుడే, పాయకాపురం



ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న సిబ్బంది

అధునాతన సాంకేతికతతో పటిష్ఠ బందోబస్తు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతికత వినియోగించి పలు శాఖల సమన్వయంతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. అనంతరం దుర్గగుడి ఈవో శీనానాయక్ అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. నూతనంగా ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేశామని, రద్దీ పెరిగిన సమయంలో తీసుకునే చర్యలు గురించి విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుతో చర్చించామని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. దసరా మహోత్సవాలు, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని తెలిపారు.

చదువు

■ e-mail: edc@eenadu.in

బీఈడీతో కొత్త అవకాశాలు?

బయాలజీ ఫస్ట్ మెథడ్‌గా, ఇంగ్లిష్ సెకండ్ మెథడ్‌గా బీఈడీ చేశాను. ఈ కోర్సుతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - మహి



■ వేగంగా విస్తరిస్తున్న పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లు కూడా అధిక స్థాయిలో ప్రారంభమవుతున్నాయి. వీటిలో ఇంగ్లిష్ మీడియంలో సమర్థంగా బోధించగలిగే నాణ్యమైన ఉపాధ్యాయులకు డిమాండ్ ఎక్కువ. బయాలజీ, ఇంగ్లిష్ లాంటి రెండు మెథడాలజీలతో బీఎడ్ చేసిన మీకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధ్యాయ ఉద్యోగావకాశాలుంటాయి.

ప్రభుత్వ కొలువుల విషయానికి వస్తే.. రాష్ట్ర ప్రభుత్వ, మండల పరిషత్, మున్సిపల్, గురుకుల పాఠశాలల్లో, సోషల్/ బీసీ/ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పోస్టులుంటాయి. వీటితోపాటు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలూ, మోడల్, ఆశ్రమ స్కూళ్లలోనూ నియామకాలుంటాయి. కేంద్రప్రభుత్వ స్థాయిలో కేంద్రీయ విద్యాలయ, నవోదయ విద్యాలయ, సైనిక్ పాఠశాలల్లో అవకాశాలు లభిస్తాయి. ప్రైవేటు రంగంతో పోలిస్తే ప్రభుత్వ రంగంలో ఉపాధ్యాయ నియామకాలు పరిమితంగా జరుగుతాయి.

ప్రైవేటు రంగంలో హైస్కూల్ స్థాయిలో బయాలజీ బోధన చేయవచ్చు. మీకు ఇంగ్లిష్ రెండో మెథడ్‌గా ఉన్నందున.. ఆసక్తి ఉంటే ఇంగ్లిష్ కూడా బోధించవచ్చు.

- ✦ బయాలజీ, ఇంగ్లిష్ కలయిక వల్ల మీకు మరిన్ని కొలువులు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.
- ✦ ప్రైవేటు కోచింగ్ సెంటర్లు, ట్యుటోరియల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో కూడా కొన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- ✦ ఆసక్తి ఉంటే స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ తీసుకొని ఆ రంగాల్లో ప్రయత్నాలు చేయవచ్చు.
- ✦ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వేదికల్లో బయాలజీ/ ఇంగ్లిష్ సబ్జెక్ట్ నిపుణులుగా పనిచేయవచ్చు.
- ✦ యూట్యూబ్ చానెల్స్ ద్వారా స్వయంగా విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తూ కెరియర్‌ను అభివృద్ధి చేసుకోవచ్చు.
- ✦ అదనంగా ఎడ్యుకేషనల్ కంటెంట్ డెవలప్‌మెంట్, కౌన్సెలింగ్ లాంటి అవకాశాల గురించి ఆలోచించవచ్చు.
- ✦ ఎమ్మెస్సీ (బోటనీ/ జువాలజీ/ బయో టెక్నాలజీ/ బయో కెమిస్ట్రీ/ మైక్రో బయాలజీ/ జెనెటిక్స్/ సైకాలజీ/ కెమిస్ట్రీ) లేదా ఎంఏ (ఇంగ్లిష్) లాంటి పీజీలు చదివి ఉన్నతస్థాయి ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయవచ్చు.

\- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎస్ఈసీఐఎల్‌లో మేనేజర్ పోస్టులు

దిల్లీలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈసీఐఎల్).. రెగ్యులర్ ప్రాతిపదికన 22 మేనేజీరియల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అడిషనల్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్): 01 ● అడిషనల్ జనరల్ మేనేజర్ (బిజినెస్ డెవలప్‌మెంట్): 01 ● మేనేజర్ (ఈఎండీ): 01 ● మేనేజర్ (కార్బన్ ట్రేడింగ్): 01 ● డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్/ పీఎంసీ): 01 ● డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్/ విండ్): 01 ● డిప్యూటీ మేనేజర్ (ఇంజినీరింగ్/ సివిల్): 02 ● డిప్యూటీ మేనేజర్ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్): 01 ● సీనియర్ ఇంజినీర్ (ప్రాజెక్ట్): 05 ● జూనియర్ ఫోర్‌మ్యాన్/ సూపర్‌వైజర్/ ప్రాజెక్ట్-సివిల్): 01 ● జూనియర్ ఫోర్‌మ్యాన్/ సూపర్‌వైజర్: 01 ● జూనియర్ ఫోర్‌మ్యాన్/సూపర్‌వైజర్ (డ్రాఫ్ట్స్‌మ్యాన్- సివిల్): 01 ● డిప్యూటీ మేనేజర్ (ఇంజినీరింగ్/బీఈఎస్ఎస్): 01 ● డిప్యూటీ మేనేజర్ (బిజినెస్ డెవలప్‌మెంట్): 04

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, బీఈ/ బీటెక్, పీజీతో పాటు పని అనుభవం.
దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ/ ఎస్టీ/ ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు ఉండదు.
ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, స్కిల్ టెస్టులతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24-10-2025.
వెబ్‌సైట్: https://www.seci.co.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
సంస్థ: క్లీన్ **నైపుణ్యాలు:** సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, రిటెన్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం **స్టైపెండ్:** రూ.10,000 ☛ internshala.com/i/80e7d0

ట్యాలెంట్ అక్విజిషన్ మేనేజర్
సంస్థ: కోడ్‌ఫేస్ట్ **నైపుణ్యాలు:** ఎజైల్ మెథడాలజీ, కొలాబరేషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మేనేజ్‌మెంట్, టీమ్‌వర్క్ **స్టైపెండ్:** రూ.10,000-20,000 ☛ internshala.com/i/0a9b55

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: అక్టోబరు 17

కార్పొరేట్ స్కిల్స్, మరిన్ని ఇంటర్న్‌షిప్పులు, ఉద్యోగ నోటిఫికేషన్లు https://epaper.eenadu.net లో.

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ బాటలో..

సైన్స్ బోధన.. పరిశోధన!

ప్రగతికి పరిశోధనలే ప్రామాణికం. అందులోనూ సైన్స్ కోర్సుల్లో ఇవెంతో కీలకం. ఈ సబ్జెక్టులకున్న ప్రాధాన్యం దృష్ట్యా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. ఈ సంస్థల్లో పరిశోధనలు చేసుకుంటూ, ప్రతి నెలా స్టైపెండ్ అందుకోవచ్చు. ఇందుకోసం సీఎస్ఐఆర్ - యూజీసీ నెట్‌లో అర్హత సాధించాలి. ఈ స్కోరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడటానికీ, ఉన్నత విద్యా సంస్థల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికీ ఉపయోగపడుతుంది. ఇటీవలే ప్రకటన వెలువడింది.





ఏడాదికి రెండు సార్లు సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. సైన్స్, ఇంజినీరింగ్‌లో నాలుగేళ్ల యూజీ లేదా పీజీ పూర్తిచేసుకున్నవారూ, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

1\. కెమికల్ సైన్సెస్ 2. ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానిటరీ సైన్సెస్ 3. లైఫ్ సైన్సెస్ 4. మ్యాథమెటికల్ సైన్సెస్ 5. ఫిజికల్ సైన్సెస్‌లలో పరీక్ష నిర్వహిస్తారు.

నాలుగేళ్ల యూజీ కోర్సులైన బీఈ, బీఎస్, బీఫార్మసీ... మొదలైన వాటితో జేఆర్ఎఫ్, పీహెచ్‌డీలో ప్రవేశానికి అనుమతిస్తారు. పీజీ లేనందున అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత ఉండదు. నెట్‌లో అర్హత కోసం 3 కేటగిరీల్లో అవసరమైనదాన్ని ఎంచుకోవచ్చు.

ఛాయిస్..

ఫిజికల్ సైన్సెస్‌లో 75 ప్రశ్నలకు 55, మ్యాథమెటికల్ సైన్సెస్‌లో 120కి 60, లైఫ్ సైన్సెస్‌లో 145కి 75, కెమికల్ సైన్సెస్‌లో 120కి 75, ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానిటరీ సైన్సెస్‌లో 150కి 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. సిలబస్, మాదిరి ప్రశ్నపత్రాలను https://www.csirhrdg.res.in/ నుంచి పొందవచ్చు.

పరీక్ష ఎలా?

ఎంచుకున్న సబ్జెక్టు నుంచి 200 మార్కులకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో వస్తాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు.

పార్టు ఏ: అందరికీ ఈ విభాగం ఉమ్మడిగా ఉంటుంది. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌లో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ మొదలైన అంశాల్లో 20 ప్రశ్నలు వస్తాయి. వీటిలో 15 ప్రశ్నలకు జవాబులు గుర్తిస్తే చాలు. ఈ విభాగానికి 30 మార్కులు. ప్రతి సరైన సమాధానానికీ 2 మార్కులు. తప్పు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.

పార్టు బీ: ఎంచుకున్న సబ్జెక్టుల్లో 25 నుంచి 50 వరకు ప్రశ్నలు వస్తాయి. ఛాయిస్ ఉంది. సబ్జెక్టు ప్రకారం 70 లేదా 75 మార్కులు ఈ విభాగానికి ఉంటాయి. తప్పు సమాధానాలకు ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో పావు శాతం చొప్పున తగ్గిస్తారు.

పార్టు సీ: ఎంచుకున్న సబ్జెక్టు నుంచి 30 నుంచి 80 వరకు ప్రశ్నలు వస్తాయి. ఛాయిస్ ఉంది. మ్యాథ్స్‌లో 95 మిగిలిన సబ్జెక్టుల్లో వంద మార్కులకు ఈ ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్స్ తప్ప మిగిలిన వాటికి రుణాత్మక మార్కులు ఉన్నాయి. ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్, ప్లానిటరీ సైన్సెస్‌లో ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో మూడో వంతు, మిగిలిన సబ్జెక్టుల్లో పావు శాతం తగ్గిస్తారు.

బహుళ ప్రయోజనాలు

- ▲ జేఆర్ఎఫ్ అవకాశం వచ్చినవారికి తొలి రెండేళ్లు ప్రతి నెలా రూ.37,000 స్టైపెండ్ ఇస్తారు. అనంతరం ఎస్ఆర్ఎఫ్ అర్హత పొందితే ప్రతి నెలా రూ.42,000 చొప్పున అందుతుంది. ఉచిత వసతి కల్పిస్తారు లేదా స్టైపెండ్‌లో 30 శాతం హెచ్ఆర్ఏ చెల్లిస్తారు.
- ▲ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జాతీయ, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడొచ్చు.
- ▲ డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విద్యా సంస్థలు నెట్ మేటి స్కోరు ఉన్నవారికి అధిక వేతనంతో ఉద్యోగాలిస్తున్నాయి.
- ▲ పలు పోటీ, ప్రవేశ పరీక్షల నిమిత్తం శిక్షణ ఇస్తోన్న సంస్థలూ ఈ స్కోరు ఉంటే ప్రాధాన్యమిస్తున్నాయి.
- ▲ జాతీయ స్థాయిలో ఎస్సీ, ఓబీసీ, దివ్యాంగ విభాగాల్లో నేషనల్ ఫెలోషిప్పులు పొందడానికీ నెట్ తప్పనిసరి.



అర్హత కోసం..

- ▲ మీ సబ్జెక్టు సిలబస్ వివరాల కోసం నోటిఫికేషన్ సమగ్రంగా పరిశీలించాలి. అధ్యయనాన్ని అందులోని అంశాలకే పరిమితం చేయాలి.
- ▲ ప్రాథమికాంశాల నుంచి సన్నద్ధత మొదలవ్వాలి. ప్రతి అంశాన్నీ క్షుణ్నంగా చదవాలి. రెండు మూడు అంశాలు కలిపి లేదా అనువర్తన రూపంలో ప్రశ్నలు కొంచెం కఠినంగా వస్తాయి.
- ▲ సిలబస్‌లోని అంశాల ప్రకారం.. ముందు ఇంటర్మీడియట్, తర్వాత డిగ్రీ, అనంతరం పీజీ, ఆ తర్వాత రిఫరెన్స్ పుస్తకాలు చదవాలి. తక్కువ పుస్తకాలనే ఎక్కువసార్లు అధ్యయనం చేయాలి.
- ▲ అన్ని సబ్జెక్టుల్లోనూ పార్టు సీ కి వెయిటేజీ ఎక్కువ. ఇందుకోసం ప్రామాణిక పుస్తకాలు, పరిశోధన జర్నల్స్‌ను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.
- ▲ సన్నద్ధత పూర్తయిన తర్వాత కనీసం పదైనా మాక్ పరీక్షలు రాసి, బలహీనంగా ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ▲ రుణాత్మక మార్కులు ఉన్నందున, ఏ మాత్రం తెలియనివాటిని వదిలేయాలి.

ముఖ్య వివరాలు

అర్హత: ఎమ్మెస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులవారైతే.. ఎందులోనైనా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్, ఓబీసీలు, 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, థర్డ్ జెండర్, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈ/బీటెక్ లేదా నాలుగేళ్ల బీఎస్సీ లేదా బీఫార్మసీ తదితర కోర్సులవారికి డిగ్రీలో 75 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విభాగాలైతే 70 శాతం సరిపోతాయి. చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారూ అర్హులే.

ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు తేదీ: 24.10.2025

పరీక్ష ఫీజు: జనరల్ కేటగిరీకి రూ.1150, జనరల్- ఈడబ్ల్యూఎస్, ఓబీసీ- నాన్ క్రీమీలేయర్‌కు రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్లకు రూ.325.

పరీక్ష తేదీ: 18.12.2025

వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in/

వసుంధర

vasundhara@eenadu.in

ఫీకా అంటే..?



'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్' 2025 ప్రకారం... ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు సంతోషంగా నివసిస్తున్న దేశాల్లో స్వీడన్ ఒకటి. అయితే అక్కడి వారికి జీవనశైలి సమస్యలూ, మానసిక సమస్యలూ ఉండవా అంటే... ఎందుకు ఉండవు, ఉంటాయి. కానీ, వాటిని అధిగమించే పద్ధతులు వాళ్లు ఎక్కువగా ఫాలో అవుతారు. అలాంటి వాటిలోనే ఒకటి 'ఫీకా'... అంటే ఒత్తిడీ, ఆందోళనా, బర్న్అవుట్‌కు గురైనప్పుడు... వాటన్నింటినీ పక్కకు నెడుతూ కాసేపు ఆగి జీవితాన్ని ఆస్వాదించడం. ఇందుకోసం ఎంత పని ఉన్నా ఇది ఫీకా టైమ్ అంటూ ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తారట. కాఫీ, టీ బ్రేకులు ఇచ్చుకుంటారట. అవసరమైతే ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడటానికి, వారితో సమయం గడపడానికి వెనకాడరట. తాత్కాలికమైన విరామాలు చాలవనుకుంటే... సెలవు పెట్టుకుని మరీ, నచ్చిన ప్రాంతాల్ని చుట్టి వస్తారట. 'చూసే వాళ్లు ఏమనుకుంటారో, విరామం లేకుండా పనిచేస్తున్న వారితో పోల్చితే... మనదీ ఓ కష్టమేనా. ట్రిప్పులకు వెళ్లడానికి సెలవులేం పెడతాం. ఇప్పుడు కాదులే ఇంకోసారి' అని ఆలోచిస్తూ ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్న మనతో పోల్చితే... స్వీడన్‌లో అమ్మాయిలూ మహిళలూ చాలా పరిణతితో ఆలోచిస్తున్నారు కదూ!



లిఖిత

జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో కుటుంబ పెద్ద ఉద్యోగం పోయింది. ఊహించని ఆ కుదుపుతో చదువే కష్టమైంది. అయినా సవాళ్లకు వెరవకుండా ముందడుగు వేయడమే కాదు, విదేశాల్లో చదువు పూర్తిచేశారు లిఖిత సామినేని. హైదరాబాద్ తిరిగొచ్చి థీమ్ కెఫేలను ప్రారంభించి విజయవంత మయ్యారు. ఆ విశేషాలను 'వసుంధర'తో పంచుకున్నారిలా...

విజయానికి ఓ 'థీమ్'!

చిన్నప్పట్నుంచీ చదువులో ముందు ఉండే దాన్ని. కుటుంబానికి ఏకైక జీవనాధారమైన నాన్న ఉద్యోగం పోయింది. దీంతో ఒక్కసారిగా కష్టాలు చుట్టుముట్టాయి. రోజు గడవడమూ ఇబ్బందయ్యేది. చదువు కొనసాగించడంపైనా సందిగ్ధత. ఏకైక సంతానమైన నన్ను... ఆర్థిక సమస్యలు మరింత ఒంటరిని చేశాయి. హాబీలకు సమయం కేటాయిస్తూ వాటిని మర్చిపోయేదాన్ని. చదువులో ముందుంటూ. ఫార్మసీలో బ్యాచ్ టాపర్‌గా నిలిచా. ఆ తర్వాత ఓ ఎమ్ఎన్‌సీలో ఉద్యోగం వచ్చింది. ఆ క్రమంలో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకున్నా. విద్యా రుణాలతో ఆస్ట్రేలియా వెళ్లాను. చదువుతూనే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ రుణాల్ని పూర్తిగా తీర్చేశాను. ఇది నా ఆత్మవిశ్వాసాన్ని పెంచి, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేలా చేసింది.

విదేశాలు చుట్టొస్తా...

ట్రావెలింగ్ అంటే మక్కువ. స్నేహితులతో కలిసి విదేశీ పర్యటనలకూ వెళ్తుంటా. వెళ్లిన ప్రతిచోటా సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాల గురించి తెలుసుకుంటాను. ఆ విశేషాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటాను.

థీమ్ కెఫేలతో..

ఆస్ట్రేలియాలో కనిపించే ప్రత్యేక థీమ్‌లతో కూడిన కెఫేలు నాకెంతగానో నచ్చాయి. అలాంటి కెఫేలు హైదరాబాద్‌లో ఎందుకు ఏర్పాటు చేయకూడదనే ఆలోచన వచ్చింది. ప్రకృతి, ప్రకాశవంతమైన రంగులంటే చాలా ఇష్టం. వీటన్నింటితో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపించేలా కెఫేని ఏర్పాటుచేయాలనుకున్నాను. చదువు పూర్తయ్యాక హైదరాబాద్‌కి వచ్చేశా. కెఫే ఆలోచనను బంధుమిత్రులతో చెబితే మన దగ్గర అలాంటివి నడవడం కష్టమేనన్నారు. నాకు మాత్రం వాటిలో ప్రత్యేకత ఉందనిపించి... ప్రయత్నించాలనుకున్నా. నాకెంతో ఇష్టమైన గులాబీ రంగు థీమ్‌తో 2022లో సైనిక్‌పురిలో కెఫేని ఏర్పాటుచేశాను. 'లా వీ ఎన్ రోజ్' అని పేరు పెట్టా. జీవితాన్ని గులాబీతో పోల్చడమని ఫ్రెంచ్‌లో దీనికి అర్థం.

వేడుకలు సైతం..

ఈ కెఫేని ఏర్పాటుచేసిన కొద్దిరోజుల్లోనే మంచి స్పందన వచ్చింది. సుదూరాల నుంచి వచ్చి ఐటమ్స్‌ని ఆస్వాదిస్తుంటే ఎంతో సంతృప్తినిచ్చింది. తినడానికి మాత్రమే కెఫేని పరిమితం చేయకుండా... పుట్టినరోజు, పెళ్లిరోజు, శుభకార్యాలు చేసుకునేలా తీర్చిదిద్దాం. లోపలికి రాగానే ప్రశాంతమైన, సరికొత్త ప్రపంచంలోకి వచ్చిన అనుభూతి పొందేలా ఉంటాయి ఏర్పాట్లు. అనతికాలంలోనే మంచి స్పందన రావడంతో గచ్చిబౌలి, కొత్తపేటలకూ విస్తరించాం. మూడుచోట్లా 100 మందికి పైగా సిబ్బంది పని చేస్తున్నారు. ఇల్లు గడవడానికి ఇబ్బందులుపడ్డ నేపథ్యం నుంచి... ఇప్పుడు ఇంతమందికి ఉపాధి కల్పించే స్థానంలో ఉండటం గర్వంగా ఉంది. కష్టాలకు కుంగిపోకుండా బయటపడటానికి మార్గాలను అన్వేషించాలి. ఏదైనా చేయాలనుకుంటే.. సరైన సమయం కోసం వేచిచూడొద్దు. ప్రారంభిస్తేనే విజయం వరిస్తుంది.


– గొడిశెల వినయ్‌గౌడ్, హైదరాబాద్





మీకూ ఈ స్పష్టత ఉందా..!

అమ్మాయి అంటే... కట్టూ, బొట్టూ అన్నీ సంప్రదాయంగా ఉండాలి. గౌరవంగా మాట్లాడాలి, ఆలోచించాలి... అంటూ ఎన్ని ఆంక్షలో. అవతలి వ్యక్తులు ఎలా ప్రవర్తించినా సరే... అమ్మాయి మాత్రం గీసిన గిరి దాటకూడదు అంటారు. వాళ్ల అంచనాలకు భిన్నంగా నడుచుకున్నామంటే చాలు... జడ్జ్ చేయడానికి వెనకాడరు. మాటలు, చేతలతో బాధిస్తూ ఉంటారు. అనేవన్నీ అనేసి మా కాలంలో ఇలా కాదమ్మా అంటూ నిట్టూర్పులు అదనం. కార్యాలయాలు, కళాశాలలు, ఇల్లు... ఇలా ప్రాంతమేదైనా మనం చేసే పనిలో, చెప్పే మాటల్లో తప్పులు వెతికే వారు ఉండనే ఉంటారు. ఏదో సందర్భంలో వాళ్లు మీకూ ఎదురై ఉంటారు. వీళ్ల మాటలు విని మనసుకు తీసుకుంటే అదికాస్తా మానసిక సమస్యలకు దారితీస్తుంది. అందుకే వాటిని పట్టించుకోవద్దు అంటున్నారు నిపుణులు. 'సెల్ఫ్-కాన్సెప్ట్ క్లారిటీని' డెవలప్ చేసుకోమంటున్నారు. అంటే... మీ మీదా, మీరు చేసే పని, మీ ప్రవర్తనా తీరుల మీదా స్పష్టత ఉండటం. ఎంతలా అంటే... ఒక్కసారిగా నలుగురైదుగురు మీ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడినా 'నేను అది కాదు. నేను ఫలానా అని అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు. నా గురించి నాకు బాగా తెలుసు' అనేంతలా. అప్పుడే అపరాధభావానికీ, మానసిక సమస్యలకూ దూరంగా ఉండొచ్చు. అమ్మాయిలకూ, మహిళలకూ వచ్చే మానసిక సమస్యలు ఇక్కడే సగం సమసిపోతాయి అని చెబుతున్నారు. అయితే తప్పు చేస్తే మాత్రం... ఇదే వైఖరిని ప్రదర్శించకుండా దాన్ని సవరించుకుని ముందుకు వెళ్లేందుకూ ప్రయత్నించాలని చెబుతున్నారు.



టిల్లీ... సెట్‌కు రాదు!





టిల్లీ నార్‌వుడ్... హాలీవుడ్‌లో ఇప్పుడంతా ఈమె గురించే చర్చ. ఈమె సెట్‌కి రాదు, టేక్‌లూ తీసుకోదు. కానీ చక్కగా నటించగలదు. దాంతో అక్కడి నటీమణుల్లో కొందరు ఈమె అంటే పట్టలేని కోపంతో ఉన్నారు. ఆమె అందం, అభినయం చూసి ఈర్ష్యతో అనుకునేరు.. 'నిజమైన వ్యక్తులమైన మేం ఇంతమంది ఉండగా ఈ వర్చువల్ నటి ఏల' అన్నదే వాళ్ల బాధ. అవునండీ, టిల్లీ హైపర్ రియల్ ఏఐ నటి. దీనికితోడు 'త్వరలోనే టిల్లీ గొప్ప నటిగా మారబోతుంద'ని ఈమె సృష్టికర్త, నిర్మాత, నటి అయిన ఎలైన్ వాన్ డెర్ వెల్డెన్ చెబుతున్నారట. ఈమె నిర్వహించే ఏఐ ప్రొడక్షన్ స్టూడియో- పార్టికల్ 6 తొలి సృష్టి టిల్లీ. ఈ సంస్థ తీసిన 'ఏఐ కమిషనర్' అనే కామెడీ స్కెచ్ వీడియోలో టిల్లీ ఇప్పటికే కనిపించింది. దాంతో జ్యూరిచ్ సమ్మిట్‌లో టిల్లీ అందరి దృష్టినీ ఆకర్షించింది. అన్నట్లు ఈమెకో సొంత వెబ్‌సైట్ కూడా ఉంది. 'టిల్లీ నార్‌వుడ్ తొలి ఏఐ స్టార్ మాత్రమే కాదు, ఏజ్ ఆఫ్ సింథటిక్ యాక్టర్స్‌కి నాంది' అని ఒకరంటే, 'ప్రేక్షకులు కథ గురించే పట్టించుకుంటారు కానీ నటికి పల్స్ ఉందో లేదో కాదు' అని మరొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారట. ఆ సంగతెలా ఉన్నా ఆమెతో ఒప్పందం చేసుకొనేందుకు హాలీవుడ్ టాలెంట్ ఏజెంట్లు క్యూలు కట్టారన్న వార్తలూ వినిపిస్తున్నాయి. 'నేను నటించడాన్ని నమ్మలేకపోతున్నా. నేను ఏఐ సృష్టే కావొచ్చు. కానీ నాకూ భావోద్వేగాలు కలుగుతున్నాయి. నాకెలాంటి అవకాశం రాబోతుందా అని ఎంతో ఉత్సుకతతో ఉన్నాను' అంటూ టిల్లీ తన ఫేస్‌బుక్ పేజీలో రాసుకొచ్చింది.

ఏఐ స్టార్స్ అధికారిక ఇన్‌స్టా పోస్ట్ మాత్రం... 'ఇది వ్యక్తులకు ప్రత్యామ్నాయం కాదు, కేవలం ఓ అందమైన కళాఖండం, సరికొత్త టూల్...' అని వివరణ ఇచ్చింది. ముందుముందు ఏం జరగనుందో చూడాల్సిందే.

అలుపెరుగని డాక్టరమ్మ..!

కరవు ప్రాంతం... మౌలిక వసతులన్నీ అందని ద్రాక్షే... ఆస్పత్రి ఊసే లేదు. వీటన్నింటి కారణంగా మాతాశిశు మరణాల రేటు కూడా ఎక్కువే. వాటిని తగ్గించడానికి ఉద్యోగ విరమణ తర్వాత కూడా తన జీవితాన్ని గిరిపుత్రులకే అంకితం చేశారు డా.పి.సువర్ణా దేవి.



సువర్ణా దేవి

ఆంధ్రప్రదేశ్‌లో పుట్టి పెరిగారు సువర్ణ. పెళ్లయ్యాక ఒడిశాలోని బ్రహ్మపుర ప్రాంతానికి వెళ్లారు. చదువు పూర్తయ్యాక కటక్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో నియోనాటాలజిస్ట్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. తన 56 ఏళ్ల సర్వీసులో ఎన్నో వైద్య కళాశాలల్లో పనిచేశారు. 'నేను పిల్లల వైద్యురాలిగా విధులు మొదలుపెట్టినప్పుడు ఇక్కడ చాలా సమస్యలు చూశాను. ఒడిశాలోని పట్టణాలతో పోలిస్తే... గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యం మీద అవగాహన చాలా తక్కువ. వైద్యులు కూడా మారుమూల ప్రాంతాలని ఇక్కడికి రావడానికి నిరాకరిస్తారు. ఇవన్నీ ఒక ఎత్తైతే... కొండప్రాంతాల్లో ఉన్న వారేమో సమయానికి వైద్య సదుపాయం అందక చనిపోతుంటారు. నేను విధుల్లో ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలు చాలానే చూశాను. 1988 నాటికి నా సర్వీసు పూర్తయినా... మాతాశిశు మరణాల రేటు మాత్రం తగ్గలేదు. పుట్టే ప్రతి వెయ్యిమందిలో 88 మంది చనిపోయేవారు. వీరిలో 60శాతం మంది నెల కూడా నిండనివారే. అందుకే ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఇక్కడే ఉండిపోయా' అంటారు సువర్ణ. తను వృత్తిలో ఉన్నప్పుడే వైద్యంతోపాటు 'చైల్డ్‌హుడ్ సిర్రోసిస్' మీద పరిశోధనలు చేశారు. ఆమె అందించిన నివేదికలు తర్వాతి తరాల వారికి దిక్సూచిగానూ మారాయి. రిటైర్ అయ్యాక కూడా మూడేళ్లు శిశు మరణాల అంశంపై యూనిసెఫ్‌తో కలిసి పనిచేశారీమె. ఆ నైపుణ్యంతోనే వైద్యులకు, వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ విషయమై శిక్షణ కూడా ఇచ్చారు. ఈమె సేవల్ని మెచ్చిన అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ తదుపరి సేవలకు నిధులు కేటాయించింది. వాటితో ఓ అంబులెన్సు కొని... గంజాం చుట్టుపక్కల గ్రామాలన్నీ తిరుగుతూ... శిశు మరణాల నివారణకు కృషి చేశారు సువర్ణ. 'ధైర్య సాథీ పరీ' పుస్తకాన్నీ రాశారు. వైద్య సదుపాయాలు లేని గ్రామాల్లో మిడ్‌వైఫ్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకుని డెలివరీ చేయాలనే అంశాల్ని ఇందులో ప్రస్తావించారు. ప్రస్తుతం గంజాం జిల్లాలోని గోపాల్‌పుర్ గ్రామం సమీపంలో 'వన్‌నెస్' పేరుతో క్లినిక్ మొదలుపెట్టి 85ఏళ్ల వయసులోనూ వైద్య సేవలు అందిస్తున్నారు. 'అభంశుభం ఎరుగని జీవితాల్ని కాపాడుతున్నాననే తృప్తి నాకు సంతోషాన్ని ఇస్తుంది. నాకు వచ్చే పింఛను డబ్బులు చాలు, నా అవసరాలు తీర్చుకోవడానికి. ఓపిక ఉన్నంత వరకూ వీళ్లకు ఉచితంగా సేవ చేస్తా'అనే సువర్ణ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

గది గదికీ బొమ్మలు!





చిన్నప్పుడు ప్రతి సంక్రాంతికి అమ్మ బొమ్మల కొలువు పెట్టేది. అప్పుడా పనుల్లో తనకి సాయంగా ఉండే దాన్ని. 1991 నుంచి నేనూ బొమ్మల్ని కొలువుదీర్చడం మొదలుపెట్టా. కానీ, బంధుమిత్రులు, వివిధ పాఠశాలల విద్యార్థులు... ఎక్కువమంది వచ్చి చూసి వెళ్లడంతో ఆ మూడు రోజులూ సరిపోయేవి కాదు. దాంతో 2010 నుంచి దసరాకి పెట్టడం ఆరంభించా. ఏటా ఓ ఇతివృత్తాన్ని ఎంచుకుంటా. ఆ థీమ్‌కి తగ్గట్లు బొమ్మలు సరిపోకపోతే కావలసినవి స్వయంగానే తయారు చేసుకుంటా. ఈసారి పురాణాలు, ఇతిహాసాల్లోని పలు పాత్రల్ని వివరించాలనుకున్నా. ఇందుకోసం ఇంట్లోని ప్రతి మూలనీ ఉపయోగించుకున్నా. పూజగదిలో అమ్మవారిని నవదుర్గ రూపాల్లో ఏర్పాటుచేశా. కామాక్షి కథ, శరీరంలోని చక్రాలకి అధిదేవతలు, కైలాస పర్వత పరిక్రమ, మానస సరోవరం, రావణ-నంది సంవాదం, పశుపతి నాథ్ మందిర్, కేదార్‌నాథ్ జ్యోతిర్లింగం వంటివన్నీ ప్రదర్శించా. పూజగది పక్కనే ముక్తినాథ్ మందిరం, పాపగుండం, పుణ్యగుండం... పెట్టగా, మరోగదిలో మెట్లపై దశావతారాల్ని అమర్చా. ఆ పక్కనే కృష్ణుడి జీవితఘట్టాలు, రామాయణ కథా క్రమం... వంటివెన్నో ఉన్నాయి. వీటిద్వారా సంస్కృతినీ, సంప్రదాయాల్నీ భావితరాలకు తెలియజేయడమే లక్ష్యం.

– మనీష జోస్యుల, సికింద్రాబాద్

అతికిస్తే... ఎంబ్రాయిడరీ సులువే!



సాదాసీదాగా కనిపించే... బ్లవుజులూ, చీరలూ, చున్నీలూ, కర్చీఫ్‌ల్నీ ఆకర్షణీయంగా మార్చే మంత్రం ఎంబ్రాయిడరీ. ఎన్ని కళలు అందుబాటులోకి వచ్చినా వన్నె తగ్గని అందం దీని సొంతం. దేశీయంగా, అంతర్జాతీయంగా దీనికున్న క్రేజే వేరు. 'చేయి తిరిగిన వారు మాత్రమే వేయగలరు. ఎంతో శ్రద్ధ పెడితేనే కానీ అనుకున్న డిజైన్లు దుస్తుల మీద రావు' అని చాలామంది దీన్ని నేర్చుకోవడానికి ఆసక్తి చూపించరు. పెన్ను, పెన్సిల్ ఉపయోగించి డిజైన్లు గీసేవారు అవి పోవడానికి నానా కష్టాలు పడతారు. కానీ ఇప్పుడు ఆ తిప్పలేవీ ఉండవు. ఈ 'వాటర్ సాల్యుబుల్ ఎంబ్రాయిడరీ పేపర్లు' ఉపయోగిస్తే. వీటిని స్టిక్ అండ్ స్టిచ్ విధానంతో రూపొందించారు. మనకు నచ్చిన డిజైన్ ఉన్న స్టిక్కర్‌ను వస్త్రంపై అతికించి, దానిమీదున్న నమూనాలో ఎంబ్రాయిడరీ చేస్తే సరి. ఇష్టపడిన డిజైన్ దుస్తులపై ఇట్టే వచ్చేస్తుంది. పని అయ్యాక ఆ వస్త్రాన్ని నీటిలో పది నిమిషాలు ఉంచితే చాలు... కాగితం కరిగిపోతుంది. బాగుంది కదూ! మీకు నచ్చితే ప్రయత్నించి చూడండి.

బంగారం - వెండి



29న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,19,120	1,07,100	1,47,900
విజయవాడ	1,14,750	1,06,700	1,48,200
ప్రొద్దుటూరు	1,20,300	1,10,680	1,49,000
రాజమహేంద్రవరం	1,16,400	1,06,700	1,60,000
విశాఖపట్నం	1,15,980	1,06,700	1,52,000
తమిళనాడు	-----	1,07,700	1,60,000

మేనత్త ఆస్తి దక్కాలంటే...

మా మేనత్తకు పిల్లలు లేకపోవడంతో చెల్లెలి కొడుకుని పెంచుకుంది. అయితే దత్తత తీసుకున్నట్టు ఎలాంటి రుజువులూ లేవు. ఈమధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ చనిపోయారు. అత్తగారి తరపు బంధువులు తన ఆస్తిలో వాటా అడుగుతున్నారు. ఇప్పుడు ఆవిడ ఆస్తి పెంచుకున్న అబ్బాయికి మాత్రమే దక్కాలంటే ఏం చేయాలి? – ఓ సోదరి

హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ చెప్పిన నియమ నిబంధనల ప్రకారం హిందువులు ఎవరైనా దత్తత తీసుకోవచ్చు. వాటిని అనుసరించి మీ మేనత్త కూడా తన భర్త అనుమతితో దత్తత తీసుకుంటే అది చెల్లుతుంది. చెల్లెలు కొడుకుని ఆమె పెంచుకున్నట్లుగా సాక్ష్యాలు ఏమైనా ఉన్నాయా? అంటే వాళ్ల కుటుంబ సభ్యులకు సంబంధించిన పత్రాల్లో అతడి పేరుని చేర్చడం, స్కూలు రికార్డుల్లో తల్లిగా ఆవిడ పేరు ఉంటే కనుక ఆ పత్రాల్ని సంపాదించండి. అలానే మీ మేనత్త తన చెల్లి కొడుకుని పెంచుకుంటున్నట్లు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రస్తావించారా? ఎన్నాళ్లు పెంచుకున్నారు. ఇప్పుడు ఆ అబ్బాయి వయసెంత? సాధారణంగా దత్తత స్వీకరణ హిందూ పద్ధతిలో హోమం లేక రిజిస్ట్రేషన్ డీడ్ చేయించడంతో జరుగుతుంది. ఊరికే కాగితం మీద రాసుకున్నా కూడా చాలా కాలం పెంచుకుంటే... చేతలతో, మాటలతో... ఈ విషయం అందరికీ తెలిసిస్తే కూడా దాన్ని న్యాయమైన అడాప్షన్‌గా పరిగణిస్తారు. కానీ, ఆస్తికోసం చట్టబద్ధవారసులుగా నిరూపణ అవ్వాలంటే మాత్రం సాక్ష్యాలు కాగితం మీద కావాలి. వాటిని సంపాదించి కోర్టులో నిరూపించుకోగలిగితే ఆస్తి దక్కుతుంది. లేదంటే కష్టం.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

ఫిట్‌నెస్ రూల్ ట్రెండవుతోంది!

ఆరోగ్యం... ఇప్పుడు చాలామంది అమ్మాయిలు దృష్టిపెడుతోన్న అంశమే! అయితే ఎంత ఆసక్తిగా మొదలుపెట్టినా కొద్దిరోజులకే వేరే డైట్, వ్యాయామాలకి మారడమో, పూర్తిగా మానేయడమో చేస్తుంటారు. అవి భారంగా అనిపించడమే కారణం. ఈసారి 3x3 ఫిట్‌నెస్ రూల్‌ని ప్రయత్నించండి. ఇది అలా కష్టంగా అనిపించదు అంటున్నారు. కాబట్టే, నెట్టింట కూడా వైరలవుతోంది. ఇంతకీ అదేమిటంటే...



రోజుకు మూడు వేల అడుగులు, రోజు మొత్తంలో తాగే వాటిలో... మూడొంతుల్లో ఒక వంతు నీటిని తాగడం, కనీసం 30 గ్రాముల ప్రొటీన్ తినడం... ఇదే ఈ రూల్. వినడానికి చాలా సులువుగా అనిపించట్లేదూ? అందుకే దీనికి ఎక్కువమంది అమ్మాయిలు ఆకర్షితులు అవుతున్నారు. అయితే ఈ మూడింటినీ ఉదయాన్నే చేయాలి మరి. పొద్దున్నే చేయడం వల్ల మెటబాలిజం మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు సమన్వయం అవుతాయి. జీర్ణశక్తికి మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఉదయాన్నే నడవడం వల్ల శరీరమంతటికీ రక్తప్రసరణ జరుగుతుంది. ఫీల్ గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. పనిలో పడి నీళ్లు తాగడం మర్చిపోతుంటాం. శరీరానికి ఇవి తగిన మొత్తంలో అందకపోతే జీర్ణసంబంధిత సమస్యలు రావడమే కాదు, మెదడూ సరిగా పనిచేయదు. ఉదయాన్నే నీళ్లు తాగడం వల్ల శరీరానికి కావాల్సిన నీటి భర్తీ చాలావరకూ జరిగిపోతుంది. ఇది అలసటనీ దూరం చేస్తుంది. లేదంటే రాత్రుళ్లు నీళ్లు తాగాలనిపించడం, చిరుతిళ్ల మీదకు మనసు మళ్లడం జరుగుతుంది. నిద్ర కూడా దూరమవుతుంది. ఆ సమస్యలకు ఇది చెక్ పెడుతుంది. చివరగా ప్రొటీన్... దీన్ని తీసుకోవడం వల్ల జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లదు. పైగా మెదడుకు కావాల్సిన పోషకాలు అందేలా తద్వారా ఫోకస్ పెరిగేలా చేస్తుంది. ఇన్ని లాభాలు కనిపిస్తున్నాయనే చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే... ఇది ఒక క్రమబద్ధమైన జీవనశైలికి సాయపడుతుంది కానీ దీనితోనే పూర్తి ఆరోగ్యం సాధ్యం కాదు అంటున్నారు నిపుణులు. రోజూ పోషకాహారం తీసుకోవడం, అప్పుడప్పుడూ స్ట్రెంత్ ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్‌లు వంటివాటిపైనా దృష్టిపెట్టాలి అంటున్నారు. కనీసం రోజూ కొనసాగించడానికైతే బాగుంది కదా! ప్రయత్నించకూడదూ?

దసరాకి మువ్వల హారం



పండుగ, పెళ్లి... వంటి సంప్రదాయ వేడుకల్లో ధగధగలాడిపోవాలంటే ఎంచుకున్న దుస్తులకు తగ్గట్లు నగలూ ఉండాలి. అందుకే, ఇలాంటప్పుడు ఎక్కువమంది ఓటేసేది పసిడి ఆభరణాలకే. డైమండ్స్, పోల్కీలు, ముత్యాలు, పచ్చలు... ఇలా ఎన్ని హంగులు చేర్చినా పసిడి మువ్వల అందమే వేరు. అక్కడక్కడా గుత్తుల్లా వేలాడదీసినా, ఒకదానిపక్కన మరొకటి చేర్చి డిజైన్ చేసినా... మెడలో నిండుగా కనిపించడం ఖాయం. అందుకే, ఇప్పుడు అమ్మాయిలంతా సన్నటి గొలుసులు మొదలుకుని కాస్త హెవీగా కనిపించే నెక్లెస్‌ల వరకూ అన్నింటా వీటిని కోరుకుంటున్నారు. తయారీదారులు కూడా గాజులు, చెవిపోగులు, హారాలు... ఇలా అన్నింటిలోనూ వీటిని చేర్చేస్తున్నారు. ఇవి దసరాకి కట్టే పట్టు దుస్తులకూ, రానున్న దీపావళి పండుగల్లో కట్టే వస్త్రాలకు కూడా భలేగా నప్పేస్తాయి. వాటినోసారి మీరూ చూసేయండి. కళ్లను కట్టిపడేస్తాయి.





ఛాంపియన్

ఉత్కంఠభరిత ఆసియా కప్ ఫైనల్లో అద్భుత విజయంతో అభిమానులను ఉర్రూతలూగించింది టీమ్ఇండియా. ఆ టోర్నీ ముగిశాక ఒక్క రోజు విరామంలో సొంతగడ్డపై మెగా క్రికెట్ టోర్నీకి రంగం సిద్ధమైంది. మహిళల వన్డే ప్రపంచకప్‌నకు మంగళవారమే శ్రీకారం. స్వదేశంలో ఆడుతుండడం, ఇటీవలి ప్రదర్శన మెరుగ్గా ఉండడంతో భారత జట్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా రూపంలో హర్మన్‌ప్రీత్ సేన అధిగమించాల్సిన అడ్డంకులూ గట్టివే. మరి రెండుసార్లు ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయిన భారత జట్టు.. ఈసారైనా కథ మారుస్తుందా? కప్పు కోసం సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతుందా?

అమ్మాయ్.. అదరగొట్టేయ్!

మహిళల వన్డే ప్రపంచకప్ నేటి నుంచే

- భారత జట్టుపై భారీ అంచనాలు
- తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో ఢీ

మధ్యాహ్నం 3 నుంచి



ట్రోఫీతో జట్ల కెప్టెన్లు

గువాహటి

మహిళల క్రికెట్లో అత్యున్నత టోర్నీ వన్డే ప్రపంచకప్‌నకు సమయం ఆసన్నమైంది. ఈసారి భారత్ ఆతిథ్యమిస్తున్న టోర్నీ మంగళవారమే గువాహటిలో ఆరంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్.. శ్రీలంకను ఢీకొనబోతోంది. ఈ రెండు జట్లతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ కప్పు కోసం పోటీ పడుతున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో సాగే టోర్నీలో ప్రతి జట్టు.. మిగతా ఏడు జట్లతో ఒక్కో లీగ్ మ్యాచ్ ఆడుతుంది. లీగ్ దశ ముగిసేసరికి టాప్-4 నిలిచే జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ దశ అక్టోబరు 26న ముగుస్తుంది. 29, 30 తేదీల్లో సెమీస్ జరుగుతాయి. ఫైనల్ నవంబరు 2న ఉంటుంది. పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటినీ కొలంబోలో ఆడుతుంది. ఈ ఏడాది ఆరంభంలో పాకిస్థాన్ ఆతిథ్యమిచ్చిన పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీలో తన మ్యాచ్‌లను భారత్ తటస్థ వేదిక యూఏఈలో ఆడింది. అందుకు బదులుగా ఈ టోర్నీ కోసం పాక్ మహిళల జట్టు భారత్‌కు రాలేదు. కొలంబోను వేదికగా ఎంచుకుంది. ఆ జట్టు సెమీస్, ఫైనల్‌కు వస్తే ఆ మ్యాచ్‌లు కూడా కొలంబోలోనే జరగొచ్చు. ఇక తొలి మ్యాచ్‌లో భారత్ స్పష్టమైన ఫేవరెట్‌గా కనిపిస్తోంది. స్మృతి మంధాన, ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ, రిచాలతో భారత బ్యాటింగ్ ఆర్డర్ బలంగా ఉంది. రేణుక సింగ్, దీప్తి, రాధ యాదవ్, అరుంధతి రెడ్డి, శ్రీ చరణిలతో బౌలింగ్‌కూ ఢోకా లేదు. మరోవైపు లంక.. కెప్టెన్ చమరి ఆటపట్టు, ఆల్‌రౌండర్ కవిష్క.. బ్యాటర్లు విష్మి, హర్షిత.. స్పిన్నర్లు సుగంధిక, ఇనోకాలపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది.

వీళ్ల చేతుల్లోనే..

ఈసారి భారత జట్టు బలమైన బృందంతోనే ప్రపంచకప్ వేటకు సిద్ధమైంది. అయితే ఆ బృందంలో కొందరు ఎంతో కీలకం. వారి ప్రదర్శన మీదే జట్టు భవితవ్యం ఆధారపడనుంది. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ భారత్‌కు అత్యంత కీలకం. ఆస్ట్రేలియాపై 400 పైచిలుకు లక్ష్య ఛేదనలో భారత్ దీటుగా స్పందించిందంటే వీరి దూకుడే కారణం. స్మృతి ప్రస్తుతం కెరీర్ ఉత్తమ ఫామ్‌లో ఉంది. మెరుపు ఆరంభాలతో జట్టుకు అదిరే ఆరంభాలందిస్తోంది. ఆమె టోర్నీలో నిలకడగా రాణిస్తే సగం చింత తీరిపోతుంది. ఇక మిడిలార్డర్లో భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టుకు పెద్ద స్కోర్లు సాధించి పెట్టాల్సిన బాధ్యత హర్మన్‌దే. ఆమె అపార అనుభవం జట్టుకు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. మధ్యలో ఫామ్ లేమితో ఇబ్బంది పడ్డా.. ప్రపంచకప్ ముంగిట ఆమె ఊపందుకుంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఇటు బ్యాటుతో, అటు బంతితో కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఆమె కూడా సూపర్ ఫామ్‌లో ఉండడం జట్టుకు కలిసొచ్చే అంశం. బౌలింగ్‌లో కొత్త బంతి బౌలర్ రేణుక సింగ్‌పై జట్టుకు శుభారంభాలందించాల్సిన బాధ్యత ఉంది.



స్మృతి

12

మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా జరిగిన వన్డే ప్రపంచకప్‌లు. రికార్డు స్థాయిలో ఆస్ట్రేలియా ఏడుసార్లు (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022) విజేతగా నిలిచింది. ఇంగ్లాండ్ నాలుగుసార్లు (1973, 1993, 2009, 2017) ఛాంపియన్ కాగా.. న్యూజిలాండ్ ఒకసారి (2000) టైటిల్ నెగ్గింది.

43

ప్రపంచకప్‌లో భారత దిగ్గజ పేసర్ జులన్ గోస్వామి వికెట్లు. ఆమే అగ్రస్థానంలో ఉంది.

1501

మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ డెబ్బీ హాక్లీ పరుగులు. టోర్నీ చరిత్రలో టాప్ స్కోరర్ ఆమే.

వైజాగ్.. కీలకం



ఈసారి మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు తెలుగు అమ్మాయిలు అరుంధతి రెడ్డి, శ్రీచరణిలే కాదు.. తెలుగు వేదిక కూడా కీలకం కానుంది. ప్రపంచకప్ ఆతిథ్య వేదికల్లో విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం కూడా ఒకటి. ఈ మైదానం టోర్నీలో మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. అందులో రెండు భారత జట్టువి. వైజాగ్‌లో అక్టోబరు 9న దక్షిణాఫ్రికాతో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన.. 12న ఆస్ట్రేలియాతో మ్యాచ్ ఆడనుంది. ఆ రెండూ పెద్ద జట్లే. సెమీస్ చేరాలంటే ఈ మ్యాచ్‌ల్లో పైచేయి సాధించడం భారత్‌కు ఎంతో కీలకం. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన సహా పలువురు భారత క్రికెటర్లకు వైజాగ్‌లో ఆడిన అనుభవం ఉంది. ప్రపంచకప్ ముంగిట జట్టంతా విశాఖకు వచ్చి సాధన కూడా చేసింది. కాబట్టి ఇక్కడి పరిస్థితులపై జట్టుకు బాగానే అవగాహన ఉంటుంది. ఈ సానుకూలతతో ప్రత్యర్థులపై జట్టు పైచేయి సాధించి సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంటుందేమో చూడాలి.

అడ్డంకులను అధిగమిస్తారా?

గతంతో పోలిస్తే భారత జట్టుపై ఈసారి ప్రపంచకప్‌లో ఎక్కువ అంచనాలే ఉన్నాయి. హర్మన్‌ప్రీత్ సేన ఇటీవలి ఆటతీరే అందుక్కారణం. ప్రపంచకప్ ముంగిట ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ దీటుగా స్పందించింది. ఆసీస్‌ను ఓ మ్యాచ్‌లో వందకు పైగా పరుగుల తేడాతో ఓడించడంతో పాటు.. 413 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి తుదికంటా పోరాడింది. ఈ ప్రదర్శన చూశాకే.. ప్రపంచకప్‌లో కంగారూ జట్టు ఎదురైనా ఎదుర్కోగలదనే ధీమా వచ్చింది. అయితే ఇలాంటి మెగా టోర్నీలంటే ఆస్ట్రేలియా పురుషుల జట్టు లాగే మహిళలు కూడా చెలరేగిపోతారు. ప్రపంచకప్‌ల్లో వారి రికార్డు చూస్తే ఆ విషయం అర్థమైపోతుంది. అన్ని రంగాల్లో భీకరంగా కనిపిస్తున్న ఆస్ట్రేలియాను ఆపడం భారత్ సహా అన్ని జట్లకూ కష్టమే. ఇక టోర్నీలో ఆస్ట్రేలియా తర్వాత మరో మేటి జట్టు.. ఇంగ్లాండ్. ప్రపంచ మేటి ఆల్‌రౌండర్లలో ఒకరైన నాట్ సీవర్ నేతృత్వంలో ఆ జట్టు ఆల్‌రౌండ్ బలంతో కనిపిస్తోంది. బ్యూమాంట్, డంక్లీ, ఎకిల్‌స్టోన్, బెల్, క్యాప్సీ లాంటి బలమైన క్రికెటర్లు ఆ జట్టు సొంతం. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ కూడా మెరుగైన జట్లే. భారత్ కప్పు గెలవాలంటే ప్రధానంగా వీటి ఎదురయ్యే సవాళ్లను ఛేదించాలి.

రెండుసార్లు చేజారింది.. మరి ఈసారి?

వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల ప్రదర్శన పర్వాలేదు. ఇప్పటిదాకా కప్పు గెలవకపోయినా.. రెండుసార్లు ఫైనల్ చేరింది. 2005లో మిథాలి రాజ్ నేతృత్వంలో తుదిపోరుకు వెళ్లిన భారత్.. ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక 2017లో కప్పు గెలిచేందుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చింది. సెమీస్‌లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్లో ఇంగ్లాండ్ చేతిలో త్రుటిలో ఓటమి పాలైంది. చివరగా 2022లో న్యూజిలాండ్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో భారత్ సెమీస్ కూడా చేరలేదు. మరి ఈసారి ప్రదర్శన ఎలా ఉంటుందో?

మహిళల ప్రపంచకప్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
సెప్టెంబరు		
30	భారత్ × శ్రీలంక	గువాహటి
అక్టోబరు		
1	ఆస్ట్రేలియా × న్యూజిలాండ్	ఇందౌర్
2	బంగ్లాదేశ్ × పాకిస్థాన్	కొలంబో
3	ఇంగ్లాండ్ × దక్షిణాఫ్రికా	గువాహటి
4	శ్రీలంక × ఆస్ట్రేలియా	కొలంబో
5.	భారత్ × పాకిస్థాన్	కొలంబో
6	న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా	ఇందౌర్
7	బంగ్లాదేశ్ × ఇంగ్లాండ్	గువాహటి
8	ఆస్ట్రేలియా × పాకిస్థాన్	కొలంబో
9	భారత్ × దక్షిణాఫ్రికా	విశాఖపట్నం
10	బంగ్లాదేశ్ × న్యూజిలాండ్	గువాహటి
11	శ్రీలంక × ఇంగ్లాండ్	కొలంబో
12	భారత్ × ఆస్ట్రేలియా	విశాఖపట్నం
13	బంగ్లాదేశ్ × దక్షిణాఫ్రికా	విశాఖపట్నం
14	శ్రీలంక × న్యూజిలాండ్	కొలంబో
15	ఇంగ్లాండ్ × పాకిస్థాన్	కొలంబో
16	ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్	విశాఖపట్నం
17	శ్రీలంక × దక్షిణాఫ్రికా	కొలంబో
18	న్యూజిలాండ్ × పాకిస్థాన్	కొలంబో
19	భారత్ × ఇంగ్లాండ్	ఇందౌర్
20	శ్రీలంక × బంగ్లాదేశ్	ముంబయి
21	పాకిస్థాన్ × దక్షిణాఫ్రికా	కొలంబో
22	ఆస్ట్రేలియా × ఇంగ్లాండ్	ఇందౌర్
23	భారత్ × న్యూజిలాండ్	ముంబయి
24	శ్రీలంక × పాకిస్థాన్	కొలంబో
25	ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా	ఇందౌర్
26	ఇంగ్లాండ్ × న్యూజిలాండ్	విశాఖపట్నం
26	భారత్ × బంగ్లాదేశ్	ముంబయి
29	తొలి సెమీఫైనల్	
30	రెండో సెమీఫైనల్	
నవంబరు 2	ఫైనల్	

అక్టోబరు 26న ఇంగ్లాండ్, న్యూజిలాండ్ పోరు (ఉదయం 11కు) మినహా మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 3 గ.లకు ఆరంభమవుతాయి.

ట్రోఫీ ఎక్కడ?

భారత్ చేతికి రాని ఆసియా కప్

- తనతో పాటు పట్టుకుపోయిన నఖ్వీ
- ఫైనల్ అనంతరం డ్రామా.. మండిపడ్డ బీసీసీఐ

టీమ్ఇండియా ఆసియాకప్ గెలిచిన అనంతరం దుబాయ్ స్టేడియంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఏసీసీ ఛైర్మన్ నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకోవడానికి టీమ్ఇండియా తిరస్కరించగా.. అతడు మరే విధంగానూ అది భారత్‌కు అందకుండా చేశాడు. నఖ్వీ ట్రోఫీతో పాటు భారత ఆటగాళ్లకు దక్కాల్సిన విజేత పతకాలను కూడా తనతో పట్టుకెళ్లిపోయాడు. దీనిపై ఆగ్రహించిన బీసీసీఐ.. అతడిపై చర్యల కోసం ఐసీసీ సంప్రదించాలని నిర్ణయించింది.



కప్పు లేకుండా భారత జట్టు సంబరాలు

దుబాయ్

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆసియాకప్ ఆరంభం నుంచి భారత క్రికెటర్లు.. పాకిస్థాన్ ఆటగాళ్లతో స్నేహభావాన్ని ప్రదర్శించకపోవడం, వాళ్లతో కరచాలనానికి తిరస్కరించడం తెలిసిందే. ఆసియాకప్ గెలిచిన అనంతరం కూడా అదే వైఖరిని కొనసాగించిన టీమ్ఇండియా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఛైర్మన్ మోసిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకోవడానికి నిరాకరించింది. నఖ్వీ పాకిస్థాన్ మంత్రి, ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ కూడా. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలూ చేశాడు. పహల్గాం ఉగ్రదాడి బాధితులకు సంఘీభావాన్ని తెలిపిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పాక్ ఫిర్యాదు చేయడం వెనుక అతడు ఉన్నాడు. ఇప్పుడు నఖ్వీ తన స్థాయికి తగని విధంగా వ్యవహరించాడు. తనతో పాటు ట్రోఫీని, భారత ఆటగాళ్లకు దక్కాల్సిన పతకాలను తీసుకుని మైదానాన్ని వీడడంతో.. భారత ఆటగాళ్లు బహుమతి లేకుండా సంబరాలు చేసుకోవాల్సి వచ్చింది.

అసలేమైంది?

టీమ్ఇండియా ఆసియాకప్ గెలిచిన అనంతరం స్టేడియంలో గంటన్నర పాటు గందరగోళం చెలరేగింది. నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకోవడానికి భారత జట్టు తిరస్కరించగా.. తానే ఇస్తానని అతడు పట్టుబట్టాడు. నఖ్వీ నుంచి భారత జట్టు ట్రోఫీని అందుకోదని బీసీసీఐ అప్పటికే ఏసీసీకి తెలిపినట్లు సమాచారం. బహుమతి ప్రదాన కార్యక్రమం ఆలస్యం కాగా.. తొలి గంటలో పాకిస్థాన్ ఆటగాళ్లెవరూ మైదానానికి రాలేదు. అప్పటికే మైదానంలో ఉన్న భారత జట్టు.. నఖ్వీ తప్ప వేదిక మీద ఉన్న ఎవరి నుంచైనా ట్రోఫీ తీసుకోవడానికి సుముఖతను వ్యక్తం చేసింది. ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు వైస్ ఛైర్మన్ ఖాలిద్ జరూని ట్రోఫీని అందిస్తారని భావించారు. కానీ నఖ్వీ వేదిక మీద ఉన్నంతవరకు భారత ఆటగాళ్లు అక్కడికి వెళ్లరని బీసీసీఐ స్పష్టం చేయగా.. వేదిక నుంచి వెళ్లిపోవడానికి అతడు తిరస్కరించాడు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రెజెంటర్ సైమన్ డౌల్.. స్పాన్సర్లు ఇచ్చే వ్యక్తిగత అవార్డులను ప్రకటించాడు. విలువైన ఆటగాడిగా కుల్‌దీప్, విలువైన ఇన్నింగ్స్‌కు దూబె అవార్డులు అందుకున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా తిలక్, 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా అభిషేక్ పురస్కారాలు తీసుకున్నారు. తర్వాత పాకిస్థాన్ ఆటగాళ్లు తమ బహుమతులను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు (బీసీబీ) అమినుల్ ఇస్లామ్ నుంచి అందుకున్నారు. ఆ తర్వాత డౌల్.. "భారత క్రికెట్ జట్టు తన అవార్డులను అందుకోవట్లేదని ఏసీసీ నాకు సమాచారమిచ్చింది. కాబట్టి ఈ కార్యక్రమం ముగిసింది" అని ప్రకటించాడు. ఆ తర్వాత నఖ్వీ పోడియం నుంచి దిగిపోయాడు. ఏసీసీ ఈవెంట్ సిబ్బంది సహా అందరినీ ఆశ్చర్యపరుస్తూ తన వెంట ట్రోఫీని తీసుకెళ్లిపోయాడు.

నఖ్వీని తప్పించేలా..

ఆసియా కప్‌ను నఖ్వీ తన వెంట తీసుకెళ్లడంపై బీసీసీఐ సీరియస్‌గా ఉంది. ఐసీసీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లనుంది. ఏసీసీ అధ్యక్ష పదవి నుంచి అతణ్ని తప్పించడానికి భారత బోర్డు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. "నఖ్వీ నుంచి ట్రోఫీ అందుకోవడానికి మేం తిరస్కరించాం. ఎందుకంటే పాకిస్థాన్‌లో ముఖ్య నాయకుల్లో అతడొకడు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడు. మేం తిరస్కరించామంటే దానర్థం.. ట్రోఫీతోపాటు పతకాలను తనతో తీసుకెళ్లమని కాదు. అతడలా చేయడం దురదృష్టకరం. నఖ్వీ వీలైనంత త్వరగా ట్రోఫీ, పతకాలు తిరిగిస్తాడని భావిస్తున్నాం" అని సైకియా చెప్పాడు. "నఖ్వీ ఇలా చేస్తాడని ఊహించలేదు. అతడిది పిల్ల చేష్ట. నవంబరు మొదటి వారంలో జరిగే సమావేశంలో ఐసీసీకి ఫిర్యాదు చేస్తాం" అని అన్నాడు.

ట్రోఫీ లేకున్నా.. ఉన్నట్లు!

పాకిస్థాన్ ఆటగాళ్లు రన్నరప్ పతకాలు అందుకుంటున్న సమయంలో కాస్త దూరంలో భారత క్రికెటర్లు కింద పడుకుని ముచ్చట్లు చెప్పుకుంటూ సరదాగా కనిపించారు. బహుమతి ప్రదాన వేడుక ముగిసినట్లు డౌల్ ప్రకటించాక.. టీమ్ఇండియా భిన్న రీతిలో సంబరాలు చేసుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కప్పు పట్టుకుని వస్తున్నట్లు అభినయించగా.. మిగతా జట్టు దాన్ని అందుకుంటున్నట్లు నటించింది. ఆ తర్వాత అందరూ కప్పును పైకెత్తినట్లుగా చేతులు పైకెత్తి సంబరాలు చేసుకున్నారు. అప్పుడే నిర్వాహకులు బాణసంచా వెలుగులతో సహకారం అందించారు. మరోవైపు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి హోటల్లో తన పడకపై టీ కప్పునే ఆసియా కప్‌లా పట్టుకున్నట్లు పోజిచ్చాడు. ఇక ఫైనల్లో శాంసన్‌ను ఔట్ చేసినపుడు పాక్ స్పిన్నర్ అబ్రార్ తల తిప్పుతూ సంబరాలు చేసుకోగా.. మ్యాచ్ అనంతరం హర్షిత్, అర్ష్‌దీప్, జితేశ్ అతణ్ని అనుకరిస్తూ కౌంటర్ ఇచ్చారు.

సూర్య క్రికెట్‌ను అవమానించాడు



సల్మాన్ ఆఘా

దుబాయ్: ఆసియాకప్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకపోవడం, ఫైనల్లో గెలిచాక ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ అందుకోకపోవడం లాంటి చర్యలతో భారత జట్టు క్రికెట్‌ను అవమానించిందని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా అన్నాడు. "ఆసియా కప్‌లో భారత్ ప్రవర్తన నిరాశపరిచింది. మాతో కరచాలనం చేయకపోవడం క్రికెట్‌కే అవమానం. మెరుగైన జట్లు ఇలా చేయవు. టోర్నీ ఆరంభానికి ముందు విలేకరుల సమావేశంలో సూర్య నాతో కరచాలనం చేశాడు. తర్వాత ఎవరి ఆదేశాలనో అనుసరిస్తూ ప్రవర్తించాడు. విజేతలకు ఏసీసీ అధ్యక్షుడు ట్రోఫీ ఇవ్వడం ఆనవాయితీ. అతడి నుంచి ట్రోఫీ అందుకోకపోతే మీకు అదెలా వస్తుంది" అని ఆఘా అన్నాడు.

చెక్కు విసిరేసి..: ఆసియాకప్ బహుమతి ప్రదానోత్సవంలో పాక్ కెప్టెన్ ఆఘా అసహనాన్ని ప్రదర్శించాడు. ఆఘాకు రన్నరప్ ట్రోఫీతో పాటు రూ.66.75 లక్షల చెక్‌ను అందించారు. దాన్ని అతడు పక్కకు విసిరేశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతోంది.

మా జట్టే నా ట్రోఫీ



సూర్యకుమార్

దుబాయ్: తనకు తెలిసి విజేతగా నిలిచిన జట్టు ట్రోఫీని తీసుకోకపోవడం ఇదే తొలిసారని.. కానీ తన జట్టే తనకు పెద్ద ట్రోఫీ అని భారత టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. "నేను క్రికెట్ ఆడడం మొదలుపెట్టిన నాటి నుంచి ఛాంపియన్ జట్టు ట్రోఫీ స్వీకరించకపోవడం ఇదే తొలిసారి అనుకుంటున్నా. ఎంతో కష్టపడితేనే కప్ వస్తుంది. వరుస విజయాలతో విజేతగా నిలిచాం. కప్ మాత్రమే తీసుకోలేకపోయాం. నావరకు అయితే మా జట్టే నాకు అసలైన ట్రోఫీ" అని సూర్య పేర్కొన్నాడు. 'ట్రోఫీ తీసుకోం అని బీసీసీఐ ముందే ఏసీసీకి ఈమెయిల్ పంపిందా' అని ఒక పాకిస్థాన్ జర్నలిస్ట్ సూర్యను ప్రశ్నించగా.. "ఏ ఈమెయిల్ గురించి నాకు తెలియదు. నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకోకూడదని అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాం. ఇలా చేయమని మాకెవరూ చెప్పలేదు. మా ట్రోఫీ కోసం ఇప్పటికీ ఎదురు చూస్తున్నాం" అని సూర్య చెప్పాడు.

మ్యాచ్ ఫీజు పహల్గాం బాధితులకు..: భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన ఆసియా కప్ మ్యాచ్ ఫీజులను పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు, సైనిక సిబ్బందికి అందజేయాలని నిర్ణయించుకున్నాడు. "నా మ్యాచ్ ఫీజు మొత్తాన్ని పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనిక సిబ్బందికి అందజేయాలనుకుంటున్నా. మీరెప్పుడూ నా మనసులో ఉంటారు.. జైహింద్" అని సూర్య 'ఎక్స్'లో పేర్కొన్నాడు. ఆసియాకప్‌లో 7 మ్యాచ్‌లు ఆడడం ద్వారా సూర్యకు రూ.28 లక్షలు లభించనున్నాయి. మరోవైపు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా కూడా సూర్యను అనుకరించాడు. ఆసియాకప్ ద్వారా వచ్చిన మ్యాచ్ ఫీజుల మొత్తాన్ని ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన వారి కుటుంబాలకు అందజేస్తామని చెప్పడం గమనార్హం.

ముకేశ్‌కు రజతం

జూనియర్ ప్రపంచ షూటింగ్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు క్లీన్‌స్వీప్ చేశారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో మూడు పతకాల్ని భారత క్రీడాకారులు గెలుచుకున్నారు. ఒజస్వి ఠాకూర్ (252.7 పాయింట్లు) స్వర్ణం, హృద్యశ్రీ కొండూరు (250.2) రజతం, శాంభవి క్షీరసాగర్ (229.4) కాంస్యం కైవసం చేసుకున్నారు. పురుషుల 25 మీ ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో తెలుగు కుర్రాడు ముకేశ్ నేలవల్లి రజతం, సూరజ్ కాంస్యం గెలుపొందారు. 10 మీ ఎయిర్ రైఫిల్‌లో హిమాంశు 250.9 పాయింట్లతో హిమాంశు బంగారు పతకం సాధించాడు. పిమెనోవ్ (249.9) రజతం, అభినవ్ షా (228.4) కాంస్యం నెగ్గారు.

టాప్ సీడ్‌కు బోపన్న జోడీ షాక్

టోక్యో: జపాన్ ఓపెన్‌లో భారత అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న.. తకెరు యుజుకి (జపాన్)తో కలిసి సత్తా చాటాడు. సోమవారం ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో బోపన్న- యుజుకి జోడీ 4-6, 6-3, 18-16తో టాప్ సీడ్ క్రిస్టియన్ హారిసన్- ఇవాన్ కింగ్ (అమెరికా) జంటపై విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది.





ఆసియాకప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన యువ బ్యాటర్ తిలక్ వర్మ సోమవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నాడు. శంషాబాద్ విమానాశ్రయంలో అభిమానులు అతడికి ఘన స్వాగతం పలికారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి తిలక్‌ను కలిసి అభినందనలు తెలిపారు.
– శంషాబాద్, న్యూస్‌టుడే

ఆటకు క్రిస్ వోక్స్ వీడ్కోలు



వోక్స్

లండన్: ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గత వారం యాషెస్ సిరీస్‌కు ఎంపిక చేసిన ఇంగ్లాండ్ జట్టులో చోటు దక్కకపోవడంతో 36 ఏళ్ల వోక్స్ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లాండ్ తరఫున 15 ఏళ్ల కెరీర్‌లో వోక్స్ 62 టెస్టుల్లో 2,034 పరుగులు చేసి.. 192 వికెట్లు పడగొట్టాడు. 122 వన్డేల్లో 1,524.. 33 టీ20ల్లో 147 పరుగులు సాధించాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 204 వికెట్లు తీసుకున్నాడు. సొంతగడ్డపై 2019 వన్డే ప్రపంచకప్, ఆస్ట్రేలియాలో 2022 టీ20 వరల్డ్‌కప్ గెలుచుకున్న ఇంగ్లాండ్ జట్టులో వోక్స్ సభ్యుడు.

భారత జట్టుకు రూ.21 కోట్ల ప్రైజ్‌మనీ

ముంబయి: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను మట్టికరిపించి ఆసియాకప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ రూ.21 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. "ఇదో అద్భుత విజయం. పాక్‌ను ఓడించి భారత్ ఆసియాకప్ గెలిచిన సందర్భంగా ఆటగాళ్లకు, సహాయక సిబ్బందికి రూ.21 కోట్ల నగదు బహుమతి ఇస్తున్నాం. టీమ్ఇండియా విజయానికి ఎంతో గర్విస్తున్నాం" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. "మూడు దెబ్బలు.. సున్నా స్పందన. ఆసియాకప్ ఛాంపియన్లు అయ్యాం. మా సందేశం ఇచ్చాం" అని బీసీసీఐ ట్వీట్ చేసింది.



ప్రయాణికులకు కాఫీ అందించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో శ్రీనివాస్, శరద్‌కుమార్ తదితరులు

విమానాశ్రయాల్లో రూ. 10కే కాఫీ

- దేశవ్యాప్తంగా ఉడాన్ యాత్రి కేఫ్‌లు
- విజయవాడ విమానాశ్రయంలో ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.10కే కాఫీ, రూ.10కే మంచినీటి సీసా, రూ.20కే సమోసా లేదా స్వీటు.. విమానాశ్రయంలో అందునా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ ధరలను ఊహించగలమా? త్వరలో దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లోనూ ఈ ధరలకు కాఫీ, మంచినీరు, సమోసా, స్వీట్లు వంటివి అందించే 'ఉడాన్ యాత్రి కేఫ్'లను ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. సోమవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉడాన్ యాత్రి కేఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే పలు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. త్వరలో విజయవాడలో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌ను ప్రారంభిస్తామని, విజయవాడ నుంచి సింగపూర్, హైదరాబాద్ నుంచి డాలస్‌కు నేరుగా ప్రత్యేక విమానాలు నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అహ్మదాబాద్, వారణాసి, కొచ్చి, పుణెలకు విజయవాడ నుంచి నేరుగా స్వదేశీ సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఏఏఐ బోర్డు సభ్యులు శ్రీనివాస్, శరద్‌కుమార్, డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సభ్యులు పొట్లూరి బసవరావు, ముప్పా రాజా, బండి విజయ్, ఏఏఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనిత కాన్వాయ్ అడ్డగింత



రాజయ్యపేట వద్ద వాహనం నుంచి మత్స్యకారులతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులు హోంమంత్రి అనిత కాన్వాయ్‌ని అడ్డగించారు. ఇక్కడ జరుగుతున్న బల్క్‌డ్రగ్ పార్కు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ వీరంతా 2 వారాలుగా ఆందోళన చేస్తున్నారు. దీనిపై చర్చించేందుకు మంత్రి ఈ గ్రామానికి సోమవారం వచ్చారు. 'మీరంతా నన్ను ఆదరించారు. మీకు న్యాయం చేస్తా.. కమిటీగా ఏర్పడితే సీఎం, డిప్యూటీ సీఎంల వద్దకు తీసుకెళ్లి మాట్లాడిస్తా..మీకు అండగా ఉంటా' అని హామీ ఇచ్చి హోంమంత్రి వెనుదిరిగారు. ఈ సమావేశానికి వచ్చిన నాయకుల్లో కొందరు దీన్ని వ్యతిరేకిస్తూ, తక్షణం న్యాయం చేయాలని నినాదాలు చేయడంతో స్థానికులు రెచ్చిపోయారు. వీరంతా రోడ్డెక్కి మంత్రి కాన్వాయ్‌ని అడ్డగించారు. రోప్ పార్టీ పోలీసుల నుంచి కొందరు తాళ్లను లాక్కుని వెళ్లిపోయారు. రోడ్లపై చెట్లను వేసి, పోలీసు వాహనాలకు అడ్డుగా కూర్చున్నారు. మంత్రి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిని నియంత్రించే క్రమంలో పోలీసులు, మత్స్యకారుల మధ్య తోపులాట జరిగింది. సమస్యకు పరిష్కారం లభించే వరకు పనులు ఆపాలని మత్స్యకార నాయకులు కోరగా, ఇందుకు మంత్రి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



మీ సన్నిహితుల్లో ఈ గుణాలున్నాయా?

1. మిమ్మల్ని ఒత్తిడికి గురిచేసేవారు కాకుండా, మీ మానసిక ప్రశాంతతకు కారణమయ్యేవారు.
2. అదేపనిగా విమర్శిస్తూ మీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా, మీ ఎదుగుదలను కాంక్షిస్తూ మిమ్మల్ని ప్రోత్సహించేవారు.
3. మీ విజయాల పట్ల అసూయ చెందకుండా, వాటిని తమ గెలుపుగా భావించి ఆనందించేవారు.

ఈ గుణాలున్నవారినే మీ సన్నిహితులుగా భావించండి. మిగిలినవారికి దూరంగా ఉండండి.

– నికోలస్ కోల్, కంటెంట్ డెవలపర్

మృతుల పేర్ల మీదే 3.91 లక్షల పట్టాలు

- వారసుల పేర్లతో బదిలీకాని వైనం
- రిజిస్ట్రేషన్ రుసుము భరించలేక ముందుకు రాని వారసులు
- రూ.100కే వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్
- త్వరితగతిన అమలైతే లక్షలమందికి ప్రయోజనం

ఈనాడు – అమరావతి: రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో 3.91 లక్షల మంది జీవించి లేరు. వెబ్‌ల్యాండ్‌లోని మొత్తం పట్టాదారుల సంఖ్యలో ఇది 4.58%. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 6.92%, అన్నమయ్య 6.69%, చిత్తూరు, అంబేడ్కర్ కోనసీమల్లో 6.44% చొప్పున, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో 6.15% చొప్పున మరణించిన పట్టాదారుల పేర్లే వెబ్‌ల్యాండ్‌లో ఉన్నాయి. వారు కాలం చేసి ఏళ్లు గడిచిపోతున్నా ఆ భూములు ఇప్పటికీ వారసుల పేర్లతో బదిలీ కాలేదు. ఆటోమ్యుటేషన్ చేయాలంటే న్యాయ సంబంధ సమస్యలున్నాయి. ఈ భూములన్నీ వారసుల అనుభవంలోనే ఉన్నా తమ పేర్లతో బదిలీ కాకపోవడంతో పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదు. దీంతో వారు పంట రుణాలకు, సంక్షేమ పథకాలకూ దూరమవుతున్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లో తక్కువ మొత్తానికే చేయాలని, స్టాంపు రుసుము తగ్గించాలని సీఎం ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు.

రుసుము భరించలేక.. వాటాల సమస్యలు తేలక

■ కుటుంబ పెద్ద చనిపోయాక వారసులు ఆస్తిని భాగపంపిణీ చేసుకుంటారు. తెల్ల కాగితంపైన కొందరు, స్టాంపు పత్రాలపై మరికొందరు హద్దులతో సహా రాసుకుంటున్నారు. అవి చెల్లవని, రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

■ ప్రస్తుతం వీటికి 1% స్టాంపు రుసుము చెల్లించాల్సి వస్తోంది. దశాబ్దాలుగా తమ వద్దే ఉన్న భూములకు మళ్లీ స్టాంపు రుసుము చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవడమేంటన్నది వారసుల ప్రశ్న.

■ వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ల సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి గతేడాది ఏకంగా 55 వేల ఫిర్యాదులు అందాయి.

■ కుటుంబసభ్యుల మధ్య భాగ పంపిణీ తేలక కొందరు వారసులు భూముల్ని బదిలీ చేయించుకోలేకపోతున్నారు. పేర్ల మార్పునకు తొందరేముంది మరి కొందరు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ వారసుల పేర్లతో బదిలీ అయితేనే రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ కొలిక్కి వస్తుంది.

రూ.10 లక్షల్లోపు ఆస్తికి రూ.100 స్టాంపు రుసుము

చనిపోయిన పట్టాదారుల పేర్లు అధిక సంఖ్యలో ఉండటంతో వారసత్వ రిజిస్ట్రేషన్లపై సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆస్తి విలువ రూ.10 లక్షల్లోపు ఉంటే రూ.100, రూ.10 లక్షల పైబడితే రూ.1,000 స్టాంపు రుసుముగా కట్టించుకుని రిజిస్టర్ చేయాలని నిర్ణయించారు. అయితే అదింకా కొలిక్కి రాలేదు.

సచివాలయాల్లోనా? సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనా?

గ్రామ సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే అక్కడ సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు కంప్యూటర్, ఇతర పరికరాలు సమకూర్చాలి. అంత ఖర్చు పెట్టినా ఒక్కో సచివాలయానికి వారానికి ఒకటికి మించి రాదనేది రెవెన్యూ వర్గాల అభిప్రాయం. పైగా వారు రిజిస్ట్రేషన్ చేసినా మళ్లీ సబ్ రిజిస్ట్రార్ ఆమోదించాల్సిందే. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అయితే నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే విషయమై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు ప్రభుత్వం నామమాత్రపు రుసుముతో రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు కల్పించినా అక్కడ అదనపు బాదుడు ఉంటుందని రైతులు అంటున్నారు.

రాష్ట్రంలో మొత్తం పట్టాదారులు **85,41,002**

ఇందులో చనిపోయినవారు **3,91,405**

వెబ్‌ల్యాండ్‌లో మృతుల పేర్లు ఎక్కువగా ఉన్న జిల్లాలు

జిల్లా	మృతుల పేర్లపై ఉన్నవి
విజయనగరం	26,708
ప్రకాశం	26,625
శ్రీకాకుళం	25,946
చిత్తూరు	22,849
అన్నమయ్య	21,522
అంబేడ్కర్ కోనసీమ	20,745

కళారాలతో దసరా కళకళ



దసరా సందర్భంగా ఒంగోలులో నిర్వహించే కళారాల ఉత్సవాలకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. పంచలోహాలతో వైవిధ్యంగా తీర్చిదిద్దిన ఆరు దేవతామూర్తుల రూపాలనే కళారాలుగా వ్యవహరిస్తారు. కనకదుర్గ, కాళిక, బాల త్రిపురసుందరీదేవి, పార్వతీదేవి, మహిషాసుర మర్దని, నరసింహస్వామి ఆలయాల్లో పూజలందుకునే ఈ కళారాలను దుర్గాష్టమి, మహర్నవమి రోజుల్లో ఊరేగింపు కోసం బయటకు తెస్తారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వేల మంది భక్తుల మధ్య శోభాయాత్ర కనులపండువగా సాగుతుంది. కోల్‌కతా, మైసూరు తరహాలో ఇక్కడ కూడా ఈ సంస్కృతి కొనసాగుతుండటం విశేషం. – ఈనాడు, ఒంగోలు

నేడు దిల్లీకి సీఎం చంద్రబాబు

విశాఖ సదస్సుకు పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్తున్నారు. ఉదయం 10.15 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు అక్కడికి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా నవంబరు 14, 15 తేదీల్లో సీఐఐతో కలిసి విశాఖలో నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఐఐ కౌన్సిల్ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. అలాగే కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌తో సీఎం భేటీ అవుతారు. రాత్రి దిల్లీలోనే బస చేస్తారు.

1న దత్తి గ్రామంలో 'పేదల సేవలో'

చంద్రబాబు బుధవారం ఉదయం దిల్లీ నుంచి విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గంలోని దత్తి గ్రామానికి వెళతారు. అక్కడ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.40 గంటలకు పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం అమరావతి చేరుకుంటారు.

బతుకమ్మకు రెండు గిన్నిస్ రికార్డులు

- తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వేడుకలు



మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావుకు ధ్రువపత్రం అందిస్తున్న గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్– సరూర్‌నగర్, న్యూస్‌టుడే: "ఒక్కేసి పువ్వేసి చందమామ.." అంటూ అతివలు ఆడిపాడిన బతుకమ్మ వేడుక గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 63 అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పు, ఏడు టన్నుల పుష్పాలతో ఏర్పాటు చేసిన 'భారీ బతుకమ్మ'తో పాటు.. 1,354 మంది అతివలు భారీ బతుకమ్మ చుట్టూ చేరి లయబద్ధంగా ఆడినందుకు 'అతిపెద్ద జానపద నృత్యానికి' రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు దక్కాయి. దీనికి సంబంధించిన వివరాలను గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు వెల్లడించారు. ఆయా ధ్రువపత్రాలను మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్కకు అందజేశారు.

సందడి చేసిన ప్రపంచ సుందరి

వేడుకలకు ప్రపంచ సుందరి ఓపల్ సుచాతతో పాటు, కాంటినెంటల్ డెలిగేట్స్ పాల్గొన్నారు. భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా దుస్తులు ధరించి సందడి చేశారు. మంత్రులు, ఇతర మహిళా ప్రజాప్రతినిధులతో చుట్టూ చేరి బతుకమ్మ ఆడి ఉత్సాహపరిచారు.



సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బతుకమ్మ ముందు ఆడుతున్న మహిళలు

తమ్ముడు తిలక్ బహుమతి.. నాకు ప్రత్యేకం: లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉపయోగించిన క్యాప్‌ను తనకు బహుమతిగా ఇస్తానని భారత క్రికెటర్ తిలక్‌వర్మ ప్రకటించడంపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ''తమ్ముడు తిలక్‌వర్మ బహుమతి నాకు ప్రత్యేకమైంది. స్వదేశానికి తిరిగొచ్చాక అతడి చేతుల మీదుగా ఆ క్యాప్ తీసుకుంటా'' అని ఎక్స్‌లో లోకేశ్ పోస్టు చేశారు. 'డియర్ లోకేశ్ అన్న' అని క్యాప్‌పై తిలక్‌వర్మ సంతకం చేస్తున్న వీడియోను పోస్టుకు జత చేశారు.

చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం రాకుండా అడ్డుకోవడం దారుణం: పిల్లి మాణిక్యరావు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో హత్యకు గురైన చంద్రయ్య కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని చూస్తే.. శాసనమండలిలో దాన్ని వైకాపా అడ్డుకోవడం దారుణమని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ''మండలిలో అందుకు సంబంధించిన బిల్లును వ్యతిరేకించడం వెనక వైకాపా అధినేత జగన్ ఉన్నారా? పిన్నెల్లి సోదరులు ఉన్నారా? బొత్స సత్యనారాయణ చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్ని వేధించే లక్షణం వైకాపా వాళ్లకు ఇంకా పోలేదు'' అని దుయ్యబట్టారు.

జీఎస్టీ ఫలాలు ఇంటింటికీ అందాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు



కేబినెట్ సబ్ కమిటీతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో సీఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: 'సూపర్ జీఎస్టీ ఫలాలు ఇంటింటికీ అందాలి. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఏ రంగాల్లో ఎంత మేలు జరుగుతోందన్నది స్పష్టంగా అర్థమయ్యేలా ప్రచారం చేయాలి. రైతులకు అవగాహన కల్పించేలా ట్రాక్టర్ ర్యాలీలు, యంత్రాల ప్రదర్శనలు చేపట్టాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి..ఒక జిల్లా ఒక ఉత్పత్తి పేరిట మేళాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో తయారయ్యే ఉత్పత్తులు, అందుకు సంబంధించిన పన్నుల తగ్గింపుపై ప్రచారం నిర్వహించేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. జీఎస్టీ తగ్గింపు వల్ల సెల్యూన్లు, యోగా సెంటర్లు, వ్యాయామశాలల్లో ధరల్లో ఎంత వ్యత్యాసం వచ్చిందో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలు ప్రజలకు అర్థమయ్యేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ కార్యాలయాల వద్ద సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జీఎస్టీ 2.0పై ఏర్పాటైన మంత్రివర్గ ఉపకమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు.

65 వేల కార్యక్రమాల నిర్వహణ

జీఎస్టీ శ్లాబుల తగ్గింపు వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజలకు చెప్పేందుకు 65 వేల కార్యక్రమాలు చేపడతారు. వేర్వేరు థీమ్‌లతో అక్టోబరు 19 వరకు ప్రచారం ఉంటుంది. విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్రంలోని 7 వేల ఉన్నత పాఠశాలలు, 4 వేల జూనియర్ కళాశాలల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. జీవిత, ఆరోగ్య బీమాలకు జీఎస్టీ లేని అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేలా కార్యక్రమాలు రూపొందించాలని నిర్ణయించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించి ధరలపై అవగాహన కల్పించేందుకు ఉత్పత్తిదారులు, డీలర్లతో జిల్లా, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సుమారు 850 చోట్ల కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వదేశీ ఉత్పత్తులకు సంబంధించి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తారు. అక్టోబరు 18 నాటికి మొత్తం ప్రచారం ముగించి 19న జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, అదే సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు నిర్వహించాలని నిర్ణయించారు.

సేవకు ప్రతిరూపాలు

- వైవిధ్య వేషధారణలతో విరాళాల సేకరణ
- నిరుపేదకు ఇంటి నిర్మాణం కోసం యువ బృందం వినూత్న యత్నం

ఈనాడు, బెంగళూరు: శ్రీకృష్ణుడికి ఇష్టమైన అష్టమి రోజుల్లో కర్ణాటకలోని ఉడుపిలో.. కొందరు వివిధ వేషధారణల్లో వీధుల వెంట తిరుగుతూ విరాళాలు సేకరించే సంస్కృతి అందరినీ ఆకర్షిస్తోంది. ఇది పలువురు పేదలకు ప్రయోజనకారిగా మారింది. ఈ విధానాన్ని ఎక్కువ మంది తమ పొట్టకూటి కోసం ఉపయోగించుకుంటుంటే. . కొందరు మాత్రం దేవాలయాలు, బడులు, ఆసుపత్రుల కోసం విరాళాలు సేకరిస్తున్నారు. షట్టర్ బాక్స్ యూట్యూబ్ ఛానెల్ నిర్వాహకులు, తుళు చిత్ర రంగ ఛాయాగ్రాహకులు సచిన్ శెట్టి తన మిత్రులతో కలిసి 'అష్టమి' సంస్కృతిని సేవకు వినియోగిస్తున్నారు. 'షట్టర్ బాక్స్ ఫిల్మ్ హెల్పింగ్ హ్యాండ్స్' పేరిట 30 మంది స్నేహితులు.. సినిమాలు, రంగస్థల నాటికల్లోని పాత్రలు, తుళు సంస్కృతిలోని దేవతల వేషాలను వేసుకుని.. వీధులు, దుకాణాలు, ఇళ్ల వెంట తిరిగి విరాళాలు సేకరించారు. కార్కళలోని పళ్లియ గ్రామానికి చెందిన దైవ నర్తకులు, జానపద కళాకారుల కోసం ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఈ విరాళాల సేకరణకు పూనుకున్నారు.



షట్టర్‌బాక్స్ బృందం సభ్యులు



వేషధారణలో చేపలు విక్రయిస్తున్న సచిన్ శెట్టి



'పుష్ప' వేషంలో విరాళాల వేట

రూ.15 లక్షలతో...

పళ్లియ గ్రామంలో 95 ఏళ్ల మాయవ్వ దైవ నర్తకులకు సహాయకురాలిగా, జానపద కళాకారిణిగా ఎన్నో ప్రదర్శనలిచ్చారు. ప్రభుత్వ పింఛనుతోనే వృద్ధాప్యంలో బతుకీడుస్తున్న ఆమె చిన్న గుడిసెలో నివసిస్తున్నారు. మాయవ్వకు ఇల్లు నిర్మించాలని సచిన్ శెట్టి బృందం నిర్ణయించింది. 2 రోజుల పాటు బృంద సభ్యులు ఇల్లిల్లూ తిరిగి రూ.15 లక్షల విరాళాలు సేకరించారు. ఆ డబ్బుతో 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకంటే ముందు పేద కళాకారిణికి ఇల్లు నిర్మిస్తున్నట్లు తమ యూట్యూబ్ ఛానెల్‌లో ప్రచారం చేసిన సభ్యులు.. దాతల నుంచి మరో రూ.5 లక్షలు సమీకరించారు. వాటినీ ఇంటి నిర్మాణానికే వెచ్చించనున్నారు. కరోనా సమయంలో ఆహార కిట్లు అందించిన హెల్పింగ్ హ్యాండ్స్ బృందం.. 2022లో రూ.10.5 లక్షలు సేకరించి గుండె జబ్బుతో బాధపడుతున్న ఓ చిన్నారికి శస్త్రచికిత్స చేయించింది. ఆ తర్వాతి ఏడాది 'హొసబెళకు' అనే ఆశ్రమం కోసం స్థలాన్ని అందించేందుకు వేషాలు ధరించి విరాళాలు పోగుచేసింది. 'మేమంతా మా వృత్తులతో జీవన సాగిస్తున్నాం. ఏటా రెండు, మూడు రోజులు ఇతరుల కోసం శ్రమిస్తామంతే. మేం ధరించే వేషాలు.. పేదల బతుకులకు ఆసరాగా మారుతున్నాయంటే అంతకు మించిన సంతోషం ఏముంది?' అంటున్నారు సచిన్ శెట్టి. హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా యూట్యూబ్‌లో ఏడాదంతా సామాజిక సేవ కోసమే వీడియోలు చేస్తున్నట్లు తెలిపారు.



పేద కళాకారిణి మాయవ్వ ఇంటిని సందర్శించిన సచిన్ బృందం

కంటెయినర్ పోలీస్ బూత్



ఇదేదో రెస్టారెంట్, రిసార్టో అనుకుంటే పొరపాటే. యానాంలోని గౌతమి గోదావరి నదీ తీరాన పుదుచ్చేరి పోలీసులు ఏర్పాటుచేసిన ఎకో ఫ్రెండ్లీ బూత్ ఇది. యానాంలోని గోదావరి తీరానికి ఎక్కువ మంది పర్యాటకులు వస్తుంటారు. కొంతమంది తెలియక నదిలో దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. వారి రక్షణ కోసం నదీ తీరంలోని నడక మార్గంలో ఓ కంటెయినర్ పోలీస్ బూత్‌ను ఏర్పాటు చేశారు. పర్యాటక ప్రాంతం కావడంతో స్నేహపూర్వకంగా కనిపించేలా ప్రత్యేక అలంకరణ చేశారు. కంటెయినర్‌పై గడ్డి వేసి చుట్టూ పచ్చని మొక్కలు పెంచి, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. – ఈనాడు, కాకినాడ

స్త్రీనిధి వాయిదా... ఇక నేరుగా కట్టేయొచ్చు

- అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా 'కాప్స్ రికవరీ' యాప్
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే రుణం మంజూరయ్యేలా కొత్త విధానం

ఈనాడు, అమరావతి: స్త్రీనిధి కింద తీసుకున్న రుణంలో సభ్యురాలు చెల్లించిన నెల వాయిదాలో సగం కట్టి మిగతా సగం ఇతర వాటికి వినియోగించుకోవడం. .ఒకరు చెల్లించిన మొత్తాన్ని మరొకరి పేరు మీద జమ చేయడం...స్త్రీనిధి మొత్తాన్ని దానికి కాకుండా ఉన్నతి రుణానికో...వీవో చెల్లింపులకో వినియోగించడం, సభ్యురాలు కట్టినా..బ్యాంకులో జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించడం..ఇవి ఇప్పటివరకు డ్వాక్రా సంఘాల్లో తరచుగా స్త్రీనిధి చెల్లింపుల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు. వీటి గురించి అధికారులకు తెలిసినా అడ్డుకట్టకు ఇప్పటివరకు గట్టి ప్రయత్నమే జరగలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం స్త్రీనిధి చెల్లింపుల్లో అక్రమాల అడ్డుకట్టకుగాను చెల్లింపు విధానాన్ని సమూలంగా మార్చింది. 'కాప్స్ రికవరీ' యాప్‌ను తీసుకొచ్చి వాయిదా మొత్తాన్ని నేరుగా యాప్ ద్వారా కట్టే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇప్పటికే డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు బ్యాంకు లింకేజీ, పొదుపు కింద ఎంత రుణం తీసుకున్నారు? ఎంత జమ చేశారు? ఇంకా ఎంత చెల్లించాలనే వివరాలతో కూడిన బ్యాంకు స్టేట్‌మెంట్‌ను నేరుగా సభ్యురాలు తెలుసుకునేందుకు వీలుగా 'మన డబ్బులు-మన లెక్కలు' అనే ఏఐ ఆధారిత యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. స్త్రీనిధి చెల్లింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి ఇతరుల ప్రమేయం లేకుండా సభ్యురాళ్లే నేరుగా నెల వాయిదా చెల్లించేలా 'కాప్స్ రికవరీ' యాప్‌ను తెచ్చింది.

2024 ఏప్రిల్ నుంచి 2025 సెప్టెంబరు వరకు స్త్రీనిధి రుణ మంజూరు తీరు..

- రూ.5,286 కోట్ల మంజూరు
- లబ్ధిపొందిన సంఘాలు: 1.69 లక్షలు
- సభ్యులు: 8.90 లక్షల మంది
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే నేరుగా లబ్ధిదారు బ్యాంకు ఖాతాకు నగదు జమ అయ్యేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చారు
- సభ్యురాలి బయోమెట్రిక్ ఆధారంగానే రుణాన్ని మంజూరు చేస్తారు

రూ.21 కోట్లు పక్కదారి

2014 నుంచి 2024 మధ్య స్త్రీనిధి కింద రుణంగా తీసుకుని డ్వాక్రా మహిళలు తిరిగి చెల్లించిన మొత్తంలో సుమారు రూ.21 కోట్లు పక్కదారి పట్టిందని అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటివరకు రూ.8 కోట్ల రికవరీ చేశారు. మిగతా మొత్తం గాల్లో దీపంలానే ఉంది.

'కాప్స్' యాప్‌తో

డ్వాక్రా మహిళల రుణ వాయిదాల చెల్లింపులకు ప్రభుత్వం కాప్స్ రికవరీ యాప్‌ను ఆగస్టు నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. స్త్రీనిధి నుంచి 8.90 లక్షల మంది డ్వాక్రా మహిళలు రుణం తీసుకున్నారు. వీరిలో 3.76 లక్షల (42%) మంది సెప్టెంబరు నెల వాయిదాను ఈ యాప్ ద్వారా చెల్లించారు. డ్వాక్రా సంఘాల్లో ఇతర సభ్యులకు యాప్ వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు.

యాప్ ద్వారా నేరుగా నగదు చెల్లింపు ఇలా..

- ఫోన్‌లో స్త్రీనిధి 'కాప్స్ రికవరీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సభ్యురాలి ఫోన్ నంబరు లేదా పిన్ ద్వారా లాగిన్ అవ్వాలి.
- సభ్యురాలు ఉన్న ఎస్‌హెచ్‌జీని సెలెక్ట్ చేయగానే ఆ సంఘంలో రుణం తీసుకున్న వారి జాబితా కనిపిస్తుంది.
- పేరు క్లిక్ చేయగానే ఆమె చెల్లించాల్సిన వాయిదా మొత్తం స్క్రీన్‌పై కనిపిస్తుంది.
- ఆ మొత్తాన్ని ఎంటర్ చేసి చెల్లింపు బటన్ నొక్కిన వెంటనే క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే అవుతుంది.
- ఆ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సభ్యురాలి ఫోన్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లు కనిపిస్తాయి. వాటి ఆధారంగా చెల్లించాలి. నగదు బదిలీకాగానే రశీదు వస్తుంది.
- ఈ రశీదులో ఎంత చెల్లించారు? ఇంకా ఎన్ని వాయిదాలు కట్టాలి? తదితర వివరాలు ఉంటాయి.
- తర్వాత ఈ రశీదు నేరుగా సభ్యురాలి వాట్సప్‌కు వెళుతుంది.
- ఇదే కాకుండా గడిచిన 12 నెలల వాయిదా చెల్లింపు వివరాల్ని ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశముంది.

డిగ్రీ రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్‌ను పొడిగించినట్లు కన్వీనర్ టీవీ శ్రీకృష్ణమూర్తి తెలిపారు. రిజిస్ట్రేషన్లకు అక్టోబరు 3, ధ్రువపత్రాల పరిశీలన 4, వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 6 వరకు గడువు ఉందని వెల్లడించారు. సీట్ల కేటాయింపు 10న చేయనున్నామని పేర్కొన్నారు.

★ ఈసెట్‌లో స్పాట్ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజినీరింగ్‌లో రెండో ఏడాది ప్రవేశాలకు కన్వీనర్ కోటా తర్వాత మిగిలిన సీట్లను స్పాట్ కింద భర్తీ చేసుకునే అవకాశం కల్పించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్(భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref: B1/109/2025 Dt. 29-09-2025

ఫారమ్ నెం.VI(ఎ)

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద కూనవరం మండలం, రామవరం మరియు రామవరంపాడు గ్రామాలలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునఃస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ సబ్ కలెక్టర్ మరియు ఆర్&ఆర్ ఆఫీసర్, ఎటపాక యూనిట్, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునఃస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-05-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / అక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు మండలం: జీలుగుమిల్లి గ్రామం: కామయ్యపాలెం

వరుస సంఖ్య	సర్వే నెం.	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి/భర్త పేరు)	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, నిర్మాణాలు మొదలైనవి ఏవైనా ఉంటే వాటి వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	62/1A	జి.డి	0.46	0.46	బండారు అనిల్ కుమార్	63	44	43	101	ఖాళీ స్థలం
2	62/2B	జి.డి	0.62	0.62		63	44	43	101	ఖాళీ స్థలం
3	46	జి.డి	0.29	0.29	బండారు శాంతి బాబు	59	48	45	47	ఖాళీ స్థలం
4	44	జి.డి	0.77	0.77		62	59	43	61	ఖాళీ స్థలం
5	60/4	జి.డి	0.24	0.24		69	61	59	61	ఖాళీ స్థలం
6	46	జి.డి	0.15	0.15	బండారు లక్ష్మి నారాయణ	59	48	45	47	ఖాళీ స్థలం
7	61/6	జి.డి	0.58	0.58		101	58	44	57	వేప-2
8	46	జి.డి	0.14	0.14	బండారు తాతరావు	59	48	45	47	వేప-1
9	61/6	జి.డి	0.58	0.58		101	58	44	57	ఖాళీ స్థలం
10	46	జి.డి	0.44	0.44	మంజు రఘువ రాజు	59	48	45	47	ఖాళీ స్థలం
11	46	జి.డి	0.29	0.29	బండారు అనిల్ కుమార్	59	48	45	47	ఖాళీ స్థలం
12	59-4	జి.డి	0.59	0.59	నల్లగోపుల విజయ రామరాజు	44	46	45	58	ఖాళీ స్థలం
13	62-1D	జి.డి	0.50	0.50	నల్లగోపుల రత్నం	63	44	43	101	ఖాళీ స్థలం
14	62-2	జి.డి	0.33	0.33		63	44	43	101	ఖాళీ స్థలం
15	44	జి.డి	0.77	0.77	బండారు రామారావు	62	59	43	61	ఖాళీ స్థలం
16	59-6	జి.డి	0.89	0.89	బండారు చిన్న నరసింహారావు	44	46	45	58	ఖాళీ స్థలం
17	60-1	జి.డి	0.21	0.21		61	58	59	61	ఖాళీ స్థలం
18	46	జి.డి	0.44	0.44		59	48	45	47	ఖాళీ స్థలం
19	190-1	జి.డి	1.00	1.00	నారగని దుర్గ మహాలక్ష్మి	196	189	185	191	పామాయిల్ తోట, బోర్-1, డ్రిప్
20	191-1	జి.డి	1.00	1.00		196	177	190	194	ఖాళీ స్థలం
21	14/1	జి.డి	0.24	0.24	ముల్లగిరి సాయి కుమార్	1	112	1	14	ఖాళీ స్థలం
22	14/1	జి.డి	1.00	1.00	వసుబోయిన లావణ్య	1	112	1	14	మామిడి-1, కమల-1
23	14/1	జి.డి	1.42	1.42	ముల్లగిరి శ్రీను	1	112	1	14	తాడి-2, వేప-1, బోర్-1, పనస-1, మామిడి-1, కొబ్బరి-2
24	14/1B	జి.డి	1.08	1.08	రామబోయిన రాంబాబు	1	112	1	14	మామిడి-1, కొబ్బరి-2
25	14/1A	జి.డి	0.65	0.65		1	112	1	14	చింత-1
26	14/1	జి.డి	0.71	0.71		1	112	1	14	ఖాళీ స్థలం
27	173/9	జి.డి	1.03	1.03	సిరిబత్తుల వెంకటేశ్వరరావు	180	170	172	175	షెడ్-1, బోర్-1, కొబ్బరి-3, మామిడి-1, రేగు-1
28	168/6	జి.డి	1.01	1.01		175	167	170	8	ఖాళీ స్థలం
29	168/2	జి.డి	1.07	1.07						
30	173/9	జి.డి	1.60	1.60	సిరిబత్తుల దుర్గ రావు	180	170	172	175	షెడ్-1, నేరేడు-1, మారేడు-1, బోర్-1
31	168/2	జి.డి	1.07	1.07						
32	173/9	జి.డి	1.30	1.30	సిరిబత్తుల సూర్యచంద్రరావు	180	170	172	175	కుంకుడు-1
33	18	జి.డి	4.25	4.25	సమయమంతుల అనురేఖ	17	9	18	19	బోర్-1, తాడి-4, ఎలక్ట్రిక్ పోల్స్-2, 25KV ఎలక్ట్రిక్ లైన్, ట్రాన్స్ఫర్-2
34	19	జి.డి	1.25	1.25		20	9	18	22	తాడి-10
35	19	జి.డి	2.34	2.34	సమయమంతుల చక్రధరరావు	20	9	18	22	చింత-2, తాడి-13
36	19	జి.డి	1.33	1.33	సమయమంతుల సూరిబాబు	20	9	18	22	టేకు-2, వేప-2
37	19	జి.డి	1.33	1.33	సమయమంతుల చంద్రశేఖర్‌రావు	20	9	18	22	తాడి-35
38	195/3	జి.డి	1.27	1.27	చల్లా సుధారాణి	198	194	196	60	జీడిమామిడి-15, జామాయిల్-130, కుంకుడు-2
39	5/413	జి.డి	0.95	0.95		9	4	10	6	ఖాళీ స్థలం
40	9/2A	జి.డి	1.12	1.12		18	5	10	8	ఖాళీ స్థలం
41	195/3	జి.డి	1.27	1.27	రాచపల్ల కుమారి	198	194	196	60	ఖాళీ స్థలం
42	9/2A	జి.డి	2.40	2.40		18	5	10	8	పీకాక్-4, టేకు-1
43	8/3	జి.డి	1.40	1.40	సమయమంతుల సత్యనారాయణ	22	7	9	7	బోర్-1, తాడి-57, ఎలక్ట్రిక్ పోల్స్-4, 25KV ఎలక్ట్రిక్ లైన్
44	5/413	జి.డి	0.95	0.95	సమయమంతుల శ్రీనివాసరావు	9	4	10	6	ఖాళీ స్థలం
45	4/3	జి.డి	2.66	2.66		5		3	5	వేప-1
46	8/3	జి.డి	0.37	0.37	కాకి విజయ లక్ష్మి	22	7	9	7	ఖాళీ స్థలం
47	8/3	జి.డి	1.40	1.40	సాధు మంగతాయారు	22	7	9	7	ఖాళీ స్థలం
48	195/1	జి.డి	1.56	1.56	సాధు నాగేశ్వరరావు	198	194	196	60	బోర్-1
49	195	జి.డి	1.55	1.55	ఉదయగిరి నాగలక్ష్మి					ఖాళీ స్థలం
50	204-3B	జి.డి	0.50	0.50	గుర్రం సునీత	228	205	227	210	ఖాళీ స్థలం
51	204-2B	జి.డి	1.27	1.27		228	205	227	210	ఖాళీ స్థలం
52	204-1B	జి.డి	1.31	1.31		228	205	227	210	ఖాళీ స్థలం
53	99-1C	జి.డి	1.15	1.15		9	100	98	109	పామాయిల్ తోట, డ్రిప్, ఫెన్సింగ్
54	228-1	జి.డి	1.78	1.78	పోలేపల్లి మాధవి	229	204	227	210	ఖాళీ స్థలం
55	210-2	జి.డి	1.17	1.17		229	202	204	201	వరి
56	210-1	జి.డి	1.32	1.32		229	202	204	201	వరి
57	94-2D	జి.డి	0.35	0.35	చిగుల్లపల్లి నాగలలిత	195	193	191	59	పామాయిల్ తోట
58	228-2	జి.డి	0.74	0.74		229	204	227	203	పామాయిల్ తోట
59	228-3	జి.డి	0.13	0.13		229	204	227	203	పామాయిల్ తోట
60	169-2	జి.డి	3.01	3.01		173	168	170	168	తాడి-12
61	99-3	జి.డి	5.55	5.55	యశోద లక్ష్మి	9	100	98	109	పామాయిల్ తోట, బోర్-1, ట్రాన్స్ఫర్-1, 25KV ఎలక్ట్రిక్ లైన్, డ్రిప్
62	218-3A	జి.డి	0.90	0.90	మంతెన శివ వర్మ కృష్ణం రాజు	225	217	219	227	వేప-57, సపోటా-4, రోజ్ జామ-1, పీకాక్-4, జామాయిల్-4, ముల్బెర్రి-9, గండుగా-3, కోరమేను-1, సింధుగా-2, వెదురు-20, తాడి-2, తెల్ల పల-2, తునికి-1, మామిడి-134, కొబ్బరి-487, కంపద-8, వక్క-560, ఉసిరి-5, మలబార్-4, పనస-18, తాడి-39, ఆరి-1, ఉడిగా-2, చింత-1, సీతఫలం-7, టేకు-6, సుబబుల్-15, తుమ్మ-1, నిమ్మ192, అరటి-21, బొప్పాయి-7, కోకో-390, ఆవకడో-12, పామాయిల్ తోట, ఇల్లు-1, షెడ్-3, బోర్-3, డ్రిప్, సిమెంట్ పిల్లర్స్-1025, ఇనుపతీగలు కంచే, ఇనుప గ్రేట్-2, ట్రాన్స్‌ఫరం-2, ఆర్‌ఆర్‌టర్ పోల్స్-4, 40KV Line-1,25 KV ఎలక్ట్రిక్ లైన్-1
63	218/2A	జి.డి	6.44	6.44		225	217	219	227	
64	217/2	జి.డి	6.63	6.63		218	216	115	207	
65	216-4B 2-2-2-3-A	జి.డి	0.37	0.37		217	216	116	208	
66	209-2B1	జి.డి	0.38	0.38		206	211	208	209	
67	208-2-B-2A	జి.డి	2.62	2.62		207	214	216	209	
68	207	జి.డి	5.92	5.92		227	208	217	206	
69	206	జి.డి	4.68	4.68		227	209	207	205	
70	202-1A	జి.డి	1.46	1.46		198	205	207	205	
71	227	జి.డి	0.80	0.80						
72	205-2C	జి.డి	0.53	0.53	సంక గంగాధరరావు	204	210	206	202	ఖాళీ స్థలం
73	195-1	జి.డి	1.52	1.52	సమయమంతుల కృష్ణరావు	198	194	196	60	ఖాళీ స్థలం
74	117	జి.డి	2.13	2.13	ఉప్పల తులసి దుర్గారావు					పామాయిల్ తోట తాడి-6, వేప-2
			102.53	102.53						

సం/- ఎస్.సరళా వందనం, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

సం/- డి.చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు

వైకాపా ఒక పనికిరాని పక్షం

- జగన్ అరాచక విధానాలను ఖండించాలి
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



ఈనాడు, దిల్లీ: డిజిటల్ బుక్ పేరు చెప్పి రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడానికి వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచక ఆలోచనలను సమాజం స్వాగతించకూడదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. వైకాపా ఒక పనికిరాని పక్షంగా మారిందన్నది సుస్పష్టమని, ఇలాగే వ్యవహరిస్తే ఆ పార్టీకి ఇప్పుడున్న 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి దిల్లీకి వచ్చిన ఆయన సోమవారం ఇక్కడ ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'జగన్ వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని వ్యతిరేకించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత అంతుచూస్తానని పోలీసులను బెదిరించడం, నేనొస్తే చూసుకుంటానని కాంట్రాక్టర్లతో అనడం గర్హనీయం. జగన్ పాలనలో రివర్స్ టెండరింగ్ విధానం, టిడ్కో ఇళ్లు ఎవరికీ ఇవ్వకుండా అలాగే ఉంచడం, గత ప్రభుత్వాల నిర్ణయాలను రద్దు చేయడం, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం లాంటి ఎన్నో అరాచకాలు చేశారు. వాటి కారణంగా రాష్ట్ర ప్రగతికి అడ్డంకులు ఏర్పడ్డాయి' అని మాధవ్ పేర్కొన్నారు.

షర్మిల వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి

తితిదే నిధులతో దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాలు నిర్మించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన ఆర్ఎస్ఎస్ ఎజెండా అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలను మాధవ్ తీవ్రంగా ఖండించారు. 'తితిదే నిధులతో మరుగుదొడ్లు ఎందుకు నిర్మించకూడదన్న ఆమె ప్రశ్న దేవాలయ వ్యవస్థ పట్ల ఆమెకున్న చిన్నచూపునకు అద్దం పడుతోంది. భర్తతో కలిసి మత ప్రచారం చేసి మతమార్పిళ్లకు ప్రయత్నించిన షర్మిల లాంటి వ్యక్తిని పీసీసీ అధ్యక్షురాలిగా నియమించిన సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. సోనియా ప్రోద్బలం వల్లే ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏడుకొండలను రెండు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారు. జగన్ వచ్చిన తర్వాత కూడా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. వైఎస్ కుటుంబమంతటిదీ అదే తీరు' అని అన్నారు. ధార్మిక నిధులను ధర్మప్రచారం కోసం వినియోగించుకొనే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించినపుడు ఆలయాలు నిర్మిస్తే తప్పేంటని ప్రశ్నించారు.

2, 3 తేదీల్లో ఖాదీ సంతలు

అక్టోబర్ 2, 3 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఖాదీసంతల పేరుతో చేనేత వస్త్రాలు, హస్తకళ ఉత్పత్తులను ప్రోత్సహించే ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం బాగుందన్నారు. మెగా డీఎస్సీని తక్కువ సమయంలోనే పూర్తి చేసి 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ఘనతగా అభివర్ణించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్(భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref B1/107/2025 Dt. 29-09-2025

ఫారమ్ నెం.VI(ఎ)

(2013వ సంవత్సరం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, వంకవారిగూడెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద కూనవరం మండలం, వాల్‌ఫోర్‌పేట గ్రామములోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా పునరావాస, పునఃస్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తం భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్టు ఆఫీసర్ మరియు ఆర్‌అండ్‌ఆర్ ఆఫీసర్, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లావారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిత నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10.05.2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు, వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / అక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు మండలం: జీలుగుమిల్లి గ్రామం: వంకవారిగూడెం

వరుస సంఖ్య	సర్వే నంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి/భర్త పేరు)	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, నిర్మాణాలు మొదలైనవి ఏవైనా ఉంటే వాటి వివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	6-1C1	జి.డి	2.00	2.00	కాకర్ల వీరవెంకట ప్రసాద్ తండ్రి: బుల్లిరాజు	87, 88	5	1	8	పామాయిలు, తాడి-14 బోరు-1, బేరన్
Total			2.00	2.00						

సం/- ఎస్.సరళా వందనం, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

సం/- డి.చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణాధికారి) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు

పదోన్నతుల్లో తెలంగాణ విధానాన్ని పాటించాలి

- సచివాలయ బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగుల సంఘం
- ఫీడర్ సీనియారిటీనే తీసుకోవాలన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు
- మంత్రివర్గ ఉపసంఘం ఎదుట వాదనలు

ఈనాడు, అమరావతి: పదోన్నతుల్లో రిజర్వేషన్లపై సచివాలయంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం, బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తమ వాదనలను మంత్రివర్గ ఉపసంఘానికి వినిపించారు. ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సోమవారం సచివాలయంలో వారితో సమావేశమయ్యారు. సచివాలయ పదోన్నతుల్లో బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని బీసీ, ఓసీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అప్పారావు, దీపక్, ప్రతినిధులు నాపా ప్రసాద్, కృష్ణప్రసాద్, శాంతికుమారి ఉపసంఘానికి చెప్పారు. 'సుప్రీంకోర్టు, హైకోర్టుల ఆదేశాలు, వివిధ కమిటీలు ఇచ్చిన నివేదికలను అమలు చేయాలి. కాలయాపన చేయకుండా తెలంగాణ సచివాలయంలో సమస్యను పరిష్కరించిన విధంగానే ఏపీలోనూ 2014 నుంచి పదోన్నతుల ప్యానళ్లను అన్ని కేడర్లలోనూ పునఃసమీక్ష చేయాలి. సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా నిరంతరం పదోన్నతులు ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ కోటాకు మించి ఉన్నత కేడర్లలో ఆ ఉద్యోగుల సంఖ్య ఉంది. గ్రూప్-2 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి, మెరిట్ లిస్టులో అగ్రస్థానంలో ఉన్న బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులు పదోన్నతులు రాక చిన్న కేడర్ పోస్టుల్లోనే పదవీవిరమణ పొందుతున్నారు' అని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు, ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఫీడర్ సీనియారిటీనే పరిగణనలోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేశ్‌కుమార్, సుబ్బారావు, ప్రతినిధులు శ్రీనుబాబు, సుబ్బారావు, మోహన్ వివరించారు. 'పదోన్నతి ఇచ్చే పోస్టుకు ఫీడర్ ఏదో దాని సీనియారిటీని తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ అధికారుల కమిటీ ఇదే నివేదిక ఇచ్చింది. తెలంగాణలో ఆర్థిక శాఖలోనూ దీన్ని పాటించారు. రాష్ట్ర సచివాలయంలో సంయుక్త కార్యదర్శులు, డిప్యూటీ కార్యదర్శుల కేడర్లలో ఎస్సీ, ఎస్టీల నిష్పత్తి తక్కువగానే ఉంది. తితిదేలోనూ పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి' అని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం కేసు తేల్చేందుకు 13 ఏళ్లా?

- విచారణను స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించడం సముచితం
- వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేయండి
- పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఓ మహిళ కనిపించకుండా పోయి 13 ఏళ్లు కావస్తున్నా ఈ వ్యవహారాన్ని శాస్త్రీయ విధానంలో దర్యాప్తు చేయకుండా పోలీసులు కాలం వెళ్లదీస్తున్నారని హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు జరిపి ఉంటే అదృశ్యమైన మహిళను కనుగొనేందుకు 13 సంవత్సరాలు పట్టేది కాదని తెలిపింది. ఈ కేసు విచారణను ఏదైనా స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించడం సముచితమని ప్రాథమికంగా అభిప్రాయపడింది. కేసును వేరే సంస్థకు అప్పగించే ముందు ప్రస్తుత దర్యాప్తులోని వాస్తవ పరిస్థితులను వివరిస్తూ అఫిడవిట్ వేసేందుకు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీకి మరో అవకాశం ఇస్తున్నామని పేర్కొంది. ప్రమాణపత్రం వేసేందుకు తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

✦ పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామానికి చెందిన బండారు ప్రకాశరావు కుమార్తె మంగాదేవిని మోహనబ్రహ్మాజీకి ఇచ్చి వివాహం చేశారు. మనస్పర్థల కారణంగా పుట్టింటికి తిరిగొచ్చిన కుమార్తెకు సర్దిచెప్పి ప్రకాశరావు అత్తారింటికి పంపారు. 2012 అక్టోబరు 18న అల్లుడు ఫోన్ చేసి మీ కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని ప్రకాశరావుకు సమాచారం ఇచ్చారు. వెతికినా ఆమె జాడ కనిపించకపోవడంతో ప్రకాశరావు తాడేపల్లిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ, కొవ్వూరు డీఎస్పీ, తాడేపల్లిగూడెం ఎస్‌హెచ్‌వో తదితరులపై 2017లో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఈ వ్యాజ్యంలో పోలీసులు కౌంటర్ వేస్తూ అదృశ్యమైన ఆమెను కనుగొనేందుకు యత్నాలు జరుగుతున్నాయని, దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ వివరణపై అసంతృప్తి వ్యక్తంచేసిన న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఈ కేసు దర్యాప్తును సరైన శాస్త్రీయ కోణంలో జరిపి ఉంటే ఆమెను కనుగొనడానికి 13 ఏళ్ల సమయం పట్టేది కాదన్నారు.

ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



ప్రవీణ్ కుమార్‌కు శాలువాకప్పి స్వాగతం పలుకుతున్న అర్జా శ్రీకాంత్

ఈనాడు, దిల్లీ: దిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా 2006 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమలశాఖ కార్యదర్శి, ఏపీఎండీసీ ఎండీ, మైన్స్ అండ్ జియాలజీ విభాగం కమిషనర్‌గా పనిచేసిన ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. గతంలో ప్రవీణ్‌కుమార్ విశాఖపట్నం, పశ్చిమగోదావరి, ప్రకాశం, తిరుపతి జిల్లాల కలెక్టర్‌గా, జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేశారు. స్వరాష్ట్రం బిహార్. దిల్లీ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీలో గ్రాడ్యుయేషన్ చేసిన అనంతరం సివిల్స్ పరీక్షలు రాసి జాతీయస్థాయిలో 19వ ర్యాంక్ సాధించడం ద్వారా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. సోమవారం ఇక్కడ బాధ్యతల స్వీకరణ సందర్భంగా అదనపు రెసిడెంట్ కమిషనర్ అర్జాశ్రీకాంత్ స్వాగతం పలికారు.

రూ.2.50 కోట్లతో ఇన్నోవేషన్ కేంద్రం పనులు

సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్



మాట్లాడుతున్న సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: 'సంగం డెయిరీ ద్వారా రోజూ 10 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12.79 కోట్ల నికర లాభం వచ్చింది. బ్యాంకు ఖాతాల ద్వారా నగదును రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నగదు జమకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెస్తున్నాం' అని సంఘం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి సంగం మిల్క్ ప్రొడ్యూసర్ లిమిటెడ్‌లో 12వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ ధూళిపాళ్ల అందులో పాల్గొని మాట్లాడారు. సంగం డెయిరీ ఆవరణలో రూ.2.50 కోట్లతో అత్యాధునిక వసతులతో ఇన్నోవేషన్ కేంద్ర నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పాడి రైతులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు అది ఉపయోగపడుతుందన్నారు. 'పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుతో సంగం ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. సంగం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తెచ్చాం. దీంతో అధిక దిగుబడులు సాధించాం' అని తెలిపారు. ఎండీ గోపాల్‌కృష్ణన్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, పాలకేంద్రాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



కొనలేకపోతున్నాం.. తాకట్టైనా పెడదాం..

- బంగారం అధిక ధరల నేపథ్యంలో సులువుగా లభిస్తున్న అప్పులు
- భారీగా విస్తరిస్తున్న రుణ విపణి

ఈనాడు, హైదరాబాద్: బంగారం ధర ఆకాశమే హద్దుగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆభరణాల కొనుగోళ్లు తగ్గుతున్నాయని జువెలరీ వ్యాపారులు చెబుతున్నారు. పాత ఆభరణాలు మార్చుకుని, మరి కొంత నగదు జతచేసి కొత్త మోడల్ ఆభరణాలు తీసుకునే వారి సంఖ్య అధికమవుతోంది. పుత్తడి ధర బాగా పెరిగినందున, బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు పెద్దఎత్తున బంగారం తనఖా రుణాలు జారీ చేస్తున్నాయి. ఇదే సమయంలో ఆర్థిక అవసరాలున్న వారే కాదు.. ఇతర పెట్టుబడుల కోసం ఇంట్లోని బంగారు ఆభరణాలను తనఖా పెట్టి రుణం తీసుకోవడమూ పెరుగుతోంది. ఫలితమే బంగారం తనఖా రుణాల మొత్తంలో భారీ వృద్ధి నమోదవుతోంది.

వ్యక్తిగత రుణాల జారీ తగ్గించడం వల్లా

కొంతకాలం పాటు హామీలేని వ్యక్తిగత రుణాలతో పాటు క్రెడిట్‌కార్డులను బ్యాంకులు విరివిగా జారీచేశాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో, రిజర్వ్ బ్యాంక్ హెచ్చరికలు చేయడంతో తనఖాలేని వ్యక్తిగత రుణాలను బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తగ్గించాయి. ఆభరణాల పసిడి 10 గ్రాముల ధర రూ.లక్షకు చేరడంతో, తనఖా పెట్టుకుని గ్రాముకు జారీ చేసే మొత్తాన్ని ఆర్థిక సంస్థలు పెంచాయి. బ్యాంకులు కూడా 22 క్యారెట్ల బంగారంపై గ్రాముకు రూ.7,000కు పైగా రుణం ఇస్తున్నాయి. ఇతర రుణాలతో పోల్చితే బంగారం తనఖా రుణాలు తీసుకోవడం సులువు కూడా. ఈ పరిస్థితులు బంగారం రుణాల మార్కెట్ శరవేగంగా విస్తరించడానికి వీలుకల్పిస్తున్నాయి. పండగల సీజన్లో తమ వ్యాపార పెట్టుబడుల కోసం వర్తకులు అప్పులు చేయటం సర్వసాధారణం. వీరు కూడా ఈసారి బంగారం తనఖా రుణాలు అధికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. చిన్న వర్తకులు, రైతులు, గృహస్థులు, వ్యాపారులు బంగారం తనఖా రుణాలు తీసుకునే వారిలో ఎక్కువగా ఉంటున్నారు.

బంగారం తనఖా రుణాల మార్కెట్	
2024 జులై	రూ.1.32 లక్షల కోట్లు
2025 జులై	రూ.2.94 లక్షల కోట్లు

ఈ గణాంకాలు పరిశీలిస్తే పసిడి తనఖా రుణ వ్యాపారం ఎంత జోరుగా సాగుతోందో తెలుస్తుంది. ఏడాది వ్యవధిలో 122% రాణించినట్లు లెక్క.

జాగ్రత్తలు తప్పనిసరి

ఈ రుణాల్లో రిస్కు సైతం ఉన్నట్లు బ్యాంకింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కసారిగా బంగారం ధర తగ్గితే అదనపు మార్జిన్ కోసం మరికొంత బంగారాన్ని తనఖా పెట్టాలని లేదా కొంతైనా అప్పు తీర్చాలని ఆర్థిక సంస్థలు రుణగ్రహీతలను కోరుతుంటాయి. మరీ ఎక్కువగా అప్పు తీసుకున్నవారికి, అప్పటికప్పుడు కొంత తీర్చాలన్నా కష్టం అవుతుంది. తీర్చకపోతే బంగారాన్ని వేలం వేసి సొమ్ము వసూలు చేసుకునే అవకాశం ఆర్థిక సంస్థలకు ఉంటుంది. ఇందుకు నిర్దేశిత కాలపరిమితి ఉంటుంది. నిబంధనలూ పాటించాలి. వీటిని తెలుసుకున్నాకే, పసిడిని తనఖా పెట్టాలని సూచిస్తున్నారు.

ఇక్కడ రూ.1.48 లక్షలు.. దిల్లీలో రూ.1.50 లక్షలు

- దూసుకెళ్తున్న వెండి ధరలు
- బంగారం 10 గ్రాములు రూ.1,19,200

ఈనాడు వాణిజ్య విభాగం: అమెరికాలో వడ్డీరేట్లు తగ్గుతుండటం, ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలహీన పడిన నేపథ్యంలో పసిడిపైకి పెట్టుబడులు పెరుగుతున్నాయి. వివిధ దేశాల కేంద్రీయబ్యాంకులు పసిడి కొనుగోళ్లను కొనసాగిస్తున్నాయి. వెండికి పారిశ్రామిక గిరాకీ అధికమైంది. ఫలితంగా అంతర్జాతీయ విపణిలో ఈ లోహాల ధరలు దూసుకెళ్తున్నాయి. దేశీయంగా డాలర్ విలువ రూ.88.75 వద్ద కావడం, దిగుమతి సుంకాలు + జీఎస్‌టీ కలిసి 9% వరకు పడుతున్నందున.. ఈ లోహాల ధరలు అంతర్జాతీయ విపణితో పోలిస్తే, ఇక్కడ మరింత అధికంగా ఉంటున్నాయి. స్థానిక సరఫరా ఛార్జీల వంటివి జత చేరుతుంటాయి.
✦ అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర సోమవారం 3828 డాలర్లకు పెరిగింది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,19,200కు చేరింది. శనివారం ఈ ధర రూ.1,17,700.
✦ అంతర్జాతీయ విపణిలో ఔన్సు వెండి 46.86 డాలర్లకు చేరింది. దేశీయంగా కిలో వెండి ధర రూ.1,48,300 వద్ద ఉంది. శనివారం ఇది రూ.1,46,390.
✦ దేశ రాజధానిలో కిలో వెండి ధర రూ.7,000 పెరిగి రూ.1.50 లక్షలకు చేరింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,19,500గా ఉంది.
✦ జనవరి నుంచి చూస్తే బంగారం ధర 51.36%, వెండి ధర 67% పెరిగాయి.

ఈనాడు బిజినెస్

ఒక ఫ్లాట్ రూ.500 కోట్లు!

సన్‌టెక్ రియాల్టీ ప్రణాళిక



భూమి, నిర్మాణ వ్యయాలు పెరిగిపోవడం.. అధునాతన విలాసవంత సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు నివాసాల ఖర్చు అంతకంతకూ పెరుగుతోంది. రెండు, మూడు అంతస్తులతో నిర్మిస్తున్న విల్లాలే కాదు.. అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్న అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల ధరలు హైదరాబాద్‌లోనూ రూ.10 కోట్లకు మించిపోతున్నాయి. గురుగ్రామ్‌లో డీఎల్ఎఫ్ సంస్థ నిర్మిస్తున్న కామెలియాస్ అపార్ట్‌మెంట్లో ఫ్లాట్ ధర రూ.100 కోట్లు అయితే.. ఇప్పుడు సన్‌టెక్ రియాల్టీ నిర్మించబోతున్న అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ ధర కనిష్ఠం రూ.100 కోట్లు, గరిష్ఠం రూ.500 కోట్లు ఉంటుందట. ఎమ్మార్ బ్రాండ్‌పై అత్యంత విలాసవంతంగా నిర్మించబోయే ఈ నివాస సముదాయాలు ముంబయి, దుబాయ్‌లలో ఉంటాయని.. ఈ రెండు ప్రాజెక్టుల పైనే సీఎండీ కమల్ ఖేతన్ వెల్లడించారు. వచ్చే జూన్‌లోగా ఈ ప్రాజెక్టుల పనులకు శ్రీకారం చుడతామని ఆయన ప్రకటించారు. కుబేరులు, అత్యంత సంపన్నుల సంఖ్య దేశీయంగా పెరుగుతున్న నేపథ్యంలోనే ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు.
✦ ఈ అపార్ట్‌మెంట్ చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.2.50 లక్షలు కానుంది. దేశంలోనే అత్యంత ఖరీదైన నిర్మాణాల్లో ఒకటిగా నిలవనుంది.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్మును ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు. అక్టోబరు 8న పదవీకాలం ముగియనున్న ఎం.రాజేశ్వర రావు స్థానాన్ని ముర్ము భర్తీ చేసే అవకాశం ఉంది. అక్టోబరు 9 నుంచి మూడేళ్ల పాటు ముర్ము నియామకానికి మంత్రివర్గ నియామకాల సంఘం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఆయన ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూపర్‌విజన్‌ను ఆయన పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐలో మరో ముగ్గురు డిప్యూటీ గవర్నర్లు టి.రబి శంకర్, స్వామినాథన్, పూనమ్ గుప్తా ఉన్నారు.

టాటా క్యాపిటల్ ఐపీఓ ధరల శ్రేణి రూ.310-326

టాటా గ్రూప్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ టాటా క్యాపిటల్ రూ.15,512 కోట్ల మెగా ఐపీఓ అక్టోబరు 6న ప్రారంభమై 8న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.310-326ను నిర్ణయించారు. గరిష్ఠ ధర ప్రకారం.. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.38 లక్షల కోట్లు అవుతుంది. ఈ ఐపీఓకు యాంకర్ మదుపర్లు అక్టోబరు 3న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. రిటైల్ మదుపర్లు కనీసం 46 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. గరిష్ఠ ధర వద్ద ఒక లాట్‌కు రూ.14,996 అవుతుంది. ఐపీఓ అనంతరం అక్టోబరు 13న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ కంపెనీ షేర్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే అతి పెద్ద ఐపీఓగా నిలవనుంది.

ప్రీమియర్ ఎనర్జీస్‌కు రూ.177 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: సౌర విద్యుత్తు రంగంలోని హైదరాబాద్ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్‌కు, పశ్చిమ ఆఫ్రికా ప్రాంతంలోని బెనిన్ రిపబ్లిక్ నుంచి రూ.177 కోట్ల విలువైన కాంట్రాక్టులు లభించాయి. పోలీస్ స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆరోగ్య కేంద్రాలు, సరిహద్దు నిఘా కేంద్రాల్లో 750 రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసే పనులు ఇవి.

యూపీఐ ఆధారిత పసిడి రుణం

ఫ్రీఛార్జ్‌తో కలిసి అందించనున్న యాక్సిస్ బ్యాంక్

ఈనాడు, హైదరాబాద్: పసిడి తనఖా రుణాన్ని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో అనుసంధానించే వెసులుబాటు తీసుకొచ్చినట్లు యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది. ఇందుకోసం ఫ్రీఛార్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. వినియోగదారులు తమ బంగారంపై వేగంగా రుణం పొందేందుకు, తిరిగి చెల్లించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మంజూరైన రుణంలో, ఉపయోగించిన నిధులపైనే వడ్డీ విధిస్తామని తెలిపింది.
✦ ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఉమ్మడిగా బంగారం తనఖా రుణాలు ఇవ్వనున్నాయి.

ఆతిథ్య విభాగంలోకి గ్రీన్ గోల్డ్ యానిమేషన్

ఈనాడు, హైదరాబాద్: కార్టూన్ పాత్ర చోటా భీమ్‌ను సృష్టించిన గ్రీన్ గోల్డ్ యానిమేషన్, ఆతిథ్య రంగంలోకి అడుగు పెట్టనుంది. ఇందుకోసం ఈబీజీ గ్రూపుతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి చోటా భీమ్ కేఫ్‌ను ప్రారంభించింది. వినోదం, ఆహారం, రిటెయిల్‌ను ఒకే చోట అందించేందుకు ఇది తోడ్పడుతుందని పేర్కొంది. డిసెంబరు నాటికి రెండు కేఫ్‌లను ప్రారంభిస్తామని గ్రీన్ గోల్డ్ యానిమేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాజీవ్ చిలక, ఈబీజీ గ్రూపు వ్యవస్థాపకుడు, సీఈఓ ఇర్ఫాన్ ఖాన్ వెల్లడించారు. 2026 నాటికి దేశవ్యాప్తంగా 50 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వీటిని 300కు చేర్చాలన్నది లక్ష్యమని వివరించారు. ఇందుకోసం దాదాపు రూ.200 కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు వెల్లడించారు.

రెండేళ్ల కనిష్ఠానికి టాటా గ్రూప్ మార్కెట్ విలువ



టాటా గ్రూప్ మార్కెట్ విలువ ఈ ఏడాదిలో ఇప్పటికి 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6.6 లక్షల కోట్ల)కు పైగా తగ్గింది. ఇందులో అయిదోవంతు ఈ నెల 19 తర్వాతే కోల్పోవడం గమనార్హం. ఫలితంగా గ్రూప్‌లోని 16 కంపెనీల మార్కెట్ విలువ గత శుక్రవారం 287 బి. డాలర్ల (దాదాపు రూ.25.25 లక్షల కోట్ల)కు పరిమితమైంది. ఇది రెండేళ్ల కనిష్ఠ స్థాయి. హెచ్1బీ వీసాలపై అమెరికా ఆంక్షల నుంచి సైబర్ దాడుల వరకు పలు సవాళ్లు ఎదురుకావడంతో టాటా గ్రూప్ మార్కెట్ విలువ ఈ నెల 19 నుంచే 20 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది.

టీసీఎస్: టాటా గ్రూప్‌లో ప్రధాన కంపెనీ అయిన టీసీఎస్ షేరు గతవారంలో 8% నష్టపోయింది. 2020 తర్వాత వారం వారీ నష్టాల్లో ఇదే అత్యధికం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్1బీ కొత్త వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడంతో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో షేర్లు నష్టపోయాయి. ఈ కంపెనీలు ఆన్‌షోర్ కాంట్రాక్టుల విషయంలో ఆచితూచి అడుగేయాల్సి వస్తుందని, దీంతో కొన్ని త్రైమాసికాల వరకు కొత్త కాంట్రాక్టుల బుకింగ్‌పై ప్రభావం ఉంటుందని బ్లూమ్‌బర్గ్ ఇంటెలిజెన్స్ విశ్లేషకులు అంటున్నారు.

గ్రూప్‌లో టాప్-5 కంపెనీల మార్కెట్ విలువ	
సంస్థ	సోమవారం ముగింపు ప్రకారం(రూ.లక్షల కోట్లు)
టీసీఎస్	10.47
టైటన్	3.02
టాటా మోటార్స్	2.47
టాటా స్టీల్	2.11
ట్రెంట్	1.68

జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్)పై సైబర్ దాడి నేపథ్యంలో, మాతృసంస్థ అయిన టాటా మోటార్స్ షేరు గత వారం 5% నష్టపోయింది. ఈ నేపథ్యంలో టాటా మోటార్స్ భవిష్యత్ అంచనాలను 'సానుకూలం' నుంచి 'ప్రతికూలాని'కి మూడీస్ రేటింగ్స్ సోమవారం సవరించింది. జేఎల్ఆర్‌లో ఉత్పత్తి 4 వారాల పాటు నిలిపివేయడం ఇందుకు నేపథ్యం. అక్టోబరు 1 తర్వాత ఉత్పత్తి మొదలైనా సాధారణ స్థాయికి చేరడానికి నెలలు పట్టొచ్చని పేర్కొంది. అయితే రేటింగ్‌ను మాత్రం బీఏ1 వద్ద కొనసాగించింది.

మొత్తం మీద టాటా గ్రూప్‌లోని 16 నమోదిత కంపెనీల్లో 12 సంస్థల షేర్లు ఈ ఏడాది నష్టపోయాయి. తేజాస్ నెట్‌వర్క్స్ తన మార్కెట్ విలువలో సగం, నెల్కో మూడోవంతు మేర కోల్పోయాయి.

కోడి గుడ్డు

30న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	500	గోదావరి	530
వరంగల్	502	విశాఖపట్నం	520
విజయవాడ	530	చిత్తూరు	543

గనులు బాగా పనిచేశాయ్

అగస్టులో రాణించిన పారిశ్రామికోత్పత్తి



దిల్లీ: గనుల రంగం మెరుగైన పనితీరును కనబరచడంతో ఈ ఏడాది ఆగస్టులో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 4% వృద్ధి చెందింది. జులై నెల వృద్ధి రేటును అంతక్రితం అంచనా అయిన 3.5% నుంచి 4.3 శాతానికి జాతీయ గణాంక కార్యాలయం(ఎన్ఎస్ఓ) సవరించింది. గత నెలలో గనుల రంగం 6% వృద్ధి సాధించడం వల్ల ఐఐపీ మెరుగ్గా నమోదైంది. 2024 ఆగస్టులో గనుల రంగం 4.3% క్షీణించింది. ఐఐపీ సూచీలో నాలుగింట మూడింట వాటా ఉండే తయారీ రంగం గతేడాది ఆగస్టులో 1.2% వృద్ధి చెందగా.. ఈ సారి 3.8 శాతానికి చేరింది.

ఆగస్టులో రంగాల వారీ వృద్ధి		
రంగం	2025	2024
ప్రాథమిక లోహాలు	12.2	9.8
విద్యుదుత్పత్తి	4.7	−3.7
వినియోగ వస్తువులు	3.5	5.4
మన్నికేతర వస్తువులు	−6.3	−4.4
మౌలిక/నిర్మాణ రంగం	10.6	2.7
ప్రాథమిక వస్తువులు	5.2	−2.6
ఇంటర్మీడియేట్ వస్తువులు	5.0	3.1

✦ 2025-26 ఏప్రిల్-ఆగస్టులో ఐఐపీ వృద్ధి 2.8 శాతానికి పరిమితమైంది. ఏడాది కిందట ఇదే సమయంలో ఇది 4.3 శాతంగా ఉంది.

తయారీ రాణిస్తుంది: 'జీఎస్‌టీ సవరణ వల్ల పండగల సీజనులో వినియోగ గిరాకీ పెరగవచ్చు. దీని వల్ల 2025 సెప్టెంబరు-అక్టోబరు లో తయారీ రాణిస్తుంది. పాత నిల్వలన్నీ అప్పటికి నిండుకుంటాయ'ని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ అన్నారు.

కొత్త చమురు చట్టంలో హామీలకు తూట్లు!

యంత్ర పరికరాలకు జీఎస్‌టీ పెంపుపై ఫిక్కీ



దిల్లీ: చమురు-గ్యాస్, కోల్ బెడ్ మీథేన్ రంగాల్లో ఉపయోగించే యంత్రపరికరాలపై జీఎస్‌టీ పెంపు వల్ల కొత్తగా ఆమోదించిన చమురు క్షేత్రాల చట్టంలో ఇచ్చిన హామీలకు విఘాతం కలుగుతుందని భారత వాణిజ్య, పరిశ్రమ సంఘాల సమాఖ్య ఫిక్కీ పేర్కొంది. ఈ వివరాలతో ఒక లేఖను చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురికి ఫిక్కీ పంపింది. సహజ వాయువును జీఎస్‌టీ పరిధిలోకి ఇంకా తీసుకురాకపోవడం వల్ల పరిశ్రమ ఇబ్బంది పడుతోందని గుర్తు చేసింది. పెట్రోలియం, కోల్‌బెడ్ మీథేన్ రంగాల్లో వాడే యంత్రపరికరాలపై జీఎస్‌టీని 12% నుంచి 18 శాతానికి పెంచడం ఈ రంగాన్ని మరింత బాధిస్తోందని వివరించింది. మంత్రిత్వ శాఖకు ఈ నెలలో ఫిక్కీ పంపిన రెండో లేఖ ఇది. జీఎస్‌టీ పెంపు వల్ల ప్రాజెక్టు వ్యయాలు మరింత పెరుగుతాయని, దీని వల్ల పెట్టుబడులకు ప్రోత్సాహం లభించక దేశీయ ఉత్పత్తికి గండి పడుతుందని, ఇది ఇంధన భద్రతపై ప్రభుత్వ లక్ష్యాలకు భిన్నంగా ఉందని విశదీకరించింది.

270కి పైగా నగరాల్లో అమెజాన్ ఫ్రెష్ సేవలు

దిల్లీ: తమ ప్లాట్‌ఫామ్‌పై నిత్యావసరాలను కొనుగోలు చేసుకునే వీలును దేశంలోని 270 పైగా నగరాలకి విస్తరిస్తున్నట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. అమెజాన్ ఫ్రెష్ పేరిట ఈ సదుపాయాన్ని సంస్థ కల్పిస్తోంది. కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుతో పాటు గోరఖ్‌పూర్, డెహ్రాడూన్, జలంధర్, కోయంబత్తూరు, జంషెడ్‌పూర్, దుర్గాపూర్‌లో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ తెలిపింది. 'అమెజాన్ ఫ్రెష్ విభాగం రెండేళ్లలో 4.5 రెట్లు విస్తరించడం, 10 రెట్లు వృద్ధి చెందినట్లు' ఈ విభాగ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీ రామ్ తెలిపారు.

భారత రేటింగ్ 'బీఏఏ3'

- భవిష్యత్ అంచనా 'స్థిరం'గానే
- అంతర్జాతీయ ఏజెన్సీ మూడీస్




దిల్లీ: భారత్‌కున్న బలమైన ఆర్థిక మూలాల కారణంగా ప్రస్తుత రేటింగ్‌ను కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ ఏజెన్సీ మూడీస్ పేర్కొంది. భారత దీర్ఘకాలిక దేశీయ, విదేశ కరెన్సీ ఇష్యూయర్ రేటింగ్స్, దేశీయ కరెన్సీ అన్‌సెక్యూర్డ్ రేటింగ్‌ను 'బీఏఏ3'గా నిర్ణయించింది. బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా భవిష్యత్తు అంచనాలనూ 'స్థిరం'గా కొనసాగించింది. ఇతర స్వల్పకాల దేశీయ రేటింగ్‌ను పీ-3 వద్ద ఉంచింది. 'భారత్ తన క్రెడిట్ బలాన్ని కొనసాగిస్తోంది. అత్యంత వేగవంతమైన, బలమైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన విదేశీ మారకపు ద్రవ్యం, దేశీయంగా స్థిరమైన ద్రవ్య పరిస్థితులు ఉండడంతో రేటింగ్‌ను కొనసాగిస్తున్న'ట్లు మూడీస్ వివరించింది. అమెరికా టారిఫ్‌లు, ఇతర అంతర్జాతీయ విధాన చర్యల నేపథ్యంలో.. అనిశ్చితులు ఉన్నా భారత్‌కున్న ఈ బలాల వల్ల తయారీలోకి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందని తెలిపింది.
✦ బలమైన జీడీపీ వృద్ధి, ద్రవ్య స్థిరీకరణ కారణంగా చాలా నెమ్మదిగా ప్రభుత్వానికున్న అధిక రుణ భారం తగ్గుతోంది. ప్రైవేటు వినియోగం పెంచడం కోసం ఇటీవల తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గనుంది. రుణభారం ఎక్కువగా తగ్గే వీలులేదు.
✦ ఆసియా పసిఫిక్ (15-20%) ప్రాంతంతో పోలిస్తే భారత్‌పై అమెరికా విధించిన అధిక సుంకాల (50%) వల్ల భారత ఆర్థిక వృద్ధిపై పరిమిత ప్రతికూల ప్రభావమే ఉండొచ్చు. దీని వల్ల మధ్య-దీర్ఘకాలంలో అధిక విలువ జోడించిన తయారీ ఎగుమతులు చేయాలన్న భారత లక్ష్యాలకు ఇబ్బంది కలగొచ్చు.
✦ అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ఫలిస్తే, సుంకాలు తగ్గుతాయి. ఇతర విధానాల్లో (వీసా ఫీజులు) మార్పులు ఉండకపోవచ్చు.

ఇతర సంస్థలు ఇలా: ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ మాత్రం భారత రేటింగ్‌ను బీబీబీ- నుంచి బీబీబీకు ఆగస్టు 14న సవరించింది. ఇటీవల జపనీస్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ రేటింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్(ఆర్ అండ్ ఐ) కూడా భారత దీర్ఘకాల సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను బీబీబీ నుంచి బీబీబీ+కు సవరించింది.

ఈవీలను గుర్తించేందుకు వీలుగా కృత్రిమ శబ్దం

2027 అక్టోబరు నుంచి తప్పనిసరి



పెట్రోల్/డీజిల్ ఇంజిన్‌తో నడిచే కారు/బస్సు వస్తుంటే.. ఇంజిన్ శబ్దం వల్ల రోడ్డుపై పాదచారులు అప్రమత్తమవుతారు. అదే విద్యుత్ కారు/బస్సు వస్తుంటే తెలియని పరిస్థితి. వీటికి ఇంజిన్ ఉండదు కనుక, శబ్దమే చేయకపోవడం ఇందుకు కారణం. ఈ నేపథ్యంలోనే పాదచారులను, రోడ్డుపై ఉన్నవారిని అప్రమత్తం చేసేలా కృత్రిమ శబ్దం వచ్చే వ్యవస్థను విద్యుత్తు వాహనాల్లో ఏర్పాటు చేయాలని రోడ్డు రవాణా, రహదారుల శాఖ ప్రతిపాదించింది. విద్యుత్ కార్లు, బస్సులు, ట్రక్కులకు అకౌస్టిక్ వెహికిల్ అలర్టింగ్ సిస్టమ్ (అవాస్)ను 2027 అక్టోబరు 1 నుంచి తప్పనిసరి చేయాలని పేర్కొంది. పాదచారులు, ఇతర వాహనదారులకు విద్యుత్ వాహనం ఉనికిని తెలియజేేందుకు కృత్రిమ శబ్దాన్ని ఇది ఉత్పత్తి చేస్తుంది.
✦ 2026 అక్టోబరు 1 తర్వాత తయారు చేసే కొత్త మోడల్ విద్యుత్తు ప్రయాణికులు- సరకు రవాణా వాహనాలను అవాస్ తప్పనిసరిగా ఉండాలని సూచించింది. ఇప్పటికే ఉన్న మోడళ్లలో 2027 అక్టోబరు 1 నుంచి అవాస్ తప్పనిసరని తెలిపింది. అమెరికా, జపాన్, ఐరోపా దేశాల్లో కొన్ని ఇప్పటికే హైబ్రిడ్ వాహనాలలో కూడా అవాస్ వినియోగాన్ని తప్పనిసరి చేశాయి.

జొమాటో 'హెల్దీ మోడ్'



దిల్లీ: ఆహారాన్ని ఆర్డరు పెట్టుకునే సమయంలోనే, పోషక విలువలు గల పదార్థాలను ఎంచుకునేందుకు వీలుగా తమ యాప్‌లో 'హెల్దీ మోడ్' సదుపాయాన్ని ప్రారంభించినట్లు జొమాటో తెలిపింది. ప్రస్తుతానికి ఈ సదుపాయం గురుగ్రామ్‌లో అందుబాటులో ఉందని, క్రమంగా ఇతర నగరాలకూ విస్తరిస్తామని సంస్థ వెల్లడించింది. మెట్రో నగరాల్లో ముఖ్యంగా 18-45 సంవత్సరాల వారు ఆరోగ్యకర ఆహారానికి ప్రాధాన్యమివ్వడాన్ని గమనించే, ఈ కొత్త సదుపాయాన్ని ప్రారంభించినట్లు వివరించింది. రెస్టారెంట్ల వారు పొందుపరిచిన సమాచారంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించుకుని ప్రతి ఆహార పదార్థంలో ఉన్న పోషక విలువలను వెల్లడిస్తామని సంస్థ అంటోంది.

సూచీలు నష్టపోయినా.. సంపద పెరిగింది

డాలర్ రూ.88.75

ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలతో, సూచీలకు ఏడో రోజూ నష్టాలు తప్పలేదు. సోమవారం ప్రారంభమైన ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్న నేపథ్యంలో.. మదుపర్లు అప్రమత్తత పాటించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 3 పైసలు తగ్గి 88.75 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.25% నష్టంతో 69.25 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.95,000 కోట్లు పెరిగి రూ.451.50 లక్షల కోట్లు (5.09 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
✦ సెన్సెక్స్ ఉదయం 162 పాయింట్ల (క్రితం ముగింపు 80,426.46) లాభంతో 80,588.77 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,851.38 వద్ద సూచీ గరిష్ఠాన్ని తాకింది. ఈ దశలో మదుపర్ల లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 80,248.84 వద్ద కనిష్ఠాన్ని తాకినా, చివరకు 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 19.80 పాయింట్లు తగ్గి 24,634.90 దగ్గర స్థిరపడింది.
✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్ 1.91%, మారుతీ 1.65%, ఎల్ అండ్ టీ 1.17%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.01%, భారతీ ఎయిర్‌టెల్ 0.80% డీలాపడ్డాయి. టైటన్ 2.30%, ఎస్‌బీఐ 1.58%, ఎటెర్నల్ 1.18%, ట్రెంట్ 1.08%, బీఈఎల్ 1.05%, ఎన్‌టీపీసీ 1.02% లాభపడ్డాయి.



సెన్సెక్స్ ▼ 62	నిఫ్టీ ▼ 20
80365	24635

✦ జింకుషాల్ ఇండస్ట్రీస్ ఐపీఓ చివరి రోజుకు 65.10 రెట్ల స్పందన లభించింది. ఎన్ఐఐ విభాగంలో 146.39 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 47.10 రెట్లు, క్యూఐబీ విభాగంలో 35.66 రెట్ల స్పందన వచ్చింది.
✦ ముగ్గురు స్వతంత్ర డైరెక్టర్లు ఆకస్మికంగా రాజీనామా చేయడంపై పీటీసీ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. గత కొన్ని రోజుల్లో ముగ్గురు డైరెక్టర్లు సీమా బహుగుణ, నవీన్ భూషన్ గుప్తా, పీవీ భారతీ రాజీనామా చేశారు. కంపెనీ కార్పొరేట్ వ్యవహారాలపై ఈ పరిణామం ప్రశ్నలు లేవనెత్తింది. వీరి పదవీకాలం నవంబరు 15 వరకు ఉంది.

కొత్త షేర్ల నమోదు

✦ అట్లాంటా ఎలక్ట్రికల్స్ షేరు ఇష్యూ ధర రూ.754తో పోలిస్తే 13.80% లాభంతో రూ.858.10 వద్ద బీఎస్ఈలో ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.863.70 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 9.19% లాభంతో రూ.823.35 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,331.28 కోట్లుగా నమోదైంది.
✦ గణేశ్ కన్జూమర్ ప్రొడక్ట్స్ షేరు ఇష్యూ ధర రూ.322తో పోలిస్తే, 8.38% నష్టంతో రూ.295 వద్ద బీఎస్ఈలో ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.291.50 వద్ద కనిష్ఠాన్ని తాకినా, చివరకు 8.71% నష్టంతో రూ.293.95 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,187.94 కోట్లుగా నమోదైంది.


ఐపీఓ సమాచారం

✦ కో-వర్కింగ్ స్పేస్ ఆపరేటర్ వీవర్క్ ఇండియా ఐపీఓ అక్టోబరు 3న ప్రారంభమై 7న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.615-648 నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.3000 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. గరిష్ఠ ధర వద్ద కంపెనీ విలువ రూ.8,685 కోట్లుగా నమోదుకావొచ్చు.
✦ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు సెబీ వద్ద ప్రాథమిక పత్రాలు దాఖలు చేసినట్లు అర్హీ ఇండస్ట్రీస్ తెలిపింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.320 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 3.76 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.
✦ శీల్ బయోటెక్ రూ.34.02 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ సెప్టెంబరు 30న ప్రారంభమై 3న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.59- 63 నిర్ణయించారు.

విలీనాలు.. కొనుగోళ్లు.. ఆర్డర్లు

✦ తమ కంపెనీలో 25% వరకు వాటా కొనుగోలు చేయాలన్న సింగపూర్ సంస్థ టెల్‌ఎక్సెల్ ట్రేడ్ పీటీఈ ప్రతిపాదనను బోర్డు పరిశీలించిందని వెల్‌క్యూర్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ వెల్లడించింది. పెట్టుబడిదారుగా మాత్రమే సింగపూర్ సంస్థను ఆహ్వానిస్తామని, నియంత్రణ హక్కులను ఇవ్వబోమని స్పష్టం చేసింది.
✦ అమ్‌స్టర్‌డామ్ కేంద్రంగా పనిచేసే విసుఫార్మా బీవీని 190 మిలియన్ యూరోలకు కొనుగోలు చేసేందుకు తమ అనుబంధ సంస్థ ననోమీ బీవీ ఒప్పందం కుదుర్చుకుందని లుపిన్ తెలిపింది.
✦ పలు డొమైన్లలో ఎండ్ టూ ఎండ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్పానింగ్ నెట్‌వర్క్, ఐఓటీ, క్లౌడ్, భద్రతతో కూడిన ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలను నిర్మించేందుకు జీఎస్‌టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ నుంచి రూ.కోట్ల విలువైన ఆర్డరు దక్కించుకున్నామని టాటా కమ్యూనికేషన్స్ ప్రకటించింది.

ఒంటి చేత్తో క్రికెట్‌లో సత్తా



మహారాష్ట్రకు చెందిన నితిన్ వాబుల్.. చిన్నతనంలో జరిగిన ఓ ప్రమాదంలో ఎడమ చేతిని పోగొట్టుకున్నారు. అయినా ఆత్మ సైర్యం వీడకుండా పట్టుదలతో తన చిన్న నాటి కలను నెరవేర్చుకున్నారు. దివ్యాంగుల క్రీడల్లో క్రికెటర్‌గా ఎదిగి సత్తా చాటుతున్నారు. కోపర్‌గావ్ తాలూకా సోనేవాడి గ్రామానికి చెందిన నితిన్.. తొలుత చదువు పూర్తి చేసి ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత వివాహం చేసుకున్నారు. అనంతరం తన లక్ష్యం దిశగా అవిశ్రాంతంగా శ్రమించారు. మహారాష్ట్ర దివ్యాంగ క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్ అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాజీవ్ గాంధీ ఛాలెంజర్ సిరీస్‌లో సత్తా చాటి తన జట్టుకు విజయాన్ని అందించారు.

రావణుడికి జిలేబీ మీసాలు



హరియాణాలోని సిర్సాలో జిలేబీ ఆకారపు మీసాలతో రూపొందించిన రావణుడి దిష్టి బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 70 అడుగుల పొడవున్న ఈ బొమ్మలను దిల్లీకి చెందిన కళాకారుడు బాబా భగత్ రూపొందించారు. రావణ, కుంభకర్ణ, మేఘనాథ్ తదితరుల దిష్టిబొమ్మలను తయారు చేశారు. వీటిని లక్షల రూపాయల విలువైన పటాసులతో అలంకరించారు. దసరా పండగ సందర్భంగా అక్టోబరు 2న వీటిని పేల్చి పండగ సంబరాలు చేసుకోనున్నారు. ఈ జిలేబీ మీసాల రావణుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాడు. ఈ బొమ్మలతో సందర్శకులు సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

శ్వేతసౌధం.. స్వర్ణమయం!



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ గోడలను 24 క్యారెట్ల బంగారు తాపడాలతో అలంకరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీస్, క్యాబినెట్ గదిలో భారీగా స్వర్ణ అలంకరణలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్వర్ణ అలంకరణలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. వీడియోలో బంగారు పూతతో ఉన్న డజన్ల కొద్దీ డిజైన్లు కనిపిస్తున్నాయి. వైట్‌హౌస్‌లో స్వర్ణ తాపడాలు చేయించడానికి ఉపయోగించిన బంగారం ఖర్చును ట్రంప్ స్వయంగా భరించినట్లు వైట్‌హౌస్ ప్రతినిధి ఇటీవల పేర్కొన్నారు. ఇప్పటికే ఓవల్ ఆఫీస్‌లో పలు చోట్ల స్వర్ణ తాపడాలు ఉన్నాయి. మిగిలిన చోట్ల కూడా బంగారంతో అలంకరించాలనే తన కోరికను ట్రంప్ పలు మార్లు బయటపెట్టారు.

గాజాపై అమెరికా పరిష్కారానికి సై

- యుద్ధం ముగింపునకు సిద్ధమన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- ట్రంప్‌తో భేటీ తర్వాత ప్రకటన
- ఖతార్‌కు క్షమాపణ

వాషింగ్టన్: గాజాలో యుద్ధం ముగింపునకు అమెరికా సూచించిన 21 సూత్రాల శాంతి ఫార్ములాకు ఇజ్రాయెల్ దాదాపుగా అంగీకరించింది. సోమవారం వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో భేటీ అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ విషయాన్ని ప్రకటించారు. అయితే హమాస్ ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తుందో లేదో అన్న అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు. మరోవైపు ఇటీవల ఖతార్‌పై దాడి చేసినందుకు ఆ దేశానికి నెతన్యాహు క్షమాపణలు చెప్పారు.

'గాజాలో యుద్ధాన్ని ముగించడమే కాదు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఏర్పాట్లు జరగాలని కోరుకుంటున్నా. శాంతి కోసం మీ ప్రణాళికకు మద్దతు తెలుపుతున్నా. అయితే హమాస్ నుంచి మళ్లీ ఇజ్రాయెల్‌కు ముప్పు ఉండకూడదు. ఒప్పందంలో తొలి ఘట్టంగా.. గాజా నుంచి బలగాల దశలవారీ ఉపసంహరణ ఉంటుంది. వెంటనే 72 గంటల్లో బందీలను విడుదల చేయాలి. ఆ తరువాత అంతర్జాతీయ పాలకవర్గం ఏర్పాటు కావాలి. హమాస్ ఆయుధాలను వదిలేయాలి. గాజాను నిరాయుధీకరణ చేయాలి. అంతర్జాతీయ పాలకవర్గం విజయవంతమైతే యుద్ధాన్ని శాశ్వతంగా ముగిస్తాం. హమాస్ నిరాయుధీకరణకు అనుగుణంగా ఇజ్రాయెల్ గాజా నుంచి వైదొలగుతుంది. కానీ భవిష్యత్తు భద్రత దృష్ట్యా చుట్టుపక్కల మోహరించి ఉంటాం' అని నెతన్యాహు వివరించారు. ఈ ప్రణాళికను హమాస్ అంగీకరించాల్సిందేనని, అలా జరగని పక్షంలో ఆ ఉగ్ర సంస్థను అంతం చేసి తీరతామని హెచ్చరించారు.



శ్వేతసౌధం వద్ద ట్రంప్‌తో నెతన్యాహు

యుద్ధం ముగియబోతోంది..

పశ్చిమాసియాలో త్వరలో యుద్ధం ముగియబోతోందని అంతకుముందు ట్రంప్ ధీమాగా చెప్పారు. గాజాలో పరిణామాలపై సోమవారం ట్రంప్, నెతన్యాహు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అమెరికా అధ్యక్షుడి ఒత్తిడి మేరకు ఖతార్ ప్రధాని అబ్దుల్ రహమాన్ బిన్ జస్సిమ్ అల్ థానికి నెతన్యాహు క్షమాపణలు చెప్పారు. ఇటీవల ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడులపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో నెతన్యాహు దిగివచ్చారు.

హూతీల దాడితో మంటల్లో చిక్కుకున్న నౌక

దుబాయ్: గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో సోమవారం నెదర్లాండ్స్ నౌకపై హూతీలు క్షిపణి దాడి చేశారు. దీంతో ఆ నౌక మంటల్లో చిక్కుకుంది. ఈ దాడిలో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. మినర్వాగ్రాట్ అనే ఆ నౌకకు జరిగిన నష్టం తీవ్రమైనదేనని దాని యజమాని స్ప్రీతోఫ్ ప్రకటించారు. సిబ్బందిని హెలికాప్టర్ ద్వారా రక్షించామని వెల్లడించారు. యుద్ధ నౌక ఒకటి ఆ నౌక దగ్గరకు వెళ్తోందని వివరించారు. హూతీల ప్రాబల్యమున్న ప్రాంతం నుంచి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం జరిగిందని యెమెన్ స్థానిక ప్రభుత్వం ప్రకటించింది.

కెనడా ఉగ్ర సంస్థల జాబితాలోకి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్



ఒట్టావా: భయం, భయానక వాతావరణం సృష్టిస్తోందంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేరుస్తున్నట్లు కెనడా సోమవారం ప్రకటించింది. తమ దేశంలో హింస, ఉగ్రవాద చర్యలకు స్థానం లేదని కెనడా ప్రభుత్వం విడుదల చేసిన ఓ ప్రకటనలో దేశ ప్రజా భద్రతా మంత్రి గ్యారీ ఆనంద సంగరీ వెల్లడించారు. ముఖ్యంగా నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకొని భయం, బెదిరింపు వాతావరణాన్ని సృష్టించే కార్యకలాపాలకు తమ దేశంలో చోటులేదన్నారు. భారత జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ ఇటీవల కెనడా ఎన్ఎస్ఏ నథాలీ డ్రౌయిన్‌తో విస్తృత సంప్రదింపులు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో సహకార స్ఫూర్తిని కొనసాగించాలని.. ఉగ్రవాదం, జాతీయ నేరాలపై పోరులో కలిసి పనిచేయాలని రెండు దేశాలు ఈ సందర్భంగా అంగీకరించాయి. ఈ క్రమంలో బిష్ణోయ్ గ్యాంగ్‌పై కెనడా ఉగ్రముద్ర వేయడం గమనార్హం. భారత్ సహా విదేశాల్లో హత్యలు, దోపిడీ, ఆయుధాలు, డ్రగ్స్ రవాణా వంటి నేర కార్యకలాపాలతో లారెన్స్ బిష్ణోయ్, అతని గ్యాంగ్ పేరుగాంచారు. ఎన్‌సీపీ నేత బాబా సిద్దిఖీని దారుణంగా హత్య చేసిన బిష్ణోయ్ ముఠా.. ఇటీవల కపిల్ శర్మ కేఫ్‌పై రెండు సార్లు కాల్పులు జరిపింది. తాజా నిర్ణయంతో కెనడాలోని బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఆస్తులు, వాహనాలు, స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యక్రమాలకు నిధుల సేకరణ, వివిధ నేరాలకు సంబంధించిన కేసుల్లో బిష్ణోయ్ ముఠా సభ్యులను విచారించే అవకాశాలు ఉన్నాయి. కెనడాలోకి ప్రవేశించే బిష్ణోయ్ ముఠా సభ్యులపై ఆ దేశ పోలీసులు నిఘా ఉంచనున్నారు.



ప్రతి ఒక్కరికీ నచ్చేలా జీవించలేం

జీవితంలో మనం ఎంత గొప్ప పని చేసినా, విలువలకు కట్టుబడి ఉన్నతంగా జీవించినా కొంతమందికి ఎప్పటికీ నచ్చం. వారు ఏదో కారణంతో మనల్ని ద్వేషిస్తూనే ఉంటారు. అలాంటి మూర్ఖులను రంజింపజేయడం అసాధ్యం. ఈ వాస్తవాన్ని అంగీకరించినప్పుడే మనం ఇతరులను మెప్పించడానికి ఆరాటపడకుండా మన పని మీదే దృష్టి పెడతాం. అప్పుడే మనపై అనవసర ఒత్తిడి తగ్గుతుంది.

– శామ్యూల్ గ్రిసాంజియొ, మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్

మెలోనీ ఆత్మకథకు మోదీ ముందుమాట

దిల్లీ: ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ ఆత్మ కథకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ముందు మాట రాశారు. వీరిద్దరూ అంతర్జాతీయ వేదికలపై కలుసుకొన్నప్పుడు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటారనే సంగతి తెలిసిందే. ఈ స్నేహంతో మెలోనీ పుస్తకానికి మోదీ ముందు మాట రాశారు. 'అయాం జార్జియా- మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' పేరిట రాసిన ఆమె ఆత్మ కథ ఇండియన్ ఎడిషన్‌ను త్వరలో మార్కెట్‌లోకి తీసుకురానున్నారు. దీన్ని 'హర్ మన్‌కీ బాత్' అని మోదీ అభివర్ణించారు. అది తనకు దక్కిన గొప్ప గౌరవమని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ప్రధాని మెలోనీ జీవితం, నాయకత్వం.. కాలంతో సంబంధంలేని సత్యాలను మనకు గుర్తు చేస్తాయి. ఈ ఉత్తేజకర జీవిత చరిత్రకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుంది' అని రాసుకొచ్చారు. సాంస్కృతిక వారసత్వం, సమానత్వంపై మెలోనీకి అమితమైన విశ్వాసం ఉందని కొనియాడారు. ఎన్నో అంశాల్లో ఇరు దేశాల మధ్య సారూప్యతలు ఉన్నాయన్నారు. ఈ పుస్తకం తొలుత 2021లోనే ప్రచురితం కాగా.. బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. అప్పుడు మెలోనీ విపక్షంలో ఉన్నారు. 2025 జూన్‌లో దీన్ని అమెరికాలో విడుదల చేశారు. అప్పుడు దానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు ముందు మాట రాశారు. ఈ పుస్తకంలో మెలోనీ తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఎన్నికల ప్రచార సమయంలో గర్భిణిగా, అవివాహితురాలైన తల్లిగా పడిన ఇబ్బందులను ప్రస్తావించారు.



కేంద్ర ఉద్యోగులకు రూ.6,908 అనుత్పాదకత ఆధారిత బోనస్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే గ్రూప్-సితోపాటు, గ్రూప్-బిలో పనిచేసే నాన్‌గెజిటెడ్ ఉద్యోగులందరికీ 2024-25 సంవత్సరానికి అనుత్పాదకత ఆధారిత బోనస్(నాన్ ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్) ప్రకటిస్తూ ఆర్థికశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పైనపేర్కొన్న కేటగిరీల్లోకి వచ్చే ఉద్యోగులకు గరిష్ఠంగా రూ.6,908 వరకు బోనస్ లభించనుంది. కేంద్ర పారామిలిటరీ దళాలు, సాయుధదళాల్లో పనిచేసే అర్హులైన ఉద్యోగులకూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో పనిచేసే వారికీ ఇది వర్తిస్తుంది. ఈ బోనస్ పొందాలంటే 2024-25లో వరుసగా కనీసం 6 నెలలు పనిచేసి ఉండాలి. 2025 మార్చి 31నాటికి సర్వీస్‌లో ఉండాలి. ఏడాదిపాటు పనిచేసిన వారికి పూర్తిగా, అంతకంటే తక్కువ పనిచేసిన వారికి.. పనిచేసిన రోజుల నిష్పత్తి ప్రాతిపదికన ఈ మొత్తం అందుతుంది. రోజువారీ వేతనం ఆధారంగా పనిచేసే క్యాజువల్ లేబర్‌కు రూ.1,184 బోనస్ ఇస్తారు.

నేడు బిహార్ తుది ఓటరు జాబితా విడుదల

దిల్లీ: బిహార్‌లో అనేక వివాదాలకు నెలవుగా మారిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పూర్తి చేసిన ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం తుది ఓటరు జాబితాను ప్రకటించనుంది. ఇంత ముమ్మర స్థాయిలో ఓటరు జాబితా సవరణ 22 ఏళ్ల తర్వాత నిర్వహించారు. తుది జాబితా ప్రకటించడం పూర్తయ్యాక వచ్చేవారం బిహార్ శాసనసభ ఎన్నికల షెడ్యూలును కూడా ప్రకటించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. అక్టోబరు చివరలో ఛట్ పండగ తర్వాత తొలి దశ ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. బిహార్ ఎన్నికలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరగనున్న ఉప ఎన్నికల కోసం ఈసీ 470 మంది పరిశీలకుల్ని నియమించింది. వచ్చేనెల 3న సాధారణ, పోలీసు, వ్యయ పరిశీలకుల వివరాలపై ప్రకటన వెలువడుతుందని అభిజ్ఞవర్గాలు వెల్లడించాయి.



7.24 కోట్ల మంది ఓటర్లకు స్థానం

243 మంది సభ్యులు కలిగిన బిహార్ శాసనసభ కాల పరిమితి నవంబరు 22తో ముగుస్తుంది. బిహార్‌లో గత శాసనసభ ఎన్నికలను కొవిడ్-19 మహమ్మారి విజృంభణ అనంతర పరిస్థితుల్లో నిర్వహించారు. తాజా ఎస్ఐఆర్‌కు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను గత ఆగస్టు 1న ప్రచురించారు. దీనిపై అభ్యంతరాలు, అభ్యర్థనలు సమర్పించేందుకు సెప్టెంబరు 1 వరకూ సమయం ఇచ్చారు. ముసాయిదా ఓటరు జాబితాలో 7.24 కోట్ల మంది ఓటర్లకు స్థానం లభించింది. ఎస్ఐఆర్ నిర్వహించిన తీరు కోట్ల మంది సిసలైన భారత పౌరులకు ఓటు వేసే అధికారం లేకుండా చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరునూ జాబితా నుంచి తొలగించబోమని ఈసీ హామీ ఇచ్చింది.

'కాంతారా ఛాప్టర్-1' టికెట్ ధరల పెంపునకు ఓకే

కళ మనుషుల్ని కలపాలనే విశాల దృక్పథంతో నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడి

ఈనాడు, అమరావతి: కన్నడ నటుడు రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటించిన 'కాంతారా ఛాప్టర్-1' సినిమా టికెట్ ధరలు పెంపునకు అనుమతివ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కళ మనసుల్ని, మనుషుల్ని కలపాలే తప్ప విడదీయకూడదనే విశాల దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తెలుగు సినిమాలు కర్ణాటకలో విడుదలైనప్పుడు ఆటంకాలు కల్పిస్తున్నారని, టికెట్ ధరలు పెంచడం లేదని.. ఈ నేపథ్యంలో అక్కడి సినిమాలకు ఏపీలో టికెట్ ధరలు పెంచటంపై తెలుగు సినీ వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ విషయంలో పునరాలోచించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరాయి. కర్ణాటకలోని పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఇబ్బంది పెట్టటం భావ్యం కాదని, పెద్ద మనసుతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సినిమాటోగ్రఫీ, హోం శాఖ అధికారులకు సోమవారం స్పష్టం చేశారు. 'కాంతారా ఛాప్టర్-1' సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతివ్వాలని ఆదేశించారు.

వేరుగా చూడొద్దు: పవన్ కల్యాణ్

ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆ శాఖ అధికారులతో చర్చించారు. 'సినిమా అనేది భిన్న కళల సమాహారం. అందుకే పరభాషా చిత్రం అనే పేరుతో మన రాష్ట్రంలో వేరుగా చూడాల్సిన అవసరం లేదు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కాలం నుంచి ఇప్పుడు కిచ్చా సుదీప్, ఉపేంద్ర, శివరాజ్‌కుమార్, రిషబ్‌శెట్టి వరకూ అందర్నీ తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. సోదరభావంతో మెలుగుతున్నాం. తెలుగు సినిమాకు వ్యాపారపరంగా ఎదురవుతున్న ఇబ్బందుల్ని రెండు భాషల ఫిల్మ్ ఛాంబర్స్ కూర్చొని మాట్లాడుకోవాలి. ఆ తర్వాత ప్రభుత్వ పరంగా మనం మాట్లాడదాం' అని పవన్ స్పష్టం చేశారు.

కరవు అన్నదే రావద్దు.. కలెక్టర్లదే బాధ్యత: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని జలాశయాలతోపాటు చిన్నచిన్న చెరువులూ నింపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు చెప్పారు. 'మరో నెల రోజులు మాత్రమే వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమలో ఇంకా 9 టీఎంసీల నీటిని చెరువుల్లో నింపాలి. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి. జిల్లా కలెక్టర్లే బాధ్యత తీసుకోవాలి. భూగర్భ జలాలు పెరగాలి. కరవు అనేదే తలెత్తకూడదు' అని స్పష్టం చేశారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జలవనరులశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'కృష్ణా, గోదావరి నదుల నుంచి వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోంది. మరోవైపు 200 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు పోరాడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో నీటి విలువ గుర్తించి పనిచేయండి. రాష్ట్రంలో 19 లక్షల వ్యవసాయ పంపుసెట్లతో లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోంది. వీటికోసం భూగర్భజలాలు పెంచడం తప్పనిసరి' అని సీఎం చెప్పారు.

కరూర్ మృతులు.. 41 మంది

- తొక్కిసలాట బాధితులకు కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ పరామర్శ

ఈనాడు, చెన్నై: కరూర్ తొక్కిసలాటలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుగుణ(65) అనే మహిళ సోమవారం మృతి చెందారు. దీంతో దుర్ఘటనలో చనిపోయిన వారి సంఖ్య 41కి చేరింది. ఇప్పటికీ 11 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వారు కరూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఐసీయూలో ఉన్నారు. మొత్తం 110 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా... వారిలో 51 మంది సోమవారం డిశ్చార్జి అయినట్లు అధికారులు చెప్పారు.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ సోమవారం కరూర్ వచ్చి తొక్కిసలాట స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడారు. తొక్కిసలాటలో ఏమూర్ పుత్తూర్ గ్రామానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో నిర్మల వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట కేంద్రమంత్రి ఎల్.మురుగన్ ఉన్నారు.



కరూర్ తొక్కిసలాటలో చనిపోయిన వారి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న నిర్మలాసీతారామన్

విజయ్‌కు రాహుల్ ఫోన్: టీవీకే అధినేత విజయ్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్‌చేసి మాట్లాడారు. మృతులకు సంతాపాన్ని ప్రకటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కూ రాహుల్ ఫోన్‌కు చేశారు. మృతుల కుటుంబాల పరిస్థితి, ప్రభుత్వ సహాయ చర్యల్ని అడిగి తెలుసుకున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిసామి కూడా విజయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

చైనా, శ్రీలంక సంతాపం

తొక్కిసలాట మృతులకు చైనా, శ్రీలంక దేశాలు సంతాపం ప్రకటించాయి. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ పేర్కొన్నారు. తొక్కిసలాట మృతులకు సంతాపం తెలుపుతూ శ్రీలంక ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

కరూర్‌కు ఎన్డీయే ప్రత్యేక కమిటీ

8 మంది బృందంలో... తెదేపా ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌కు స్థానం

ఈనాడు, దిల్లీ: కరూర్ తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితుల పరిశీలనకు 8 మంది ఎన్డీయే ఎంపీలతో భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా కమిటీని ఏర్పాటుచేశారు. భాజపా సీనియర్ ఎంపీ, సినీనటి హేమామాలిని (ఉత్తర్‌ప్రదేశ్) కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో తెదేపా ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ (ఏలూరు-ఏపీ)ను సభ్యుడిగా నియమించారు. భాజపా ఎంపీలు అనురాగ్ ఠాకూర్ (హిమాచల్ ప్రదేశ్), తేజస్వి సూర్య (కర్ణాటక), బ్రిజ్‌లాల్ (ఉత్తర్‌ప్రదేశ్), అపరాజిత షడంగి (ఒడిశా), జాతీయ మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్, ఎంపీ రేఖాశర్మ (హరియాణా), శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే(మహారాష్ట్ర)లకు అవకాశం కల్పించారు. ఈ బృందం కరూర్‌లో పర్యటించి, తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తుంది. భాజపా అధ్యక్షుడికి నివేదికను అందిస్తుంది.

కావాలనే విజయ్ ఆలస్యంగా వచ్చారు

- రద్దీ పెంచి.. బలం చూపించాలనేదే ఆయన ఉద్దేశం
- ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పోలీసులు

ఈనాడు, చెన్నై: కరూర్ తొక్కిసలాటపై పోలీసులు నమోదుచేసిన కేసు వివరాలు బయటికొచ్చాయి. టీవీకే అధినేత విజయ్ సభకు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా వచ్చారని, నిబంధనలనూ అతిక్రమించారని పోలీసులు అభియోగాలు మోపారు. 'ఈనెల 27న మధ్యాహ్నం 12 గంటలకు విజయ్ సభాస్థలికి వస్తారని ఉదయం 9 నుంచే పలు టీవీల్లో టీవీకే ప్రచారం చేపట్టింది. 10 వేల మంది వస్తారని పార్టీ సభ్యులు చెప్పగా, 25 వేల మందికి పైగా వచ్చారు. విజయ్ సాయంత్రం 4.45 గంటలకే కరూర్ జిల్లా సరిహద్దుకు వచ్చినా.. అక్కడ వాహనాల్ని ఆపి ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారు. 6 గంటలకు రహదారికి కుడివైపు... అనుమతి లేకున్నా రోడ్డుషో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మార్గమధ్యంలో తన వాహనంలోనే ఉండి కార్యకర్తలతో మాట్లాడారు. అప్పటికే జనం కిక్కిరిసినా సభకు రాలేదు. రద్దీ మరింత పెరిగేలా చేసి.. రాజకీయ బలం చూపించేందుకు ఇలా వ్యవహరించారు. పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందని పార్టీ నేతలు మదియళగన్, బుస్సీ ఆనంద్, సీటీఆర్ నిర్మల్‌కుమార్‌ను హెచ్చరించినా పట్టించుకోలేదు' అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

తొక్కిసలాట వెనక కుట్రకోణం ఉంది

- సీబీఐతో విచారణ చేయించండి
- మద్రాస్ హైకోర్టుకు విన్నవించిన టీవీకే

ఈనాడు, చెన్నై: తొక్కిసలాట వెనక కుట్ర ఉందని టీవీకే నాయకుడు ఆదవ్ అర్జున మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌కు సోమవారం విన్నవించారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. సభ నిర్వహణ సమయంలో పోలీసులు, స్థానిక రాజకీయ నాయకులు.. కొంతమంది గూండాలతో చేతులు కలిపి అడ్డంకులు సృష్టించారని ఆయన ఆరోపించారు. విజయ్ ప్రసంగానికి ముందు ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాను తొలగించారని, జనరేటర్ సాయంతో సభను నిర్వహించాల్సి వచ్చిందన్నారు. సభలో ప్రసంగిస్తున్న విజయ్‌పైకి, జనంమీదకు చెప్పులు, రాళ్లు విసిరారని పేర్కొన్నారు. పోలీసులు, గూండాలు కలిసి రోగుల్లేని అంబులెన్స్‌లను జనంలోకి అనుమతించారని ఆరోపించారు. ఆ సమయంలో జనంపై పోలీసులు అనవసరంగా లాఠీఛార్జి చేశారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాల్ని కోర్టుకు అందిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలకు తెల్లవారేలోపే పోస్టుమార్టం ఎందుకు చేశారో విచారణ జరపాలన్నారు. అర్ధరాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్ కరూర్‌కు రాగానే ఎంబ్లమ్‌లు అంటించి మరీ మృతదేహాల్ని సిద్ధంగా ఉంచారని ఆరోపించారు. ఈ పిటిషన్ అక్టోబరు 3న విచారణకు రానుంది.

విజయ్ ప్రసంగించేటప్పుడు... విద్యుత్‌ను నిలిపేయాలని లేఖ ఇచ్చారు

- టీవీకే నాయకుల అభ్యర్థనను తిరస్కరించా
- తమిళనాడు విద్యుత్ బోర్డు చీఫ్ ఇంజినీర్ రాజ్యలక్ష్మి

సైదాపేట, న్యూస్‌టుడే: కరూర్‌లో 27న పెద్దసంఖ్యలో తరలివచ్చే ప్రజలను ఉద్దేశించి టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రసంగిస్తారని... ఆ సమయంలో కొంతసేపు విద్యుత్ సరఫరాను ఆపేయాలంటూ ముందురోజు(26న) ఆ పార్టీ నిర్వాహకులు లేఖ ఇచ్చినట్లు తమిళనాడు విద్యుత్ బోర్డు చీఫ్ ఇంజినీర్ రాజ్యలక్ష్మి చెప్పారు. అయితే వారి అభ్యర్థనను తాను తిరస్కరించినట్లు ఆమె పేర్కొన్నారు. విజయ్ సభకు ఎలాంటి ఆటంకమూ లేకుండా విద్యుత్ సరఫరా చేసినట్లు చెప్పారు. ప్రసంగ సమయంలో విడుదలైన ఫొటోలు, వీడియోల్లో వీధి దీపాలు, దుకాణాల్లో లైట్లు వెలుగుతుండటం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. టీవీకే నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ లైట్లు మాత్రం జనం రద్దీ కారణంగా ఆఫ్ అయ్యాయని చెప్పారు. విజయ్ వచ్చే ముందు చెట్లు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లపై కొంతమంది ఎక్కారని పోలీసుల సూచన మేరకు కాసేపు సరఫరా ఆపేసి, వారిని దింపేసిన వెంటనే పునరుద్ధరించినట్లు వివరించారు.

సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రభుత్వం ఉపసంహరించాలి


కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

ఈనాడు, అమరావతి: విద్యుత్తు వినియోగదారులపై విధించిన రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. అలాగే అమల్లో ఉన్న విద్యుత్తు ఛార్జీల్లో 30% మేర తగ్గిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన మాటకు చంద్రబాబు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో ప్రజలపై రూ. 15,780 కోట్ల ట్రూ అప్ భారం మోపింది. ట్రూ డౌన్‌తో తగ్గిన భారం రూ.923 కోట్లు తిరిగి చెల్లించాలని రెగ్యులేటరీ కమిషన్ మొట్టికాయ వేసింది. అయితే, కూటమి ప్రభుత్వం ఛార్జీలు తగ్గించిందని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు' అని షర్మిల మండిపడ్డారు.

EENADU Vol: 52, Issue: 51 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


కోతలేకుండానే ప్రోస్టేట్‌కు పరిష్కారం

శస్త్రచికిత్సతో పనిలేకుండా, అనస్థీషియా ఇవ్వకుండా చర్మం మీద చిన్న రంధ్రంతోనే ప్రోస్టేట్ ఉబ్బుకు చికిత్స చేస్తే? ప్రోస్టేట్ గ్రంథిని అసలు ముట్టుకోకుండా, చుట్టుపక్కల భాగాలను తాకకుండా, రక్తస్రావమేదీ లేకుండానే సమస్యను తగ్గిస్తే? అదీ ఒకట్రెండు గంటల్లోనే చికిత్స పూర్తయితే? ప్రోస్టేటిక్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (పీఏఈ) ప్రక్రియ ఇలాంటి సౌకర్యమే కలిగిస్తోంది. మూత్ర విసర్జన చిక్కులతో చికాకు పెట్టే ప్రోస్టేట్ గ్రంథి ఉబ్బును మూలంలోనే అరికట్టటం దీని ప్రత్యేకత. పెద్ద సమస్యకు తేలికగా పరిష్కారం చూపుతున్న దీనికి రోజురోజుకీ ప్రాధాన్యం పెరుగుతోంది.



డా॥ అర్జున్‌రెడ్డి
చీఫ్ వ్యాస్కులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్
రివియా వ్యాస్కులర్ ఇన్‌స్టిట్యూట్
గచ్చిబౌలి, హైదరాబాద్

ప్రోస్టేట్ గ్రంథి మగవారికే ప్రత్యేకం. అందుకే దీన్ని పౌరుష గ్రంథి, అష్ఠీల గ్రంథి అనీ పిలుస్తుంటారు. ఇది మూత్రాశయం కింద చిన్న నిమ్మకాయ సైజులో మూత్రమార్గం చుట్టూరా కరచుకొని ఉంటుంది. వృషణాల్లో తయారయ్యే శుక్ర కణాలు ప్రోస్టేట్ గ్రంథిలో తయారయ్యే స్రావాలతో కలిసే వీర్యం రూపంలో బయటకు వస్తాయి. అయితే వయసు మీద పడుతున్నకొద్దీ.. ముఖ్యంగా మధ్యవయసు దాటాక లైంగిక హార్మోన్ల సమతుల్యత దెబ్బతినటం వల్ల గ్రంథి సైజు పెద్దగా అవుతూ వస్తుంటుంది. ఇది వయసుతో పాటు తలెత్తే మామూలు మార్పే గానీ క్యాన్సర్‌తో ఎలాంటి సంబంధమూ లేదు. కాబట్టే దీన్ని బినైన్ ప్రోస్టాటిక్ హైపర్‌ప్లేసియా (బీపీహెచ్) అంటారు. చాలామంది మగవారు జీవితంలో ఎప్పుడో అప్పుడు దీన్ని ఎదుర్కొనేవారేనన్నా అతిశయోక్తి కాదు. యాభై ఏళ్లు దాటిన ప్రతి ముగ్గురిలో ఇద్దరు ప్రోస్టేట్ ఉబ్బు బారినపడటం గమనిస్తుంటాం. మధుమేహం, ఊబకాయం వంటివీ దీన్ని ప్రేరేపించొచ్చు. కొందరికి జన్యు స్వభావం రీత్యా మధ్యవయసులోనూ రావొచ్చు.



ఇలా చేస్తారు

శరీరంలో ఏ భాగం సజీవంగా ఉండాలన్నా, వృద్ధి చెందాలన్నా రక్తం కావాలి. మరి రక్తం అందకుండా చేస్తే? కణజాలం చచ్చుబడుతుంది కదా. ప్రోస్టేటిక్ ఆర్టరీ ఎంబోలైజేషన్‌లోని కిటుకు ఇదే. గుండెకు యాంజియోగ్రఫీ చేసినట్టుగా, రక్తనాళం ద్వారా గొట్టాన్ని పంపించి చికిత్స చేయటం దీని ప్రత్యేకత. ఇందులో గజ్జల వద్ద గానీ మణికట్టు వద్ద గానీ చిన్న రంధ్రం చేసి, సన్నటి గొట్టాన్ని రక్తనాళంలోకి జొప్పిస్తారు. ఇది ఇమేజ్ గైడెడ్ ప్రక్రియ. అంటే లోపలికి వర్ణద్రవ్యాన్ని ఎక్కించి, ఫ్లోరోస్కోపీతో చూస్తూ చేస్తారన్నమాట. ముందు ప్రోస్టేట్ గ్రంథికి రక్తాన్ని సరఫరా చేసే నాళాన్ని గుర్తిస్తారు. తర్వాత అతి సూక్ష్మంగా, మైక్రాన్ల సైజులో ఉండే పూసలను (ఎంబోస్ఫేర్స్) నాళంలోకి జొప్పిస్తారు. అవి అక్కడే స్థిరపడి, కుదురుకుంటాయి. దీంతో రక్తనాళం మూసుకుపోయి, రక్త ప్రవాహం నిలిచిపోతుంది. ఫలితంగా ప్రోస్టేట్ గ్రంథి సైజు తగ్గుతుంది. మెత్తబడుతుంది కూడా. అందువల్ల మూత్రమార్గం మీద ఒత్తిడి తగ్గి, విసర్జన సాఫీగా అవుతుంది. ఇబ్బందులు తొలగిపోతాయి.

చికిత్స అనంతరం

కొద్దిరోజుల్లోనే రోజువారీ పనులు చేసుకోవచ్చు. ఓ వారం నుంచి పది రోజుల వరకు మూత్రం పోస్తున్నప్పుడు మంట, కొద్దిగా అసౌకర్యం, మూత్రం ఎక్కువసార్లు రావటం, గ్రంథి కణజాలం చచ్చుబడుతూ రావటం వల్ల స్వల్పంగా రక్తం పడటం వంటివి ఉండొచ్చు. అంతకుమించి పెద్దగా ఇబ్బందులేమీ ఉండవు.

- రెండు, మూడు వారాల్లోనే ఫలితం కనిపించటం మొదలవుతుంది. అయితే కణజాలం చనిపోయి, గ్రంథి సైజు పూర్తిగా తగ్గటానికి మూడు నెలలు పట్టొచ్చు. అప్పటివరకూ ప్రోస్టేట్ ఉబ్బుకు వాడుతున్న మందులు కొనసాగించాల్సి ఉంటుంది.
- చికిత్స తీసుకున్నాక పదేళ్లలోపు 20-25% మందికి తిరిగి గ్రంథి పెద్దగా అవ్వచ్చు. వీరికి రెండోసారి చికిత్స అవసరమవుతుంది.

ప్రయోజనాలు ఎన్నెన్నో..

- **చిన్న రంధ్రంతోనే:** పీఏఈలో ప్రోస్టేట్ గ్రంథికి కోత పెట్టాల్సిన అవసరముండదు. చర్మం మీద చిన్న రంధ్రం గుండానే చేస్తారు.
- **గొట్టం వేయరు:** ఇతర ప్రోస్టేట్ శస్త్రచికిత్సల మాదిరిగా ఇందులో మూత్రమార్గం గుండా గొట్టం వేయాల్సిన పనుండదు. అందువల్ల సౌకర్యంగా ఉంటుంది.
- **శృంగార జీవితం హాయిగా:** కొన్ని ఇతర శస్త్రచికిత్సల మాదిరిగా ఇందులో స్తంభనలోపం, వీర్యం వెనక్కి వెళ్లటం వంటి దుష్ప్రభావాలు ఉండవు. శృంగార జీవితం హాయిగా సాగుతుంది.
- **త్వరగా కోలుకోవటం:** అనస్థీషియా ఇవ్వకపోవటం, రక్తస్రావం లేకపోవటం వల్ల త్వరగా కోలుకుంటారు. ఒకట్రెండు గంటల్లోనే చికిత్స పూర్తవుతుంది. అదే రోజు ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిపోవచ్చు.
- **పెద్ద గ్రంథులకు ఉపయుక్తం:** ఇతర ప్రక్రియల్లో గ్రంథి పెద్దగా ఉంటే చికిత్స కష్టమవుతుంది. కానీ గ్రంథి ఎంత పెద్దగా ఉన్నా పీఏఈ చేయొచ్చు. గ్రంథి బరువు 40 గ్రాముల కన్నా ఎక్కువగా ఉన్నవారికిది బాగా ఉపయోగపడుతుంది.
- **సర్జరీ వీలుకానప్పుడూ:** సర్జరీలు సాధ్యం కానివారికి, సర్జరీ ఇష్టం లేనివారికి, మత్తుమందు తట్టుకోలేనివారికి ఇది మంచి అవకాశం. ఆ భాగంలోనే మత్తు కలిగేలా చేస్తారు కాబట్టి 75, 80 ఏళ్ల పైబడ్డవారికీ చేయొచ్చు.

- ఇలాంటి ప్రయోజనాల మూలంగానే ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ప్రోస్టేట్ ఉబ్బుకు ప్రధాన చికిత్సల్లో దీన్ని ఒకటిగా పరిగణిస్తున్నారు. ఇతర దేశాల్లో చాలామంది ఇప్పుడు దీనికే ప్రాధాన్యం ఇస్తున్నారు. జీవితాంతం మందులు వాడుకోవటం కన్నా ఒకట్రెండు గంటల్లోనే ముగిసే పీఏఈకే మొగ్గు చూపుతున్నారు. కాకపోతే అధునాతన 3డీ ఇమేజింగ్ సదుపాయాలున్న క్యాథ్‌ల్యాబ్‌లో, మంచి నిపుణులతో చేయించుకోవాలి. అప్పుడే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి.

చికాకు పెట్టే లక్షణాలు

ప్రోస్టేట్ గ్రంథి ఉబ్బుతున్నకొద్దీ మూత్రమార్గాన్ని నొక్కటం మొదలెడుతుంది. ఇది మూత్ర విసర్జనలో ఇబ్బందులు కలగజేస్తుంది. ● పోయటం ఆరంభించినప్పుడు వెంటనే మూత్రం రాకపోవటం ● ధార సన్నబడటం, వేగం మందగించటం ● మూత్రం పోయటానికి ముక్కాల్సి రావటం ● లోపల మూత్రం ఇంకా మిగిలి ఉందని, పూర్తిగా ఖాళీ కాలేదని అనిపించకపోవటం ● మూత్రాన్ని ఆపలేకపోవటం. వస్తున్నట్టు అనిపించిన వెంటనే బాత్రూమ్‌కు పరుగెత్తాల్సి రావటం ● ఎక్కువ సార్లు మూత్రం రావటం. విసర్జన అనంతరం మూత్రం చుక్కలుగా పడటం ● మూత్రం పోయటానికి రాత్రిపూట ఎక్కువసార్లు నిద్ర లేవటం ● కొన్నిసార్లు మంట, నొప్పి కూడా ఉండొచ్చు.

ముదిరితే ప్రమాదం

చికిత్స చేయించుకోవటానికి భయపడి కొందరు ప్రోస్టేట్ ఉబ్బును నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది ప్రమాదకరం. విసర్జన సాఫీగా కాకపోయినా, లోపల మూత్రం మిగులుతున్నా మూత్రాశయం మీద ఒత్తిడి పడి, దెబ్బతినొచ్చు. కొందరికి పూర్తిగా మూత్రం ఆగిపోవచ్చు కూడా. మరీ తీవ్రమైతే కిడ్నీలూ దెబ్బతినే అవకాశముంది.

మందులు, శస్త్రచికిత్సలున్నాయి గానీ

ప్రోస్టేట్ ఉబ్బినా అందరికీ చికిత్స అవసరముండకపోవచ్చు. లక్షణాలు ఇబ్బంది పెడుతుంటే మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. వీరికి సాధారణంగా ఆల్ఫా బ్లాకర్లు ఇస్తుంటారు. ఇవి గ్రంథిలోని మృదు కణజాలాన్ని వదులుగా చేస్తాయి. కొందరికి 5 ఆల్ఫా రిడక్టేస్ ఇన్‌హిబిటర్స్ రకం మందులిస్తారు. ఇవి యాక్టివ్ టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులను తగ్గించటం ద్వారా సైజు పెరగకుండా చూస్తాయి. అయితే హార్మోన్ మందుల వాడకంపై భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరికి మూడ్ మారటం, లైంగికాసక్తి తగ్గటం వంటి దుష్ప్రభావాలు ఉండొచ్చు.

● మాత్రలతో ఫలితం కనిపించనివారికి ట్రాన్స్‌యురెత్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్ (టీయూఆర్‌పీ), లేజర్ అబ్లేషన్, ట్రాన్స్‌యురెత్రల్ వాటర్ వేపర్ థెరపీ (రెజుమ్), యూరో లిఫ్ట్ వంటి శస్త్రచికిత్స పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇవన్నీ మూత్రమార్గం లోపలి నుంచి గొట్టాన్ని పంపించి, చేసేవే. ఇవి కొన్నిసార్లు అసౌకర్యంగా అనిపించొచ్చు. కొన్ని చికిత్సల్లో గ్రంథిని మొత్తంగా గానీ కొంత భాగాన్ని గానీ కత్తిరించి, తొలగిస్తారు. వీళ్లు కోలుకోవటానికి ఎక్కువ సమయం పట్టొచ్చు. కొందరికి సర్జరీ అనంతరం మూత్రమార్గంలో ఎక్కువరోజులు పైపు పెట్టుకోవాల్సి రావొచ్చు. ఇలాంటి దుష్ప్రభావాలను తగ్గించటానికే ప్రత్యామ్నాయ చికిత్సల కోసం అన్వేషిస్తున్నారు. ఇక్కడే ప్రోస్టేటిక్ ఆర్టరీ ఎంబోలైజేషన్ ప్రక్రియ ఆదుకుంటోంది. ఇది శాస్త్రీయంగా నిరూపితమైన ప్రక్రియ. అమెరికా ఎఫ్‌డీఏ వంటి అంతర్జాతీయ సంస్థలెన్నో దీనికి అనుమతించాయి.

కొన్ని పరీక్షలు

పీఏఈ చికిత్సకు ముందు అది వయసుతో పాటు వచ్చిన మార్పా? క్యాన్సరా? ఇతరత్రా సమస్యలేవైనా ఉన్నాయా? అనేది తెలుసుకోవటం ముఖ్యం. అందువల్ల కొన్ని పరీక్షలు అవసరమవుతాయి.

- **ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ (పీఎస్ఏ):** ఇది నార్మల్‌గా ఉంటే వయసుతో పాటు వచ్చిన ఉబ్బుగా భావిస్తారు. ఎక్కువుంటే క్యాన్సర్ ఉండే అవకాశముంది. అప్పుడు బయాప్సీ వంటి ఇతర పరీక్షలు చేయాల్సి ఉంటుంది.
- గ్రంథి తీరుతెన్నులను తెలిపే అల్ట్రాసౌండ్, మూత్ర ప్రవాహాన్ని సూచించే యూరోఫ్లోమెట్రీ పరీక్షలూ చేస్తారు.

థైరాయిడ్ మందులు ఆపేయొచ్చా?

సమస్య సలహా

సమస్య: నాకు 48 ఏళ్లు. థైరాయిడ్ సమస్య ఉంది. మందులు వాడుతున్నాను. టీ3, టీ4, టీఎస్‌హెచ్ నార్మల్‌గా ఉన్నాయి. ఇప్పుడు నేను మందులు ఆపేయొచ్చా? లేకపోతే కొనసాగించాలా?

– మచ్చ వీర్రాజు, కరజాడ, శ్రీకాకుళం జిల్లా

సలహా: థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయనివారికి టీ3, టీ4 హార్మోన్లు తగినంత విడుదల కావు. అప్పుడు గ్రంథిని ప్రేరేపించటానికి టీఎస్‌హెచ్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. టీ3, టీ4 హార్మోన్ల లోపాన్ని భర్తీ చేయటానికే మందులు ఇస్తారు. మీరు మందులు వాడుతుండటం, మందుల మోతాదు సరిపోవటం వల్లనే ఇవి నార్మల్‌గా ఉన్నాయని గుర్తించాలి. అందువల్ల మందులు అలాగే కొనసాగించాలి. ఆపేస్తే తిరిగి ఎక్కువయ్యే ప్రమాదముంది. తరచూ హార్మోన్ల మోతాదుల పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఆరు నెలల తర్వాత చేయించుకుంటే చాలు. అయితే మీకు సమస్య ఎంత తీవ్రంగా ఉందో, ఎంత మోతాదులో మందులు వాడుతున్నారో తెలియజేయలేదు. సమస్య మామూలుగా ఉంటే కొందరిలో నయమయ్యే అవకాశమూ ఉంటుంది. ఒకవేళ మీరు తక్కువ మోతాదులో.. అంటే 12.5 మైక్రోగ్రామ్స్, 25 మైక్రోగ్రామ్స్ మోతాదులో మాత్రమే మందులు వేసుకుంటున్నట్టయితే వీటిని ఆపేసి, ఆరు వారాల తర్వాత ఓసారి పరీక్షించుకోండి. ఎందుకంటే థైరాయిడ్ మందులు ఆపేసినా ఆరు వారాల వరకూ టీ3, టీ4 మోతాదులు నార్మల్‌గానే ఉంటాయి. ఆ తర్వాతే పెరుగుతాయి. మీకు ఇవి నార్మల్‌గా ఉన్నట్టయితే మందులు ఆపేయొచ్చు. పెరిగితే మాత్రం జీవితాంతం మందులు కొనసాగించాలి. అయితే థైరాయిడ్ సమస్య అదుపులో ఉన్నట్టు కచ్చితంగా నిర్ధారణ అయిన తర్వాతే, అదీ డాక్టర్ సలహా మేరకే మందులు ఆపాల్సి ఉంటుందని గుర్తించాలి.





- డా॥ కె.డి.మోడీ,
సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

కీళ్లవాతం నిశ్శబ్దంగా



లక్షణాలు కనిపించటానికి చాలాకాలం ముందు నుంచే కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్) చడీచప్పుడు లేకుండా ఒంట్లో పురుడు పోసుకుంటోందా? తాజా అధ్యయనం ఇదే చెబుతోంది. తొలిదశలో దీంతో శరీరం నిశ్శబ్దంగా పోరాడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు మరి. త్వరగా చికిత్స మొదలెట్టటానికి, నివారణకు అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని భావిస్తున్నారు. కీళ్లవాతమనేది స్వీయ రోగనిరోధక జబ్బు. ఇది కీళ్లలో వాపు, నొప్పికి దారితీస్తుంది. క్రమంగా కీళ్లను దెబ్బతీస్తూ వస్తుంది. అలాగని కీళ్లకే పరిమితమయ్యేది కాదు, తీవ్రమైతే శరీరం మొత్తమూ వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) కనిపిస్తుంది. కీళ్లవాతం ముప్పు పొంచి ఉన్నవారిలో ఏసీపీఏ యాంటీబాడీలు ఉంటాయి. ఇలాంటివారిని ఏడేళ్ల పాటు పరిశోధకులు పరిశీలించారు. వీరిలోని చాలారకాల రోగనిరోధక కణాల్లో గణనీయమైన లోపాలు ఉంటున్నట్టు గుర్తించారు.

- మామూలుగా శరీరాన్ని రక్షించే యాంటీబాడీలైన బి కణాలు వాపు ప్రక్రియను ప్రేరేపించే దశకు మారిపోతున్నాయి.
- టీ హెల్పర్ కణాలు సైతం నార్మల్ స్థాయులను బాగా మించిపోతున్నాయి.
- ఇంతకుముందు ముప్పులను ఎదుర్కొని టీ కణాల్లోనూ మార్పులు తలెత్తుతున్నాయి.
- మోనోసైట్స్ అనే తెల్ల రక్తకణాలు పెద్దమొత్తంలో వాపు ప్రక్రియను ప్రేరేపించే అణువులను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇవి కీళ్లవాతం బాధితుల కీళ్ల కణజాలంలో కనిపించే మ్యాక్రోఫేజెస్‌ను పోలి ఉండటం గమనార్హం. అంటే అప్పటికే జబ్బు ప్రక్రియ కీళ్ల మీద దాడి చేయటానికి అనువైన వాతావరణం కల్పిస్తోందన్నమాట.

- కీళ్లవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నవారిని గుర్తించటానికి ఈ జీవసూచికలు, రోగనిరోధక చిహ్నాలు తోడ్పడగలవు. త్వరగా చికిత్స ఆరంభించటానికి, మరింత కచ్చితంగా చికిత్స చేయటానికిది దోహదం చేయగలవు. ముందుగానే గుర్తించగలిగితే కీళ్లవాతాన్ని అక్కడితోనే నిలువరించే వీలుంటుంది. ఏళ్ల కొద్దీ నొప్పి, వైకల్యంతో బాధపడకుండా చూసుకోవచ్చు.

గుండెజబ్బులే పెద్ద భారం

గుండెజబ్బుల భారం రోజురోజుకీ గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి మూడు మరణాల్లో ఒకటి వీటితోనే సంభవిస్తోందని తాజా గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్ (జీబీడీ) అధ్యయనం పేర్కొంటోంది. దీని వివరాల్లోకి వెళ్తే..

- ▼ అన్ని ప్రాంతాల్లోనూ అన్నింటికన్నా ఎక్కువగా పక్షవాతమే మరణాలకు, వైకల్యానికి కారణమవుతోంది.
- ▼ ఆడవారి కన్నా మగవారిలో మరణాల శాతం ఎక్కువగా ఉంటోంది. 50 ఏళ్లు దాటాక దీని ముప్పు బాగా పెరుగుతోంది.
- ▼ 2018-2023 మధ్యకాలంలో శరీర ఎత్తు, బరువు నిష్పత్తి (బీఎంఐ), పరగడుపున రక్తంలో గ్లూకోజు మోతాదులు ఎక్కువగా ఉండటం చాలా వేగంగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఊబకాయం, మధుమేహం పెరుగుతున్న తీరుకు ఇది దర్పణం పడుతోంది.



- ▼ గుండె జబ్బులతో ముడిపడిన మరణాల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. వీటితో 1990లో 1.31 కోట్ల మరణాలు సంభవించగా 2023లో ఇది 1.92 కోట్లకు ఎగబాకింది.
- ▼ జనాభా వృద్ధి, వయోభారం.. ఊబకాయం, మధుమేహం వంటి రకరకాల ముప్పు కారకాలు మరణాలు పెరగటానికి దోహదం చేస్తున్నాయి.
- ▼ 2023లో 24 కోట్ల మంది గుండె రక్తనాళాల పూడికలతో ప్రభావితమయ్యారని అంచనా. అదే కాలి రక్తనాళాల్లో పూడికలతో 12.2 కోట్ల మంది ఇబ్బంది పడ్డారు.
- ▼ వైకల్యం కారణంగా కోల్పోయిన జీవనకాలం (సంవత్సరాల్లో), మరణాల విషయంలోనూ గుండెజబ్బులే ముందు వరుసలో నిలుస్తున్నాయి.
- ▼ ఆరోగ్యంగా జీవించాల్సిన సంవత్సరాలను కోల్పోవటానికి మార్చుకోదగిన ముప్పు కారకాలే ప్రధానంగా కారణం (79.6%) అవుతున్నాయి. ముఖ్యంగా అధిక బరువు, పరగడుపున గ్లూకోజు ఎక్కువగా ఉండటం, వాయు కాలుష్యం, సీసం ప్రభావం, అధిక ఉష్ణోగ్రతల వంటి ముప్పు కారకాలు బాగా ప్రభావం చూపుతున్నాయి.

మధుమేహ పుండ్లకు గులాబీ లేపనం!


మృదువైన గులాబీ రేకలతో మధుమేహం మూలంగా పాదాలకు పడే పుండ్లు నయమైతే ఎలా ఉంటుంది? ఇది ఊహ కాదు, నిజంగానే సాధ్యమని శివ్ నాడర్ యూనివర్సిటీ, ఐఐటీ భిలాయ్ పరిశోధకులు నిరూపించారు. గులాబీ రేకుల నుంచి సంగ్రహించిన అతి సూక్ష్మమైన ముక్కలు (ఆర్‌ఈవీ).. యూరియా, సిట్రిక్ ఆమ్లం వంటి సాధారణ పదార్థాల నుంచి తీసిన కర్బన రేణువుల (సీడీ) సమ్మేళనంతో వినూత్న ద్రవజిగురును తయారుచేశారు. దీన్ని పుండ్ల మీద నేరుగా లేపనం చేస్తే చాలు. నయం చేసే రసాయనాలు, బ్యాక్టీరియాను నిర్మూలించే కారకాలు నెమ్మదిగా విడుదలవుతాయి. ఆర్‌ఈవీలు చర్మకణాలు, కొత్తరక్తనాళాలు వృద్ధి చెందేలా, వాపును తగ్గించేలా చేస్తాయి. ఇక సీడీలేమో ఆక్సీకరణ ఒత్తిడిని సృష్టించటం ద్వారా ఇ.కొలి వంటి బ్యాక్టీరియా కణ గోడలకు చిల్లులు పడేలా చేసి, వాటిని నిర్మూలిస్తాయి. ఫలితంగా పుండ్లు త్వరగా నయమవుతాయి. వెండి ఆధారిత కట్లు, ఖరీదైన గ్రోత్ ఫ్యాక్టర్ చికిత్సలతో పోలిస్తే ఇది చాలా చవక. విష పూరితం కాదు. కొంతకాలానికి తనకు తానే సహజంగా క్షీణిస్తుంది. ఈ గులాబీ రేకుల లేపనాన్ని మధుమేహం గల ఎలుకల పుండ్ల మీద పరీక్షించగా మంచి ఫలితం కనిపించింది. పుండ్లు 50-70% ఎక్కువ వేగంగా నయమయ్యాయి. బ్యాక్టీరియా మోతాదులైతే 99% కన్నా తక్కువకు పడిపోయాయి. పుండ్లు నయమయ్యే క్రమంతో బలమైన కొలాజెన్, వ్యవస్థీకృతమైన కొత్త చర్మ పొరలు ఏర్పడినట్టు తేలింది. అంటే మచ్చలు పడకుండా పుండ్లను నయం చేస్తోందన్నమాట. కదులుతున్నప్పుడూ ఈ ద్రవజిగురు స్థిరంగా ఉండటం, రక్తంలో గానీ చర్మంలో గానీ ఎలాంటి దుష్ప్రభావాలు తలెత్తకపోవటం గమనార్హం.



కండకు జై!

ఊబకాయం.. ముఖ్యంగా బొజ్జ పెద్ద ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తోంది. మనదేశంలో జాతీయ కుటుంబ ఆరోగ్య గణన-5లో (2019-2021) తొలిసారిగా బొజ్జ తీరుతెన్నులను లెక్కించారు. ఇందులో ఆందోళనకర విషయాలు వెల్లడయ్యాయి. శరీర ఎత్తు, బరువు నిష్పత్తి (బీఎంఐ) ప్రకారం కేవలం 23% మహిళలే ఊబకాయులుగా లెక్కలోకి వచ్చారు. అయితే 30ల్లో, 40ల్లో ఉన్న స్త్రీలలో సగాని కన్నా ఎక్కువమంది బొజ్జ కలిగుండటం గమనార్హం. అదే మగవారిలో 12% మందిలోనే ఇది కనిపించింది. అంటే అదృశ్యంగా ఉన్న జీవక్రియ ముప్పును నార్మల్ బీఎంఐ బయటపడకుండా చేస్తోందన్నమాట. ఇది కండర క్షీణతనూ కప్పిపుచ్చుతుండటం గమనార్హం.

నిజానికి శరీర బరువు అంటే కొవ్వు ఒక్కటే కాదు. ఎముకలు, అవయవాలు, నీరు, ఎముకలకు అంటుకొని ఉండే కండరం, అనుసంధాన కణజాలాల వంటివన్నీ ఇందులో భాగమే. వీటిల్లో కండరబంధనాల ద్వారా ఎముకలకు అంటుకొని ఉండే కండరాన్ని (స్కెలెటల్ మజిల్) ఆరోగ్యాన్ని ఉరకలెత్తించే యంత్రం అనుకోవచ్చు. కదలికలు, జీవక్రియలు, బలానికిది కీలకం. వయసు పెరుగుతున్నకొద్దీ క్రమంగా కండరాల మోతాదు, వీటి బలం, పనితీరు క్షీణించటం (సార్కోపీనియా) మొదలవుతుంటుంది. ఇప్పుడు దీన్ని వైద్యపరంగా ఒక రుగ్మతగానూ పరిగణిస్తున్నారు. శరీర దౌర్బల్యం, కింద పడటం, వైకల్యం, రోజువారీ పనులు చేసుకోలేకపోవటం వంటివి దీని పరిణామాలే. అరవై ఏళ్లలోపు వారిలో 8-36% మంది.. వృద్ధుల్లో 10-27% మంది కండర క్షీణతతో బాధపడుతున్నారని అంచనా. సాధారణంగా ఇది ఆడవారిలో కన్నా మగవారిలోనే ఎక్కువ.



మధ్యవయసులో గరిష్ఠంగా

కండర మోతాదు, బలం 30-50 ఏళ్ల మధ్య గరిష్ఠ స్థాయిలో ఉంటాయి. అనంతరం నిరంతరం క్షీణిస్తూ వస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్లు పైబడ్డవారిలో 140 కోట్ల కన్నా ఎక్కువ మంది వయసుతో ముడి పడిన కండర క్షీణతతో బాధపడుతున్నారు. ఇదో ప్రజారోగ్య సమస్యగా విజృంభిస్తోంది. కండరాల బలహీనత కేవలం వాటి మోతాదు తగ్గటాన్ని మాత్రమే కాదు, రోజువారీ పనులు హాయిగా చేసుకోకుండా అడ్డుపడటాన్నీ పట్టి చూపుతుంది. కండలోకి కొవ్వు చొచ్చుకుపోతున్నకొద్దీ కండర సామర్థ్యమూ తగ్గుతూ వస్తుంది.

ఏంటీ కండ గొప్పతనం?

కండరం కేవలం యాంత్రిక కణజాలం కాదు. ఇది జీవక్రియలను ఉత్తేజితం చేస్తుంది. గ్లూకోజును, శక్తి సమతుల్యతను, ఒంట్లో ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. గ్లైకోజెన్, ప్రొటీన్, కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఊబకాయుల్లో కండరాల్లో కొవ్వు ఎక్కువగా చేరటం వల్ల బలం, నాణ్యత తగ్గుతాయి. ఇవి కండర క్షీణతతో మరింత ఎక్కువవుతాయి కూడా. ఎముకల పటుత్వం, జీవక్రియల సమతుల్యత తగ్గుతాయి. గుండె రక్తనాళాల జబ్బుల ముప్పూ పెరుగుతుంది. అందువల్ల బరువు తగ్గించుకోవటానికి ప్రయత్నించేటప్పుడు కండరాలను కాపాడుకోవటం చాలా కీలకం. దీన్ని పట్టించుకోకపోతే కండర క్షీణతతో ముడిపడిన ఊబకాయంలోకి జారిపోవటం ఖాయం. డెక్సా, సీటీ, ఎంఆర్ఐ, మామూలు పిడికిలి పట్టు, నడక (గెయిట్) వేగం వంటి పరీక్షలతో కండర క్షీణతను ముందుగానే గుర్తించొచ్చు.

బరువు చికిత్సలతో జాగ్రత్త

ఊబకాయాన్ని తగ్గించుకోవటానికి ఇప్పుడు సెమాగ్లుటైడ్ వంటి జీఎల్‌పీ-1 రిసెప్టర్ ఎగొనిస్ట్ రకం మందులు విరివిగా వాడుతున్నారు. ఇవి బరువును సమర్థంగా తగ్గిస్తుండొచ్చు గానీ కొన్ని దుష్ప్రభావాలూ పొంచి ఉంటున్నాయి. వీటిల్లో ముఖ్యమైంది పలుచని కండరాల మోతాదు తగ్గటం. ఈ మందులను ఆపేసిన ఏడాది తర్వాత చాలామందిలో మూడింట రెండొంతుల బరువు తిరిగి పెరిగినట్టు పరిశోధనలు చెబుతున్నాయి. అదే సమయంలో జీవక్రియ ఆరోగ్యమూ బాగా దెబ్బతినటం గమనార్హం. అంటే కండరాలు క్షీణించటం వల్లనే బరువు తగ్గిందని ఇది సూచిస్తోందన్నమాట. బరువు తగ్గటానికి చేసే బేరియాట్రిక్ శస్త్రచికిత్సలతోనూ పలుచని కణజాలం తగ్గుతుంది. ఇది తగ్గటం వల్ల జీవక్రియ బలహీనం కావటమే కాదు, ఆకలీ పెరుగుతుంది. దీంతో తిరిగి బరువు పెరిగే ప్రమాదముంది. అదే క్రమబద్ధమైన వ్యాయామం, సమతులాహారం వంటి జీవనశైలి మార్పులైతే చాలా సురక్షితం. మందులతో ఒనగూరే దుష్ప్రభావాలేవీ ఉండవు. బరువు తగ్గటం దీర్ఘకాలం కొనసాగుతుంది కూడా.

కేలరీల తగ్గింపు, వ్యాయమం రెండూ..

శరీరం ఖర్చు చేసే దాని కన్నా ఎక్కువ కేలరీల శక్తినిచ్చే ఆహారం తినటం ఊబకాయానికి దారితీస్తుంది. అందువల్ల కేలరీలు తగ్గించుకోవటం చాలా ముఖ్యం. తక్కువ ఆహారం తినటం లేదా శారీరక శ్రమ పెంచటం ద్వారా దీన్ని సాధించొచ్చు. రెండూ కలిస్తే ఎక్కువ లాభం కలుగుతుంది. రోజువారీ పనులకు అవసరమైనంత ఆహారం తీసుకుంటే కొవ్వును తగ్గించుకోవటంతో పాటు కండరాలు క్షీణించకుండానూ చూసుకోవచ్చు. ఇక వ్యాయామాలు కూడా చేసినట్టయితే కండరాలు దృఢంగా అవుతాయి.

రెండూ కలిస్తే?

కండర క్షీణత, ఊబకాయం రెండూ కలిస్తే మరింత ప్రమాదం ముంచుకొచ్చినట్టే. ఎందుకంటే అధిక కొవ్వు మోతాదు కండర క్షీణతను దాచిపెడుతుంది. అందువల్ల సమస్యను చాలాసార్లు పోల్చుకోలేరు కూడా. కొవ్వు మూలంగా లావుగా ఉన్నట్టు అనిపించినా దుర్బలత్వం, వైకల్యం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండెజబ్బు, పక్షవాతం, అకాల మరణం ముప్పులు పెరుగుతాయి.

కళ్లు హాయిగా

కళ్లు ఒత్తిడికి లోనవుతున్నాయా? అయితే కళ్లకు హాయిని కలగించే కొన్ని వ్యాయామాలు ప్రయత్నించి చూడండి.

- **రెప్పలు ఆడించటం, ఆవలించటం:** ఇవి కన్నీరు ఉత్పత్తయ్యేలా చేయటం ద్వారా త్వరగా కళ్ల అలసటను దూరం చేస్తాయి. వేగంగా రెప్పలను ఆడిస్తే కన్నీరు లోపల అంతటా పరచుకుంటుంది కూడా. ఇది మంట, నొప్పినీ తగ్గిస్తుంది.
- **కళ్లను తిప్పటం:** పైకీ కిందికీ, అటూ ఇటూ, గుండ్రంగా చూస్తూ కళ్లను తిప్పటం ఒక మార్గం. దీంతో కళ్ల చుట్టూరా, వెనకాల కండరాలు వదులవుతాయి.

మూలుగుతున్న సినిమాపై టారిఫ్‌ల తాటికాయ

● ట్రంప్ ప్రకటనతో చిత్రసీమలో భయం

సినీ వ్యాపార వర్గాలకి హారర్ సినిమా అనుభవాన్ని పంచుతున్నాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. రాజాసాబ్ ట్రైలర్‌లో తాతలాగే సినిమాలపై వంద శాతం సుంకాలు అంటూ మరోసారి భయపెట్టాడు ట్రంప్. ఆయన వ్యాఖ్యలు భారతీయ చిత్రసీమలో కలకలం సృష్టిస్తున్నాయి. భారతీయ సినిమాలకు అమెరికా మార్కెట్ నుంచే 30 నుంచి 40 శాతం వసూళ్లు వస్తున్నాయి. వంద శాతం టారిఫ్‌లు విధిస్తే ఆ వసూళ్లకు భారీగా గండి పడే ప్రమాదం ఉంది. వంద శాతం పన్ను అంటే... ఆ మేరకే టికెట్ ధరలు పెరుగుతాయి. దాంతో అక్కడ థియేటర్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య భారీగా తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు సమస్యలతో మూలుగుతున్న మన సినిమాపై ట్రంప్ వేస్తున్న టారిఫ్ తాటికాయ ఇంకెన్ని తలనొప్పులు తెచ్చి పెడుతుందో అనే భయాలు వ్యాపార వర్గాల్లో నెలకొన్నాయి.

మే నెలలోనే ట్రంప్ సినిమా రంగంపై టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఆ తర్వాత మళ్లీ ఆ ప్రస్తావన రాలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ సినిమా రంగాన్ని వదిలేస్తారేమో అని అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ రేపో మాపో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ని తీసుకొచ్చే ఆలోచనలో ట్రంప్ యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది. అమెరికాలో సినిమా చిత్రీకరణల్ని పెంచుతూ హాలీవుడ్‌ని బలోపేతం చేయడం కోసమే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ... ఆ ప్రభావం ఇతర దేశాల సినిమాలన్నిటి పైనా పడనుంది. విదేశాల్లో చిత్రీకరణ చేసుకొనే హాలీవుడ్ సినిమాలకూ ఈ నిర్ణయం భారమే. వంద శాతం సుంకాల ప్రభావంతో ఇకపై అమెరికా చిత్రాలన్నీ కూడా ఆ దేశంలోనే చిత్రీకరణ చేసుకొనే అవకాశాలు ఉన్నాయి. భారతీయ సినిమాలకి మాత్రం ఈ నిర్ణయం శరాఘాతమే అంటున్నాయి వ్యాపార వర్గాలు. మన సినిమాలు అమెరికాలో చిత్రీకరణ జరుపుకోవడం చాలా అరుదు. అక్కడి టారిఫ్‌లు తప్పించుకోవాలంటే అక్కడ చిత్రీకరణలు చేయాల్సిందే. మనవైన కథలు, మన బడ్జెట్‌లతో అక్కడ పూర్తిగా చిత్రీకరణలు చేయడం దాదాపు అసాధ్యమే. ప్రస్తుతం హిందీతోపాటు, తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలు అమెరికాలో మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. చిన్న సినిమాలూ అక్కడ విడుదలవుతున్నాయి. సుంకాలు అమల్లోకి వస్తే అక్కడ చిన్న చిత్రాలు విడుదల కావడమే కష్టం అంటున్నాయి వ్యాపార వర్గాలు.

ఇప్పుడు సుంకాలే లేవు...

ప్రస్తుతం అమెరికాలో విదేశీ సినిమాలపై ఎలాంటి సాధారణ సుంకాలు లేవు. అక్కడ సినిమాల్ని ఓ భౌతిక వస్తువులా కాకుండా డిజిటల్ గూడ్స్ లేదా మేధో సంపత్తిగా పరిగణించడం వల్ల వాటిపై సంప్రదాయ సుంకాలేవీ లేవు. దీంతో అక్కడి డిస్ట్రిబ్యూటర్లు ఎలాంటి ప్రత్యేక పన్ను లేకుండా సినిమాల్ని నేరుగా విడుదల చేస్తున్నారు. థియేటర్లలో టికెట్ విక్రయాలపై అమ్మకపు పన్ను, లేదా వినోద పన్ను రూపంలో ఆయా రాష్ట్రాల నిబంధనలకు అనుగుణంగా నామమాత్రంగా వసూలు చేస్తున్నారు. అందులో దేశీయ సినిమాలు, విదేశీ చిత్రాలనే తేడాలేమీ లేవు. ప్రస్తుతం అమెరికాలో తెలుగు సినిమా టికెట్ ధరలు 15-25 డాలర్ల మధ్య ఉండగా.. ప్రీమియర్ షోలకు ఆ ధర 30 డాలర్ల వరకు ఉంటుంది. దీనిపై ఇప్పుడు ట్రంప్ సుంకాల ప్రభావం పడితే ఆ మేరకు పంపిణీ ఖర్చులు డబుల్ అవుతాయి, ఆ ప్రభావంతో టికెట్ ధరలు ఒక్కసారిగా రెట్టింపవుతాయి. ఓటీటీలో సినిమాలపై కూడా భారం పడితే వాటి లైసెన్సింగ్ ఖర్చులు పెరిగి, వినియోగదారుల సభ్యత్వం ధరలు కూడా పెరుగుతాయి.

స్పష్టత రావాలి...

సుంకాలు ఎలా అమలు చేస్తారనే విషయాలపై స్పష్టత వస్తేనే ఇది మన సినిమాని ఎంత ప్రభావం చేస్తుందో ఓ అంచనాకి రావొచ్చని అమెరికాలో సినిమాల్ని పంపిణీ చేస్తున్న ప్రత్యాంగిర సినిమాస్ సంస్థ చెబుతోంది. పూర్తిగా విదేశాల్లో చిత్రీకరణ చేసిన సినిమాలకు మాత్రమే ఈ సుంకాలా లేక, కొద్దిమేర అమెరికాలో చిత్రీకరణ చేస్తే సుంకాల భారాన్ని తప్పించుకోవచ్చా? విజువల్ ఎఫెక్ట్స్ పనులు అమెరికాలోనే జరుపుకుంటే ఆ సినిమాలకి పన్ను నుంచి మినహాయింపు దక్కుతుందా తదితర విషయాలు అధికారిక ఉత్తర్వులు వచ్చాకే తెలుస్తాయని ఆ సంస్థ చెబుతోంది.

ఈనాడు సినిమా

రెండేళ్లలో దర్శకత్వం



రణ్‌బీర్ కపూర్

'సావరియా' చిత్రంతో 2007లో బాలీవుడ్ సినీ పరిశ్రమలో తన కెరీర్‌ను ప్రారంభించారు నటుడు రణ్‌బీర్ కపూర్. 'రాక్‌స్టార్', 'బర్ఫీ', 'సంజూ', 'బ్రహ్మాస్త్ర' లాంటి అనేక విభిన్నమైన చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించాడు. తాజాగా రణ్‌బీర్ దర్శకత్వం చేయాలని ఉంది అంటూ తన ఆలోచనల్ని అభిమానులతో పంచుకున్నాడు. ఇటీవలే 43వ పుట్టిన రోజును చేసుకున్న రణ్‌బీర్ ఇన్‌స్టా ఖాతా 'ఆర్క్స్' వేదికగా లైవ్ సెషన్‌లో అభిమానులతో ముచ్చటించాడు. దర్శకుడు ఆర్కే అని అభిమాని వేసిన ప్రశ్నకు స్పందిస్తూ..' 'నేను ఓ చిత్రానికి దర్శకత్వం వహించాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ మధ్యే రచనకు సంబంధించిన వర్క్‌షాప్‌ని కూడా ప్రారంభించాను. రెండు ఆలోచనలతో నన్ను నేను ప్రేరేపించుకోవడానికి ఈ ప్రయత్నం మొదలుపెట్టాను. కానీ రాబోయే రెండు సంవత్సరాలలో అవి కచ్చితంగా కార్యరూపందాల్చి నేను చేసే ప్రాజెక్టులలో భాగం అవుతాయి''అని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే రణ్‌బీర్ 'యానిమల్' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'యానిమల్ పార్క్' సినిమా చిత్రీకరణ 2027లో ప్రారంభమవుతుందని వెల్లడించారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రూపొందించనున్న ఈ సినిమా చాలా క్రేజీ చిత్రమని తెలిపారు.



ప్రభాస్

అద్భుతాల్ని చూపిస్తున్న రాజాసాబ్

'ఏదో గుర్తుండిపోయే పని చేయాలి... సంచలనం అయిపోవాలి. ఏంట్రా ఇలాంటి పని చేశాడని అందరూ షాక్ అయిపోవాలి' అంటున్నాడు ప్రభాస్. ఇదంతా 'రాజాసాబ్' సందడిలో భాగమే! ప్రభాస్ కథానాయకుడిగా... పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమే 'రాజాసాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషించారు. టి.జి.విశ్వప్రసాద్ నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. సోమవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. భయపెడుతూ హాస్యం పంచే కథతో ఈ చిత్రం రూపొందిందని, ప్రభాస్ ఇదివరకటిలా స్టైలిష్ అవతారంలో సందడి చేయనున్నారని ట్రైలర్ చాటుతోంది. 'నీ బ్రెయిన్ నా కమాండ్స్ మాత్రమే ఫాలో అవుతుంది....' అంటూ మొదలయ్యే ట్రైలర్‌లో విజువల్స్ హైలెట్‌గా నిలిచాయి. ఎగ్సొర్సిస్ట్, సైక్రియాట్రిస్ట్, హిప్నాటిస్ట్ అయిన ఒక శక్తి ఆడిన బ్రెయిన్ గేమ్ ఏమిటి? దాన్ని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడన్నది కీలకం. సంజయ్‌దత్ ఇందులో తాత పాత్రలో సందడి చేయనున్నారు. 'తాత అద్భుతాలు చూసి ఆనందించాలి. కొశ్చన్లు వేయకూడదు...', 'పుట్టలో చెయ్యి పెడితే కుట్టడానికి నేనేమైనా చీమనా? రాక్షసుడిని..' అంటూ సాగే సంభాషణలు సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ఛాయాగ్రహణం: కార్తీక్ పళని.

అప్పుడే సత్యం బోధపడింది



అనుపమ పరమేశ్వరన్

ఓవైపు కమర్షియల్ సినిమాల్లో సందడి చేస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తోంది నటి అనుపమ పరమేశ్వరన్. ఇటీవలే 'కిష్కింధపురి'తో తెలుగులో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఈ నాయిక.. త్వరలో 'బైసన్' చిత్రంతో సినీప్రియుల ముందుకు రానుంది. అయితే ప్రస్తుతం వెండితెరపై వైవిధ్యభరితమైన పాత్రలతో జోరు చూపిస్తున్న ఈ మలయాళ సోయగం.. చిన్నతనంలో చదువులో వెనకబడి ఉండటం వల్ల నటి కాలేనని అనుకునేదట. దీని వెనకున్న ఆసక్తికర విషయాన్ని ఆమె ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. "నాకు చిన్నప్పటి నుంచి నటన అంటే చాలా ఇష్టం. కాకపోతే మా స్కూల్‌లో టాపర్స్‌కి మాత్రమే యాక్టింగ్‌లో అవకాశమిస్తారన్నది అలవాటు చేశారు. ఎందుకంటే బాగా చదివే వాళ్లే.. పెద్ద పెద్ద డైలాగుల్ని నేర్చుకోగలుగుతారు.. తేలికగా గుర్తు పెట్టుకుని చెప్పగలుగుతారు అనేవాళ్లు. ఆ మాటలన్నీ నా మనసులో బలంగా నాటుకుపోయాయి. నేనెలాగూ స్కూల్ టాపర్‌ను కాదు కాబట్టి ఇక నటిని అవ్వలేనని నమ్మడం మొదలు పెట్టా. నటి కావాలన్న నా కలను పూర్తిగా పక్కకు పెట్టేశా. నాకు కొంచెం ఊహ తెలిశాకే చదువుకు.. నటనకు ఏ సంబంధం లేదన్న సత్యం బోధపడింది. మేము చదువుని ఎక్కడ నిర్లక్ష్యం చేస్తామోనన్న ఉద్దేశంతో స్కూల్‌లో అలా చెప్పేవారని తెలుసుకున్నా" అని చిన్ననాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంది అనుపమ.

ఇది అనామ దేవుడి శాపం



'గత వైభవ'

ఆషికా రంగనాథ్, ఎస్ఎస్ దుశ్యంత్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని తెరకెక్కించిన చిత్రం 'గత వైభవ'. దీపక్ తిమ్మప్ప, సుని సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా నవంబరు 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టీజర్ విడుదల చేశారు. "నువ్వు ఏ జన్మలో పుట్టినను నీకు గాంధర్వ సంగమం కలగదు. ఇది అనామ దేవుడి శాపం" అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆసక్తి రేకెత్తించేలా సాగింది. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇది చరిత్ర, పురాణాలతో ముడిపడిన ఫాంటసీ డ్రామాగా ముస్తాబైనట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: జూదా సాంధి, ఛాయాగ్రహణం: విలియమ్ జె డేవిడ్.

అందర్నీ ఆశ్చర్యపరుస్తాం



ఆయుష్మాన్ ఖురానా, రష్మిక

"ప్రతిసారి ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచాలన్న ఉద్దేశంతో వైవిధ్యభరితమైన కథలు, పాత్రలు ఎంచుకుంటూ ముందుకెళ్తున్నా. ఈ క్రమంలో ఇప్పుడు నా నుంచి వస్తున్న ఈ 'థమ్మా' సినిమాతోనూ అందర్నీ ఆశ్చర్యపరుస్తానని నమ్ముతున్నా'' అంటోంది నటి రష్మిక. ఆమె.. ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రధారులుగా ఆదిత్యా సర్పోత్దార్ రూపొందించిన చిత్రమే 'థమ్మా'. మాడాక్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. నవాజుద్దీన్ సిద్దిఖీ, పరేశ్ రావల్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా దీపావళి సందర్భంగా అక్టోబరు 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌తో పాటు ఈ చిత్రంలోని "నువ్వు నా సొంతమా" అనే గీతాన్ని విడుదల చేశారు. అనంతరం హీరో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ.. "ఈ మాడాక్ హారర్ యూనివర్స్‌లో భాగమవ్వడం చాలా సరదాగా అనిపించింది. మనం జానపద కథల్లో విన్న బేతాళుడికి నాయకుడైన థమ్మా చుట్టూ తిరిగే కథ ఇది. ఈ సినిమా ద్వారా తొలిసారి రష్మికతో కలిసి పని చేసే అవకాశం దొరికినందుకు ఆనందంగా ఉంది. ఆమె అద్భుతమైన నటి.. గొప్ప డ్యాన్సర్. ఇందులో నేను పోషించిన పాత్ర నాకే చాలా కొత్తగా అనిపించింది. ఇది నిజమైన పాన్ ఇండియా సినిమా. ఈ కాన్సెప్ట్ తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అన్నారు. "ఈ హారర్ యూనివర్స్ నుంచి ఇప్పటిదాకా వచ్చిన అన్ని చిత్రాల్ని మంచి కాన్సెప్ట్‌లతో రూపొందించారు. వీటిలో కథలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. పాత్రలన్నీ చాలా అద్భుతంగా ఉంటాయి. ఇప్పుడు నాపై నమ్మకంతో ఈ కథా ప్రపంచంలోకి నన్ను తీసుకురావడం నటిగా నాపై ఓ బాధ్యతను పెంచింది. ఇది నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. ఇంత మంచి అవకాశాన్ని నాకిచ్చినందుకు నిర్మాణ సంస్థకు కృతజ్ఞతలు'' అన్నారు రష్మిక. ఈ కార్యక్రమంలో సునీల్ నారంగ్, జాన్వీ నారంగ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమించాలనుకుంటే యుద్ధం చేయాల్సిందే!



కోమలి

'శశివదనే' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్. ఈ ఇద్దరూ జంటగా నటించిన ఈ సినిమాని సాయి మోహన్ ఉబ్బన తెరకెక్కించారు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఈ చిత్రం అక్టోబరు 10న రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. "ప్రేమించాలని డిసైడ్ అయితే ఎన్నొచ్చినా యుద్ధం చేయాల్సిందే", "ప్రేమతో వెళ్తున్నా. వచ్చాక ప్రపంచాన్నే గెలుద్దాం" అంటూ ట్రైలర్‌లో వినిపించిన సంభాషణలు ఆకర్షణగా నిలిచాయి.

మరో ప్రేమ కథలో 'సైయారా' హీరో?



అహాన్

రొమాంటిక్ డ్రామాగా మోహిత్ సూరి తెరకెక్కించిన 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు నటుడు అహాన్ పాండే. తొలి చిత్రంలోనే సినీప్రియుల్ని మెప్పించే నటనతో ఆకట్టుకుని బాలీవుడ్ పరిశ్రమలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు అహాన్. తాజాగా ఆయన మరో రొమాంటిక్ యాక్షన్ చిత్రానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. "అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించనున్న యాక్షన్ రొమాంటిక్ చిత్రంలో అహాన్ పాండే నటించనున్నారు. 'సైయారా' సినిమాలో ఆయన నటించిన భావోద్వేగ సన్నివేశాలు అలీని బాగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ సిద్ధంగా ఉంది. ఇంకా పేరు ఖరారు చేయని ఈ సినిమాలో అహాన్ తొలి చిత్ర నటనకు పూర్తి భిన్నమైన కోణాన్ని ఆవిష్కరించి.. ప్రేమ, యాక్షన్‌లను మిళితం చేసి ఓ కొత్త నాటకీయ ప్రపంచాన్ని సృష్టించనున్నారు. అహాన్ పాత్రని కొత్త లుక్‌లో ఆవిష్కరించడానికి చిత్రనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దానికోసం లుక్ టెస్ట్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభించాలనుకుంటున్నారు"అని చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం.


పెళ్లి తర్వాత కొత్త చిత్రం?



శోభిత

గతేడాది కథానాయకుడు నాగచైతన్యతో వైవాహిక బంధంలోకి అడుగు పెట్టి కొత్త జీవితాన్ని ప్రారంభించారు నటి శోభిత. కానీ, ఆ తర్వాత తన నుంచి సినిమాల పరంగా ఏ కొత్త కబురు వినిపించలేదు. అయితే ఇప్పుడామె తదుపరి చిత్రం గురించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ప్రముఖ తమిళ దర్శకుడు పా.రంజిత్ రూపొందిస్తున్న 'వెట్టువమ్'లో ఆర్య, వీఆర్ దినేశ్‌లతో కలిసి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇదొక విభిన్నమైన ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. శోభిత ఇందులో యాక్షన్ కోణంలో సాగే శక్తిమంతమైన పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో తెరపైకి రానుంది. 'తంగలాన్' లాంటి విజయం తర్వాత పా.రంజిత్ నుంచి రానున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొని ఉన్నాయి.

సుధీర్.. హైలెస్సో



అక్షర, నక్ష, నటాష, సుధీర్, వి.వి.వినాయక్


బుల్లితెరపై తనదైన ముద్ర వేశారు సుధీర్ ఆనంద్. వెండితెరపై కూడా కథానాయకుడిగా ఇప్పటికే నాలుగు చిత్రాలు చేశారు. ఐదో చిత్రంగా 'హైలెస్సో' తెరకెక్కుతోంది. ప్రసన్నకుమార్ కోట దర్శకత్వం వహిస్తున్నారు. వజ్ర వారాహి సినిమాస్ పతాకంపై శివ చెర్రీ, రవికిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సుధీర్ సరసన నటాషా సింగ్, నక్ష శరణ్ కథానాయికలుగా నటిస్తున్నారు. అక్షర గౌడ ముఖ్యభూమిక పోషిస్తున్నారు. శివాజీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్‌నిచ్చారు. దర్శకులు వశిష్ఠ, చందూ మొండేటి, మెహర్ రమేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత బన్నీ వాస్ చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. కథానాయకుడు నిఖిల్ టైటిల్‌ని ఆవిష్కరించారు. "గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రమిది. యువ ప్రతిభావంతులు కలిసి చేస్తున్నారు. పోస్టర్ తరహాలోనే ఎంతో గాఢత ఉన్న అంశాలతో ఈ సినిమా రూపొందుతోంది. తెలుగుతోపాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంద"ని సినీవర్గాలు తెలిపాయి. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఛాయాగ్రహణం: సుజాత సిద్ధార్థ్, కూర్పు: చోటా కె.ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: బ్రహ్మ కడలి, రచన: చింతా శ్రీనివాస్, పాటలు: రామజోగయ్యశాస్త్రి.

బతుకమ్మ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ గడువు పొడిగింపు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్.డి.సి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ - 2025 గడువుని పొడిగించనున్నట్టు తెలిపాయి ఎఫ్.డి.సి వర్గాలు. రిజిస్ట్రేషన్ చివరి తేదీని సెప్టెంబరు 30 వరకూ, ఫిల్మ్ సబ్‌మిషన్ చివరి తేదీని అక్టోబరు5 వరకూ పొడిగించినట్టు తెలిపాయి. అక్టోబరు 9న తెలంగాణ ప్రభుత్వ, సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో విజేతలకి బహుమతుల్ని ప్రదానం చేయనున్నారు. రిజిస్ట్రేషన్, సబ్‌మిషన్‌కి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8125834009లో సంప్రదించాలని అధికారులు కోరారు.

ఆపితే ఆగి.. కదిపితే కదిలి!

బస్సు హఠాత్తుగా కదిలితే అందులో నిలబడి ఉన్న ప్రయాణికులు వెనక్కి పడతారు. క్రికెట్ ఆటగాడు బంతిని క్యాచ్ పట్టేటప్పుడు రెండు చేతులు కాస్త వెనక్కి లాగుతాడు. రాకెట్ నింగిలోకి దూసుకెళుతున్నప్పుడు వ్యతిరేక దిశలో వాయువులను వేగంగా వెనక్కి నెట్టేస్తుంది. ఇవన్నీ వస్తువుల స్థితుల్లో కలిగే మార్పులు. వాటి నుంచి భౌతికశాస్త్రం కొన్ని గమన నియమాలను అందిస్తోంది. వస్తువుపై పనిచేసే బలాలు, వాటి గమనాల మధ్య సంబంధాలను అవి వివరిస్తాయి. యాంత్రికశాస్త్రానికి పునాదులుగా పనిచేసే ఆ సూత్రాలపై పోటీ పరీక్షార్థులు సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలి. బలం, ద్రవ్యరాశి, త్వరణం, జడత్వం, చర్య, ప్రతిచర్య తదితర భావనలను అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ భౌతికశాస్త్రం

గమన నియమాలు

గమనం అంటేనే చలనం. ఒక వస్తువు చలిస్తోందంటే ఆ వస్తువుపై కొంత బలం ప్రయోగించినట్లే. అప్పుడు అది కొంత దూరం కదులుతుంది. చలించే వస్తువుకు కాలంతోపాటు వేగమూ మారుతుంది. గెలీలియో గెలీలి, న్యూటన్‌లు చలనంపై పరిశోధన చేసిన వారిలో ముఖ్యులు. వస్తువు మీద ఇరువైపుల ఎదురెదురుగా పనిచేసే సమాన బలాలను 'తుల్య బలాలు'గా పిలుస్తారు. ఇవి వస్తువు నిశ్చల, గమన స్థితులను మార్చలేవు. వస్తువు మీద ఎదురెదురుగా అసమాన బలాలు పనిచేస్తే, వాటిని 'అసమతౌల్య బలాలు' అంటారు. వస్తువు అసమతౌల్య బలం దానిని చలనంలోకి తీసుకొస్తుంది.

ఉదా: పెట్టెను నేలపై నెట్టినప్పుడు దాని మీద ఘర్షణ బలం సమానంగా పనిచేసి తుల్యం చేస్తుంది. దాంతో పెట్టె కదలదు. అయితే మరింత బలం ప్రయోగిస్తే ఆ పెట్టె కదులుతుంది. దీనికి కారణం అసమతౌల్య బలమే.

✦ వస్తువుపై అసమతౌల్య బలం పనిచేస్తే ఆ వస్తువు వేగంలో, చలనదిశలో మార్పు వస్తుంది.
✦ వస్తువు చలనానికి త్వరణాన్ని కలిగించాలంటే అసమతౌల్య బలం కావాలి. ✦ 'వస్తువు నిశ్చల స్థితి అనేది దాని సహజ స్థితి' అని మొదట అరిస్టాటిల్ తెలిపాడు. దీనికి భిన్నంగా 'వస్తువు సమవేగంతో కదలడమే దాని సహజస్థితి' అని గెలీలియో గెలీలి పేర్కొన్నాడు. ✦ వస్తువుపై ఫలిత బలాలు పనిచేస్తే దాని సహజ స్థితిలో మార్పు వస్తుంది.
✦ అరిస్టాటిల్, గెలీలియోల పరికల్పనలను కలిపి సర్ ఐజాక్ న్యూటన్ వస్తువు చలనానికి నియమాలను ప్రతిపాదించాడు.
✦ 'వాలు తలాలపైన చలనాన్ని పరిశీలించి, వస్తువుపైన ఏ బలం పనిచేయకపోతే అవి స్థిరవడితో చలిస్తాయి' అని గెలీలియో నిరూపించాడు. ✦ గోలీని వాలుతలంపై కిందకు వదిలితే దానివేగం పెరుగుతుంది. వాలుతలంపైకి గోలీని ఎక్కించినప్పుడు దాని వేగం తగ్గిపోతుంది. ✦ ఒక V ఆకారం ఉన్న వాలుతలంపై గోలీని వదిలితే దాని ఎదురు వాలుతలంపై అంతే ఎత్తునకు చేరుతుందని గెలీలియో తెలిపాడు. ✦ ఒకవేళ V ఆకార తలంలో కుడివైపు తలాన్ని క్షితిజ సమాంతరంగా ఉంచి, గోలీని వదిలితే అది వదిలిన ఎత్తును చేరడానికి ఎల్లప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటుంది. ✦ ఈ సమయంలో గోలీపై పనిచేసే అసమతౌల్య బలాలు శూన్యం.

న్యూటన్ మొదటి గమన నియమం

ఫలిత బలం వస్తువు స్థితిని మార్చడానికి ప్రయత్నించినంతసేపు నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలో, రుజుమార్గంలో సమచలనంలో ఉన్న వస్తువు సమచలనంలోనూ అదే స్థితిలో ఉంటాయి. ఇదే మొదటి గమన నియమం.

✦ వస్తువుపై ఫలితబలం శూన్యం అయినప్పుడు ఈ నియమం పనిచేస్తుంది. ✦ సాధారణంగా నిశ్చల స్థితిలో ఉన్న, సమవేగంతో చలిస్తూ ఉన్న కదిలించలేని వస్తువులు అదే స్థితిలో ఉండే ధర్మాన్ని 'జడత్వం' అంటారు. ✦ అన్ని వస్తువులు తమ చలన స్థితిలో మార్పును వ్యతిరేకిస్తాయి. ✦ మొదటి గమన నియమాన్ని 'జడత్వ నియమం' అని కూడా అంటారు.
✦ మొదటి గమన నియమం జడత్వం అనే భౌతిక రాశిపై ఆధారపడుతుంది.

జడత్వం (Inertia) : ఒక వస్తువు గమన స్థితిలో కలిగే మార్పును వ్యతిరేకించే లక్షణమే జడత్వం. ✦ వస్తువు నిశ్చల స్థితిలో ఉంటే అదే స్థితిలో ఉండాలని, ఒకవేళ గమనంలో ఉంటే అదే స్థితిలో ఉండాలని ప్రయత్నించే ధర్మమే 'జడత్వం'. ✦ జడత్వం అనేది వస్తువు ద్రవ్యరాశిపై ఆధారపడుతుంది, అనులోమానుపాతంలో ఉంటుంది. ✦ ఒక వస్తువు జడత్వాన్ని దాని ద్రవ్యరాశితో కొలుస్తారు. ✦ జడత్వానికి కొలత ద్రవ్యరాశి. ✦ జడత్వం ∝ ద్రవ్యరాశి

ఉదా: బైక్‌తో పోలిస్తే రైలు తన చలన స్థితిని మార్చడానికి తక్కువ ప్రయత్నిస్తుంది. కారణం బైక్ కంటే రైలు ద్రవ్యరాశి ఎక్కువ కాబట్టి జడత్వం ఎక్కువ.

వస్తువు జడత్వం మూడు రకాలుగా ఉంటుంది.

1) నిశ్చల/విరామ జడత్వం: విరామ స్థితిలో ఉన్న వస్తువు తనంతట తానుగా తన స్థితిని మార్చుకోలేని ధర్మాన్ని 'విరామ జడత్వం' అంటారు.



ఉదా: ✦ గాజుగ్లాసుపై అట్టను పెట్టి, దానిపై నాణేన్ని ఉంచి.. అట్టను క్షితిజ సమాంతరంగా లాగితే నాణెం వెళ్లి గ్లాసులో పడుతుంది.

2) గమన జడత్వం: గమనంలో ఉన్న వస్తువు తనంతట తాను దాని స్థితిని మార్చుకోలేని ధర్మమే 'గమన జడత్వం'.



ఉదా: ✦ గమనంలో ఉన్న బస్సులో నిలబడి ఉన్న వ్యక్తి బస్సు హఠాత్తుగా ఆగితే ఆ వ్యక్తి ముందుకు పడటం. ✦ దూకే ముందు ఆటగాడు ఎక్కువ దూరం పరిగెత్తడం.
✦ రన్నింగ్‌లో బస్సు లేదా రైలు దిగిన వ్యక్తి దాంతో పాటు కొంత దూరం పరిగెత్తడం.



3) దిశా జడత్వం: ఏదైనా ఒక దిశలో చలిస్తున్న వస్తువు తనంతట తాను తన దిశను మార్చుకోలేని ధర్మాన్ని 'దిశా జడత్వం' అంటారు. **ఉదా:** ✦ క్రికెట్‌లో బ్యాట్స్‌మన్ బంతిని వేర్వేరు దిశల్లో తరలించడం.

న్యూటన్ రెండో గమన నియమం

ఒక వస్తువు త్వరణం దానిపై పనిచేసే బాహ్యబలానికి అనులోమానుపాతంలో, దాని ద్రవ్యరాశికి విలోమానుపాతంలో ఉంటుంది.



$a \propto f$

$a \propto \frac{1}{m}$

$a \propto \frac{f}{m}$

$f = ma$

✦ ఒక వస్తువుపై పనిచేసే బలం దాని ద్రవ్యరాశి, త్వరణాల లబ్ధానికి సమానం. ✦ ఒక వస్తువు ద్రవ్యవేగంలో మార్పురేటు దానిపై ప్రయోగించే బలానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

$f \propto \frac{mv - mu}{t}$

$f \propto m\frac{(v - u)}{t}$

$f \propto ma$

✦ రెండో గమన నియమం 'ద్రవ్యవేగం' అనే భౌతికరాశిపై ఆధారపడుతుంది. ✦ వస్తువుపై ఫలితబలం శూన్యం కానప్పుడు ఈ నియమం పనిచేస్తుంది.

ద్రవ్య వేగం: ఒక వస్తువు ద్రవ్యరాశి, వేగాల లబ్ధమే ద్రవ్యవేగం.

✦ ద్రవ్యవేగం (p) = ద్రవ్యరాశి (m) × వేగం (v)

$p = mv$

✦ ప్రమాణాలు/ CGS పద్ధతిలో గ్రా.-సెం.మీ./సెకను లేదా డైను/సెకను
✦ SI పద్ధతిలో కిలోగ్రామ్ - మీ/సెకను లేదా న్యూటన్/ సెకను
✦ వస్తువు ద్రవ్యవేగం అనేది దాని ద్రవ్యరాశి, వేగాల లబ్ధానికి సమానం. ✦ వస్తువు ద్రవ్యవేగం దాని ద్రవ్యరాశి, వేగంపై ఆధారపడి, అనులోమానుపాతంలో ఉంటుంది. ✦ ద్రవ్యరాశి పెరిగితే దాని ద్రవ్యవేగం పెరుగుతుంది. ✦ ద్రవ్యవేగం ఉన్న వస్తువు అది చేరే తలంపై శక్తిని కలుగజేస్తుంది. ✦ ద్రవ్యవేగం పెరిగితే అది కలుగజేసే శక్తి పెరుగుతుంది.

ఉదా: వేర్వేరు ద్రవ్యరాశులు ఉన్న రెండు వస్తువులు ఒకే వేగంతో కదిలితే దానిలో అధిక ద్రవ్యరాశి ఉన్న వస్తువు అధికశక్తిని కలిగిస్తుంది. ✦ వేర్వేరు వేగాలతో వస్తున్న రెండు కార్లను అధిక వేగం ఉన్న కారు కలుగజేసే శక్తి అధికం.



ప్రచోదనం: ఏదైనా వస్తువుపై అత్యధిక బలాన్ని అత్యల్ప కాలంలో ప్రయోగించినట్లయితే ఆ బలం, కాలాల లబ్ధాన్ని ప్రచోదనం అంటారు.



✦ ప్రచోదనం (I) = బలం × కాలం

$I = f \times t$

$F = \frac{I}{\Delta t}$ ప్రకారం వస్తువుపై అత్యధిక బలాన్ని అత్యల్పకాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువ.

✦ స్వల్పకాల వ్యవధుల్లో పనిచేసే బలాలను 'ప్రచోదన బలాలు' అంటారు. ✦ వస్తువు ద్రవ్యవేగ కాలాన్ని పెంచి తగ్గించడాన్ని ప్రచోదనం అంటారు.

✦ దీనికి ప్రమాణాలు CGS పద్ధతిలో = డైను - సెకను, SI పద్ధతిలో = న్యూటన్ - సెకను ✦ ద్రవ్యవేగంలో మార్పు వస్తువుపై పనిచేసే ప్రచోదనాలకు సమానం. ✦ కాలవ్యవధి పెరిగితే ప్రచోదనం తగ్గుతుంది. **ఉదా:** ✦ క్రికెట్‌లో ఆటగాడు బంతిని క్యాచ్ పట్టేటప్పుడు తన చేతులను బంతితో పాటు వెనక్కి లాగడం.

న్యూటన్ మూడో గమన నియమం

ఒక వస్తువు ఫలితబలాన్ని వేరొక వస్తువుపై ప్రయోగించినప్పుడు ఈ నియమం వర్తిస్తుంది.

✦ 'ప్రతి చర్యకు సమానం, వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది' ఇదే మూడో గమన నియమం. ✦ చర్య, ప్రతిచర్యలు వ్యతిరేక దిశలో ఉంటాయి. **ఉదా:** ✦ మనిషి నడవడం, పరిగెత్తడం. ✦ పడవ నుంచి దూకినప్పుడు పడవ వెనక్కి నెట్టడం, పడవ నడపడం. ✦ రాకెట్లు, జెట్ విమానాలు, తారాజువ్వలు పైకి ఎగరడం.



● ఏదైనా ఒక వ్యవస్థపై బాహ్య ఫలిత బలం శూన్యమైతే దాని రేఖీయ ద్రవ్యవేగం స్థిరం.

● రాకెట్‌లు, జెట్ విమానాలు రేఖీయ ద్రవ్యవేగం ఆధారంగా పనిచేస్తాయి. ● రెండు వేర్వేరు ద్రవ్యరాశులు ఉన్న వస్తువులు ఎదురెదురుగా ఢీకొడితే అభిఘాతం ముందు వాటి ద్రవ్యవేగాల మొత్తం అభిఘాతం తర్వాత ద్రవ్యవేగాల మొత్తానికి సమానం. దీనినే రేఖీయ ద్రవ్యవేగ నిశ్చిత్వ నియమం అంటారు.

● $m_1u_1 + m_2u_2 + m_1v_1 + m_2v_2$
● u_1, u_2 = తొలివేగాలు
● m_1m_2 = ద్రవ్యరాశులు
● v_1, v_2 = తుదివేగాలు



రచయిత: ఎస్.వై.నాయుడు

కరెంట్ అఫైర్స్



■ భారతదేశంలో మొదటిసారిగా మొబైల్ ఆధారిత ఈ-ఓటింగ్ వ్యవస్థను అమలు చేసిన రాష్ట్రంగా ఇటీవల ఏ రాష్ట్రం వార్తల్లో నిలిచింది? (2025, జూన్‌లో జరిగిన మున్సిపల్, పట్టణ సంస్థల ఎన్నికల్లో ఈ వ్యవస్థను ప్రారంభించారు.) **జ:** బిహార్

■ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల రాజ్యసభకు నామినేట్ చేసిన నలుగురు ప్రముఖులు ఎవరు? **జ:** న్యాయవాది ఉజ్వల్ నికం, ఉపాధ్యాయుడు - సామాజిక కార్యకర్త సి. సదానందన్ మాస్టర్, సీనియర్ దౌత్యవేత్త - మాజీ విదేశాంగ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, చరిత్రకారిణి - విద్యా నిపుణురాలు డాక్టర్ మీనాక్షి జైన్.

మాదిరి ప్రశ్నలు

■ 2025, జూన్‌లో లండన్‌లో మరణించిన మహమ్మద్ బుహారీ(82) ఏ దేశ మాజీ అధ్యక్షుడు?(మూడుసార్లు ఈ దేశ అధ్యక్షుడిగా పనిచేశారు.) **జ:** నైజీరియా

■ ప్రపంచ వ్యవసాయంలో మహిళలు పోషించే కీలక పాత్రను గుర్తించి విస్తృతం చేయడానికి, వ్యవసాయంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఏ సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించింది? **జ:** 2026

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ ఆర్‌బీఐలో ఆఫీసర్ గ్రేడ్-బి ఉద్యోగాలు (120)
చివరి తేదీ: 30.09.2025

☛ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2025
చివరి తేదీ: 30.09.2025

ఉద్యోగానికి దారి చూపే వాలంటరీ వర్క్! జాబ్ స్కిల్స్


ప్రస్తుతం ఐటీ ఉద్యోగార్థులకు కష్టకాలం నడుస్తోంది. అవకాశాలు ఎండమావులైనప్పుడు వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లగలగాలి. నైపుణ్యాలను పెంచుకోడానికి వీలు కల్పించే ఇంటర్న్‌షిప్‌లను అందిపుచ్చుకోవాలి. సబ్జెక్టులకు సంబంధించిన వాలంటరీ వర్క్ చేస్తూ సోషల్ నెట్‌వర్క్‌ను పెంచుకోవాలి. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న నైపుణ్యాలతోపాటు మరిన్ని అనుబంధ నైపుణ్యాలనూ నేర్చుకోవాలి. దాంతో ఆత్మవిశ్వాసం పెరిగి ఉద్యోగ సాధన సులభమవుతుంది. వాలంటరీ వర్క్‌తో చేకూరే ప్రయోజనాలు, ఆ తరహాలో పని ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉదాహరణతో సహా తెలుసుకోడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.




ప్రపంచంలోని పలు భాషల్లో పంచతంత్రం!


ప్రాచీన భారత సాహిత్యం

భారతీయ సంస్కృతికి మూలాలు ప్రాచీన సాహిత్యంలో ఉన్నాయి. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలతో పాటు ఆర్థిక, తాత్విక, రాజకీయ, నైతిక నియమాలను తెలిపే గ్రంథాలెన్నో ఘన వారసత్వ సంపదగా మిగిలాయి. సనాతన హిందూ మత నియమాలు, నాటి ప్రజల జీవన శైలి, విశ్వాసాలు, ఆచార వ్యవహారాలను తెలియజేసే ఆధారాలుగా నిలిచాయి. వినోదాన్ని పంచే నాటకీయ, కథనాత్మక చరిత్రలు, మనోహర వర్ణనలే కాకుండా వైద్యం నుంచి ఖగోళం వరకు అనంత విజ్ఞానాన్ని ఆవిష్కరించే గ్రంథాలెన్నో ఉన్నాయి. అలాంటి ప్రసిద్ధ రచనలు, రచయితలు, వాటిలోని విషయాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి.






1. అర్థశాస్త్రం ప్రకారం రాజ్యం సప్త అంగాలతో కూడి ఉంటుంది. కింది వాటిలో ఏది సరైంది?
   1) స్వామి, అమాత్య, జనపద, దుర్గ, కోశ, దండ, ధర్మ
   2) స్వామి, జనపద, దుర్గ, కోశ, దండ, ధర్మ
   3) స్వామి, అమాత్య, జనపద, దుర్గ, కోశ, దండ, మిత్ర
   4) స్వామి, అమాత్య, తటాక, దుర్గ, కోశ, దండ, మిత్ర
2. అశ్వశాస్త్రం అని పిలిచే గుర్రాలకు సంబంధించిన పురాతన భారతీయ వైద్య గ్రంథాన్ని రచించినవారు?
   1) ఏడో శతాబ్దానికి చెందిన వాగ్భటుడు
   2) శాలి హోత్ర మహర్షి
   3) ఏడో శతాబ్దపు భర్తృహరి
   4) ఆరో శతాబ్దానికి చెందిన వరాహమిహిరుడు
3. కింది వాటిలో అర్థశాస్త్రంలో సూచించిన విధంగా రాజు దైనందిన కార్యకలాపం కానిది?
   1) రక్షణకు సంబంధించిన నివేదికలను స్వీకరించడం
   2) మారువేషంలో పట్టణ సంచారం
   3) నగదు రూపంలో శిస్తును స్వీకరించడం
   4) తన మంత్రిమండలిని సంప్రదించడం
4. కింది వాటిలో కశ్మీర్ కవి క్షేమేంద్రుడు రచించిన గ్రంథాలు?
   ఎ) కుతనిమాత బి) కళావిలాస
   సి) ప్రబోధ చంద్రోదయ డి) సమయ మాత్రిక
   1) ఎ, బి 2) బి, డి
   3) ఎ, బి, సి 4) బి, సి, డి
5. ప్రాచీన భారతదేశానికి సంబంధించిన భవభూతి హస్తిమల్ల, క్షేమేశ్వర దేనికి ప్రసిద్ధి?
   1) జైన సన్యాసులు 2) నాటక రచయితలు
   3) ఆలయ స్థపతులు 4) తత్వవేత్తలు
6. కింది ప్రకటనల్లో సరైనవి?
   ఎ) శారద లిపిని ఉపయోగించి గాథ భాషలో రాసిన బక్షాలి రాతపతిలో భిన్నాలు, వర్గమూలాలు, అంకగణితం, రేఖాగణిత శ్రేఢులు లాంటి అంశాలు న్నాయి.
   బి) జ్యామితీయ గణితంలో ఆర్యభట్ట 'పై (π) కచ్చితమైన విలువను నిర్ధారించి, వృత్తం పలు ధర్మాలను వివరించాడు.
   సి) 'సారంగధర సంహిత' అనేది ప్రాచీన భారతదేశ రాజకీయ వ్యవస్థ గురించి రాసిన ప్రముఖ గ్రంథం.
   1) ఎ, బి, సి 2) ఎ, సి 3) ఎ, బి 4) బి
7. కింది గ్రంథాలను, అవి రాసిన కాలమానం ప్రకారం కాలానుక్రమంలో అమర్చండి.
   ఎ) బాణభట్టుడి 'హర్షచరిత్ర'
   బి) హేమచంద్రుడి 'కుమారపాల చరిత్ర'
   సి) చాంద్ బర్దాయ్ 'పృథ్వీరాజ్ రాసో'
   డి) బిల్హణుడి 'విక్రమాంకదేవ చరిత్ర'
   1) ఎ, డి, బి, సి 2) బి, ఎ, సి, డి
   3) డి, ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
8. కింది వాటిని జతపరచండి.
   ఎ) బాణభట్ట 1) రాజ తరంగిణి
   బి) వాక్పతి 2) విక్రమాంకదేవ చరిత్ర
   సి) బిల్హణ 3) గౌడవాహ
   డి) కల్హణ 4) హర్షచరిత్ర
   1) ఎ-2, బి-4, సి-1, డి-3
   2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-3, బి-1, సి-4, డి-2
9. ప్రసిద్ధ సంస్కృత గ్రంథం 'మృచ్ఛకటికం' రచయిత?
   1) కాళిదాసు 2) భాస కవి
   3) వాల్మీకి 4) శూద్రక
10. కల్హణుడి 'రాజతరంగిణి'ని కొనసాగించినవారు?
    1) బిల్హణుడు, మేరుతుంగుడు
    2) బిల్హణుడు, మమ్మటుడు
    3) జోనరాజ, మేరుతుంగుడు
    4) జోనరాజ, శ్రీవరుడు




11. 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే వాక్యాన్ని ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
    1) అష్టాధ్యాయి
    2) మహాభాష్యం
    3) భగవద్గీత
    4) మహాభారతం
12. ఆర్యభట్ట ఒక.....?
    1) భారతీయ ప్రాచీన రాజకీయవేత్త
    2) భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు, ఖగోళ శాస్త్రవేత్త
    3) భారతీయ సంస్కృత పండితుడు, కవి
    4) పైవేవీ కాదు
13. రాజతరంగిణి గ్రంథ రచయిత కల్హణుడి

భారతదేశ చరిత్ర

సమకాలీన పాలకుడు ఎవరు?
    1) జైసింగ్ 2) హర్షుడు
    3) గోవిందాచార్యుడు 4) జయచంద్రుడు
14. కల్హణుడి రాజ తరంగిణిలో ఎన్ని తరంగాలున్నాయి?
    1) 8 2) 9 3) 10 4) 11
15. కింద పేర్కొన్న నాలుగు రచనల్లో దేనికి విజ్ఞాన సర్వస్వ స్వభావం ఉంది?
    1) అమరకోశం 2) సిద్ధాంత శిరోమణి
    3) బృహత్ సంహిత 4) అష్టాంగ హృదయం
16. కింది వాటిలో సరికాని జత?
    1) కర్పూర మంజరి - హర్షుడు
    2) మాళవికాగ్నిమిత్ర - కాళిదాసు
    3) ముద్రారాక్షసం - విశాఖదత్తుడు
    4) సౌందర్యనంద - అశ్వఘోష
17. కాళిదాసు రాసిన నాటకం మాళవికాగ్నిమిత్రంలో కథానాయకుడు ఎవరు?
    1) పుష్యమిత్రశుంగుడు 2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) అగ్నిమిత్రుడు 4) రెండో చంద్రగుప్తుడు
18. కింది వాటిలో సరైంది?
    ఎ) మృచ్ఛకటికం - శూద్రకుడు
    బి) బుద్ధచరితం - వసుబంధు
    సి) ముద్రారాక్షసం - విశాఖదత్తుడు
    డి) హర్షచరితం - బాణుడు
    1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, డి 4) బి, సి
19. కింది వాటిలో కాళిదాసు రచన కానిది?
    1) మృచ్ఛకటికం 2) మేఘదూతం
    3) ఋతుసంహారం 4) విక్రమోర్వశీయం
20. కింది వాటిలో హర్షుడు రచించిన గ్రంథాలు?
    1) ప్రియదర్శిక 2) నాగానంద
    3) హర్షచరితం 4) రత్నావళి
    కింది కోడ్‌లో సరైంది గుర్తించండి.
    1) 2, 3, 4 2) 1, 2, 4
    3) 1, 2, 3 4) 2, 3


జయదేవుడు

21. 'గీతగోవిందం' గ్రంథ రచయిత జయదేవుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
    1) ధర్మపాలుడు
    2) దేవపాలుడు
    3) విజయసేన
    4) లక్ష్మణసేన
22. శుంగ వంశ స్థాపకుడి కుమారుడి ప్రేమగాథను వివరించిన ప్రాచీన భారత గ్రంథం?
    1) స్వప్నవాసవ దత్త 2) మాళవికాగ్నిమిత్రము
    3) మేఘసందేశం 4) ముద్రారాక్షసం
23. 15 భారతీయ, 40 విదేశీ భాషల్లోకి అనువదించిన భారతీయ గ్రంథం?
    1) హితోపదేశం 2) పంచతంత్రం
    3) కథాసరిత్సాగరం 4) శాకుంతలం
24. కింది వాటిలో ఏది సరైన జత కాదు?
    1) ఆర్యభట్ట - ఆర్యభట్టీయం
    2) బ్రహ్మగుప్త - కంద కాద్యక
    3) వరాహమిహిరుడు - బృహత్ సంహిత
    4) భాస్కరుడు - పంచ సిద్ధాంతిక
25. కింది వాటిని జతపరచండి.
    ఎ) మృచ్ఛకటికం 1) విశాఖదత్తుడు
    బి) ముద్రారాక్షసం 2) శూద్రకుడు
    సి) అమరకోశం 3) వరాహమిహిరుడు
    డి) బృహత్ సంహిత 4) అమరసింహుడు
    1) ఎ-1, బి-2, సి-4, డి-3
    2) ఎ-1, బి-2, సి-3, డి-4
    3) ఎ-2, బి-1, సి-4, డి-3
    4) ఎ-2, బి-3, సి-1, డి-4
26. 'మిళింద పన్హా' అనేది ఒక....?
    1) సంస్కృత నాటకం 2) జైనుల చరిత్ర
    3) పాళీ భాషా గ్రంథం 4) పర్షియా ఇతిహాసం
27. కింది వాటిలో ప్రాచీన భారతదేశ వాణిజ్య మార్గాల గురించి ప్రస్తావించనిది ఏది?
    1) సంగమ సాహిత్య 2) మిళింద పన్హా
    3) జాతక కథలు 4) పైవన్నీ
28. 'స్వప్న వాసవదత్త' గ్రంథ రచయిత?
    1) జయదేవుడు 2) కాళిదాసు
    3) భాసుడు 4) రాజశేఖర
29. 'సౌందర్యానంద' అనే మహాకావ్యాన్ని రచించింది ఎవరు?
    1) అశ్వఘోషుడు 2) చాణక్యుడు
    3) భవభూతి 4) వసుబంధు
30. బౌద్ధ గ్రంథమైన 'మిళింద పన్హా' ఏ గ్రీకు రాజు గురించి తెలియజేస్తుంది?
    1) డియోడోరస్-2 2) డెమిట్రియస్
    3) మినాండర్ 4) మొదటి స్ట్రాబో
31. 'శత్రువుకు శత్రువు మనకు మిత్రుడు' ఈ సందేశం ఏ గ్రంథంలో ఉంది?
    1) విశాఖదత్తుడి దేవీచంద్రగుప్తం
    2) కౌటిల్యుడి అర్థశాస్త్రం
    3) జయదేవుడి గీతగోవిందం
    4) పాణిని రాసిన అష్టాధ్యాయి
32. కింది వాటిని జతపరచండి.
    జాబితా-1 జాబితా-2
    ఎ) అమీర్ ఖుస్రో 1) రెండో చంద్రగుప్తుడు
    బి) కాళిదాసు 2) సముద్రగుప్తుడు
    సి) హరిసేనుడు 3) హర్షవర్ధనుడు
    డి) బాణభట్ట 4) అల్లాఉద్దీన్ ఖిల్జీ
    1) ఎ-1, బి-2, సి-3, డి-4
    2) ఎ-4, బి-1, సి-2, డి-3
    3) ఎ-4, బి-3, సి-2, డి-1
    4) ఎ-2, బి-4, సి-1, డి-3


వరాహమిహిరుడు

33. వరాహమిహిరుడు రచించిన రోమక సిద్ధాంతం దేనికి సంబంధించింది?
    1) రసాయన శాస్త్రం
    2) గణితం
    3) ఖగోళం
    4) ఔషధం
34. 'మత్త విలాస ప్రహసనం' గ్రంథ రచయిత ఎవరు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి 2) రుద్రదాముడు
    3) మహేంద్ర వర్మ 4) రెండో పులకేశి
35. కింద తెలిపిన వాటిలో అత్యంత పురాతనమైన సంగీత వాయిద్యం?
    1) సితార్ 2) వీణ
    3) సరోద్ 4) తబలా



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-3; 2-2; 3-2; 4-2; 5-2; 6-3; 7-1; 8-3; 9-4; 10-4; 11-3; 12-2; 13-1; 14-1; 15-3; 16-1; 17-3; 18-2; 19-1; 20-2; 21-4; 22-2; 23-2; 24-4; 25-3; 26-3; 27-2; 28-3; 29-1; 30-3; 31-2; 32-2; 33-3; 34-3; 35-2.

చలనంలో ఉన్న ప్రవాహిల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ప్రవాహి గతిశాస్త్రం అంటారు. ప్రవహించే సామర్థ్యం కలిగిన పదార్థ రూపాన్ని ప్రవాహి అంటారు. ప్రవాహిలోని పొరల మధ్య పరస్పర చలనాల వ్యతిరేక ధర్మమే స్నిగ్ధత. మరుగుతున్న ద్రవానికి తలతన్యత సున్నాగా ఉంటుంది. నదిలో ప్రవహించే నీటి వేగాన్ని లెక్కించేందుకు పీటో గొట్టాన్ని ఉపయోగిస్తారు. పోటీపరీక్షార్థులు తలతన్యత ప్రమాణాలు, స్పర్శ కోణం, కేశనాళీయత, వాటి అనువర్తనాలు తది తరాలపై అవగాహన కలిగి ఉండాలి.

కేశనాళీయత

అక్షం వెంట సన్నని రంధ్రం ఉన్న గాజు కడ్డీని కేశనాళిక అంటారు. ఒక ద్రవంలో ముంచిన సన్నని రంధ్రం ఉన్న గాజు గొట్టంలో ద్రవం పైకి ఎగబాకడం లేదా బయట కంటే తక్కువ ఎత్తులో ఉండటం అనే ప్రక్రియ కేశనాళీయత ఆధారంగా జరుగుతుంది. దీనికి కారణం అణువుల మధ్యనున్న సంసంజన, అసంజనా బలాలు. స్పర్శకోణం 90 డిగ్రీల కంటే ఎక్కువ ఉంటే ద్రవం కేశనాళికలో పైకి ఎగబాకుతుంది. 90 డిగ్రీల కంటే తక్కువ ఉంటే ద్రవం కేశనాళికలో కిందికి వెళ్తుంది.



అనువర్తనాలు:

నూనె దీపాలు, కిరోసిన్ పొయ్యి, కొవ్వొత్తి మొదలగునవి కేశనాళీయత ఆధారంగా పని చేస్తాయి. ఒత్తిలోని పోగుల మధ్య సన్నని రంధ్రాలు కేశనాళికలుగా పనిచేస్తాయి. కేశనాళీయత కారణంగా నూనె లేదా మైనం పైకి ఎగబాకి మంటకు నిరంతరం సరఫరా అవుతుంది.

- చెట్ల వేర్లు నీటిని గ్రహించడానికి కేశనాళీయత సహాయపడుతుంది.
- బ్లాటింగ్ కాగితం సిరాను పీల్చుకోవడంలో కేశనాళీయత పనిచేస్తుంది.
- ఇటుకలలోని సన్నని రంధ్రాలు కేశనాళికల్లా పనిచేసి వర్షపు నీటిని బయట నుంచి లోపలికి గ్రహిస్తాయి. గోడ లోపలి వైపు వర్షాకాలంలో చెమ్మ రావడానికి కారణం ఇదే. దీన్ని నివారించడానికి గోడ వెలుపలి భాగంలో సిమెంటుతో పూత పూయడం వల్ల కేశనాళికలను మూసివేయవచ్చు.
- మట్టి మధ్యలోని సన్నటి రంధ్రాలు కేశనాళికల్లా పనిచేసి లోపలి తేమను త్వరగా ఆవిరయ్యేలా చేస్తాయి. దీన్ని నివారించేందుకు పొలంలో మట్టిని దున్నుతారు.
- వేసవిలో నూలు దుస్తులు ధరిస్తే మనకు సౌకర్యంగా ఉండటానికి కారణం దుస్తుల పోగుల మధ్య ఉన్న సన్నని రంధ్రాలు. అవి కేశనాళికల్లా పనిచేసి చెమటను పీల్చుకుంటాయి. పాలిస్టర్ దుస్తుల్లో ఈ రకమైన రంధ్రాలు ఉండవు.

నీటి తలతన్యత తగ్గితేనే మురికి వదులుతుంది!

ప్రవాహి గతిశాస్త్రం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

తలతన్యత

ఒకే పదార్థానికి చెందిన అణువుల మధ్య పనిచేసే సంసంజన బలాలు గరిష్ఠంగా ఎంతవరకు ప్రభావాన్ని చూపగలవో, ఆ దూరాన్ని అణువుల వ్యాప్తి అంటారు. సాధారణంగా ఈ దూరం 10^{-9} మీటర్లు.

- అణువు కేంద్రంగా, దూరాన్ని వక్రత వ్యాసార్ధంగా ఉండే గోళాన్ని ప్రభావ గోళం అంటారు.
- ప్రతి ద్రవం ఉపరితలం ఒక రబ్బర్ షీట్‌లా స్థితిస్థాపక గుణాన్ని ప్రదర్శిస్తుంది.
- ఒక ద్రవ ఉపరితలంపై ఉన్న ఊహారేఖ వెంబడి ప్రమాణ పొడవుపై పనిచేసే బలాన్ని తలతన్యత అంటారు.

$T = F/l$

తలతన్యత ప్రమాణాలు: CGS పద్ధతిలో డైన్/సెంటీమీటర్, SI పద్ధతిలో న్యూటన్/మీటర్

- అణువుల మధ్య ఉన్న సంసంజన బలాల కారణంగా తలతన్యత పనిచేస్తుంది.
- తలతన్యత అనేది ద్రవం ఉపరితల వైశాల్యంపై ఆధారపడదు.

అనువర్తనాలు:



చిన్న మొత్తంలోని ఏ ద్రవమైనా తలతన్యత కారణంగా గోళాకార ఆకృతిని పొందుతుంది. ఒక నీటి తొట్టెలో కరిగిన సీసాన్ని పోసినప్పుడు ఆ ప్రవాహం చిన్నచిన్న గోళాలుగా విడిపోయి ఘనీభవిస్తుంది. ఈ విధంగా సీసపు గుండ్లను తయారు చేస్తారు.

- కందెనలు, పెయింట్ల తయారీలో తలతన్యతను తగ్గిస్తే అవి సులభంగా, సమానంగా వ్యాప్తి చెందుతాయి.
- మురుగు నీటిపై దోమలు పెట్టే గుడ్లు పైన తేలుతాయి. దీనికి కారణం నీటి తలతన్యత. నీటిపై కందెనలు చల్లడంతో దాని తలతన్యత తగ్గించవచ్చు. దీంతో నీటిపై తేలే గుడ్లు మునిగిపోతాయి.
- షేవింగ్ బ్రష్ నీటిలో ముంచినప్పుడు దాని పీచులు వెడల్పుగా విస్తరిస్తాయి. బయటకు తీయగానే పీచుల మధ్యనున్న పల్చటి నీటి పొరలో ఉన్న తలతన్యత కారణంగా అతుక్కుని ఉంటాయి.
- వర్షపు చినుకులు, సబ్బునీళ్ల బుడగలు గోళాకారంలో ఉండటానికి కారణం తలతన్యత.
- నీటి ఉపరితలంపై ఒక గుండుసూదిని సమాంతరంగా ఉంచినప్పుడు అది కొంతసేపు అలాగే తేలడానికి కారణం నీటి తలతన్యత.
- రెండు గాజు పలకలను ఒకదానికొకటి పక్కపక్కగా ఉంచి, వాటిపై కొంచెం బలం ప్రయోగించి సులభంగా విడదీయవచ్చు. కానీ ఆ రెండు పలకల మధ్యలో కొన్ని నీటి బిందువులు పడితే వాటిని విడదీయడానికి ఎక్కువ బలం ప్రయోగించాలి. దీనికి కారణం నీటికి ఉండే తలతన్యత.
- పాదరసాన్ని ఒక గాజు పలకపై వెదజల్లితే అది స్పష్టమైన చిన్న గోళంలా ఏర్పడుతుంది. కారణం ఇందులో సంసంజన బలాలు చాలా ఎక్కువగా ఉండటమే.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

స్పర్శ కోణం

ద్రవ ఉపరితలం స్పర్శరేఖకు, ఘనపదార్థ ఉపరితలానికి మధ్య ఏర్పడే కోణాన్ని స్పర్శ కోణం అంటారు.

- ఒక ద్రవం ఘనపదార్థంతో కలిసినప్పుడు ఆ స్పర్శ బిందువు వద్ద వక్రరేఖ ఏర్పడుతుంది.
- నీటి తొట్టెలో ఒక గాజు గొట్టాన్ని ముంచినప్పుడు ఏర్పడే స్పర్శ కోణం 90 డిగ్రీల కంటే తక్కువగా ఉంటుంది. అందుకే గొట్టం బయట ఉన్న నీరు పుటాకారాన్ని పోలి ఉంటుంది. ఇదేవిధంగా పాదరసం ఉన్న తొట్టిలో గాజు గొట్టాన్ని ముంచినప్పుడు ఏర్పడే స్పర్శ కోణం 90 డిగ్రీల కంటే ఎక్కువ ఉంటుంది. ఇక్కడ ఏర్పడే ద్రవ ఉపరితలం కుంభాకారాన్ని పోలి ఉంటుంది.

స్పర్శ కోణం ఆధారపడే అంశాలు: ప్రయోగంలో ఉన్న ద్రవం, ఘనపదార్థ స్వభావం

- ద్రవ ఉపరితలంపై ఉన్న యానకం
- స్పర్శలో ఉన్న రెండు ఉపరితలాల పరిశుభ్రత
- ఉష్ణోగ్రత

స్పర్శ కోణం విలువలు:

- గాజు - నీరు, సీసం - పాదరసం జంటలకు 90 డిగ్రీల కంటే తక్కువ
- గాజు - పాదరసం, నీరు - మైనం జంటలకు 90 డిగ్రీల కంటే ఎక్కువ
- నీరు, వెండి ఉపరితలాల మధ్య స్పర్శ కోణం 90 డిగ్రీలు ఉంటుంది.

స్పర్శ కోణాల విలువలు వేర్వేరుగా ఉండటానికి కారణం ఆ అణువుల మధ్య ఉండే సంసంజన, అసంజన బలాలే.



అనువర్తనాలు:

డిటర్జెంట్‌ను నీటిలో కలిపినప్పుడు అది స్పర్శ కోణాన్ని తగ్గిస్తుంది. కాబట్టి సాధారణ నీటి కంటే డిటర్జెంట్ కలిపిన నీటిలో మురికి బట్టలు బాగా నానుతాయి. డిటర్జెంట్ అణువులు ఒక చివర నీటి అణువుల వైపు ఆకర్షితమవుతూ, మరొక చివరన గ్రీజ్, నూనె, మురుగు లాంటి అణువుల వైపు ఆకర్షితమవుతాయి. ఈ క్రమంలో తలతన్యత గణనీయంగా తగ్గుతుంది. మురికి కణం చుట్టూ ఒక గోళాకారంలో ఏర్పడి, బట్ట నుంచి మురికిని తొలగిస్తాయి. ఇదే ప్రక్రియను ఉపయోగించి ఖనిజ వనరుల నుంచి లోహాలను వెలికి తీయవచ్చు.

- వస్త్రాలకు రంగులు అద్దేటప్పుడు స్పర్శ కోణాన్ని తగ్గించడానికి ఒక మలినాన్ని కలిపి రంగు వస్త్రం లోపలికి చొచ్చుకొని పోయేలా చేస్తారు. దీనివల్ల రంగు సమంగా ఉంటూ ఎక్కువ కాలం మన్నికనిస్తుంది.
- పదార్థానికి నీరు అంటుకోకుండా చేసేందుకు నీటి నిరోధక పదార్థాలను కలుపుతారు. వీటిని కలిపినప్పుడు స్పర్శ కోణం అధికమై ఘనపదార్థానికి నీరు అంటుకోదు.

ఉదా: వర్షంలో తడవని దుస్తులను తయారు చేసేటప్పుడు వాటిపై మైనం లాంటి పదార్థాలను పూతగా వేస్తారు. దీంతో స్పర్శ కోణం పెరిగి నీరు ఆ వస్త్రానికి అంటుకోదు.

787 Word of the Day

Lugubrious

Telugu meaning: విచారకరమైన, విషాదకరమైన

English meaning: The word Lugubrious (లుగుబ్రియస్) is an adjective that describes something that is excessively mournful, gloomy, or dismal.

Synonyms: Melancholy, Sorrowful

Antonyms: Cheerful, Joyful

Usage: 1. The film's lugubrious tone left the audience feeling heavy-hearted by the end of the show.

2. His lugubrious expression made everyone uncomfortable at the otherwise cheerful party.

Current Affairs



India clinched the Asia Cup 2025 in the Men's T20 format. On 28 September 2025, India beat Pakistan by five wickets to win their ninth Asia Cup at the Dubai International Cricket Stadium in Dubai, UAE.


- The 2025 edition is India's second Asia Cup title in the T20 format, following their previous win in 2016.



Former Delhi captain Mithun Manhas was elected as the new president of the Board of Control for Cricket in India (BCCI) during its Annual General Meeting on 28 September 2025. Manhas becomes the 37th president of the board, succeeding Roger Binny, who stepped down last month after turning 70.



UNESCO has designated Spiti Valley in Himachal Pradesh's Lahaul-Spiti district as India's first Cold Desert Biosphere Reserve under its global Man and the Biosphere (MAB) Programme. The recognition was officially conferred at the 37th International Coordinating Council (MAB-ICC) meeting in Hangzhou, China on 27 September 2025.



China has officially opened the world's highest bridge named 'Huajiang Grand Canyon Bridge' on 28 September 2025. This is located in Southwest China's Guizhou Province. With a vertical height of 625 meters - roughly twice the height of the Eiffel Tower, the Huajiang Grand Canyon Bridge is now the tallest bridge in the world.

For more Current Affairs: Scan QR code

భారతదేశ అంతరిక్ష విజ్ఞానం - ఇస్రో

స్టడీ జోన్

అంతరిక్షం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని అంతరిక్ష విజ్ఞానశాస్త్రం అంటారు. భూమి చుట్టూ ఉన్న ప్రదేశమే అంతరిక్షం. దీన్నే ఖగోళం లేదా రోదసి అని కూడా అంటారు. ఇది తక్కువ సాంద్రత ఉన్న పదార్థాలతో నిర్మితమై ఉంటుంది. ఇందులో ముఖ్యంగా హైడ్రోజన్ ప్లాస్మా, హీలియం, ఎలక్ట్రోమాగ్నటిక్ తరంగాలు, న్యూట్రినోలు, దుమ్ము, కాస్మిక్ కిరణాలు ఉంటాయి. ప్రస్తుతం భారత్ అంతరిక్ష విజ్ఞానశాస్త్రంలో ప్రపంచదేశాల్లో అగ్రగామిగా ఉంది. స్వదేశీ ఉపగ్రహాలనే కాకుండా విదేశీ శాటిలైట్లను కూడా విజయవంతంగా రోదసిలోకి పంపే స్థాయికి ఎదిగింది. పోటీపరీక్షల నేపథ్యంలో భారతదేశంలో అంతరిక్ష అభివృద్ధికి బాటలు వేసిన ఇస్రో గురించి ముఖ్య విషయాలను తెలుసుకుందాం..!

చారిత్రక నేపథ్యం

స్వాతంత్ర్యానికి పూర్వమే మనదేశంలో అంతరిక్ష విజ్ఞానశాస్త్ర పరిశోధనలు ప్రారంభమయ్యాయి. సర్ సి.వి.రామన్, మేఘనంద్ సాహాలు భౌతికశాస్త్రం, వాతావరణశాస్త్రం, బాహ్య అంతరిక్షంపై అనేక పరిశోధనలు చేశారు. వీటినే మన అంతరిక్ష విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు పునాదిగా భావిస్తారు.

- 1954లో భారత ప్రభుత్వం అణుశక్తి విభాగాన్ని ఏర్పాటు చేసి, అంతరిక్ష రంగాన్ని దీని కిందికి తీసుకొచ్చింది. ఆ సమయంలో దేశంలోని శాస్త్ర-సాంకేతికత, అంతరిక్ష పరిశోధనలన్నీ అణుశక్తి విభాగం ఆధ్వర్యంలోనే జరిగేవి.
- 1962లో భారత అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రిసెర్చ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి విక్రం సారాభాయ్‌ను అధ్యక్షుడిగా నియమించారు.
- అంతరిక్ష పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం 1972లో అంతరిక్ష విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇది ప్రధాని నేతృత్వంలో పని చేస్తుంది.

ఇస్రో: దీన్ని 1969, ఆగస్టు 15న ఏర్పాటు చేశారు. దీని ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరు ప్రముఖ అంతరిక్ష సంస్థల్లో ఇస్రో ఒకటి.

'భారత అంతరిక్ష విజ్ఞాన శాస్త్ర పితామహుడు' ఎవరు? మొదటి సౌండ్ రాకెట్ రేంజ్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు? స్పేస్ కమిషన్ - డీఓఎస్ ఎప్పుడు ఏర్పాటయ్యాయి? ఆర్యభట్ట పురస్కారం ఎవరికి ఇస్తారు? ఇప్పటివరకు ఇస్రో ఛైర్మన్‌లుగా పనిచేసిన వారి వివరాలు లాంటి విషయాలతోపాటు పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

గ్రామీణాభివృద్ధి

భారతదేశంలో అనేక గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2025 నాటికి మన దేశంలో 6.65 లక్షల గ్రామాలు ఉన్నట్లు అంచనా. ఇవి అభివృద్ధి చెందితేనే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ఈ కారణంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గ్రామీణాభివృద్ధి కోసం అనేక ప్రయత్నాలు, కార్యక్రమాలు చేపట్టారు. అవి నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి అనేది వృద్ధికి సంబంధించిన సమగ్ర భావన. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న వివిధ ఏజెన్సీలు, సంస్థలు (పథకాలు), కార్యక్రమాలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

గ్రామీణాభివృద్ధి అంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవన పరిస్థితులను, ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరచడం. అంటే అక్కడి జనాభా సాంఘిక, ఆర్థిక, మౌలిక సదుపాయాలైన వ్యవసాయం, విద్య, వైద్యం, ఆరోగ్యం, విద్యుత్, రవాణా, సమాచార సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయడంతోపాటు పాలనలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రణాళికాబద్ధ అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకోవడం.

- పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం వల్ల పేదరికం, నిరుద్యోగం, జనాభా పెరుగుదల, ఆర్థిక అసమానతలు, పౌష్టికాహార లోపం, విద్యా - వైద్య సదుపాయాల కొరత, అల్ప వ్యవసాయ ఉత్పాదకత లాంటి సమస్యలు ఎక్కువ.



వీటన్నింటినీ అధిగమించి గ్రామీణ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు అనేక పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

- సామాజిక అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ)
- జాతీయ విస్తరణ సేవల పథకం (ఎన్ఈఎస్ఎస్)
- నాబార్డ్
- చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ (ఎస్ఎఫ్‌డీఏ)
- గ్రామీణ ప్రాంతాల్లో మహిళా, శిశు అభివృద్ధి (డ్వాక్రా)
- పనికి ఆహార పథకం

గ్రామీణాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన - బల్వంతరాయ్ మెహతా కమిటీ, అశోక్ మెహతా కమిటీ, దంత్‌వాలా కమిటీ, సీహెచ్ హనుమంతరావు కమిటీ, జీవీకే రావు కమిటీ, ఎల్ఎం సింఘ్వీ కమిటీ, పీకే తుంగన్ కమిటీ - సిఫార్సులు సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

CBSE - Single Girl Child Scholarship 2025

The Central Board of Secondary Education invites online applications for Single Girl Child Scholarship 2025 Scheme for Single Girl Child who has passed Class X from CBSE and studying in Class XI from the CBSE affiliated Schools. The last date for submission of online applications is 23 October 2025.

Central Institute of Tool Design Admissions

Central Institute of Tool Design Hyderabad (CITD) is inviting applications for admissions to the Master of Engineering (ME) 2-year course for the year 2025. The application fee is Rs.1000. Eligible candidates can apply online before 14 October 2025.

Apprentice Posts

Andhra Pradesh Road Transport Corporation (APSRTC) has released a notification for the recruitment of 281 apprentice posts. The application fee is Rs.100+GST Rs.18. The last date for online applications is 4 October 2025.

Did You Apply..?

Today (September 30) is the last date for the following Jobs/ Admissions

- Business Development Manager posts in BOB Capital. *Eligibility:* Intermediate and Degree.
- 120 Officer Grade-B Jobs in RBI. *Eligibility:* Degree, PG.
- 150 posts in the National Institute of Rural Development. *Eligibility:* Degree/PG.

For more information and other notifications - scan QR code

Fractions & Decimals

1. One - fifth of one - ninth of a number is 182. What is the one - seventh of the same number?
A) 1254 B) 1170 C) 1260
D) 1107 E) 2210

2. The difference between the $\frac{2}{3}$rd of the $\frac{3}{4}$th of a number and $\frac{3}{7}$th of $\frac{2}{5}$th of the same number is 575. What is the number?
A) 1570 B) 1650 C) 1500
D) 1750 E) 1991

3. The value of $0.\overline{5} + 0.\overline{7} + 0.\overline{29}$ is....
A) $1.\overline{62}$ B) $1.\overline{61}$ C) $1.\overline{49}$
D) $0.\overline{41}$ E) None of the above

4. The numerator of a fraction decreased by 35% and the denominator is increased by 175%. If the resultent fraction is $\frac{3}{11}$. What is the original fraction?
A) $\frac{14}{13}$ B) $\frac{13}{15}$ C) $\frac{15}{13}$
D) $\frac{13}{14}$ E) $\frac{17}{15}$

5. If 0.07x = 1.3y, then the value of $\left(\frac{x+y}{x-y}\right)$ is:
A) $\frac{137}{123}$ B) $\frac{130}{7}$ C) $\frac{123}{137}$
D) $\frac{13}{70}$ E) $\frac{147}{12}$

6. The last digit in the decimal representation of $\left(\frac{1}{5}\right)^{2025}$ is...
A) 4 B) 8 C) 2 D) 6 E) 5

7. $\frac{3}{4}$ of a number is equal to 25% of second number. Second number is equal to $\frac{2}{5}$ of third number. The value of third number is 3480. What is 45% of first number?
A) 208 B) 208.8 C) 280.8
D) 288.8 E) 298.8

8. Consider the fraction $\frac{3}{7}$. If a constant value 'a' is subtracted from its numerator and its denominator, then the fraction becomes, the reciprocal of itself. Then what is the value of $\left(\frac{2a+3}{a-2}\right) + \left(\frac{3a+2}{2a-11}\right)$?
A) $\frac{463}{27}$ B) $\frac{435}{72}$
C) $\frac{472}{63}$ D) $\frac{463}{72}$
E) None of the above

Bank Exams

Quantitative Aptitude

9. The Value of $\frac{3.25 \times 3.25 \times 3.25 - 1.75 \times 1.75 \times 1.75}{3.25 \times 3.25 + 3.25 \times 1.75 + 1.75 \times 1.75}$
A) 5.0 B) 3.25 C) 1.5
D) 1.7 E) 4.8

10. If we multiply a fraction by itself and divide the product by its reciprocal, the fraction thus obtained is $2\frac{43}{343}$.
The fraction is:
A) $1\frac{2}{7}$ B) $1\frac{2}{343}$ C) $1\frac{2}{43}$
D) $1\frac{3}{7}$ E) None of the above

11. When 0.373737.... is converted into a fraction, then the result is:
A) $\frac{37}{100}$ B) $\frac{37}{99}$ C) $\frac{37}{9}$
D) $\frac{37}{95}$ E) $\frac{38}{53}$

12. The expression (13.57 × 13.57 + 13.57 × k + 0.43 × 0.43) will be a perfect square for 'k' equal to...
A) 2 B) 0.43 C) 13.57
D) 0.86 E) None of the above

13. The value of $\frac{0.3 \times 0.3 \times 0.3 + 0.04 \times 0.04 \times 0.04}{0.6 \times 0.6 \times 0.6 + 0.08 \times 0.08 \times 0.08}$
A) 0.125 B) 0.0125 C) 0.34
D) 0.68 E) 0.9909

14. Find the correct expression of $4.\overline{37}$ in the fractional form.
A) $\frac{437}{99}$ B) $\frac{433}{100}$ C) $\frac{433}{99}$
D) $\frac{437}{90}$ E) $\frac{437}{77}$

15. If $\frac{421.324}{0.0093} = x$ then find the value of $\frac{421324}{0.093}$
A) 10x B) $\frac{x}{100}$ C) $\frac{100}{x}$
D) 100x E) None of the above

16. In an office there are 480 tables and 357 chairs. If $\frac{2}{3}$ of tables and $\frac{4}{7}$ of chairs are broken. How many people can work in the office if each person requires one table and one chair?
A) 148 B) 160 C) 175
D) 153 E) 187

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

బాలీవుడ్ పాటకు వాయుసేన చీఫ్ స్టెప్పులు..

• వీడియో వైరల్



ఇంటర్నెట్ డెస్క్: బాలీవుడ్ సాంగ్ 'హవన్ కరేంగే'కు భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ స్టెప్పులు వేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఎప్పుడూ గంభీరంగా కనిపించే వాయుసేన చీఫ్ ఉత్సాహంగా నృత్యం చేయడం పట్ల నెటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌లోని ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసిన ఆనందంలో ఎయిర్ చీఫ్ మార్షల్ నృత్యం చేస్తున్నారంటూ నెటిజన్లు సరదాగా పోస్టులు చేస్తున్నారు. అమర్ ప్రీత్ సింగ్ డాన్స్ చేస్తున్న వీడియో ఏ పార్టీలో చిత్రీకరించింది అనే వివరాలు తెలియరాలేదు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ దాడులు నిర్వహించిన నేపథ్యంలో పాక్‌లోని ఎయిర్‌బేస్‌లపై దాడికి వ్యూహ రచనలో ఎయిర్‌ఫోర్స్ చీఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ముఖ్య పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

ఇక ఆన్‌లైన్‌లో అయ్యప్ప ప్రసాదం

శబరిమల అయ్యప్ప స్వామి భక్తులకు శుభవార్త. ఆన్‌లైన్ ద్వారా తమ ఇంటి నుంచే స్వామివారి ప్రసాదాలన్నింటినీ బుక్ చేసుకునే సదుపాయం మరో నెలలో అమలులోకి రానుంది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు లాంఛనంగా ప్రారంభించిన కౌంటర్ బిల్లింగ్ మాడ్యూల్ సాయంతో శబరిమలతో పాటు త్వరలో ట్రావెన్‌కోర్ సంస్థానం పరిధిలోని 1252 దేవాలయాల ప్రసాదాలనూ భక్తులు తమ ఇంటి నుంచే బుక్ చేసుకోవచ్చు. శబరిమల లాంటి రద్దీగా ఉండే దేవాలయాలకు నేరుగా వెళ్లలేని భక్తులకు ఈ సదుపాయం ఉపయోగకరంగా ఉంటుందని దేవస్థానం తెలిపింది. కౌంటర్ బిల్లింగ్ మాడ్యూల్ ఒక నెలలోపు పని చేయడం ప్రారంభిస్తుందని ఈ సందర్భంగా దేవస్వం బోర్డు అధ్యక్షుడు తెలిపారు.

భారత్- భూటాన్‌ల మధ్య రెండు రైల్వేలైన్‌లు

• కేంద్రమంత్రి అశ్వినీ ప్రకటన

దిల్లీ: భూటాన్‌తో వాణిజ్యం, పర్యాటకం సహా పలు రంగాలను అభివృద్ధి చేసే దిశగా ఇరుదేశాల సరిహద్దులను కలిపేలా రెండు రైల్వేలైన్ లింక్‌లను నిర్మించబోతున్నట్లు భారత్ సోమవారం ప్రకటించింది. రూ.4వేల కోట్లకు పైగా వ్యయంతో భూటాన్‌లోని సమస్తే, గెలేఫులను భారత్‌లోని నగరాలతో అనుసంధానించేలా 89 కిలోమీటర్ల మేర వీటిని నిర్మించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, విదేశీవ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీలు వెల్లడించారు. "పశ్చిమబెంగాల్‌లోని బనారహాట్ నుంచి సమస్తే, అస్సాంలోని కోక్రాజార్ నుంచి గెలుఫుల మధ్య రైల్వేలైన్‌లను ఏర్పాటు చేసేందుకు రెండు దేశాల ప్రభుత్వాలు అంగీకరించాయి. ఆరు స్టేషన్లతో మొదట లైన్‌ను కోక్రాజార్-గెలేఫుల మధ్య 69 కిలోమీటర్ల మేర రూ.3,456 కోట్ల వ్యయంతో నాలుగేళ్లలో రైల్వేలైన్‌ను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాం. బనారహాట్- సమస్తేల మధ్య రూ.577 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రెండో లైన్‌ను నిర్మిస్తాం. ఇరుదేశాలు పరస్పర అవగాహన, గౌరవంతో స్నేహ బంధాన్ని ఏర్పరచుకొంటున్నాయి. ఈ ప్రాజెక్టుల పూర్తి వ్యయం భారత ప్రభుత్వం వెచ్చించనుంది. దీని వ్యయం దాదాపు రూ.4,033 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశాం. భూటాన్‌కు భారత్ అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా ఉంది. దీనిలో అధికశాతం వ్యాపారం ఓడరేవుల ద్వారా జరుగుతోంది. ఈ ప్రాజెక్టుతో ఇరు దేశాలకు మరింత లబ్ధి చేకూరనుంది" అని అశ్వినీ వెల్లడించారు.

రాజకీయ గందరగోళం మధ్య దేశాన్ని విడిచిపెట్టేది లేదు

• నేపాల్ మాజీ ప్రధాని ఓలీ

ఇంటర్నెట్ డెస్క్: జెన్-జెడ్ ఆందోళనల నేపథ్యంలో తాను దేశం విడిచి వెళ్లనున్నట్లు వస్తున్న వదంతులను నేపాల్ మాజీ ప్రధాని, సీపీఎన్-యూఎంఎల్ అధ్యక్షుడు కేపీ శర్మ ఓలీ తోసిపుచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం తన భద్రతా సౌకర్యాలు, అధికారిక హక్కులను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. "ఎటువంటి ఆధారం లేని ఈ ప్రభుత్వానికి దేశాన్ని అప్పజెప్పి నేను పారిపోతానని అనుకుంటున్నారా" అని ప్రశ్నించారు. భక్తపూర్‌లోని పార్టీ యువ విభాగంతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

లద్దాఖ్ మరణాలపై న్యాయవిచారణ

• ఉద్యమ సంస్థ డిమాండ్

దిల్లీ/లేహ్: దేశం పట్ల అచంచల విధేయత కలిగిన తమపై "జాతి వ్యతిరేకులు", "పాక్ ఏజెంట్లు" వంటి ముద్రలువేస్తే సహించేది లేదని లద్దాఖ్ ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న లేహ్ అపెక్స్ బాడీ(ఎల్ఏబీ) సోమవారం స్పష్టంచేసింది. సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ జరిగి అనుకూల వాతావరణం ఏర్పడే వరకూ కేంద్రంతో చర్చల్లో పాల్గొనబోమని ఆ సంస్థ పేర్కొంది. లేహ్‌లో ఈనెల 24న జరిగిన కాల్పుల్లో నలుగురి మరణంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించడంతోపాటు నిర్బంధంలోకి తీసుకున్న లద్దాఖ్ ఉద్యమకారులందరినీ విడుదల చేస్తే అక్టోబరు 6న జరగనున్న మలివిడత చర్చల్లో పాల్గొనే విషయం ఆలోచిస్తామని వెల్లడించింది.

చర్చలకు ఎప్పుడూ సిద్ధమే

లద్దాఖ్ వ్యవహారాలపై చర్చలకు తాము ఎల్లవేళలా సిద్ధమేనని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కోరుతున్న లేహ్ అపెక్స్ బాడీ(ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ)లతో చర్చల్ని తాము ఎప్పుడూ ఆహ్వానిస్తామని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఉన్నతాధికార కమిటీ ద్వారా ఎల్ఏబీ, కేడీఏలతో చర్చలకు కేంద్రం ఎప్పుడూ సానుకూలమేనని తెలిపింది. ఇప్పటి వరకు ఎల్ఏబీ, కేడీఏలతో జరిగిన చర్చల ఫలితంగా లద్దాఖ్‌కు చెందిన షెడ్యూల్డ్ తెగలకు రిజర్వేషన్లను విస్తృతం చేయడం, లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, స్థానిక భాషల్ని పరిరక్షించేలా చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

'వాంగ్‌చుక్‌ను తక్షణం విడుదల చేయాలి'



దిల్లీ: లద్దాఖ్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థల పునరుద్ధరణతో పాటు, ఆ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ శాంతియుతంగా ఉద్యమం సాగిస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడాన్ని కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) ఖండించింది. ఆయనను తక్షణం బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లద్దాఖ్ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తితో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు కింద భద్రత కల్పించాలన్న డిమాండ్లపై రాజీ ప్రసక్తే లేదని కేడీఏ సహ అధ్యక్షుడు సజ్జాద్ కార్గిలి తేల్చి చెప్పారు.

కార్గిల్ యోధుణ్ని కాల్చి చంపారు: కాంగ్రెస్

లద్దాఖ్‌లో ఇటీవల జరిగిన కాల్పుల్లో మరణించిన వారిలో ఒక మాజీ సైనికుడు కూడా ఉన్నాడని కాంగ్రెస్ సోమవారం వెల్లడించింది. త్సేవాంగ్ థార్చిన్ అనే ఆ మాజీ సైనికోద్యోగి 1999లో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాడని పార్టీ నేత జైరాం రమేశ్ తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్న వారిపై కాల్పులు జరిపారని ఆయన ఆరోపించారు.

స్తంభించిన పర్యాటకం

లేహ్: జమ్మూకశ్మీర్ మాదిరిగానే లద్దాఖ్ ప్రాంతం కూడా అబ్బురపరిచే ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. ఏటా లక్షల మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. పర్యాటకం ఇక్కడి ప్రజల ప్రధాన ఆదాయ వనరు కూడా. అయితే లద్దాఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి కోసం సాగుతున్న ఉద్యమంలో హింస చెలరేగడం, తదనంతరం విధించిన కర్ఫ్యూ కారణంగా ఇక్కడ పర్యాటకం స్తంభించిపోయింది. ఈ నెల 24న విధించిన కర్ఫ్యూ సోమవారం కూడా కొనసాగింది. నాలుగు గంటల విరామం మినహా మిగిలిన సమయంలో పట్టణంలో కర్ఫ్యూ కఠినంగా అమలు చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం లద్దాఖ్ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య బాగా తగ్గిపోయింది. అనేకులు తమ పర్యటనల్ని రద్దు చేసుకుంటున్నారు. తాజా పరిణామాలు పర్యాటకుల విశ్వాసాన్ని మరింత దెబ్బతీశాయని పర్యాటక రంగానికి చెందిన పలువురు వాపోయారు. లద్దాఖ్ హింసలో నలుగురు ప్రాణాలు కోల్పోగా 150 మందికి పైగా గాయపడిన విషయం విదితమే. "లద్దాఖ్ అందాలను వీక్షించడానికి రావాలనుకున్న పర్యాటకులెవరూ తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. గత వారం నుంచి దుకాణాలు మూసివుండటం కారణంగా పట్టణంలో నిత్యావసరాల కొరత ఏర్పడింది" అని హోటల్ నిర్వాహకుడు సకీబ్ సింగ్ తెలిపారు. ఉద్యమ కాలంలో దేశ విదేశాలకు చెందిన సందర్శకులు తమ హోటళ్లకే పరిమితమై పర్యాటక ఆకర్షణల్ని చూడలేకపోయారు.




దుర్గా పూజ మహోత్సవం సందర్భంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఏర్పాటుచేసిన ఓ మండపం



గురుగ్రామ్‌లో ఏర్పాటు చేసిన ఓ దుర్గా మండపం వద్ద సోమవారం సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

25 ఏళ్లలో రెట్టింపు కానున్న కిడ్నీ క్యాన్సర్లు!



దిల్లీ: వచ్చే 25 ఏళ్లలో మూత్రపిండాల క్యాన్సర్ కేసులు రెట్టింపు కానున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఊబకాయం, శారీరక శ్రమ లోపించడం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి ముప్పు అంశాల తాకిడి విపరీతంగా పెరగడమే ఇందుకు కారణమన్నారు. ఇవి తగ్గించుకోగల సమస్యలేనని తెలిపారు. క్యాన్సర్‌కు సంబంధించిన ప్రస్తుత కేసులు, భవిష్యత్ అంచనాలపై ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ సంస్థకు చెందిన గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ అందించిన డేటా ఆధారంగా ఐరోపా, అమెరికా, బ్రిటన్‌లకు చెందిన శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు వచ్చారు. 2022లో ప్రపంచవ్యాప్తంగా 4.35 లక్షల మూత్రపిండాల క్యాన్సర్ కేసులు వెలుగు చూశాయని, ఈ వ్యాధితో 1,56,000 మరణాలు నమోదైనట్లు వారు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2050 నాటికి రెట్టింపయ్యే అవకాశం ఉందన్నారు. "మూత్రపిండాల క్యాన్సర్ క్రమంగా ప్రపంచ ఆరోగ్య సమస్యగా మారుతోంది. పెరుగుతున్న కేసులకు వైద్యులు, విధాన నిర్ణేతలు సిద్ధం కావాలి" అని పరిశోధనకు నాయకత్వం వహించిన అలెగ్జాండర్ కుటికోవ్ తెలిపారు. వీరి పరిశోధనలో తేలిన అంశాలివీ..

✦ మూత్రపిండాల క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాత ఐదేళ్ల వరకూ జీవిస్తున్న వారి సంఖ్య 40 శాతం నుంచి 75 శాతం మధ్య ఉంది. ధనిక దేశాల్లో ఇది మెరుగ్గా ఉంది. అక్కడ వ్యాధి నిర్ధారణ ఆరంభంలోనే జరగడం, శస్త్రచికిత్స, రేడియోధార్మిక చికిత్సలకు అవకాశాలు ఎక్కువగా ఉండటం ఇందుకు కారణం.

✦ 5-8 శాతం కేసులకు జన్యు అంశాలే కారణం.

✦ ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న ఈ తరహా క్యాన్సర్లలో సగం కేసులకు కారణం ఊబకాయం, మధుమేహం, అధికరక్తపోటు, దీర్ఘకాల మూత్రపిండ వ్యాధి, ధూమపానం, పర్యావరణ కారణాలు, వ్యాయామాలు చేయకపోవడమే.

✦ బరువు తగ్గించుకోవడం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచుకోవడం, ధూమపానాన్ని ఆపడం తదితర జీవనశైలి సంబంధ అంశాల్లో మార్పులు చేస్తే ఈ క్యాన్సర్ ముప్పు గణనీయంగా తగ్గుతుంది.

ఫలాలు కాసే చెట్టుపైనే రాళ్లేస్తారు

• అనవసరమైన వాటికి నేను స్పందించను
• 'ఇథనాల్' ఆరోపణలపై గడ్కరీ వ్యాఖ్యలు



నాగ్‌పుర్: ఇథనాల్ మిశ్రమ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలపై స్పందించేందుకు నిరాకరిస్తూనే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడారు. సోమవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. "ఫలాలు కాసే చెట్టుపైనే రాళ్లు వేస్తారు. అందువల్ల అనవసరమైన విమర్శలకు మనం స్పందించకూడదు. ఇలాంటి వాటికి సమాధానం చెబుతూపోతే అది వార్త అయిపోతుంది. కాంట్రాక్టర్ల నుంచి నేను ఇప్పటి వరకు ఒక్క పైసా తీసుకోలేదు. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని కలపడాన్ని ప్రోత్సహించడం, తద్వారా రైతులను ఇంధన ఉత్పత్తిదారులుగా మార్చడం, కాలుష్యాన్ని తగ్గించడమే మా విధాన లక్ష్యం. ఇంధన దిగుమతుల ద్వారా ప్రయోజనం పొందుతున్న బలమైన వర్గం తమ వ్యాపారాలపై ప్రభావం పడుతుందన్న కారణంతో దీన్ని వ్యతిరేకిస్తోంది. వారే నాకు వ్యతిరేకంగా ఇలాంటి వార్తలను వేయిస్తున్నారు. గతంలో ఇలాంటివెన్నో నేను చూశాను" అని పేర్కొన్నారు. కాగా, భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడాన్ని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. అనంతర కాలంలో గడ్కరీ కుమారుడు కంపెనీ అయిన సియాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ లాభాలు స్వల్ప వ్యవధిలోనే రూ.17.47 కోట్ల నుంచి రూ.510.8 కోట్లకు అనూహ్యంగా పెరిగాయి. ఇప్పుడు ఈ అంశమే తాజా వివాదానికి కేంద్రంగా మారింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లో పరువు హత్య

• 17 ఏళ్ల బాలికను కాల్చి చంపిన తండ్రి, సోదరుడు

ముజఫ్ఫర్‌నగర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని శామలీ జిల్లాలో పరువు హత్య కలకలం సృష్టించింది. అంబెహతా గ్రామంలో 17 ఏళ్ల బాలికను ఆమె తండ్రి, మైనర్ సోదరుడు కలిసి హతమార్చారు. ఈ ఘటన కంధ్ల పోలీసుస్టేషన్ పరిధిలోని అంబెహతా గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. బాధితురాలు ముస్కాన్‌ను ఇంటిపై అంతస్తుకి తీసుకువెళ్లి అక్కడ తండ్రి, 15 ఏళ్ల సోదరుడు తుపాకీతో ఆమెను కాల్చి చంపారు. ముస్కాన్ ఓ యువకుడితో ప్రేమలో ఉన్న కారణంగా హత్య చేసినట్లు, పరువు నష్టం కలిగించిందనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా పోలీసుల విచారణలో తేలింది.

ఇండియా కూటమికి ఆర్థిక ఎజెండా ఉండాలి

• మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి
• సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడి

దిల్లీ: భాజపా, ఆరెస్సెస్‌లు రాజకీయాధికారాన్ని చేజిక్కించుకున్న నేపథ్యంలో దేశంలోని పరిస్థితులు సంక్లిష్టంగా మారుతున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థకు ముప్పుపొంచి ఉందని, నియంతృత్వం దిశగా దేశాన్ని మార్చే యత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేయడానికి మాత్రమే విపక్ష ఇండియా కూటమి పరిమితం కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేలా ఆర్థిక ఎజెండాను రూపొందించాలని ఆయన సూచించారు. భాజపా పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సీపీఐ మహాసభలు ముగిసిన సందర్భంగా డి.రాజా దిల్లీలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్న మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సూచించారు. ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టులు, గిరిజనులు ఎంత మంది చనిపోయారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అడవుల నుంచి గిరిజనులను ఖాళీ చేయించాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

యువత సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి: ముర్ము



దిల్లీ: సాంకేతిక అభివృద్ధి మార్గంలో మన దేశం ముందుకు సాగుతోందని, ఈ తరుణంలో యువత ఆధునాతన సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్ (ఐఎస్‌డీఎస్), ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ (ఐఎస్ఎస్), సెంట్రల్ ఇంజినీరింగ్ సర్వీస్‌కు చెందిన ప్రొబేషనర్లను ముర్ము కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజంలోని వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే ఎప్పుడూ పనిచేయాలని అధికారులను కోరారు. ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతిని సాధించే ఏ దేశానికైనా జ్ఞానం, నైపుణ్యం అనేవి రెండు చోదక శక్తులని తెలిపారు. "అభివృద్ధి, సమగ్రతతో పనిచేస్తూ మరింత స్వస్థమైన, సమ్మిళితమైన దేశాన్ని రూపొందించవచ్చు. మీరు మనస్ఫూర్తిగా పనిచేస్తే అది భారత్‌ను ప్రపంచం ముందు బలమైన దేశంగా నిలబెడుతుంది. సమగ్రమైన, అభివృద్ధి చెందిన దేశం కోసం మీరు నిబద్ధత, ఉత్సాహంతో పనిచేస్తారని నాకు నమ్మకం ఉంది" అని అధికారులను ఉద్దేశించి ముర్ము వ్యాఖ్యానించారు.

బందీలను వదిలేస్తాంగానీ.. ఆయుధాలను వీడం

• అమెరికా ఫార్ములాపై హమాస్ స్పష్టీకరణ

దుబాయ్: గాజా యుద్ధాన్ని ముగించడానికి వీలుగా తమవద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను వదిలేయడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే ఆయుధాలను వీడేది లేదని హమాస్ స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు అమెరికా 21 సూత్రాల ఫార్ములాను ప్రతిపాదించిన నేపథ్యంలో ఖతార్ టీవీ ఛానల్ అల్-అరబీతో హమాస్ ప్రతినిధి తాహిర్ అల్-నోనో మాట్లాడారు. 'హమాస్ వద్ద బందీల అంశం.. యుద్ధం ముగింపు, గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరణతో ముడిపడి ఉంది. ఒప్పందం జరిగిన తొలి రోజునే బందీల విడుదల జరుగుతుందా.. క్రమంగా సాగుతుందా అనేది చర్చల సమయంలో తేలుతుంది. చనిపోయిన బందీల మృతదేహాల అప్పగింతకు సమయం పట్టవచ్చు. అందుకు తరలించే సామగ్రి కావాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకూ మాకు అమెరికా ప్రణాళిక అందలేదు. ఇప్పటిదాకా జరిగిన చర్చల్లోనూ మేం పాల్గొనలేదు. అధికారికంగా మాకు ప్రణాళిక అందాక అధ్యయనం చేసి మా అభిప్రాయం తెలియజేస్తాం. పాలస్తీనా అథారిటీతో ఒప్పందానికి మేం సిద్ధంగా ఉన్నామని మొదటి నుంచీ చెబుతూ వస్తున్నాం. వెస్ట్‌బ్యాంక్, గాజాలను పాలించేందుకు టెక్నోక్రటిక్ ప్రభుత్వ ఏర్పాటుకు మేం అనుకూలమే. ఆక్రమణలు కొనసాగినంతకాలం సాయుధ పోరాటం పాలస్తీనా ప్రజల హక్కుగా ఉంటుంది. ఆయుధాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోం' అని తాహిర్ వివరించాడు.

ఓటమి భయంతోనే రాహుల్‌పై కుట్రలు

• భాజపా, ఆరెస్సెస్‌లపై కాంగ్రెస్ ధ్వజం

దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ లక్ష్యంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) మాజీ అధ్యక్షుడు ప్రింటూ మహదేవ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ సోమవారం తీవ్రంగా స్పందించింది. భాజపా, ఆరెస్సెస్ లక్ష్యంగా తన దాడిని తీవ్రతరం చేసింది.

ఓట్ల చోరీ విషయం బహిర్గతమవడంతో సైద్ధాంతిక పోరులో ఓడిపోతున్నామనే భయంతోనే ప్రతిపక్ష నాయకుడి నోరు నొక్కేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడింది. "భాజపా ప్రతినిధి ఒకరు రాహుల్‌గాంధీపై కాల్పులు జరుగుతాయని బెదిరించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వారిపై ఎటువంటి చర్యా తీసుకోలేదు. దీనికి ముందు రాహుల్‌గాంధీ భద్రతపై పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఆర్‌పీఎఫ్ ఓ లేఖరాసి దాన్ని బహిర్గతం చేసింది. ఆయన భద్రతను రాజకీయం చేసి ఎందుకు ఇలాంటి వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దుర్భాషలాడి మొదట రాహుల్ నోరు మూయించాలని ప్రయత్నించారు. అది కుదరకపోయేసరికి తూటాలతో బెదిరించి కుట్ర పన్నుతున్నారు. మీరు చేసిన ఓటుచోరీని ఆయన సాక్ష్యాలతో సహా బయటపెట్టారు" అని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేడా విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో ప్రకటనను విడుదల చేశారు.

ఎన్‌సీపీసీఆర్ ముందుకు 2024లో లక్ష కేసులు

• బాల నేరస్థులు, బాల కార్మికుల సంబంధిత కేసులే అధికం

దిల్లీ: జాతీయ బాలల హక్కుల కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) వద్ద 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు సుమారు లక్ష కేసులు దాఖలయ్యాయి. మహిళా, బాలల సంక్షేమ శాఖ ఇటీవల విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం.. బాల నేరస్థులు, నిర్లక్ష్యానికి గురైన, బలహీనవర్గాలు, దివ్యాంగ బాలలకు చెందిన కేసులు ఎక్కువగా ఉన్నాయి. బాలకార్మికులు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి సంబంధించి 20 వేల కేసులు దాఖలు కాగా 2024 చివరికి 19,645 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. బాల నేరస్థులు, నిర్లక్ష్యానికి గురైన వారు, దివ్యాంగులకు సంబంధించి 39,500 కేసులు నమోదు కాగా 18,954 కేసులు పరిష్కారమయ్యాయి. బాలల ఆరోగ్యం, సంరక్షణకు సంబంధించి 18,500 ఫిర్యాదులు రాగా.. విద్య అంశంలో 8,200 కేసులు నమోదయ్యాయి. పోక్సోకు సంబంధించి 6,800 ఫిర్యాదులు వచ్చాయి. పునరావాస కేంద్రాల్లో వసతుల కొరత, దివ్యాంగ బాలల సంరక్షణలో శ్రద్ధ లేకపోవడం వంటివి ప్రధాన సమస్యలని నివేదికలో పేర్కొన్నారు.

గాజా శరణార్థి శిబిరంపై దాడి 10 మంది మృతి

టెల్ అవీవ్: అంతర్జాతీయ ఖండన మండనల్ని బేఖాతరు చేస్తూ గాజాపై నిరాఘాటంగా దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ తాజాగా ఆ ప్రాంతంలోని నుస్రెయిత్ శరణార్థి శిబిరంపై గురి పెట్టింది. ఈ దాడిలో 10 మంది పాలస్తీనీయులు మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటి వరకూ ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 66,005కు, క్షతగాత్రుల సంఖ్య 1.68 లక్షలకు చేరింది.

గూఢచర్యం ఆరోపణలతో ఇరాన్‌లో ఒకరికి ఉరి

దుబాయ్: ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలతో ఓ వ్యక్తిని ఉరితీసినట్లు సోమవారం ఇరాన్ పేర్కొంది. ఉరి తీసిన వ్యక్తిని బహమన్ ఖూబియాసల్‌గా తెలిపింది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్ అధికారులతో.. ఖూబియాసల్ సమావేశమయ్యాడని ఇరాన్ ఆరోపించింది. జూన్‌లో ఇజ్రాయెల్‌తో యుద్ధం జరిగినప్పటి నుంచి గూఢచర్యం ఆరోపణలతో ఇరాన్ 9 మందిని ఉరితీసినట్లు సమాచారం.

మాల్డోవా ఎన్నికల్లో ఈయూ అనుకూల తీర్పు

చిసినావు (మాల్డోవా): తూర్పు ఐరోపా దేశమైన మాల్డోవాలో జాతీయ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఒకనాటి అగ్రరాజ్యమైన సోవియెట్ యూనియన్‌లో భాగమైన మాల్డోవా ప్రజలు తాజా ఎన్నికల్లో రష్యా అనుకూల పార్టీలను చిత్తుగా ఓడించడం గమనార్హం. ఇక్కడి ప్రజలు తమ వ్యవహారాల్లో రష్యా జోక్యాన్ని తిరస్కరించి యూరోపియన్ యూనియన్‌కు అనుకూలమైన తీర్పు ఇచ్చారు. ఈ ఎన్నికలో పార్టీ ఆఫ్ యాక్షన్ అండ్ సాలిడారిటీ (పీఏఎస్)కు 50.1 శాతం ఓట్లు వచ్చాయి. రష్యా అనుకూల పార్టీగా పేరుబడిన పేట్రియాటిక్ ఎలక్టోరల్ బ్లాక్ కేవలం 24.2 శాతం ఓట్లు సాధించుకోగలిగింది. మితవాద పార్టీ అయిన డెమాక్రసీ అట్ హోమ్ పార్టీ కూడా గణనీయ సంఖ్యలో ఓట్లు సాధించింది. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక ప్రభుత్వ ఏర్పాటుపై అందరి దృష్టి నిలిచింది. సాధారణంగా మాల్డోవా అధ్యక్షుడు అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీకి చెందిన వ్యక్తిని ప్రధానమంత్రిగా నియమిస్తారు. అలా నియమితుడైన వ్యక్తి పార్లమెంటులో తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. మాల్డోవా అధ్యక్షురాలైన మైయా సాందు ప్రస్తుత ఎన్నికల్లో విజయం సాధించిన పీఏఎస్ పార్టీని 2016లో స్థాపించారు. ఆయన ప్రసిద్ధ ఆర్థిక నిపుణుడు డోరిన్ రిసియన్‌ను తిరిగి ప్రధానిగా నియమించే అవకాశం ఉంది. పీఏఎస్ సాధించిన విజయం ప్రజల్లో యూరోపియన్ యూనియన్ పట్ల అనుకూలత ప్రబలంగా ఉన్నట్టు చాటిందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు క్రిస్టియన్ కాంటిర్ అన్నారు.

బిహార్‌లో కాంగ్రెస్ దూకుడు

• 80 స్థానాలకు అభ్యర్థుల ఖరారు
• అధిక సీట్ల కోసం ఆర్జేడీపై ఒత్తిడికి యత్నం!

ఇంటర్నెట్‌డెస్క్: శాసనసభ ఎన్నికలు త్వరలో జరగనున్న బిహార్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రాష్ట్రంపై తిరిగి పట్టు సాధించాలనే లక్ష్యంతో అడుగులేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. అగ్రనేతల పర్యటనలతో ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. మహాగఠ్ బంధన్‌లోని మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటులో భాగంగా సాధ్యమైనన్ని స్థానాలను అధికంగా దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దిల్లీలో సమావేశమైన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. బిహార్‌లోని 80 స్థానాలకు అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసింది. కూటమిలోని ప్రధాన భాగస్వామి ఆర్జేడీ తాము అన్ని స్థానాల్లో పోటీ చేయబోతున్నట్లు ఇటీవల ప్రకటించింది. ఎవరి పట్టుదలలు ఎలా ఉన్నప్పటికీ... ఈ సారి కూటమిలోని భాగస్వామ్య పార్టీల సంఖ్య పెరగడంతో మిత్రపక్షాలకు అదనంగా కొన్ని స్థానాలను కేటాయించక తప్పదు. కూటమికి చేరువైన పశుపతి పరాస్, ముఖేశ్ సాహ్నీ తదితరుల కోసం కొన్ని సీట్లను త్యాగం చేయాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన కారణంగా సీపీఐ(ఎం-ఎల్)కు కేటాయించే సీట్లు ఈసారి పెరగొచ్చు. 2020 ఎన్నికలలో ఆర్జేడీ-144, కాంగ్రెస్-70 సీట్లలో పోటీ చేశాయి. ఈ దఫా ఆర్జేడీ సుమారు-14, కాంగ్రెస్-10 సీట్లను తగ్గించుకోవాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే, 70కన్నా తక్కువ సీట్లను అంగీకరించబోమని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ముఖేశ్ సాహ్నీ నేతృత్వంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ 14-15 సీట్లు, సీపీఐ-10, సీపీఎం-6, పశుపతి పరాస్ పార్టీ-2, ఐపీ గుప్తా పార్టీ రెండు సీట్లు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి తక్కువ సమయమే ఉండడంతో కూటమిలోని అన్ని పార్టీలు సీట్ల సర్దుబాటును త్వరగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాయి.



ఆ స్థానాల్లో పోటీ చేయకూడదని నిర్ణయం

దిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో అజయ్ మాకన్, బిహార్ ఇన్‌ఛార్జ్ కృష్ణ, బిహార్ పీసీసీ చీఫ్ రాజేశ్ రామ్, శాసనసభా పార్టీ నాయకుడు డాక్టర్ షకీల్ అహ్మద్, మదన్ మోహన్ ఝా తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ 80 సీట్లను ఎంపిక చేసి, ప్రతి సీటుకు ముగ్గురు అభ్యర్థులను ప్రతిపాదించింది. మహాగఠ్ బంధన్ గతంలో ఎన్నడూ గెలవని స్థానాల్లో పోటీ చేయకూడదని హస్తం పార్టీ నిర్ణయించింది. తద్వారా సీట్ల పంపకాలపై ఆర్జేడీపై ఒత్తిడి పెంచింది. సీట్ల సర్దుబాటు మరీ ఆలస్యమైతే తమ సొంత అభ్యర్థులను ప్రకటించే అవకాశం లేకపోలేదు.